బొబ్బిలి బెబ్బులి

(S.I., 1917)

Record no. 743

Bobbali Bebbuli

(S.I., 1917)

Record no. 743

బొబ్బిలి బెబ్బులి. - (S.l. : s.n., 1917)
297 p. ;18 cm.
Record no. 743

Bobbali Bebbuli. - (S.l. : s.n., 1917)
297 p. ;18 cm.
Record no. 743

743

125
5174

శ్రీ వేంకటేశాయనమః.

శ్రీ బొబ్బిలి బెబ్బులి.

1. ప్రకరణము.

చెఱుపకురా చెడుదువు.

రమణీయమైన యొక వేసవికాలపు టుదయమున, విజయనగరము గవనిలో నొక బ్రాహ్మణుఁడు ప్రవేశించెను. అతఁడెక్కియున్న యశ్వ ముత్తమజాతిలోఁ జేరినది. పట్టపు గుఱ్ఱమునకు వలయు లక్షణములన్నియును దానియం దమరి యుండినవి. అయినను, దానినోట నుఱుఁగులు గ్రమ్మియును పాదములధూళి గ్రుంగియు నుండుటచేత నతఁ డెచటినుండియో హుటాహుటిని బ్రయాణము సేయుచు నానగరమును జేరు వానివలెఁ గానవచ్చెను. అతఁడు మిగుల సౌందర్యవంతుఁడును దేజోవంతుఁడును. అతనియౌవన మతని సౌందర్యము నెంతో ప్రకాశమునకుఁ దెచ్చుచుండెను. అట్లువచ్చుచున్న యాబ్రాహ్మణ బాటసారి తనలో,

"అక్కటా! ప్రపంచమునఁ గవిగా జన్మమెత్తుటకంటెఁ బొరపాటు మఱియొకటి లేదు. వాఁడు, సరస్వతిని నిరాఘాటముగా సంచరింపనీక ఛందోబద్ధను గావించుటంబట్టియో, కాక మఱియే పాపకర్మవశముననో, దారిద్ర్యమే వాని సొమ్మగుచున్నది. లేమికన్నను వాఁడన్యమెఱుఁగఁడు. ఎందఱు రాజుల

యాశ్రయముండియేమి? వారివలన నూటపదాఱు లెన్నియబ్బియేమి? అబ్బినధన మప్పటికప్పుడే పలాయనమయ్యెడిని. మరల, తొంటిదారిద్ర్యమే తోతెంచి వ్యథగొలిపెడును గండి తెగిన యేటినీటివలె నిలువ నిలువక సమార్జితవిత్తమంతయు సమసిపోవుచుండఁగా మానవునిగతి యేమికావలయును? విత్తమునుగూర్చిన ప్రస్తావమేల? ఆంధ్రభాషకే యవసానకాలము సమకూఱెను. ఆంధ్రకవుల నాదరించు ప్రభువులు దఱచుగా లేరు. దేశమే యన్యాక్రాంతమగుచున్నచో దేశీయప్రభువులనుగూర్చి చెప్పవలయునా? అట్టిఘనులు సుఖస్థితియందే యుండిరనుకొందము. కృపణశిఖామణులు; కవితారసమునకును వారి కఠినహృదయములకును సంబంధమెట్లు విచారించుట? కవు లట్టిప్రభువుల నాశ్రయించుటకు భగీరథప్రయత్నములను జేయవలయును; సన్నిధాన మబ్బినప్పటికిని సంపద చేతికందునా? శుష్కప్రియములు పలికి శూన్యహస్తములతోఁ బోయిరండని యుపచరింతురు. ఇట్టి వదాన్యుల నెందఱను జూడను; వీరిచరితములు నాకుఁ గ్రొత్తలుగావే! హా, హాతవిధీ! మాదృశులకుఁ గవిత్వసంపదయొసఁగి యిట్టి యాశ్రయులకడ కేఁగ నిచ్చుట, రూపగర్వితయగు నుత్తమనాయికను షండునకుఁ దార్చుటను బోలునేకదా! నిక్కపుదాత లొకరిద్దఱు గలగనుకొందము. కల్పవృక్షమును ముండ్లపొద లలమికొనినట్లు, కుత్సితులగు కవులు గొందఱుచేరి యన్యులఁ బ్రవేశపెట్టరు. ఏమివింత! ఈకాలమున గణములను గూర్చి, పలికినఁ జాలును. కావ్యగుణములతోడి పని యెవనికిఁ గావలయును? అర్థప్రౌఢిమను ధారావిశుద్ధతను, కల్పనాచతురిమను, శయ్యా

ప్రదిమను గాంచువాఁడెవఁడు? ఎట్లయినను బొట్ట యుసుకు, దీర్చుకొనవలసి యున్నది. ఈరాష్ట్రాధిపతి రసికహృదయులనియు, మహావైభవోపేతులనియు, కవులపాలిటి కల్పవృక్షమనియు నెఱిఁగి వచ్చితిని. వీరి యాస్థానపు కవియేకదా యడిదము సూరనార్యుఁడు. అతనికిని నాకును బూర్వవైరము గలదే; అతఁడు నాయుద్యమమునకు భంగకారి గాకపోవునా? కావున మొట్టమొదట నతనిని దర్శించి ప్రసన్నునిఁ జేసికొనియే ప్రభువునొద్ద కేఁగవలయును. ఔను; ఇదియే యుక్తము" అని యనుకొనుచుండెను. ఇంతలో నతనియశ్వము విజయనగరము రాజమార్గమును జేరినదాయెను.

తదనంతర మాబాటసారి, తొల్లిటివలెఁ దనగుఱ్ఱమును వేగముగా నడుపక, దారికిరుప్రక్కలనున్న యిండ్లను గుర్తించుచు మెల్లగాఁ బోవఁదొడఁగెను.

అప్పుడొక యింటివాకిట నొకపురుషుఁడు నిలుచుండెను. అతఁడు పొడుగాటి యాకృతిగలవాఁడు. అతనిని జూడఁగానే మనబాటసారి భ్రమసి యతనిమోముపైఁ గొంతదనుకఁ దనచూడ్కులు నిగుడ్పఁదొడఁగెను. దానివలన నతఁడు దనకుఁ బూర్వపరిచితుఁడనుట దెలియవచ్చెను. ఆపురుషుఁడు సైతము మనబాటసారిని ఱెప్పవాల్పక చూడఁదొడఁగెను. పిదప, మన తెరువరియే తిన్నఁగా నతనియొద్దకేఁగి,

"మీరిచ్చటనే వసించుచున్నారా?" అని ప్రశ్నించెను.

పు—ఔను, తమరెవరో! యెచ్చటనో చూచియున్నాను. సరి జ్ఞప్తివచ్చెను. తమరిట్లు హుటాహుటిని వచ్చుటకేమికారణమో?

బా—నేను దమదర్శనము గోరియే వచ్చితిని.

పు—ఆహా ! మిముఁ బోలిన సుధీమణులు గోరి వచ్చు నంతటి భాగ్యశాలినా నేను !

బా—అయ్యా, అట్లు నుడివెద రేమి ? మహాప్రసిద్ధులరే మీరలు.

"చ. అడిదము సూర్యనార్య కవి ♦ తార్భటి గాఁగ కాందిశీకులై
మడులును మాన్యముల్ నదలి ♦ మానముడీల్వడ బాంధవాళితో
నడవులకేఁగ జానపద ♦ మందొకఁడైనను గావ్య నేత లేఁ
డడరదు గాదె పృథ్వి యక ♦ టా కవి శూన్యత కేమిచెప్పుదున్. "

పురుషుఁడీ పద్యము వినఁగానే నాశ్చర్యుఁడయి, "అయ్యా, యొక కవిని ఉగ్గడించుచునే మీ కవితాప్రౌఢిమను వెలయించెదరు. విచ్చేయుఁడు ; నాగృహము పవిత్రము చేయుఁడు" అని యుపచార పూర్వకముగాఁ బలికి, అతనిని లోఁగిటికిఁ బిలుచుకొనిపోయి యొక రత్నకంబళముపైఁ గూర్చుండఁ బెట్టుకొనెను.

వచ్చిన బాటసారి, యేమో కొంతదనుకఁ బర్యాలోచించుచుండి, "ఔను, అట్లే చేయవలయును ; ముఖస్తుతికసాధ్యమగు కార్య మొకటియు లేదు." అని తుదకుఁ దీర్మానించుకొనెను. అతఁడు కొన్ని సంస్థానములను బ్రశంసించి, తానుజూచి యున్న సంస్థానాధిపతులను, కవులను వారివారితోడఁ దన కేర్పడిన సంభాషణములను వాదములను బ్రశంసకుఁ దెచ్చెను. పిదప, నితర మండలములయందు, అడిదముసూరకవికిఁ గల ప్రఖ్యాతిని బ్రస్తావమునకుఁదెచ్చి, మిక్కుటముగాఁ బొగడుచు, తుదకు,

"సూరకవితిట్టు కంసాలి ♦ సుత్తెపెట్టు"
గాఁగఁ బల్కవె తొల్లి స ♦ త్కవి మృగాంక !

పొన్న కాకారధర్మంబుఁ ♦ బొసఁగ నేర్చు
సుత్తెపెట్టది సొమ్ముల ♦ సొమ్ము గాదె !

అని సాభిప్రాయముగాఁ బలికెను. ఇట్లు పలికిన యాబాటసారి యాకాలమున సుప్రసిద్ధుఁడుగ నుండిన తురగ-రామకవి. ఇతఁడు మొట్టమొదట నొకరాజునొద్ద పట్టపుగుఱ్ఱమును బహుమతిగాఁ బొందియున్నందున నితనికీ బిరుదము గలిగినట్లు జనులు వాడుకొనుచుండిరి. ఇప్పుడితఁ డధిష్ఠించియున్న యశ్వమదియే. ఈకవి, తనకవిత్వ పటుత్వముచేత మాండలిక ప్రభువుల మెప్పు సంపాదించి, గజాందోళికాది పారితోషికములను బొందుచుండెను. ఇతఁ డిప్పుడు ధరించియుండు ఖడ్గమును, గప్పికొనియున్న దుస్సాలువులును ప్రభువులయొద్ద సంపాదించినవే.

ఇప్పటికిఁ గొన్ని సంవత్సరములకుఁ బూర్వ మితఁడొక గ్రామమునందు బాటకుఁ బ్రక్కన నొక యిల్లు గట్టించుచుండెను. బాటవెంబడిని బోవుచుండిన జనులను భయపెట్టి తన కట్టడమునకు వలయు పనులను జేయించుకొనుచుండెను. కవులు, శాపానుగ్రహశక్తి యుక్తులను నభిప్రాయ మాకాలపు జనుల డెందములలో మెదలుచుండెడిది. కావుననే, జనులు కవియనిన భయపడుచుండిరి. యథోచిత ముపచరించుచు నుండిరి. తురగ-రామకవి సామాన్యకవులలోఁ జేరినవాఁడు గాఁడు; వేములవాడ భీమకవినిబోలి తిట్టుకవిత్వమునందుఁ బ్రసిద్ధిని వహించియుండెను. ఇది కారణముగా నప్పటి సామాన్య జనమితనిపేరు వినునప్పుడే భయపడుచుండెను.

అట్టి తరుణమునరి దొకనాఁ డాదారిని అడిదము సూర

కవి పోవుచుండెను. అతఁ డతనిని సైతము దన కట్టడమునకుఁ బాటుపడఁ బిలిచెను. సూరకవి యందుల కొడఁబడక ముందున కేఁగఁ దొడఁగెను. అతని చర్యకు, దురభిమానము పెల్లుగ వహించియుండిన రామకవి, దనపనిని జేయకయే ముందు కడు గత్తి పెట్టరాదని నిర్బంధ పెట్టఁదొడఁగెను.

రామకవియొక్క చర్యకు మిగుల విసుఁగుచెంది, సూరకవి కోపోద్దీపితుఁడయి, తాను మానవ సామాన్యుఁడు గాఁడనుట సువ్యక్త మగునట్లు, "సూరకవి తిట్టు కంసాలిసుత్తె పెట్టు" అట్టి సూరకవితోఁ బ్రతిఘటించి యేల చేటును దెచ్చుకొనెదవు ?" అనెను.

అందులకు రామకవి, "ఓరి యలసుఁడా! సూరకవియు గీరకవియు నీరామకవి యెదుట నెంతమాత్రము ? 'రామకవి బొబ్బ పెద్ద ఫిరంగిదెబ్బ' యని విని యుండవా?" అని భీషణుఁడయి పలికెను. ఇట్లే వారిలోఁ గొన్ని ప్రతిషేధవాక్యములుప్పతిల్లినవి. తుదకవి మల్లయుద్ధమువఱకును బరిణమించినవనియు నాకాలము నందొక వదంతి పుట్టియుండెను.

ఇట్టి ప్రబలమైన పూర్వవైరమును దలఁచి, సూరకవి, విజయనగర సంస్థానమునందుఁ దన సమ్మానమునకు భంగకారి గారాదని దలఁచి, విజయరామరాజు గారి సందర్శనమునకుఁ బూర్వమే, సూరకవి రాజదర్శనము చేసికొని, రామకవి యుపాయముమెయిని దనపనిని గొనసాగించుకొనఁ దలఁచెను. కాఁబట్టి యే, ఇతఁడు, పలుమాఱు సూరకవిని సందేహించుటయును, అతనిని బ్రసన్నునిగాఁ జేసికొనవలయునని ప్రయత్నించుటయును వింత చైదములుగావు.

ఇంక నడిదము-సూరకవిగారిని గూర్చి యించుక విమర్శింతము. ఇతఁ డాకాలమునందు సుప్రసిద్ధుఁడుగా నుండిన లాక్షణికాంధ్రకవి. రామకవి యొకనివలననేకాని యితని కితరులవలన నోటమి గలుగలేదు. కవిమండలమున నితనికి సాగుదల యెక్కువ. ఇంతేకాక విజయనగర సంస్థానమునందును నితనికిఁ జను వెక్కువ. పలుమాటలేల? ఇతనిని విజయరామరాజభూషణుఁడని వ్యవహరించుచుండిరి. ఇదియే యితనికవితాపటుత్వమును, రాజసమ్మానమును స్థాపించుటకుఁ దగిన నిదర్శనమగును గదా!

ఆంధ్రకవియగు నడిదము సూరపరాజునకు రామకవి యెడలఁ బొడలుచుండిన శాత్రవమునకును హృత్తాపమునకును దుల్యములుగా దేనిని బోల్పనగును? రామకవినామము శూలప్రాయముగా హృదయమును బరివేధించుచుండెను. "ఎప్పుడు తరుణము తటస్థించునా? ఎప్పుడు దనప్రతీకారము ప్రతీపుని యెడలఁ జెల్లునా ?" అని తఱివేచియుండెను. తనపగను దీర్చుకొనుటకు నతఁ డెట్టికార్యమునకైనను సాహసింప సిద్ధపడియే యుండెను. పలుమాటలేల? తనప్రభువగు విజయరామరాజు గారికి శ్రీబొబ్బిలి రంగారాయ రాణ్మణివిషయమున నున్న యుద్వేగమునకు వేయిమడంగు లధికముగానే యితనిహృత్తాపముండెననుట యతిశయోక్తి గాఁజాలదు.

అట్టి తనవిరోధి, వంట యింటికుందేలివలెఁ దనయింటికి వచ్చి, తన్నే యాశ్రయించుతరుణమునఁ దన పూర్వవిరోధమును విస్మరించునంతటి వెంగలియా సూరకవి? తన మాయావాగురను రామకవి తనయంతనే వచ్చిపడుటకు లోలోన,

సూరకవి, సంతసించి, వంచనతో మెలఁగి, యతనికిఁ బూర్తిగాఁ బరాభవము గలిగించి పంపివేయవలయునని నిశ్చయించి, పెల్లుగా నుపచరింపఁదొడఁగెను. వినయ మతివేలముగఁ గనఁబఱచుట ధూర్తుల లక్షణమే కదా! కాఁబట్టి, రామకవికిఁ దన యింట విడిదిచూపి, మజ్జన భోజనాదుల నెఱపెను. నెయ్యము మీఱ మేలములాడుచుండి, తన ప్రభువుగారి ప్రశంసకు వీలు గలిగించుకొనెను. ఎవ్విధముగానైనను దన ప్రభువుల దర్శనము చేసికొనియే మరలవలయుననియును, వారు కవిత్వ రసాస్వాదనమున నపరభోజులనియును, ఉదారమున వీరిని బేర్కొనియే శిబికర్ణదధీచులను బేర్కొనవలయుననియును నుగ్గడించి పలికెను. మఱియును,

"ఉ. రాజుకళంకమూర్తి రతిరాజుశరీర విహీనుఁ, డంబికా
రాజుదిగంబరుండు, మృగరాజు గుహాంతరసీమవర్తి, వి
భ్రాజిత పూసపాడ్విజయరామనృపాలుఁడె రాజుగాక యీ
రాజులు రాజులే పెనుత రాజులుగాక ధరాతలంబునన్."

అని ప్రశంసించెను. వారి సందర్శనమాత్రమున గజాందోళి కాది సమ్మానములఁ బడయవచ్చునని యాసగొలిపెను. తుదకు, తాను రాజసందర్శనమునకుఁ దగిన తరుణము దెలుపునట్లును, అందాఁక తన యింటనే యుండునట్లును నుపచారోక్తులు పలికి, మార్గాయాసముదీఱ విశ్రమింపుఁడని నుడివి దా నచ్చోటు వదలెను.

సూరపరాజున కా దినము, సుదినమయినట్లు దోఁచెను. హృదయ మానందరస మగ్నమయ్యెను; చిరకాల విరోధమునకు విమోచనము గలిగెను బో యని నెమ్మదిఁజెంది, మజ్జన

భోజనముల పని దీఱఁగానే యతఁడు మహారాజుగారి సంస్థానమున కేఁగెను.

సూరన్న సభను జేరు తఱికిఁ గొలువుకూటము సప్తాంగముల వారితోడను దదితర సభ్యవర్తనులతోడను జెలువుగులుకుచుండెను. మహారాజుగారప్పటికిఁ గొలువునకు విచ్చేసి యుండలేదు. వారు విజయముచేయుటకుఁ గొన్ని నిముసములు పట్టునట్లుండెను. అయినను, కాకర్లపూడి-జగన్నాథరావుగారు, సత్యవరపు - రామభద్రరాజుగారు, చింతలపాటి-నీలాద్రిరాజుగారు, లోనుగాఁగల మన్నెమన్నీంద్రులు, ఆసభ నలంకరించియుండిరి. చీమ చిటుక్కుమన్నను సవ్వడి వినవచ్చునట్లు, సభయంతయు సందడిమాని, మహారాజుగారి యాగమనమును నిరీక్షించుచుండెను. ఆతరుణమునఁ బల్లవిత కల్పమహీరుహమో యన నమూల్యాభరణములను గైసేసికొని మహారాజుగారు సభకు విచ్చేసిరి. వీరి యాభరణములకు వలెనే వీరు ధరించియున్న యుడుపులకును విలువ చెప్పుటకుఁ గాదు. వీరి శరీరచ్ఛాయ యపరంజియొరకుఁ దీటుగట్టినప్పటికిని కాయ మత్యంత స్థూలతను జెందియుండెను. అతని విగ్రహము పొడుగాటిదేయైనను బలుపుచేత నాయెత్తు దెలియరాకుండెను. వారి నడుము పట్టయందుఁ బెద్దఖడ్గ మొకటి వ్రేలుచుండెను. దాని పిడియును గోశమును మణిఖచితములయి, చూపులను మిఱుమిట్లు గొలుపుచుండినవి.

వీరి ముఖబింబము, క్షాత్ర మహాతేజమునకు వాసస్థానమువలెఁ దేజరిల్లుచుండెను. వీరి చూపులను బట్టియే, వీరిహృదయ మగాధమనుటయును, దుర్భేద్యమనుటయును దెలియ

వచ్చును. వీరిసొబగు నెంత వర్ణించినను దనివోవదు. సూరకవి యిదివఱకే నుడివియున్న పద్యము, వీరి ననుసరించినదే యయ్యును వీరి మనోహరాకారమున కయ్యది లక్షణప్రాయము గాఁజాలదు.

వీరు, నెఱజోదులగు నిరువురు దృఢగాత్రులకై దండవహించి, వందిజనము బరాబరులతో, మందగమనముల సభాప్రదేశమును జేరిరి. అప్పు డందలి సభ్యులంద ఱాసనములనుండి లేచిరి. మహారాజుగారు, గద్దియ నలంకరింపఁగానే, వారువారు, దమతమ యాసనములపైఁ గూర్చుండువారయిరి.

ఆదినము, మహారాజుగారు కవితారసాయత్త చిత్తులయిరి గాన, మన సూరకవిగారి భాగ్యమున్నతి వహించెనని యే చెప్పవలయును. అందలి కవితారసజ్ఞ హృదయులందఱును, రాజహృదయమ్ము దెలిసి సూరకవిని నుగ్గడించిరి. మఱియును, రామణీయ్యకముగాఁ గవిత్వము చెప్పుటయందా కాలపు రామరాజ భూషణుని దలఁపించు నతఁడీ విజయ రామరాజ భూషణుఁడనియును, అది కారణముఁ జేసియే యితని కవిజన రంజనమునకుఁ బిల్లవసుచరిత్రయను ప్రఖ్యాతి సార్థకమగు ననియు నుగ్గడించిరి.

అదియే తనకుఁదగిన యదనుగా భావించి, సూరకవిగారు, సభయందు లేచినిలుచుండి, మహారాజుగారి మోముపైఁ జూడ్కి నిగిడించి "మహాప్రభు! దేవరవారి సందర్శన మపేక్షించి యొకకవి సమయము గనిపెట్టుకొని యుండువాఁడు" అని విన్నవించిరి.

మహారాజుగారు, కవితారస లుబ్ధహృదయులు గావునఁ దనసన్నిధాన మపేక్షించు కవినిగూర్చి,

"మీమెచ్చున కెక్కినవారేగదా వారు?"

సూ—మనవి-చిత్తగింపవలయును. నావంటివాని మెచ్చుకోలననేల? శ్రీబొబ్బిలి రంగారావుగారి మెప్పునకు వచ్చినవారు; నాకు దేవరవారివలనఁ బ్రసాదింపఁబడిన మన్ననకుఁ దుల్యముగానే వారివలన వారు మన్నన పడసియుండువారు.

విజ—తమయాశ్రితుని యాచకునిగాఁజేసి దేశముల మీఁదఁ బంపివేయునంతటి యుదారులా యాసంస్థానాధిపతులు? (అని యించుక చిఱునవ్వుతోఁ బలికిరి.)

సూ—మహాప్రభు! ఆకవిశిఖామణి తానుగా దిగ్విజయార్థ మేఁగుదెంచి యుండరాదా?

విజ—అంతటివారారావారు? తమ సంస్థానాధిపతుల మహిమను దాము సైతము వహించినవారో?

సూ—చిత్తగింపవలయును. దేవరవారు, ఆశ్రితులపట్ల నడుచుకొనునది యాశ్రయులను జెందకపోవదు. గావున, మహారాజుగారు, శ్రీబొబ్బిలిరాజుగారి కభిన్నులగు తురగ-రామకవిగారికిఁ జేయు సమ్మానము, తత్సంస్థానాధిపతులనే యనుసరించును.

విజ—సరి, పరిశీలింతము; రేఁపు మేమేకాంతముగా నుద్యానమున నుండుసమయమునఁ గనిపించుకొనునట్లు చెప్పుఁడు. అని యానతిచ్చి, తమగమనము రాజకార్యములకు మరల్చిరి.

—* కార్యముడివోనివేళలఁ గాంతమంత్రి. *—

1755-వ సంవత్సర ప్రాంతమున మన చెన్నపురి రాజధాని యున్న స్థితినిగూర్చి వ్రాయఁబూనినచో, నెట్టి చరిత్రకారకునకును జేయి వణఁకకమానదు; వినెడి యెట్టి కఠినహృదయునకును గన్నీరొలుకక పోవదు. దేశమంతయుఁ గలఁతలకుఁ జిక్కి సొంపఱియుండెను. ఎన్నో బాములకుఁ జిక్కి విదేశములకేఁగిన సంపల్లలామ యిన్నిసంవత్సరములు గడచియుఁ దన తొంటిరాజ్యముఁ జేరుటకు భీతిల్లుచున్నదనుట విపరీతోక్తి గాదు. ఉత్తరక్షణమున మనగతి యెట్లు పరిణమించునో యను భీతి యనవరతము ప్రజల డెందములందుఁ జిందులు ద్రొక్కఁదొడఁగెను. ఏవంకఁ జూచినను, దొమ్మిగాండ్రుమ దోఁపిడిగాండ్రును బ్రబలి, జనులకెంతో యాపద ఘటించుచుండిరి. వీరి యుద్ధతి నణఁచి ప్రజలకు నెమ్మది గలిగించు దిట వప్పటిప్రభువుల కలవడకుండెను. ప్రభువులే చెప్పనలవికాని శ్రమలకుఁ జిక్కి దురవస్థల మ్రగ్గుచుండిరి. నేఁటి కొకప్రభువునకు సంబంధించియుండిన పొలిమేరయైనది, రేఁపటికే మఱియొకనికి మాఱుచుండెడిది. ప్రభువులలోని మాఱుదలలే ప్రజల కష్టములకు మూలములగుచుండెను. ప్రభుత్వము వహించిన రాజులు స్వాతిశయమునఁ బ్రవర్తింపఁదొడఁగిరి. తమ్ము శాసించువారు లేకపోవుటచేత, దొరలగువారే దుశ్చర్యల కొడిగట్టుచుండిరి.

వారి సైన్యమువారును పరివారమువారును, నగరములలోను గ్రామములలోను బహాటముగాఁ దూఱి కొల్లగొట్టుచుండిరి. ఇట్లు రాజులు, వారిని దమదేశములమీఁద వదలుచుండుటయే వారికొసఁగునట్టి వేతనము లగుచుండెను. ఇంతటితో మానక రాజ్యమునకుఁ బశ్చిమోత్తరమునుండి మరాటాదండు పలుమాఱీరాజ్యముమీఁదఁబడి దోఁపుగొనుచుండెను. కొన్ని సంవత్సరములకు వెనుక హైదరాలీ దళములోనివారును మరాటావారి వృత్తి నవలంబించి యీరాజ్యమును కొల్లగొట్టుచుండిరి. కొల్లగొట్టుటతో మానెనా? గ్రామములను నిర్దగ్ధపఱచుట, గుళ్లను గొప్పభవనములను గూలఁద్రోయుట, కమనీయచైత్యములను హతముసేయుట, భవనరాజములను బరశురామప్రీతిసేయుట, కులకాంతలగు సుందరీమణులను జెఱపట్టుట, దృఢగాత్రులగు మానవులను బానిసలనుగాఁ జేసికొనుట, యను ఘోరాము లిచటిజనుల కలవడియుండినప్పుడు, అక్కటా! ఎట్టిక్షోభ యుప్పతిల్లియుండునో? ఎట్టికలఁత దలమీఱియెసఁగెనో? ఎట్టిభీతి యుప్పతిల్లి, యుద్రేకించి యుడుకునించుచుండునో? చదువరులారా! చిత్తమునకుఁ దెచ్చుకొనుఁడు. ఆకాలమునందు మనరాజ్యమునకుఁ జొత్తెంచిన దరిద్రదేవత యింకను దేశమునువదలి పోఁజాలకున్నదనుట యతిశయోక్తి గాదుగదా!

అప్పుడు, కర్ణాటాధిపతిగాఁ దన్నుఁ జేయవలయునని మహమ్మదలీగారు, వర్తకసంఘమువారుగానుండిన యాంగ్లేయవీరుల శరణుఁజొచ్చిరి. ఆతరుణమున మన యాంగ్లేయవీరులకు ఫరాసు (ఫ్రెంచి) వారు ప్రబలశాత్రవులుగా నుండిరి. వారికి

సైతము ఆంగ్లేయులకువలెనే కోటలును రక్షకసైన్యములును నుండినవి. వీరికంటెఁ గొన్ని యంశములయందు వారు ప్రబలులుగా నుండిరనియును జెప్పనొప్పును. వారుకూడ, ఆంగ్లేయులవలెనే తమ్మాశ్రయించు ప్రభువులతోఁజేరి, ప్రతిపక్షమూని పోరాటమునకు వచ్చునట్టి యాంగ్లేయులపైఁ గవిసి తమకసిని దీర్చుకొనుచుండిరి. కావుననే పైనిజెప్పిన కర్ణాటక సింహాసనమునకుఁ దాను రాజుగావలయునని కోరి చందాసాహేబు ఫరాసువారి యాశ్రయ మనుసరించెను.

కొన్ని పోరాటములును ముట్టడలును జరిగినవి. తుదకాంగ్లేయుల ప్రక్కనే విజయలక్ష్మిచేరెను. మహమ్మదల్లీగారికే కర్నాటక సింహాసనమబ్బెను. మహమ్మదల్లీగారి రాచకార్యములయందు సైత మాంగ్లేయులే ప్రవేశించి యెంతో దిద్దుఁబాటునకుఁ దేఁ దొడఁగిరి.

ఇట్టి దుస్థితియే. యప్పుడు హైదరాబాదు సంస్థానమును నావరించియుండెను. 1750 వ సంవత్సరమున భాగ్యనగరమను పేరఁ బ్రసిద్ధిఁగాంచిన హైదరాబాదును బరిపాలించుచుండిన ముజఫరుజంగుగారు మరణించిరి. చరిత్రకారులు వీరి మరణమును దుర్మరణముగానే పరిగణించెదరు. ఆ తరుణమునందా సంస్థానమును మిగుల సామర్థ్యవంతుఁడయిన బుస్సీదొర యాశ్రయించియుండెను. ఆ సంస్థానపు బిరుదావళు లతనికిఁ బెక్కులుగలవు. అందు మూసా యన్నది యొక్కటి కావున సర్వసాధారణముగా నతనికి మూసా బుస్సియను వ్యవహారమేర్పడియుండెను. ఈశూరుఁడు మహా ప్రతాపశాలి యగుటంబట్టి, స్వలాభముగోరి గద్దియ నధిష్ఠించుట కర్హుఁడుగా నుండిన

నాజరు జంగును వదలి, యతని సన్నిహిత జ్ఞాతియగు సలాబతు జంగుగారిని సింహాసనమెక్కించెను. అతఁడు గద్దియను బొందుటకు మఱికొన్ని కారణములను సైతము వాడుకొనెదరు. నాజరుజంగుగారు మిర్జఫజంగుగారియెడల వైషమ్యము వహించి రాజ్యమునఁ గొన్నిదొమ్ములను లేపెనఁట. నవాబుగా రాదొమ్ముల నడఁచివేయుటకుఁ బోయినప్పుడు కృత్రిమముగ వారిని జంపఁ బ్రయత్నించిరి. ఆయెడ నతనికి బలమైనగాయము తగిలెను. రాజ్యలాభమున కిట్టిచేఁత కొడిగట్టిన నాజరుజంగు నవాబుగారి సమక్షమందుండక తలదాఁచెను. అప్పుడు, సలాబత్తు జంగుగారు ధర్మార్థముగా నవాబుగారి కెంతో యుపచరించిరఁట. ఆకృతజ్ఞతనుగలిగి, మిర్జఫజంగుగారు, ఆకాలమునఁ దన్నుఁ బరివేష్టించుకొని యుండిన సరదారులనుజూచి, తనగద్దియకు సలాబత్తుజంగే యర్హుఁడు. అతనిని సింహాసనాసీనునిఁ జేసెదమని మీరలు వాగ్దత్తముచేసిననే నాజీవములు నెమ్మదిగా ప్రయాణముచేయ నోపును" అని, తమ యభీష్టమును దెలిపిరఁట.

ఇందాఁక రాజ్యభారము వహింపఁగలవాఁడను నేనేయని దృఢాభిప్రాయముతో నుండిన నాజరు జంగుయొక్క కోర్కెలన్నియును సముద్రమునఁ గలిపిన చింతపండాయెను. మిర్జఫజంగు నానతిప్రకారమే అచటి సరదారులలోఁ బ్రబలుఁడుగా నుండిన మూసాబూసి, సలాబతుజంగును సింహాసనాసీనుని గావించెను. ఇప్పుడు పదవి భ్రష్టుతనుగాంచిన నాజరు జంగుయొక్క గతి యేమికావలయును? వంతుప్రకార మాంగ్లేయుల నాశ్రయింపవలయునే కదా! అందులకతఁ డెన్నోప్రయ

త్నములను జేసెనుగాని ప్రయోజన మేర్పడలేదు. కాఁబట్టి యతఁడు నైజాము సామ్రాజ్యమును సంబంధించిన మండలేశ్వరులలోఁ గొందఱను వశపఱచుకొని స్వపక్షము జయింపఁ గుట్రలు పన్నుచుండెను.

నాజరుజంగున కాకాలపు మాండలిక సామంతులలోని స్వజాతీయుఁడయిన జాఫరల్లీఖానుఁ డంతరంగమిత్రుఁడు. ఇతఁడు చిక్కాకోలమును బాలించుచుండెను. శౌర్యస్థైర్యముల యందుఁ బేరెన్నిక వహించినవాఁడు. ఇతర మాండలికులలో నితనిమాటకు వన్నె యెక్కువ.

జాఫరల్లీఖాను దన్నాశ్రయించిన మిత్రుని సింహాసన మెక్కింపఁదలఁచి యితర మాండలికుల నొకరినొకరినిగాఁ దన స్వాధీనమునకుఁ దెచ్చుకొను ప్రయత్నమున యావచ్ఛక్తిని వినియోగించుచుండెను. అప్పటి మండలాధిపతులలో మహా ప్రఖ్యాతిని వహించినవారు, విజయనగర పురాధీశులగు విజయరామరాజుగారు. వీరు మనజాఫరల్లీ కనుకూలురుగానే యుండిరి.

జాఫరల్లీకి హితులగుటఁబట్టియే విజయరామరాజుగారు సలాబత్తుజంగు భాగా నగరసింహాసమధిష్ఠించి యిప్పటికి నాలుగైదు సంవత్సరములయి యుండినప్పటికిని, చిల్లిగవ్వైనను గప్పము క్రిందఁ గట్టకుండిరి. వీరాకాలమున డెబ్బదిరెండు మన్నెదొరలకు సుల్తానుగాఁ బ్రఖ్యాతి వహించినవారు,

ఇవ్విధముగానే యాకాలమునం దితర సంస్థానములు సైత మంతశ్ఛిద్రములతోఁ జెన్నుదక్కి యుండినవి. తంజావూరు, తిరువనంతపురము లోనుగాఁగల సంస్థానములు సైతము

ఇట్టి క్షోభకే చిక్కి చెన్నఱి యుండినవి. తీక్ష్ణ శాసనులుగా నుండఁ దగిన ప్రభువులిట్టి యిక్కట్టులనకు గుఱియైన కాలమునఁ ప్రజారంజన మెచటికో ప్రవాస మేఁగ వలసినదే కదా! అక్కటా! అప్పటి జనుల క్షోభ నెంత వర్ణించినను దనివి తీఱునా? వ్రాయు నతని కాయువు చాలునా? పునరుక్తిలేక చెప్పుటకు భాషలోన మాటలు వలయు నన్ని లభించునా?

తమ హృదయాంతరాళములు సంభవ స్థానములుగా వహించి, రగిలి ప్రజ్వరిల్లిన క్రోధాగ్ని బహిర్గతమయి, శాత్రవ వర్గములను దహించుట కనువుగా, నాంగ్లేయవిరులును ఫరాసు శూరులును స్వదేశప్రభువుల పక్షములను వహించి, విపక్షులతోఁ బోరాడుచుండినప్పటికిని దమ యాశ్రయులకు లభించిన యపజయముల వలని నష్టములు దమ్ము సైత మనుసరింపక మానునా? ఇందాఁకఁ గర్నాటక భాగా నగర సామ్రాజ్యాధిపతుల నాశ్రయించి వారివలన నెన్నో సమ్మానములను బొంది, విఖ్యాతమయిన నవాబు బిరుదమును సైతము సంపాదించి వెలయుచుండిన ఫరాసుల ముఖ్యాధికారియగు డూప్లే నవాబువారు, ఇటీవల నింగ్లీషువారితోడి సంభవించిన యుద్ధముల యందెంతో ధనమును మితిమీఱి వ్యయము చేయవలసి వచ్చెను. ఇతఁడు, తన రాజాంగము వారి ధనమంతయును ధారాళముగ వ్యయపఱచెను. అంతటితోనే చాలించుకొనక దా నార్జించిన విత్త మంతటిని వెచ్చపెట్టెను. "అతి సర్వత్ర వర్జయేత్" అను లోకోక్తి యెంత మహిమగలదో; ఇతఁడు, భరతఖండ మంతటిని ఫరాసు దొరతనము క్రిందికిఁ

దేవలయునని పడినపాటు లన్నియును దన వినాశమునకే హేతుభూతములయినవి.

ఆంగ్లేయులకును ఫ్రెంచివారికిని గలిగిన మనస్పర్థలకీ డూప్లేగారే కారణభూతులని దేలెను. ఇతఁడే, తన ధనకోశమును, స్వేచ్ఛగా వెలఁగిన మెలకువచే శూన్యస్థితికిఁ దెచ్చెనని తీర్మానింపఁ బడెను. డూప్లే, యిట్లు సంభవించిన కష్టములను నివర్తించుకొనుటకై ధనము సేకరించు మార్గమునను వెదకుచున్న యదనుననే, ఇతనిపై దోష మారోపించి, ఫ్రాన్సు దొరతనమువారు రప్పించుకొనిరి. ఇతనివలనఁ గలిగిన యాంగ్లేయులతోడి వైషమ్యము లొక తీరున సరి దిద్దుటకునయి గో. ధూ. దొరవారిని చెన్నరాజధానికిఁ బంపిరి. వీరు ఫ్రెంచివారి యిలాకాలకుఁ గమీషనరు. నాఁటికిని నేఁటికిని హిందూదేశమునందలి ఫ్రెంచివారి యిలాకాలకు ముఖ్యనగరము పుదుచ్చేరి యనుట చదువరుల కెల్లరకును దెలియునే కదా ! కమీషనరు గో. ధూ. పుదుచ్చేరిలోని రాచ నగరునందే నివసింప వలసిన వారయిరి. దొరవారీ నగరమును బ్రవేశింపఁగానే యాంగ్లేయులతో నొక యొడంబడిక గావించుకొనిరి. దీనికే పుదుచ్చేరి యొడంబడిక యను పేరు వాడుకలో నేర్పడియున్నది.

ఆ యొడంబడికవలని లాభాంశము లన్నియు నాంగ్లేయుల నాశ్రయించునవి యాయెను. గో. ధూ. దొరవారీ దేశమునకుఁ గ్రొత్త వారగుటంబట్టి యిట్టి యొడంబడికకు సమ్మతించిరి. దానివలనఁ ఫ్రెంచివారికిఁ బొడమిన నష్టమింత యను

టకుఁ గాదు. బొక్కసమునఁ జిల్లి గవ్వయు లేకపోయెను. అప్పుల కాఁపులుగా నయిరి.

కమీషనరువారు పలుచనయైన శరీరము గలవారు. రమారమి యాఱడుగుల పొడవుందురు. వీరి ముఖమున కెత్తయినముక్కును విరివియైన కనులును బెట్టని భూషణములయి శోభిల్లుచుండినవి. వీరిని రాజనీతి నిపుణులనియే చెప్పవలయును. "మనము వర్తకము సాగింప వచ్చితిమి; రాజ్యమున నెమ్మది నెలకొనిననే గాని తిన్నఁగా వ్యాపారము జరుగదు" అను దృఢాభిప్రాయ మితనికిఁ గలదు. ఇంచుక ముంగోపమితనియందుఁ గ్వాచిత్కముగాఁ దలచూపుచుండినప్పటికిని నుత్తరక్షణముననే పలాయన మగుచుండును. వీరు దీర్ఘక్రోధులుగా రనుట యాకాలములోని వారి కందఱకును దెలియును డూప్లేగారి భార్యవలె నితని కులకాంత రాజకార్యనిపుణగాదు. అయినను, ఫరాసు నాతీమణులకుఁ దిలకమనఁ దగిన సొగసును సొబగును గలిగి, ప్రియుని చేతమునకుఁ జల్లఁదనము గలిగించునదిగా నెసఁగుచుండును. ఒకనాఁడు మన కమీషనరు దొరగారు భార్యతోఁగూడి, వసతి భవనమును జేరిన యుద్యానవన వనమునందు విహరించుచుండిరి. తుదకు, నాదంపతులు ఇరువురును చేతులు గ్రుచ్చికొని మందగమనములతోఁ బోయి, ప్రోదిగాఁ బెరిఁగి యున్న యొక వృక్షచ్ఛాయనున్న చలువఱాతిన్నియ మీఁదఁ గూర్చుండిరి. ఇంతవఱక సంతోషమే తాండవమాడుచున్న గో. ధూ. వారి ముఖ సీమపయి రానురాను బెల్లుమీఱి చింతబిందులు ద్రాక్క నారంభించెను.

అప్పుడు దొరసానిగారు విభునిఁజూచి—

జీవితేశ! సంతోషమునకుఁ గదా యిది సమయము! ఇదివఱకు నెమ్మదిగనున్న మీరు, చింతహత్తియున్నట్లు గానవచ్చుచున్నదే! రాచకార్యముల యందేమైనను బొరపాటు ఘటిల్లెనో? శత్రువు లుద్రేకించి మనప్రాణముల కలిగియుండువారా? మనవలన ప్రభువుల కేదైన యవజ్ఞకలిగెనో?

గో. ధూ.—అట్టి గొప్పకార్యములు గలుగుట కవకాశము లేదు; అట్లే కలిగె ననుకొందము దానికి నే నింతగాఁ జింతిల్లను.

దొరసాని—గొప్పకార్యములకుఁ గాక యల్పకార్యములకా చింతిల్లుట! ఇది మీయెడల విపరీత ధర్మముగా నున్నదే!

గో. ధూ.—ప్రాణేశ్వరీ! నీవు ముగ్ధవు, నీకేమెఱుక? గొప్పకార్యములను ధిఃకరించుటకు ధైర్యముగలదు; అది యల్పకార్యములకుఁ బ్రయోజనపడదు. అఱకాల ముల్లు గ్రుచ్చుకొన్ననుసరే! కంట నలుసుపడినను సరే, యెంత బాధ గలుగుచున్నది. శరీరమంతయు హింసకుఁజిక్కి ద్రొట్రువడును గదా! అల్పములవలనఁ గలిగెడు మహదాపద యెట్టిదో కనుఁగొనఁ గలిగితివా? ఇప్పుడు చూడుము; ఆంగ్లేయులు రానురాను ప్రబలులగుచున్నారు. వారి వర్తకమును మీఱి మనవర్తకము నిరాఘాటముగా జరుగకున్నది. మనస్థితికి క్షీణదశ గల్గుగనున్నది. కాలక్రమమునఁ బేరుకూడ లేక నశింపఁగలదని నమ్మెదను.

దొర:—మీరూహించిన యాంగ్లేయుల యున్నతికిని మన క్షీణతకును గారణము వర్తక మొకటియేకదా?

గో. ధూ:—వర్తక మొకటియనియే స్థూలముగాఁ జెప్పినప్పటికిని దాని ననుసరించిన వ్యవహారములు పెక్కులు గారణము లగుచున్నవి. వర్తక వ్యాపకమునకుఁ బ్రభువుల యాశ్రయము ముఖ్యము. అదియాంగ్లేయుల కిప్పుడు చక్కఁగా నలవడియున్నది. మనశ్రేయమునకు వేరుపురువుగా జన్మించిన రాబర్టుక్లైవు మహోద్దండుఁడు. అతనియెదుట మన జపమేమియుఁ గొనసాగకున్నది. ఎంత కెంతసంపద యాంగ్లేయుల నాశ్రయించియున్నదో, యంతకంత దారిద్ర్యము మనధనకోశము నాశ్రయించియున్నది. పలుమాటలేల? మనసైనికులకు జీతములు నిలువ నిలిచియున్నవి. వారు పొట్టకూటికి లేక మనలనెట్లు సేవింతురు? వీరు మనల నెదిరించినను గాని, లేక మనగుట్టి తెలిసి, ఇదివఱకు ధర్మపాశబద్ధులుగా నుండునట్టి యాంగ్లేయు లెత్తివచ్చినను గాని యంతటితో మనవినాశమునకుఁ బ్రబలస్థితి యేర్పడిపోవును.

దొరసాని—ఔను, మీయూహ సకారణమైనదే. ఐనను, రాబర్టుక్లైవు గారివలె నూర్వు రెత్తివచ్చినప్పటికిని ఓర్వఁగల సామర్థ్యశాలి, మన సేనానియగు బుస్సీగారని నుడివియున్నారే. మీరేల యింగులకుఁ జింతింపవలయును?

గో. ధూ—నీవు యాదార్థమే పలికెదవు. సైన్యసామగ్రి చాలక యతఁడొక్కరుఁడేమి చేయఁగలఁడు. మనుష్యుని సాము

ర్థ్యము ప్రకాశమునకు వచ్చుటకు సాధనసంపద యెంతో యావశ్యకము గదా !

దొరసా — బుస్సీదొర యిప్పుడు నైజామువారి సంస్థానమున మిగుల సన్మానింపఁబడుచున్నాఁడు. ఇప్పటి సంస్థానాధిపతియగు సలాబతుజంగు మనవలన స్థాపింపఁబడిన వాఁడు. కాఁబట్టి, తరుణము గలిగినప్పుడు వారి సైన్యసంపద మన కనుకూలింపక పోవునా?

గొ. ధూ — సైన్యసామగ్రి లభించుటకుఁ గొదువ లేదు. ఐనను, ఇప్పటి వెచ్చమున కేమి సేయుట ?

దొరసాని — వెచ్చమునకుఁ గావలసియున్నంత ధనమునకు సైతము నైజాముగారే పూచిపడవలయును.

గొ. ధూ. దొరగారు చిఱునవ్వునవ్వి "హా! ప్రాణేశ్వరీ, నీవు సందర్భములను దెలియక మాటలాడుచున్నావు. చివరకు నీసలహావలనఁ బ్రయోజనము గానరాదు. ఇటీవలఁ గొన్ని నెలలనుండి గలుగుచున్న యవ్యవస్థవలన భాగ్యనగరము దౌర్భాగ్య నగరమైనది. దాని బొక్కసమునం దొక చిల్లిగవ్వయైనను లేదని పలుతడవలకు వినుచున్నాను.

దొరసాని — జీవితేశా ! ఈసంగతి నాకు సైతము దెలియును. తెలియకయే పలికినదానను గాను. సలాబతుజంగుగారు ప్రకృతము దరిద్రులుగా నున్నారని నాకుఁ జక్కఁగాఁ దెలియును. అటులుండినను వారి సామంతులకు సైతమట్టిదారిద్ర్యము వ్యాపించియుండునా, యనుటను వ్యక్తపఱుచుటకే యిట్లు నుడివితిని. సామంతులనుగూర్చి ప్రశంసించు తరుణములయందు వారి సార్వభౌములను గూర్చియే కదా చెప్పవలయును? మనకు సామంత ప్రభువులతోడి పనియేమి?

సముద్రమధ్యమందు నావ పగిలినందున నీటమునుఁగుచుఁ దేలుచు ప్రాణపరిరక్షణమునకై పెనఁగులాడుచున్న మానవునకొక తెప్పకొయ్య చేతికిఁ జిక్కినట్లును, మహాగహన గర్భమునఁ జిక్కి మార్గము దెలియక పరితపించునట్టి ప్రాణికిఁ దోడు దొరకినట్లును, దారిద్ర్యక్లేశమున మ్రగ్గుమానవునికిఁ బెనులిబ్బి యబ్బినట్లును, గొ. ధూ. దొరవారికీ హితోక్తి హృదయసమ్మోదమొనరించెను. సందియములన్నియుఁ దీఱి బుద్ధికిఁ దేటతన మలవడెను. మితిమీఱిన యానందము వెల్లివిరియఁగా, ప్రాణకాంత చేతులను రెంటిని బట్టికొని, నాయికా ! నీవు నిజముగా నాకు జీవితేశ్వరివి అని యుగ్గడించి, యచ్చోటువాసి త్వరితగతిఁ దన యుద్యోగశాలను జేరెను. గొ. ధూ. దొరవారు తత్క్షణమే యొక లేఖను యుక్తియుక్తముగ వ్రాసి, జాంఘాలికుల చేతికిచ్చి, 'హుటాహుటిని బయనముచేసి బుస్సీగారి కొసఁగుఁడు' అని యుత్తరువిచ్చి పంపిరి.

3 వ ప్రకరణము.

"ఒక్క కోశమున రెండుఖడ్గము లిముడవు.

సత్పురుషుని హృదయమువలెను, సత్కవి యభిప్రాయమువలెను, ఆ దినము ప్రాతఃకాలము నిర్మలముగాను మనోరంజకముగాను నొప్పుచుండెను. దిశలన్నియుఁ దెలివినొంది

ఝిలఝిలమని మందమారుత మంతటను బ్రసరించుచుండెను. వార్పుపోసిన బంగారపుటుండవలె సూర్యబింబము పూర్వదిక్సంధిని బొలుపారుచుండెను. సమయశోభావిశేషము నుగ్గడించెడినో యన విహంగమ నివహము వృక్షాగ్రములం గూయుచుండియు నిక్కడి కక్కడి కెగురుచుండియుం గర్ణరసాయనముగ గానసుధ నించుచుండెను. కమలాకరములం బరిభ్రమించుచున్న భ్రమరసంచయముల ఝుంకారములుం ఆగానములకు శ్రుతిధర్మ మొనర్పుంగా సంతోషాయత్త చిత్తములయి మయూరములు నర్తనములం జలుపుచు నేత్రోత్సవ మొనఁగూర్చుచుండెను. కేదారక్షేత్రములయందు మౌక్తికములు ఫలించినవో యని చూచువారు భ్రమచెందునట్లు మంచుబొట్లు చక్షుఃప్రీతిని గలిగించుచుండెను. ఉద్యానవనవాటికలలోని వృక్షములయందుం బుష్పకుట్మలములు వికసించి కమ్మని నెత్తావి నలువంకులను వ్యాపించి ఘ్రాణేంద్రియమును గౌరవించుచుండెను.

ఇట్లు మిగుల రామణీయకముగాఁ దైవారుచున్న యాయుదయమున పూసపాటి విజయరామరాజుగారు, దమ యుద్యానవనముఁ జేరి యొక గద్దియపైఁ గూరుచుండి యుండిరి. సమయశోభవలని సంతసము కొంచెమైనను వారి యెదను మెదలనట్లు ముఖవైఖరివలన వెల్లడియగుచుండెను. మోమువాడబారియుండుటచేత, ముందురేయి వారికి సుఖనిద్ర యలవడనట్లు వారి హృదయము నేదో పరితాపము ప్రతిబాధించుచుండెనని భావింపఁదగియుండెను. వారేదో యొక విషయమును గుఱించి గాఢముగాఁ దలపోయుచుండిరి. వారికిఁ గొంత

దవ్వున నైదారుగురు భటులు దమ గాత్రములను దత్రస్థతరుకాండముల గావించి నిలఁబడియుండిరి. వారు సైత మొకరితో నొకరు మాటలాడక ప్రభువు నాజ్ఞల నిరీక్షించుచుండిన వారివలెఁ గన్పట్టిరి.

అట్టి తరుణమున వెలుపల నెవరో యొకరు మహారాజ సందర్శనాభిలాషియై వేచియుండునట్లు, వనపాలకుఁడు, మహారాజుగారిని బరాకుఁగొలిపి విన్నవించెను. అతఁడు సన్నిధానమునకు రావచ్చునని ప్రభువానతీయఁగానే, వాఁడు పోయి యొక పురుషుని వెంటఁబెట్టుకొని వచ్చెను. ఆ పురుషుఁడు దన వినయము వెల్లడియగునట్లుగాఁ దనవందనములను విభునకుఁ జెల్లించెను.

వీ రున్నతమయిన యాకారమును బలుచని శరీరమును గలవారు. వీరు ధరించియున్న యుడుపులు వీరిని మన్నెదొరగాఁ దెలుపుచుండినవి. వీరి గీఱునామమువలన వైష్ణవులుగాను గనుపట్టుచుండిరి. వీరి నడుముపట్టను ఖడ్గమొకటి స్వర్ణమయకోశముతో వ్రేలుచుండెను. శిరోవేష్టనమందు రత్నఖచితమయిన తురాయియు, కంఠమున నాణిముత్తెముల పేరును, చెవులయందలి వజ్రాల పోగులును, కంఠముల నాణిముత్తెముల పేరును, వ్రేళ్లయం దన్నిటను రత్నాంగుళీయములును వెలయుచుండినవి.

ఈపురుషునిఁ జూడఁగానే మన మహారాజుగారు——

రండు నీలాద్రిగారూ! రండు' అని మోమునఁ జిఱునవ్వంకురింపఁగాఁ బలికి, తన దాఁపుననున్న యాసనముపైఁ గూర్చుండఁబెట్టుకొనిరి. ఇప్పుడు మన విజయరామరాజుగారి చింతకాక

పరమావధి యేర్పడినట్లు తృప్తిదోచి మోమించుక వికసించెను. మహారాజుగారి కంతరంగమిత్రులు నీలాద్రిగారు.

మహా—నీలాద్రిగారు! కొన్నిరోజులుగా నాకుఁ గార్యము పాలువోక తొట్రుపాటుగలిగియున్నవి.

నీలా—చిత్తము, మిమ్మును దర్శించునప్పుడే యీ సంగతి వ్యక్తమగుచున్నది.

మహా—వినుఁడు. కార్యములన్నియు మన యిష్టానుసారమే కొనసాగుచున్నవి. హైదరాబాదు సింహాసనమునకు న్యాయపూర్వకముగా భాద్యతను వహించినట్టి నాజరుజంగు నవాబుగారు మన దయకుఁ బాత్రులుగా నున్నారు.

నీలా—ఔను, మీరు దమ కుడిభుజమనికదా భావించి యున్నారు.

మహా—వినుఁడు—ఔను, కుడిభుజమంటిరే; యెడమ భుజమెవరు?

నీలా—చిత్తము, జాఫరల్లీగారు.

మహా—సరి, నాకేదో సందేహము దోఁచెను. నాజరు జంగుగారికి మనపట్ల విశ్వాసముగలదు. వారు సింహాసన మెక్కఁగానే మన పరగణామీఁది కప్పమును ఇరువదిసంవత్సరములకు మాపు చేయునట్లు వాగ్దత్తము చేసియున్నారు. వారు, మాటదప్పి చరింతు రనుకొనెదరా?

నీలా—చేవదలుదురా? ఎంత గొప్పమాట; ఆవల వారిగతి?

మహా—మఱియొక కారణము సైతముగలదు; ఆంగ్లేయులు నైజామిలాకా విషయములయందు సంబంధము గలిగించుకొనుట లేదని యొడంబడిక చేసికొని యున్నారు గదా!

నీలా—తెలియును, దెలియును; నాజరుజంగుగారికి నాంగ్లేయులతోడ్పాటు బొత్తిగ నశించెను.

మహా—కాఁబట్టి, నాజరుజంగుగారు మన యనుగ్రహ సంపాదనముననే కృతకృత్యులు గావలయుననియును, వారి వలననే మనము ధన్యులము గావలెననియును మన మూహించిన యూహ పొరపాటు గాఁజాలదుగదా!

నీలా—అది యెట్లు పొరపాటగును? తమ దివ్యచిత్తమునకుఁ దోఁచినదియుఁ బొరపాటగునా? ఆయూహ సహేతుకమే.

మహా—అట్లుండియు న్యాయవిరుద్ధముగా గద్దియమీఁదికెక్కించిన బుస్సీగారినిగూర్చి వినునప్పుడంతయును గొంత భయమే గలుగుచున్నది.

నీలా—ఔను, ఫరాసుల మూక వారు పోరాటములయందు పిశాచములవలె వీరావేశముతోఁ బోరుదురు.

మహా—అత్తకొక యత్త యుండును లెండు; క్లైవుసాహేబుగారు, బుస్సీని హతమొనర్పవలయునని దలఁచి యున్నట్లు వింటిని. అయినను మఱియొక యంశమునుబట్టియుఁ బర్యాలోచింతము. బుస్సీయొక్క సైన్యమాద్యంతము వేయింటికి లోపుగానే యున్నది. అతని నవాబుగారి చతురంగబలములవారు, నిటీవలఁ గలిగిన యుద్ధములయందు నశించినవారుపోఁగా శేషించిన భటులు పదివేలమంది కెక్కువయుండరు. ప్రకృతము మన సైన్యమున పండ్రెండువేల భటులకుఁ గలరు. చిక్కాకోలము

నవాబు జాఫరల్లీగారి ఐదువేల దండు మనకే బాసటయగును. నవాబు వారిదళములన్నియు నెత్తివచ్చునని యే యనుకొందము. మన పదునేడువేల సైన్యములను మార్కొని యవి జయింపఁ గలుగునా? ఇంతటితో మానక వారి దళములు రణాంగణముల నొచ్చియుండునవి; మనవి యట్లుగావు. ఆయాసపా టిట్టిదని తెలియక సుఖస్థితి నుండునవి.

నీలా—“ఔనౌను, మన దళములను గజసైన్యములను జూడఁగానే విరోధులకు భీతిగదుర్దా?

మహా—హా! మఱచితిని. బొత్తిగా మఱచిపోతిని. బొబ్బిలిరావువారు సలాబత్తు జంగువారి కత్యంతమిత్రులు. వారికిఁ గల దళములు మన పగవారితోఁ జేరకయుండునా?

నీలా—దేవరవారి కీవిషయము చక్కఁగా తరుణమునకు జ్ఞప్తివచ్చెను. నేనుసైతము బొత్తిగా మఱచినాను. అట్లుండియు నైజామువారి దళములు పదునాలువేలు అయిన మనవి పదునేడువేలు అగుచున్నవే.

మహా—యదార్థము; బొబ్బిలివారు సామాన్యులను బోలినవారు గారే! శౌర్యమునఁ బేరెన్నిక గన్నవారు. వారి ఐదువేల భటులలో నొక్కఁడొక్కఁడును బోటుబంటే యగుచున్నాఁడు.

నీలా—ఆవిషయమును దలఁచియే నేను సైతము భయపడెదను.

మహా—మీరు భయపడెదరు; నాకుఁ గంటికే నిదుర పట్టకున్నది. వారిని హతముచేసినఁగాని మనస్సు కుదుటఁబడదు. ఏయాలోచనకును వారొకరే యడ్డపడెదరు. వారో

క్కరు లేకుండిన నాకీప్రపంచమునఁ దక్కువయుండదే! ఈకళింగమున కేనే గదా యేకచ్ఛత్రాధిపతి నగుదును.

నీలా—ఇప్పటికిమాత్ర మేమిక్కొఱంత? దేవర దివ్యచిత్తమున నించుక క్రోధాగ్ని యుప్పతిల్లినఁ జాలును. బొబ్బిలి రాజాముకోటలు నిర్దగ్ధములయి నేలకొరుగవా?

మహా:—అయ్యో, మీరనినట్లే యయ్యెడుపక్షమున దినమునకు వేయితడవలకైనను జిత్తవీధియందుఁ గ్రోధాగ్నిని లేపుచుండనా? నా యుద్యమములు వారియెదుటఁ బ్రయోజనవంతములుగావు. రంగారావుగారు మూర్తీకరించిన శౌర్యరసమునుబోలిన వారు. ఖడ్గాఖడ్గిని వారితోఁ బోరుట కెవరి తరము? వ్రేటునకు నలువురేవురుగా ఖడ్గపాణుల నెందర నైనను జంపి కుప్పలుగూల్తురే. వారివంటిదిట్టయే వారి తమ్ముఁడగు వేంగళరాయఁడు. ఇతఁ డభినవాభిమన్యు వనఁదగినవాఁడే! వీరిబంధువులగు వెలమదొరలు సామాన్యులా? వారు సైత మిట్టిదిట్టలే! అక్కటా! తలఁచిన గుండియ లదురుచున్నవి. ఆశూరుల కెక్కిన దండనాథుఁడు, తాండ్రపాపరాజు. అతఁ డొక్కరుఁడే మన దళములనన్నిఁటిని నిర్మూలింపఁదగిన దిట్ట. అయ్యో! అతనియొడలు, ఉక్కుతోఁ జేయఁబడినదో? లేక, యతఁడు, ప్రాణికోటిని వధించునట్టి మానవాకార ఘోరయంత్రమో? అతఁడు ఖడ్గపాణియై తన సేనాముఖమునఁ నిలిచినఁజాలునే! యెట్టి చతురంగబలములకును మహాకంపము గలిగిగొప్పక్షోభ పెల్లురేఁగునే. అతని యాకృతినిజిత్తసద్మమునకుఁ దార్చునప్పుడంతయును ప్రళయకాల కాలునివలె గన్పట్టుచున్నాఁడు. బొబ్బిలిరాజ్యమునందలి వింతను వినరా? కాపు

వాండ్రు సైతము రణశూరులు. స్త్రీలు యుద్ధమునకు నడుము గట్టరేని మృత్యుదేవతలవలె మెలఁగనేర్తురు. బాలురు పిడుగు లవలె రణక్షోణిని విహరింతురు. నీలాద్రిగారూ! పలు మాటలేల? బొబ్బిలినిబుట్టిన చిన్న యంకురమునందు కూడ చేవ గానవచ్చును.

నీలా—దేవరవారు సెలవిచ్చిన విషయములన్నియు సత్యములు; వారు దుర్జయులనియే నా యభిప్రాయము.

మహా—దుర్జయులని వదలుటకు మనస్సొప్పకున్నది.

నీలా—ఔను, అట్టివారి యునికియే శూరునకుఁ దల యేరుపట్టింపదు. వారిని మదమణఁచుటయే ప్రథమకర్తవ్యము.

మహా—అట్లుగాదు; వారేమి మనజోలికి వచ్చెదరా? వారు మనల విరోధించెదరా? పాపము! వారివఱకున్నారు.

నీలా—సరి, అట్లున్న వారి వధోద్యోగము మన కేల? కాలము దీఱినవారే కాలగతి నొందెదరు.

మహా—నీలాద్రిగారు! మీయభిప్రాయము నేనొప్పి కొనియే తీరవలయును. అయినను, రాజ్యమునందును, ప్రాభవమునందును, సంపదయందును, సామర్థ్యమునందును నేను వారికన్న నెన్నోమడంగు లెక్కువయనుటను గూర్చి నేనే యుగ్గడించుకొనవలసినది లేదు; అట్లుండియును, వారు శౌర్య స్థైర్యములయందును, పోగర్తలయందును నాకంటెఁ బెక్కు మడంగు లెక్కువయనుటను నేనే యొప్పుకొనుచున్నాను. నేనెంత ప్రయత్నించి యేమి? వారిప్రఖ్యాతి నాకలవడకున్నది.

ఏమిచేయుదును? వారు నశించిననే యని నన్నాశ్రయించు నట్లు గానవచ్చెడినే!

నీలా—వారివినాశమున కేమిచేయవలయును?

మహా—అదియే నేనడుగునట్టి ప్రశ్న.

నీలా—నాకుసైతమా విషయము పాలుపోకున్నది.

మహా—ఔను, అది యట్టివిషయమే; ఎంత యాలోచించినప్పటికిని అంతు గన్పట్టదు. మనము బుస్సీని ఆశ్రయించిన యెడలఁ గార్యములు గొనసాగవా?

నీలా—ఏల కొనసాగవు.' అయినను మన మాలోచింపఁదగిన యంశమిం దొకటిగలదు; పరాసుల నాయకుఁడు, స్వపక్షము వారికి హితముగావించునట్టిబేల కాఁడే?

మహా—నాయొక్క సందియ మిట్టిదే. నైజాము ముఖ్య సేనాని హైదరుజంగుగారు మనస్సుపెట్టినయెడల మనకోర్కె నెఱవేరదా?

నీలా—అత డిష్టపడిన మన కెంతమేలయిన నొనగూడ వచ్చును. అయినను వారికి ధనతృష్ణ యెక్కువయని విందును.

మహా—ధనవ్యయమునకుఁ జింతల్లను. కోటినిష్కములయినను పోరు పోయుటకు సిద్ధపడియున్నాను. బొబ్బిలి రాజాములశూరులు హతులయి యా కోటలు నాచేతికిఁ జిక్కిన జాలును. ఈ క్రొత్తమార్గమును ద్రొక్కుటవలన నేను జాఫరల్లీనాజరుజంగలమైత్రిని దొలఁగించుకొనవలయును.

నీలా—అట్లయిన నేమి? వారి విరోధము మనల నేమి చేయగలదు. నాజరుజంగు రాజ్యభ్రష్టుఁడు. జాఫరల్లీ ఱెక్కలువిఱిఁగినపక్షి. వీరేమిచేయఁగలరు?

మహా—ఆహా, యదార్థము పలికితిరి. మనము బ్రబలులతోడి మైత్రి ముఖ్యమే కాని దుర్బలుల స్నేహమేల? దాని వలని ప్రయోజనమేమి? సరి, మీ సంభాషణమువలన నా మనస్సులోని కలఁతదీఱి నిశ్చితాంశ మొకటి యేర్పడెను.

ఈతరుణమున నొకభటుఁడు మహారాజుగారి యొద్దకు వచ్చి, 'దేవ! పరాకు, అవధారుమహాస్వామి! ఆశ్వికుడయిన బ్రాహ్మణుఁ డొక్కరుఁడు సన్నిధాన మపేక్షించి వెలుపలఁ గనిపెట్టుకొని యున్నాఁడు' అని విన్నవించి, యనుజ్ఞపొంది పోయి యతనిని వెంటఁ బట్టించుకొని వచ్చి వదలెను.

ఈ బ్రాహ్మణుఁడు సౌందర్యవంతుఁడు. సౌందర్యమునకుఁ దోడుగా వయఃపరిపాకము నలవడి శరీరమున కెంతో శోభ గలిగించుచుండెను. బ్రహ్మతేజమును విద్యాతేజమును నొకటిగూడి ముఖవికాసమునకు సొంపొనఁగూర్చుచుండినవి. శరీర సౌష్టవమును జేత ధరించియున్న ఖడ్గమును నితని నైయోగికాభిజాత్యమును వెల్లడిపఱచుచుండినవి. శిరమునకుఁ జుట్టుకొనియున్న సాలువును బైరవాసపు సాలువును నితని వైదుష్యము నుగ్గడించుటకుఁ బరికరప్రాయములయ్యెను.

ఈ బ్రాహ్మణుఁడే తొలిదినము మన సూరకవిగారిచే సమ్మానింపబడిన రామకవి. ఇతడెక్కివచ్చిన యుత్తమాశ్వము భద్రాచలమహారాజుగారు బహుమతియొసగినది. చేతధరించి యున్న ఖడ్గము, ఇతని కవిత్వమున కెదమెచ్చి కిమిడిప్రభువుగారు బహూకరించిరి.

వీరిని దర్శింపగానే విజయరామ మహారాజుగారు సంతోష పూర్వకముగా దాపుననున్న యొక యాసనముపైఁ

గూర్చుండ ననుజ్ఞయొసఁగిరి. వారి యాదరమునకు సంతోషించి రామకవియుఁ గూర్చుండెను.

4-వ ప్రకరణము.

బావిత్రవ్వఁబోఁగా భూతము వెలువడెను.

ప్రచండాగ్నిగోళమువలె మండుచున్న వేసవికాలపు సూర్య మండలమునుండి వినిర్గతములయిన కిరణ జాలములకు, దావాగ్నికణములో యనఁ గాలుచున్న యిసుక యెడారులంబడి పరితపించుచు, శోషిల్లిన శరీరావయవముల దాహమున కోర్వఁజాలక పరితపించునట్టి పాంథునికి, విమల జలపూరితమును తరువరచ్ఛాయమును నైన సరోవరము గన్పట్టిన నెంత యానందప్రదముగా నుండునో, అంత యానందము, సంసార మహాగహనమున నాధిదావ దహనముచే దగ్ధులగుచున్న మానవ నికరమునకుఁ గావ్యరసము ప్రసాదింపఁగలదు. నిర్మలాభిప్రాయాచ్ఛాదనమున మదికిఁ దెంపు గలుగఁగలదు. కావుననే పండితులు,'విశ్వశ్రేయఃకావ్యమ్'అనునార్యోక్తినిగూర్చి భిన్నాభిప్రాయులుగారు. పురుషుని బాహ్యేంద్రియ వ్యాపారముల నన్నిటిని నిద్రవుచ్చి, వాని యంతఃకరణమును దత్తత్ప్రకరణోచిత రసంబులకుఁ దార్చి, నవ్వించుచు, నేడ్పించుచు, కరుణఁ గొల్పుచు, శౌర్యమునించుచు, మోహింపఁజేయుచు, భయపఱచుచు, ఐంద్రజాలికుని కృత్యంబును సైతము ధిఃకరించి, బుద్ధికి వికాసంబును, నెంతో లోకజ్ఞతను నలవఱచుచు, మహాప్రౌఢిమతో లోకమంతటిని దన యధీనమునకుఁ దెచ్చుకొని

వెలయునంతటి పటుత్వము సాహిత్యమునకుఁ దక్క మఱిదేనికిఁ గలదు. అట్టి యుత్కృష్ట కవిత్వమునందు లీనము గాఁజాలు చిత్తవృత్తిఁగల యుత్తముఁడేకదా రసికుఁడనుటకుఁ దగియుండును! అట్టి రసికతావిశేషము 'సార్వభౌముఁడు సర్వదరిద్రుఁడు' అను తారతమ్యములేక యనుభవపరులకుఁ బరమధనముగా నీశ్వరుఁ డనుగ్రహించుచున్నాఁడు. రసికత్వ సంపాదనమునకే యెంతో గారవ మబ్బునప్పుడు, రసికత్వపోషణమునకేర్పడునట్టి ఘనతను బేర్కొనవలయునా! అట్టి యుత్కృష్ట రసపోషకులేకదా, కీర్తిశరీరంబుల నాచంద్రార్కస్థాయులయి తమ కృతి ముఖముల జనుల చేతములను జల్లచేయుదురు.

మన తురగా రామకవియు నిట్టి ప్రౌఢకవుల తెగలోఁ జేరినవాఁడే. ఇతని కవిత్వము చమత్కార ధర్మమును ధారా విశుద్ధమును వహించునదియే.

ఇదివఱకును నీలాద్రి రాజుగారితోడి సంభాషణావలన మహారాజుగారికిఁ గొంత నెమ్మది గలిగెననుట కెంతమాత్రము సందియము లేదుగాని, శాత్రవ ప్రశంస తటస్థించి యుండినందున నతనికిఁ జిత్తవిశ్రాంతి కెడము లేకుండెను. తన పగవారిని దలఁచుచుచో నతనికి డెందము బగ్గుబగ్గున మండుచుండెడిది. అటులుండియుఁ గావ్య రసానుభవమువలని మహిమను దెలిసినవారు గావున, తొలిదినము దనకు సూరకవి చెప్పిన యాంధ్రకవి యతఁడేయనియును, యతని నామధేయమే రామకవి యనియును దెలిసి మిగుల సంతసించెను. మనస్సున గాఢముగా వ్యాపించియున్న శాత్రవవైషయిక క్రోధాగ్ని, రామకవి కవితామృతమునఁ జల్లపఱచుకొన నగునని దలఁచెను.

రామకవి మిగుల నింగితజ్ఞానము గలవాఁడు; సభలయందలియు రాజసన్నిధానమునందలియు మెలఁగవలసిన మెలఁకువ యతనికిఁ జక్కఁగాఁ దెలియును. కావునఁ దన సాహిత్యసంపదను వెలయింప నిచ్చగొని మహారాజుగారిని జూచి,

గీ. రాజరాజేంద్ర వైభవ ♦ రాజమాన
పూసపాడన్వయాంభోధి ♦ పూర్ణచంద్ర
విశ్వవిఖ్యాత భుజసార ♦ విమతవినుత
వినఁగ వేఁడెద నేఁజేయు ♦ విన్నపంబు

గీ. అవధరింపుఁడు దేవ నే ♦ నాంధ్రసుకవి
రామకవి నామధేయుఁడ ♦ రాజసభల
నాంధ్రవాఙ్మయ వైచిత్రి ♦ నలరఁజేసి
సభ్యవర్తన విఖ్యాతి ♦ సరవిగాంతు

గీ. కలితవ్యస్తాక్షరీ కావ్య ♦ కల్పనంబు
బంధగర్భాది కమనీయ ♦ పద్యరచన
కడఁగి ఘటికాశతగ్రంథ ♦ కావ్యఘటన
నుగ్గుతోఁ బెట్టినవి నాకు ♦ నుర్వినాథ!

మహా — 'ఆహా! దేశభాషలందుఁ దెలుఁగు లెస్స' యన్న యాంధ్రభోజుని యభిప్రాయ మసత్యమగునా? పద్యరూపముగా సొబగుగాంచుటకుఁ దగినభాష తెనుఁగొక్కటియే. దీనికి సమమైనభాష యిదియే. అందీ కవియొక్క ధారావిశుద్ధియు శబ్దమృదిమయును ప్రశంసార్హములే; అని తలపోసి— నీలాద్రిగారు! మీకుఁ గవిత్వమునందు అభిరుచి యెక్కువ కదా! వీరి కవిత్వమును బరిశీలించి తగిన పారితోషికమును దెలుపుఁడు చూతము.

నీలా—చిత్రము! ఈవిషయమందు తమకంటె నాకుఁ దెలివి యెక్కువయా? ఇతఁడు గవిత్వమునకే క్రొత్తయో మన సంస్థానమునకే క్రొత్తయో తెలియరాకున్నది.

మహా—(చిఱునవ్వుముఖ సీమ నలరింపఁగా) మీరు ప్రబలముగా సందేహించెదరే! అందులకుఁ గారణము?

నీలా—'మహాప్రభు! అరచేతి యుసిరిక కౌ యద్దము గావలయును? ఇతనిని మన యాస్థానమునం దెన్నటికిని జూచి యుండలేదు; కాఁబట్టి యితఁడు సాహిత్యమును గ్రొత్తగా నభ్యసించినవాఁడని దలఁచితిని. ఏమి, నాయూహ సహేతుకమేకదా!' అని క్రొత్తవిషయములను శ్రమపడి కనుఁగొన్న వారివలె గర్వముతోడి మందహాసమును వెలయించుచుఁ బలికిరి.

మహా—ఇంతకుమున్నె యితనికిఁ గవిత్వ పటుత్వ మలవడియుండరాదా?

నీలా—అదియెట్లు? తమరు సెలవిచ్చినట్లు ఇతఁడు ప్రాచీనకవియే యైనయెడల మన సంస్థానమున కితఁడు గ్రొత్తవాఁడు గానేరఁడే?

మహా—అట్లయిన, కవులను సమ్మానించునది మన యొక సంస్థానమనియే మీ యభిప్రాయమా?

నీలా—నా యభిప్రాయమును జక్కఁగాఁగనుఁగొంటిరి. కవులకు మనసంస్థానము మాతృగృహమును బోలినదని పెక్కండ్రు చెప్పుచుండఁగా వినియున్నానే.

మహా—అయ్యా, కవిగారు! వీరి యభిప్రాయమును మీ రనుకూలించెదరా? మీ రిదివఱ కితర సంస్థానములను ద్రొక్కియుందురనియే నా నమ్మకము.

రామకవి— గీ. లలితయశుఁడైన భద్రాచ♦లంబు విభుఁడు
తద్దయునుగ్రోలి నాకవి ♦ తారసంబు
తురగరాజం బొసంగుట ♦ ధరణివారుఁ
దురగబిరుదంబు వహియించు ♦ గరిమగలిగె.

గీ. కీర్తిమంతుండు, శూరుండు ♦ కిమిడిప్రభువు
ఘనుఁడు దనసభ నన్నెంతొ ♦ గారవించి
యార్జితఖ్యాతి దనర బ♦హూకరించె
శస్త్రరాజంబు స్వర్ణ కో♦శంబుతోడ

గీ. పార్థివోత్తము లెందఱో ♦ భద్రయశులు
రసికహృదయులు నాదు సా♦రస్వతంబు
పరఁగనీక్షించి యొసఁగిన ♦ వస్తుచయము
లెక్కయిడనౌనె భూమీశ ♦ నిక్కువముగ.

మహా—ఏమయ్యా, నీలాద్రిగారు! వీరు మీ యభిప్రాయమునకుఁ బ్రతికూలించెదరే.

నీలా—అదెట్లు, మహాప్రభు; మనవి చిత్తగింపవలయును. నాయూహ పొరపాటుగాదని యితనిమాటలే యొప్పుకొనుచున్నవి. కిమిడి భద్రాచలవిభు లెట్టివారో మీరే యూహింపుఁడు. ఎందఱో పార్థివోత్తములు దనకు సమ్మాన మొసఁగినట్లు చెప్పికొని నాఁడే; వారందఱును బద్మనాయకులనుటకు సందేహముండునా?

మహా—వెలమలను గుఱించియా ప్రశంసించెదరు. (అని కవినిజూచి పలికెను.)

రా— గీ. అంబరమణి ప్రభావ వి♦డంబనంబు
ఘనతరోజ్జృంభిత ప్రభా♦కరనిరూఢి

వెలయఁజూపట్టు వారొట ♦ వెలమదొరలు
పద్మనాయకులొట స్వ ♦ భావికంబు (రం-చ)

(అని యీయిరువురు ప్రభువులు నుడివిన పదములను సామ్యపఱచి తనకవిత్వ పటుత్వమును దెలిపెను.)

నీలా—అయ్యా, పద్మనాయక వెలమలనుగూర్చి మీ కింకేమయినను దెలియునా ?

రామకవి, వారి ప్రశ్న కెంతో సంతసించి, "శూరులెందును శూర పక్షపాతులనుట సహజమే కదా ? " అని యూహించి,

"చం. పరమపవిత్రయౌ భువన ♦ పావన జాహ్నవి గర్గె నే మహా
పురుషుని పాదపద్మమునఁ ♦ బుణ్యతమంబగు తన్మురద్విష
చ్చరణ సరోరుహంబుననె ♦ సంభవ మొందిన కారణంబుచే
నరయఁగఁ బద్మనాయకు ల♦న స్వెలమ ల్నతి గాంతురిమ్మహిన్"
(రం-చ)

నీలా—అయ్యా, ప్రశ్న కుబదులు పలుకక బట్రాజుల వలెఁ బద్యములు పాడెదరే! ఆవెలమలలో ప్రసిద్ధులెవరు ? వారినిగూర్చి మీ కేమి దెలియుననుటయే కదా మాయుద్దేశము.

రామ— క. ఆవెలమ వంశజులలో
రావుకులీనులు ప్రసిద్ధ ♦ రమ్యయశశ్శ్రీ
లావణ్య మూర్తులగుచు ధ
రావలయం బేలుచుంద్రు ♦ రాజశ్రీతిన్ (రం-చ)

మహా—"ఆవంశమువారు ధరాతలమే యేలుచుందురో ? వారు నీతిమంతులో ? " అని లోలోనన యెన్నికొని, "అయ్యా

మీ యభిప్రాయము ప్రశంసార్హమయినదే" అని వికటముగా నవ్వెను.

నీలా—సరి, ఆవంశమునందలి ప్రసిద్ధ పూరుషులను గూర్చి మీ కెఱుక లేదో ?

రామ— గీ. గర్వితారాతి రాజన్య - కాండకఠిన
కంఠలుంఠనజాత ర♦క్తాంబుపూర
మజ్జనవ్రతదీక్షాభి ♦ మానఘనులు
రావువారలు వట్టివా ♦ రా తలంప (రం-చ.)

రామకవి చెప్పిన యీపద్యము విజయరామరావుగారి కెంతో క్రోధరసము పూరించెననుటకు సందియముగలదా ? వారు, తాము సూర్యవంశపు క్షత్రియులగుటచే రామకవి చెప్పిన రాజన్యశబ్దమును విధిలేక తమకన్వయించుకొని కసలిరి. అట్లుండియు డెందమునందు తనకుమీఱి యతిశయించిన కోప తాప మొకవిధముగా నణఁచికొని తటస్థులుగా నుండిరి.

నీలా—రంగారావుగారినిగూర్చి మీకు వినికి చాలదో?

ఇందాఁక, దలఁచిన తలంపే యిప్పటికిని వహించినవాఁడయి, మన రామకవి, శ్రీబొబ్బిలి రంగారావుగారి ప్రశంసవలన నా ప్రభువుల కానందము కలుగఁగలదని యూహించెను. ఇతఁడు బొబ్బిలి సంస్థానమునకుఁ గ్రొత్తవాఁడు; శ్రీ రంగారావు గారిని సందర్శించిన వాఁడే కాఁడు. అట్లుండియు వారి ప్రఖ్యాతిని విన్నవాఁడు గావున వారియెడలఁ దాను వహించియుండిన సదభిప్రాయము వెల్లడిపఱచుటకుఁ దగిన తరుణము సంభవించెనుగదా యని సంతసించి—

సీ. తనభుజదండాసి ♦ ధారామహోరాహు
వరిరాజతతుల వె ♦ న్నంటిమ్రింగుఁ
దనసముద్దీప్త ప్ర♦తాప సహస్రాంశుఁ
డహితాంధతమసంబు ♦ గుహలఁజొనుపు
దనకీర్తి కుముదబాం♦ధవుఁడు శాత్రవలోక
ముఖపంకజముల సొం♦పులు హరించుఁ
దనదృఢాజ్ఞావేల ♦ మొనసి ప్రత్యర్థిభూ
పతి సముద్రంబులఁ ♦ బట్టువఱుచు
గీ. నహుష నల రంతి సగరమాం♦ధాతృపూరు
పృథు భగీరథ శశిబిందు ♦ విక్రమార్క
ధర్మతనయుల మఱపించు ♦ ధరణినాథ
రమ్యగుణజాలముల ప్రోవు ♦ రంగరావు" (రం-చ.)

"అయ్యో, చాలింపుఁడు మీవాచాలత! అయ్యో, మధులిప్తఘోర నారాచములకంటె ఘోరతరములు మీ సాహిత్యమునందలి పదజాలములు; మీరు పరానుకూలులు. మీవంటి నీచులను జూచుట యెంతో రోఁత. అక్కటా; నెమ్మదిగానున్న హృదయమున కెంతో వైకల్యము గలిగెను. అయ్యో, నీలాద్రిగారు! నాకొకవిధముగా మన యాస్థానకవి సూచించిరి. నేను దానిని స్థూలముగా విచారించి యితనిశాక కియ్యకొంటిని" అని విజయరామరాజుగారు. మిగుల ఖిన్నత వహించి పలికిరి.

"అక్కటా! ఏమి యీవిపరీతము? దేశకాలపాత్రములను విచారింపక యిట్లు మెలఁగితిని. వీరిని వదలి వీరి సమక్షమందు విరోధులను బొగడుట పొరపాటే కదా! అయ్యో, నాకిచ్చట నవమతి గలుగక పోదు. తన పూర్వవైరము దీర్చుకొనుటకు

సూరపరాజు పన్నిన పన్నుగడల ప్రయోజనమే యిది; వేఱు గాదు; అయినను నేను యదార్థమే పలికితిని. ఱోలఁ దలపెట్టి యాయెను; ఱోఁకలి పోటున కింక వెఱవనేల? ఈశ్వరుఁడు గలఁడు" అని యొకవిధముగా రామకవి యూఱడిల్లెను.

నీలా—నా కింతకుమున్నె తెలియును. దేవరవారికి నాయూహ సత్యమనుట యిప్పటికి విశదమయ్యెను గదా! మఱియొక విషయమున నాకు సందేహ మేర్పడియున్నది. అది దేవరవారి కెట్లు పరిణమించునో?

మహా—ఇతఁడు మన పగవారి యాస్థానకవి యనుటను గూర్చి యా సందేహించెదరు? ఆవిషయము నాకు ముందే తెలియును. సూరకవిగారు సూచించియున్నారు గదా!

నీలా—ఇతఁడు రావువారి యాస్థానకవి యను మాట యుండఁగా—మన పగవారు ఇతనిని పనిఁబూని మనయొద్దకుఁ బంపి యుండరాదా? దేవర హృత్తాపము శయింపఁ జేయు నిమిత్తమే, తమ్ము, మీ మ్రోలఁ బొగడున ట్లితని కానతిచ్చి పంపి యుందురని దలఁచెదను.

మహా—ఔను, నేను సైతమట్లే భావించెదను.

నీలా—అట్లు మహారాజావమానమునకు సాహసించిన యితని నూరక పంపివేయుట యుచితమగునా?

మహా—నాకేమి చేయుటకును దోఁచలేదు; చిత్తమే స్వాధీనము తప్పి యున్నది. ఇట్టి యధములను వేగులవాండ్ర తెగలోఁ జేర్చి తల తఱుగవలయును; అయ్యో బ్రాహ్మణుఁడే! ఇతనిమీఁద నాఖడ్గమెట్లు తెగఁగలదు?

నీలా—మహాప్రభూ! బ్రాహ్మణత్వ మట్లుండనిండు.

ఇతఁడు, తనకుఁ గలిగిన యవమానమును, దమ ప్రభువులకుఁ దెలిపి, మనయెడకుఁ గలిగిన పరితాపమునకు వేయిమడంగు లెక్కువ యనుతాపమును నెలకొల్పవలదా? కాఁబట్టి, తల తెఱుగరాదు; తల తెఱుగుటకంటె మన శిక్ష యతిశయించి యుండవలయును.

మహా—అట్టి శిక్షయెదియు నాకుఁ బట్టువడకున్నది.

నీలా—అట్టిది లేకపోవునా? కలదు; అది పూర్వకాలపు క్షత్రియుల యనుష్ఠానము క్రింద నుండినదే—ప్రభువు చిత్తగించినయెడల "బలభద్ర నీతి ననుసరించి—

"తలయును మూతియు గొఱుగుట
తలఁద్రుంచుటకంటెఁ దుచ్ఛ ♦ తరముమహాత్మా"

యన్నట్లీ బ్రాహ్మణుని బోడికొట్టి పంపివేయుఁడు.

అక్కటా, మన రామకవి ప్రజ్ఞానిధియయ్యును మంద భాగ్యుఁడనుటకు సందియము గలదా? వైదుష్యమెంతయుండి యేమి? వివేకచతురిమ యెంత గలిగియేమి? ఇవియన్నియు దుర్దశాహతములే కదా! అతని దౌర్భాగ్యమున కెన్ని పరికరములు క్షణమాత్రలోఁ గలిగిపోయెను. ఇట్టి తరుణముల మనము విజయరామ రాజుగారివంటి యుత్తములపై నింద నారోపింపఁ జెల్లదు; వారు వివేకనిధులు; రామకవియొక్క దౌర్భాగ్యమే మొట్టమొదట సూరకవిని దర్శించునట్లు పురికొల్పెను. తనకు మున్నే మహారాజులయొద్దకు కార్యప్రధానకుశలుఁడైన నీలాద్రి రాజును దెచ్చి వదలెను. అంతటితో మానక వారికి వైరి జన కథనమునే సంభాషణాంశముగాఁ జేసివైచెను. వేయి మాట లేల? మనరామకవిగారి నోరార నితర సంస్థానాధిపతిని బొగ

డించెను. ఇవన్నియునే యాకవి నాశ్రయించిన దుర్దశాలక్షణములు. వానివలని ప్రయోజనమే నెత్తియు మూతియు గొఱిగించుకొను నట్లగుట.

ఎంతయును మట్టుమీఱిన కోపమున మహారాజుగారు, దాఁపునఁ గూర్చుండియుండిన నీలాద్రిగారినిఁ జూచి, "మన్నెదొరగారు, మనమింక జాగుచేయరాదు; సైన్యములతో బొబ్బిలిమీఁదికి బుస్సీగారెత్తి వచ్చుటకైన ప్రయత్నములను జేయవలయును."

నీలా—చిత్తము, దేవరా! అట్లే చేయుదము. ఈ యల్పకార్యమునకా జాగుచేయుట.

మహా—బొబ్బిలివారు, చాల మదించి యున్నారు; వారిని దండింపకయే నాచిత్తమున కుపశాంతి గలుగదు.

నీలా—వారొకరుమాత్రమా? వారితోఁ జేరినవారందఱునే మదించియున్నారు.

మహా—అయ్యో, మఱచినాను; జాఫరల్లీకి సైతము రావు వారిగతినే పట్టింపవలయును.

"నీలా—ఇప్పుడు నేనాలోచించునట్టి విషయ మదియే." అని, తాను మహారాజుగారి కార్యభారమును నిపుణత మెఱయ నిర్వహించునట్లు, రామకవిగారి దండనను దలఁపునకుఁ దెప్పించి, తన యధికార మచ్చట గొనసాగుట వెల్లడి యగునట్లుగా దాఁపున నున్న భటులను బిలిచి మహారాజుగారి యాజ్ఞను దెలిపెను.

ఇప్పుడు రామకవి స్థితి యెట్లుండును? అతని హృదయ మెంత శోకసాగరమున మగ్నతఁ జెందియుండును? అని చదువ

ఱులు పొరపాటునఁ దలఁపోయరాదు. రామకవి విబుధవర్యుఁడు, ధైర్యమున కితనితోఁ సాటి యెవనిఁ బేర్కొనవచ్చును. కాఁబట్టి అచట వారి నేమాత్రము లక్ష్యపెట్టి తన దుర్గతి బాయుటకు వేఁడికొనలేదు. తన దైన్యము నగపఱుపలేదు. అయినను, మహారాజుగారి మోముపైఁ జూడ్కి నిగడించి—

"గీ. రామకవి బొబ్బ పెద్ద ఫి♦రంగిదెబ్బ"
యనఁగ వినుచుందువే కదా ♦ యవనినాథ!
దేశవితతికి వెలియగు ♦ తెలుఁగుకంటెఁ
గేశవితతికిఁ దొలఁగుట ♦ కేవలంబొ?

గీ. గర్వితారాతి నిబిడాంధ♦కారభానుఁ
డనెడు తావక విఖ్యాతి ♦ యాశ్రయించు
శౌర్యసముద్రులైన మీ♦క్షాత్రవులను
సూర్యతేజంబు చంద్రునిఁ ♦ జొచ్చునట్లు

గీ. వెంగలినె వెంద్రుకలకేను ♦ వెలితియగుట
నాశ్రయింపదొ ననుఁదురీ ♦ యాశ్రమంబు
రామకవి నామమీఁగి యీ♦భూమిమీఁద
రామబ్రహ్మాఖ్యఁ దనరెద ♦ రమణతోడ."

అని మఱియు నేమో చెప్పుటకు సాహసించు తరుణమున నచటి కావలివాండ్రతనిఁ బట్టుకొనిపోయి రాజాజ్ఞను దత్క్షణమే నిర్వర్తించి రామకవిగారిని బంపివేసిరి. పిదప మహారాజుగారును నీలాద్రిగారును నిట్టూర్పులతో నాచోటు వదలువారైరి.

5-వ ప్రకరణము.

పిల్లికిఁ జెలగాటము; ఎలుకకుఁ బ్రాణసంకటము.

హైదరాబాదు నగరమునకు రమారమి మూఁడు క్రోశముల దూరమునందు 'ఆల్వాలా'యను క్షేత్రము గలదు. ఇది శ్రీ వేంకటేశ్వర క్షేత్రము. ఇచట నొక వెంకటేశ్వరస్వామి దేవాలయమును, దాని చుట్టు సత్రములును గలవు. సమీప గ్రామములయందుండు జనులు, ఆపత్కాలములయందుఁ దిరుపతి వేంకటేశ్వరస్వామికిఁ జెల్లింపఁదగిన మ్రొక్కుబడులు, కొన్నియసందర్భములు గలిగి తిరుపతి కేఁగుటకు వీలుగలుగని కాలములయందు, నీయాల్వాలా కేఁగి, యందలి శ్రీనివాసమూర్తికిఁ జెల్లించుకొనుచుందురు. తిరుపతి వేంకటేశుని ప్రతినిధియే యాల్వాలావిభుఁడని వారినమ్మకము. ఆగ్రామమునందలి జనసంచార మెక్కువ. ఇంతేగాక యది వాసమునకు మిగుల ననుకూలించిన స్థలము. కాఁబట్టియే, సలాబత్తుజంగుగారికిఁ బ్రాణసదృశుఁడయిన బుస్సీదొర, కొంతకాల మచ్చటఁ దన స్కంధావారముతో వసించుచుండెను. ఆగ్రామమునకుఁ జుట్టుప్రక్కలఁ జిట్టడవులును, గుట్టలును గొన్ని గలవు. ఆతని బిడారములోని వీరు లాప్రదేశములను జేరి, లేళ్లను గువ్వలను గాల్చి తెచ్చి, ప్రేల్చి కడుపారఁ దినుచుందురు. ఇంతేగాక, వీరి కాగ్రామమునఁ గావలసినంత పెరుగు పాలు మొదలగు వస్తువులు ధారాళముగా లభించుచుండెను. ఆప్రదేశమునకుఁ బరిసరమున విశాలములయిన బయళ్లు గలవు. అవి యావీరభటుల స్వారులకును యుద్ధశాస్త్ర పరిశ్రమలకును

నెంతో యనుకూలించుచుండెడివి. ఆ స్కంధావారమునకుఁ జుట్టు శతఘ్నికాచయము నిలిపి యుండిరి.

ఆ స్కంధావారమునకై వేయఁబడియున్న గుడారములలో నొకటి మిగుల రమణీయతను జెందియుండెను. దానిని జూడఁగానే, యది యచ్చటివారి నాయకుని గుడారముగాఁ దెలియవచ్చును. ఆపటకుటీరము దక్కినవానికంటెఁ బెద్దదియగుట యట్లుండఁగా దానిని బింగించియున్న పగ్గములుపట్టువి. జాలర్లు పులితోలువి. నేలమీఁద విలువగల రత్నకంబళములు పఱచి వానిపైఁ బనితనముగల యాసనము లమర్చి యుండిరి.

ఆగుడారము ప్రక్క గోడలకు మాఱుగా దళమయిన బట్టతెరలు, బిగింపఁబడి, వానియందు కన్నుల మిఱుమిట్లుగొలుపఁ జాలునట్టి క్రొమ్మెఱుఁగులతోడి నానావిధ యుద్ధపరికరములను వ్రేలవైచి యుండిరి. ఒక వంక సహజాకృతిని జిత్రింపఁబడిన డూప్లేగారి పటము నమర్చియుండిరి.

ఆ గుడారములోని యాసనములలో మిగుల పనితనముగల యున్నతాసన మొకటి యుండెను. అది పదను పెట్టిన పులితోలిచేఁ గైసేయఁబడి యుండినది. వీరపురుషుఁ డొక్కఁ డా యాసన మలంకరించి యుండెను. అతని పరిసరములయందున్న యాసనములపై శూరవరులు గొందఱు గూర్చుండి, యావీర పురుషుని యుత్తరువులను గనిపెట్టికొని యుండునట్లు గానవచ్చుచుండిరి. ఆచోట నిశ్శబ్దము వ్యాపించియుండెను. అట్లుండియు నందుఁ బ్రవేశించిన యెట్టి పందయును వీరావేశమును వహింపక మానఁడు.

ఈ వీరపురుషుఁ డున్నతాకృతియును, అందులకుఁ దగిన

బలుపును గలిగియుండెను. ఇతని పెద్ద నొసలును జుఱచుఱ జూచు చూపులును నితని శూరుఁడని వేనోళ్ల నుగ్గడించుచుండినవి. అల్పసైన్యముతో సుదృఢమయిన మహావ్యూహమునఁ దూఱి, భీభత్సవృత్తిని జెదరగొట్టునంతటి దిట్టతన మతని ముఖవికాసమువలననే తెలియవచ్చుచుండెను. ఇతఁడు, యుద్ధకళావిశారదుఁడు. ఇతనియం దమరియున్నంత యింగితజ్ఞానమును సమయోచిత ప్రనిభయు నాకాలమునందలి శూరవరులలో నొక క్లైవుగారికిఁ దప్ప నితరుల కెవరికలవడి యుండలేదని ధారాళముగాఁ జెప్పనొప్పును. ఇతఁడు మనమిదివఱకునే ప్రశంసించియున్న శూరలోక శ్లాఘాపాత్రుఁడగు దౌలత్ ఉల్ ముల్క్ మూసా బూసీదొర. ఇతఁడే దుర్దముఁ డయిన ఫ్రెంచి సేనానాయకుఁడు. ఈవీరుఁడు గొంత దనుక దీర్ఘాలోచనా పరవశుఁడయి యుండి తుదకుఁ దన దాఁపునఁ గూరుచున్న వీరునిఁ జూచి—

“అయ్యా, హైదరుజంగుగారు! మన మిప్పుడేమి చేయుటకును వీలుపడకున్నది. మన నవాబుగారు భాగానగర సార్వభౌములని యొప్పుకొనుటచేతనే కార్యములన్నియుఁ గొనసాగిపోయినవని చెప్పరాదు. వారు సింహాసన మెక్కి యిప్పటికైదు సంవత్సరములు గడచినప్పటికిని రాజ్యము స్థిరపడదు. ఇందులకుఁ బ్రబలకారణము లనేకములు గలవు. వానికన్నిటికిని నాజరుజంగుగారు చేయునట్టి యంతశ్ఛిద్రములే కారణములగుచున్నవి. మరాటాలకుఁ బొడసూపియున్న క్రోధమునకు వారు పన్నినకుట్రలే హేతువులని భావింపుఁడు. మరాటుల శౌర్యాగ్ని

జ్వాలలెప్పుడున్నట్లుండి మనపై వ్యాపించి హతమొనర్పనున్నదో యని క్షణక్షణము జాగరూకతను వహించుచున్నాను. అందున్ను, మనము స్మరింపఁగల భటుఁ డొకఁడు గలఁడు. అతఁ డెంతో యుక్తుల నేర్చినవాఁడు. ఆ సదాశివరాయఁడు మిత్రునివలెనే మెలఁగుచుండి కొంపలు ముంచువాఁడు. అతనికి దృఢమయిన యిరువదివేల గుఱ్ఱపుదండు గలదు. ఆదళములోని ప్రతి భటుఁడును ముక్కాఁకలఁదేరిన పోటరి. ఇందఱుండియు, వారొక్క చిత్తమున నొకనివలె మెలఁగనేర్చినవారు. అయ్యో, వారుమిన్నుమన్నుఁ గానక భూతములవలెఁ బోరుదురు. ఇట్టి దళములతో నతఁడెప్పుడు మనల మార్కొనఁదలఁచియున్నాఁడో. తెలియను. అతని నిర్మూలపఱచుటకైన యూహాలను బన్నియేయున్నాను.

వీరిసంగతి యిట్లుండనిండు. మన పాదుషాహాగారి క్రింది మన్నెదొరలే తిరుగఁబడియున్నారు. వారు మనప్రభువు సింహాసన మధిష్ఠించినది మొదలుకొని యేపన్నుఁ జెల్లింపకున్నారు. మన్నెదొర లననేల? ఒక చిన్నకాపువానికి సైతము భక్తి చక్కఁగా నలవడియుండలేదు. ఇట్లు రాజ్యమందు వ్యవస్థదప్పి శత్రువులొక్కపెట్టున నుద్రేకించియున్న సమయమున మన నవాబువారి యునికి యెట్లు క్షేమప్రదమగును.

హైదరుజంగుగా రాతనిమాటల కించుక యాలోచింపవలసినవా రయిరి. తుదకుఁ దన మౌన ముడిగి, / "అయ్యా, సాహేబుగారు(బూసి) ప్రకృతమున్న స్థితిగతులనే మీరు చెప్పుచున్నారుగాని వీనికిఁ బ్రతికృతిని జెప్పరు. నాజరుజంగుగారు జీవించి యున్నంతవఱకు మన ప్రభువులకు క్షేమకరముగా

దనుట సత్యమే. వారి నడఁగఁద్రొక్కినచో మనకు మేలుగలుగును గదా?

బూ—ఔను, వారిని మన యధీనమునం దుంచుకొనుటయే క్షేమప్రదము; కర్తవ్యాంశమును. తక్కిన పనులను గూర్చి మీరు చింతింపవలసిన పనిలేదు.

హై—నాజరుజంగుగా రిప్పుడు జాఫరల్లీగారి పోషణ క్రింద నున్నారు. ప్రకృతము చిక్కాకోలము మన సర్కారులలోఁ జేరియున్నది!

జాఫరల్లీ తన యధీనమునందున్న నాజరుజంగుగారిని మన కప్పగించునట్లు ఫరమానా పంపెదను. అతఁడు, మన విరోధిని సంతోషపూర్వకముగా నొప్పగించెనా మేలు చెందఁగలఁడు. అతఁ డిదివఱకుఁ జెల్లింపక యాపి యుంచుకొనిన కప్పమును మన్నించుటేగాక యా మండలమును మే మతనికి జాగీరుక్రింద నొసఁగెదము. అతఁ డందులకు సమ్మతింపక పోయెనా; అతని పేరికొలును దీయించి షేకు మహమ్మదుగారి కిచ్చునట్లు ప్రయత్నింతుము.

షేకు—చిత్తము, నాజరుజంగుగారిని దెచ్చి మీపాదముల కర్పించెదను. అది దుస్తరముగాఁ గన్పట్టిన వారి శిరమునైనను దెచ్చి సమర్పించుకొనఁగలను.

హై—ఆ కార్యమును మీరు చెప్పిన దానికంటె నెక్కువగా నిర్వహింపఁగలరను నభిప్రాయము మాకుఁగలదు. మీరు నే నిచ్చు ఫరమానాను దీసికొని, కొంత సైన్యముతోఁ జిక్కాకోలమునకుఁ బొండు.

అచ్చటనున్న సభ్యులలో నొకఁడు, హైదరుజంగుగారి

మాటలనువిని, "ఏపనియును ఉపాయముతో జరుపవలయునుగాని యారంభమునందే దండనీతిని బ్రయోగింపఁదగదు. ఇంతేకాక, కొన్ని యసందర్భములనుబట్టి విచారింపఁగా, సైన్యము, యుద్ధము, అను మాటల నుచ్చరించుటకే యిది తరుణముగాదు. చిన్న యుద్ధమని తలపెట్టిన నది కాల వైపరీత్యమున నెంతకుఁ బరిణమించునో! ఇట్టి యంశములను మనమెంతో విచారించి కార్యమున కారంభింప వలయును; దీనికిఁ దోడుగాఁ బొక్కసమున ధనము లేదు.

ఇట్టు యుక్తియుక్తముగ హితము పలికినవాఁడు, 'సులేమాన్ ఉం రా' యను మహమ్మదీయ వీరుఁడు. ఇతఁడు నైజాము వారి యొక్క చిన్నదండున కధిపతి.

హైదరుజంగు సులేమాన్‌గారి కార్యవిచక్షణతకెంతో సంతసించి, ముఖమునఁ జిఱునవ్వంకురింపఁ జేసెను.

హైదరుజంగు గారు దమ యభిప్రాయము దెలుపఁగా నాతని వ్రాయసగాఁ డప్పుడే యొక లేఖను వ్రాసి దెచ్చెను. హైదరుజంగు దమ సంతకముచేసి తమ వసమునందే యుండిన దివాణపు ముద్రపొడిచి, మడిచి పేకుమహమ్మదు చేతి కొసఁగెను. అతనికిఁ దోడుగా రాఘవరావు సాంబాజీరావు అను నిరువురు మరాటావీరులను జతపఱచి తత్క్షణమే చిక్కాకోలమునకుఁ బయనము గావలయునని యాజ్ఞ పాలించెను.

అప్పుడు, సులేమాన్ ఉం రా గారుఁ "ఓహో, పేకు గారి రక్షణమునకీ యిరువురు శూరులు చాలరు. నాకు విశ్వాసపాత్రులుగా నుండువారిని మఱి యిద్దఱను వారికిఁ దోడుగాఁ బంపెదను. అని, తన నమ్మకమునకుఁ దగియున్న, బాలాజీ

సింగు శంకరసింగులను బిలిచి, గూఢముగాఁ గొన్ని సంగతులు దెలిపి యాముగ్వురతోఁ జేరి పయనము చేయు నట్లానతిచ్చెను.

తమ యజమానుల యానతిని బొంది యా యేవురు ఖడ్గపాణులయి గుఱ్ఱములెక్కి యాగ్నేయ దిశనుగూర్చి పయనము చేయఁ దొడఁగిరి.

తదనంతర మచ్చటనున్న యోధులు, నాజరుజంగు దమచేతులకు దొరికి పోయినట్లును దమ పదవులు స్థిరపడి పోయినట్లును, నెమ్మది గలుగఁగా, నందఱు లేచి దమతమ గుడారముల కేఁగిరి. దౌలత్ ఉల్ ముల్క్ మూసాబూసిగారొకరే యాలోచన పాలుపోక తటస్థులుగాఁ గూర్చుండి యుండిరి.

ఆ తరుణమున నలువురు భటు లశ్వారోహకులయి హుటాహుటినివచ్చి బూసిగారి గుడారమునకు వెలుపల నిలిచిరి. బూసివారి రాక దెలిసి, తానే వారున్న యెడకుఁబోయి మిగుల సంతోషముతో రాఁబట్టుకొనెను. భటులు వీరెక్కి వచ్చిన గుఱ్ఱములను లాయమునకుఁ జేర్చిరి.

వీరు నలువురును బూసిగారి డేరాలో నుచితాసనముల నలంకరించిరి. వారిలో నొకఁడు దన యంగీ జేబునుండి యొక యుత్తరమునుదీసి బూసిగారి చేతి కొసఁగెను.

ఈ యుత్తరము, కమిషనరు గొ. ఫూ. వారంపినదనియును, దానిలోని యంశములు ధనము కావలసి యుండుటను గూర్చినవనియును మేము ప్రస్తావింపకయే చదువరులకు స్ఫురింపఁ గలదు.

6-వ ప్రకరణము.

హృత్తాపమునకు మించిన దాక్షుత్తాపము.

రాజభటులు రామకవిగారి తలను మూతిని గొరిగి వెడల నడచిరి. అతని యదృష్టము బాగుఁగా నున్నందున నెక్కివచ్చిన గుఱ్ఱమును, దానిమీఁద వేసి యుంచిన దారి శయనపు సామగ్రిని చేత నున్న ఖడ్గమును నపహరింపక వదలిరి. రామకవి విజయనగర మహాక్షేత్రమునకు వెంట్రుకలముడి దోఁపిచ్చెనేగాని, దారి సెలవులకై తెచ్చుకొనియున్న ముల్లెయందొక కాసుగాని జార విడుచుకొనలేదు.

రామకవి, పురబాహ్యప్రదేశమును జేరఁగానే యేపని చేయుటకుఁగాని, యేవంకకుఁ బోవుటకుఁగాని దోఁచక, గుఱ్ఱము పోవు దిక్కునకే శరీరము వదలి, హృదయము పలువిధముల యాలోచనలకు వశపఱచెను. అతఁ డెక్కియున్న గుఱ్ఱము కూడ ఆగ్నేయ దిశనుగూర్చి, బాట నెంబడీనే తిన్నఁగా పోవుచుండినది. అట్లు గాల దవ్వేఁగఁగా బాటకుఁ గుడివైపున నొక సత్రము గానవచ్చెను. దానిని వదలినయెడలఁ బైకిఁ బదునైదు మైళ్లదాఁక నిలుచుటకు నీడ దొరకదు. అతఁ డెక్కియున్న యశ్వము, అలసిపోయినందున నచ్చటచ్చట నిలిచినిలిచి పోవఁ దొడఁగెను. దానికి శరీరమంతటను జెమ్మటగ్రమ్మి, నోట నుఱుఁగులుగట్టి, మిగుల దప్పిగలిగి యుండెను. భానుఁ డాకాశమధ్య మలంకరించి వేఁడి మంటలను వెలికి నుమియుచుండెను. నేల, కాలిన మంగల మనుకరించుచు వేఁడిసెగల నిర్గమింపఁజేసెను. రామకవి హృదయమున వ్యాపించియున్న గాఢ

మయిన చింతను క్షుత్పిపాసలతిశయించియు బాధింపకుండినవి. అతనికి, ప్రకృతపు స్థితికిఁ బరిహారము గలిగింప వలయునను తలంపు జ్ఞాపకమునకు రాఁగాఁ బార్శ్వమునకుఁ దిరిగిచూచెను. అందు సత్రమొకటి గానవచ్చుటచేత నది యొక మజిలీయని దెలిసికొనెను.

పిదప, రామకవి సత్రము చెంతకుఁబోయి యచట నున్న యొక సేవకుని వశమునఁ దన గుఱ్ఱ మప్పగించి, దానికి మేఁత పెట్టి సేదదేర్ప నియమించెను. అంతట, సత్రములోఁ జొచ్చి, రామకవి సత్రపు టధికారి నడుగుకొని యొక గదిని సంపాదించుకొనెను. అందు, తన మూట ముల్లెలను బదిలపఱచి, దాఁపున నున్న కోనేటికిఁబోయి, స్నానమాడి, నిత్యకర్మల నిర్వహించుకొని త్వరగాఁ దానున్న గదికి వచ్చి చేరెను. ఇప్పటికిఁ గొంతసేద దేరినందునఁ దాను దెచ్చుకొని యున్న పేలపిండిని జల్లలోఁ గలిపి త్రావి యించుక నెమ్మది జెందెను. క్షేత్రయాత్రలఁ జేయుచు నచ్చట బసదిగి యున్న యొక బ్రాహ్మణ తైర్థికుఁడీ రామకవిగారిని జూచి తాను వండుకొనిన వంటకమును భుజింప నతిథిగాఁ బిలచెను. రామకవియు నందులకు సమ్మతించి యావిప్రుఁడు పెట్టిన భోజనమును గడుపారఁ దిని లేచెను. ఇట్లొక విధముగా రామకవిగారు, తన శరీరము నాశ్రయించియున్న క్షుత్పిపాసల యుద్వేగ మణఁచెను.

రామకవిగారి హృదయము స్వాయత్తముగా నుండ లేదనియు నతని తలలో నెన్నో తలంపులు దలచూపుచుండిన

వనియును జెప్పియున్నాము గదా! అతని యొడలు సేద దీఱినప్పటికిని మనస్సున కుపశాంతి గలుగదయ్యెను.

“మఱియొక తడవకు విజయనగరమును జేరి నా కసి దీఱ సూరకవిని మర్దింతునా? అతనికి రాజాశ్రయము గలదు; తుదకు నాకే ముప్పుగలుగును” అని దలపోసి యాయాలోచనను మానుకొనెను. “హుటాహుటిని మహారాజు గారి సభ కేఁగి, నోరార వారిని నిష్ఠురములాడి వారి యనీతిని వారికే విశదపఱతునా? సభ్యులందఱు రాజభృత్యులగుట న్యాయము వారి వంకకే యొరఁగును. బీదమాట సదస్సుకెక్కునా?” అని యా యుద్యమమును మానుకొనెను. “ఔను, విజయనగరమున కేఁగుటయును పగదీఱుటకుఁ బ్రయత్నించుటయును నా ప్రాణమును వదలుటకే హేతువులగును. ప్రాణ పరిత్యాగమునకు వెనుదీయనుగాని పద్దు కొన సాగమికి వగచెదను” అని పలుమాఱుఁ దనలో ననుకొనుచుండెను.

ఇట్లెంతో సేపు పర్యాలోచించుచుండి, తుదకొక నిశ్చితమునకు వచ్చెను. “సరి, యుసురుండిన పద్దు దీర్చుకొనుట కొక తరుణము గలుగును. మొట్టమొదటఁ జేయఁదగినపని బొబ్బిలి కేఁగుట. అచ్చట మహారాజుగారిని దర్శించి, నా పరిభవమును విజయ రామరాజుగారికి వారియెడలఁ గల విరోధమును, అందుల కయి వారు చేయఁదలఁచిన కార్యమును దెలిపెదను. తరుణము తటస్థించునప్పుడు నా పగను దీర్చుకొనెదను. ఆత్రపడుట యిట్టి కార్యములకుఁ దగవు. ప్రకృతము, మహారాజుగారికై పాటుపడుటచేతనే నా శాత్రవమునకు గొంత పరిహారము గలుగ రాదా?” అని నిశ్చయించుకొనెను.

గాఢాంధకారమునఁ దెస దెలియక ద్రిమ్మరుచున్న మానవునకు దీపకళిక యొకటి లభించినయెడల వాని కెంత తెంపుగలుగునో, యంత కిరు మిక్కిలిగదా, కృత్యము పాలుపోక బుద్ధి పరిభ్రమణము గలవానికి సునిశ్చితాంశమలవడుటం. అప్పుడు వాని చిత్తమునకుఁ దోఁచు తృప్తిని వర్ణింప నెవనికి శక్యము! అంధునకుఁ గన్నులగపడినట్లును, బీదకుఁ బెనులిబ్బి యబ్బినట్లును వాని సంతోష మొప్పుచుండునని కవులు, ఉపమానముల నుపపాదింతురు. విషయ మహాగహన పరిభ్రమణ పరిశ్రాంతున కీసాదృశ్యము లేపాటివి?

ప్రపంచమునందలి మానవావళిలో బ్రాహ్మణునకు బుద్ధిపాటవ మెక్కువయను నంశమున నెవ్వరును భిన్నాభిప్రాయులుగారు. అట్టి బ్రాహ్మణులలో లౌకిక వ్యవహారములయందుఁ బేరెన్నిక చెందినవారు నియోగి జనులు. వీరి తెగవారి కందఱకును రాజ బిరుదమును మంత్రి బిరుదమ్మును గలవు. వీరుత్తమ క్షత్రియులవలె ఖడ్గపాణులయి సైన్యములలోఁ దూఱి వీరవిహారము సలుపుటయం దనుపమానులుగ నుండిరి. తమ మంత్ర బలముచేతఁ బెక్కు రాజులను బోషించుచుండుటయే గాక పెక్కు రాజ్యములను నభి రక్షించుచుండిరి. వేయి మాటలేల, వీ రభినవద్రోణాచార్యులనియుఁ గృపాచార్యు లనియు నశ్వత్థామలనియుఁ జెప్పుట యసత్యముగాఁ జాలదు.

మనకవి రామయామాత్యుఁడీ తెగను జేరినవాఁడే; కావుననే యితని హృదయమునకుఁ బరిభవఖేదము మిగుల వ్రేఁగుగ నుండెను.

మదికి సునిశ్చితాంశ మలవడఁగానే మన రామకవి

యచ్చటనుండి లేచి యాసత్రపు టరుగును జేరెను. ఇప్పటి కతని మనస్సునకుఁ బ్రాపంచిక జ్ఞాన మలవడినందునఁ దన చూడ్కి యచట బసదిగియున్న జనులమీఁదను జుట్టుప్రక్కలఁ దిరుగులాడు చుండిన వారిమీఁదను బ్రసరింపఁ దొడఁగెను.

ఆసత్రమున కెదుట నూడలతోఁ బెరిగి పెద్దగుడారము వలెఁ జాలప్రదేశము నావరించుకొనియున్న యొక మఱ్ఱి యుండెను. దానిక్రింద నేవురు సన్న్యాసులుండిరి. వారిలో నొకఁడు నిప్పురవులఁగొల్పి రొట్టెలు గాల్చుచుండెను. వారెక్కి వచ్చిన యుత్తమాశ్వము లాచెంతనే బలిష్ఠములయిన యూడలకుఁ గట్టఁబడియుండినవి. వారి యాకృతులు చూడఁగానే వీరభటులను తలంపును గలిగించును. ఆచోటనే యొకవంక జమఖానము పఱచి, దానిమీఁద మూటముల్లెలను దింపియుంచిరి. దానికి దాఁపున నేలపై గుఱ్ఱపుజీని సామాను లుంపఁబడియుండెను. నలుగురు సన్న్యాసులు పఱుపుమీఁదఁ గూర్చుండి యుండిరి.

వారిని జూడఁగానే మన రామయామాత్యుని చిత్తమునకుఁ గొంటిజ్ఞాపకము తలచూపెను. "అక్కటా! వీరు కూడ నావలెనే విజయరామ రాజుగారివలన నయిన సన్న్యాసులో?" అని, వారివేసములకుఁ బరికించెను. ఏదో మఱచిపోయి యప్పుడే జ్ఞాపకము దెచ్చుకొన్న వానివలె తటాలున లేచి, తన గుఱ్ఱమునకై దిట్టపఱచికొనియున్న సేవకునిఁ బిలిచి, వానిచేతఁ గొంత పైకము పెట్టి, సన్న్యాసులు ధరించుకొను నుడుపులను సేకరించి త్వరగాఁ దెమ్మని చెప్పిపంపెను. వాఁడు, మహాప్రసాదమని తత్క్షణమే దాఁపుననున్న యొకగ్రామమును

గూర్చిపోయి బట్టలనువిలిచి కుట్టించి కాషాయమద్ది యెండఁ బెట్టి కొన్ని గంటలలోనే యచటికి వచ్చిచేరెను.

సేవకుఁడు, రామకవికి యతియొక్క యుడుపులను దెచ్చి యిచ్చునప్పుడు భాస్కరుఁడు సైతమా యుడుపుల వన్నెనే వహించి పరమశాంతమూర్తియై యపరదిక్సంధిని భాసిల్లుచుండెను. సంధ్యానురాగము దిగంతరాళముల వ్యాపించి, ప్రపంచమే సన్న్యాసధర్మమును వహించి కాషాయ వసనమును గట్టికొనెనో యనఁ దేజరిల్లుచుండెను. భూభాగము చుట్టుప్రక్కలను మేయుచుండిన పసులను దోలుకొని గొల్ల పిల్లవాండ్రు పరిసరముల యందున్న పల్లెలకుఁ బోవుచుండిరి. మార్గస్థు లొకరివెంబడి నొకరుగా రేయి నాసత్రమునఁ గడుపఁ దలఁచి వచ్చి చేరుచుండిరి. గడియలు మీఱను మీఱను సత్రమునఁ జేరినప్రజలు, స్నానమాడి వచ్చువారును, వంటవార్పులకు యత్నించువారును,మూటముల్లెలఁ ,గనిపెట్టుకొని యుండువారును, పనులనిమిత్త మీవల కావలకుఁ దిరుగువారును, పూర్వ పరిచితులఁ గుశలప్రశ్నలు చేయువారునునై మెలఁగుచుండిరి. ఇట్టి జనకలకలముచేత నాసత్రము పెండ్లియింటి ననుకరించు చుండెను. దీపములకాంతికిని జనుల సందడికిని నాసత్రమున నొక దివ్యశోభ యొనకూడి యానందలక్ష్మి కాలయమో యనుభ్రాంతిని నందలివారి కాప్రదేశము గలిగించుచుండెను. ఆసత్రమునకు వెలుపల బయలునందు దట్టముగా బండ్లవాండ్రు దమ బండ్లనునిలిపి, నొగకు ఎడ్లనుగట్టి మేతవైచి, బండ్లక్రింద మంటలువేసి యన్న ముడికించుకొనుచు, నొకరితో నొకరు సల్లాపించు కొనుచుండిరి.

మన రామకవి, దనగదిని జేరి, యీవేళకు సేవకుఁడు దెచ్చియిచ్చిన యుడుపులను ధరించుకొని యుండెను. ఇతఁడు సమయసన్న్యాసి యగుటచేత గృహస్థాశ్రమోచిత ధర్మములను జేవదలక, కోనేటికేఁగి సాయం సంధ్యాదికములను దీర్చుకొనెను. పిదపఁ దనవేసమును దానే మెచ్చుకొని "సెపగ దీక్షవఱకు నీకీ యుడుపులే యుండవలయును. అంతదనుక రామబ్రహ్మమను పేరినే నీవు వహింపవలయును" అని తన్నుఁదాను సంబోధించి సమయము చేసికొనెను.

మన మిదివఱకే తెలిసికొనినట్లు, రామకవి యొక్క నిశ్చితమునకు వచ్చినప్పటికిని, అట్లే సన్న్యాసి యుడుపులను ధరించి యుండినప్పటికిని, అతని మనస్సునకుఁ బూర్తిగా నూఱటగలుగ లేదు. ఎట్లు, అపకారమున కపకారమును జేయుట? అట్టి చేతయే సుకృతులగువారి కుపకృతి రూపముగా వెలయవలయును. కాఁబట్టి, విజయ రామరాజుగారి విషయమునఁ దలఁచు నపకృతి సూరకవి కొనరించు ప్రతికృతి గావలయును. ఆశ్రయులకుఁగలుగు పోరామియే యాశ్రితుల కష్టములకు మూలముగాదా! ఇట్టి ప్రయత్నమున రావువారి కుపకృతిచేసిన పుణ్యమును లభింపవలయును. వీని కనువుగా, రామరాజుగారి కహితాపాదియును, రావువారికి హితోత్పాదియును నగు కార్యవిధానమేది?" అనుతలంపు పాలువ్రాక దనచిత్తమును గందఱ వెట్టుచుండెను.

ఆదినము బహుళాష్టమి, కావున, నడిరేయి దనుక చీఁకట్లు గ్రమ్మియుండెను. రాను రాను సత్రమున జనకలకల మడఁగుచు వచ్చెను. అన్నపానముల పని దీఱఁగానే ప్రయా-

ణికు లక్కడక్కడఁ బరుండువారును బరుండినవారునుగా నుండిరి. రామబ్రహ్మమునకు నెమ్మది లేనందున నిదుర పట్టదయ్యెను. అప్పుడతనికిఁ దాను మధ్యాహ్నము చూచియున్న సన్న్యాసుల సంగతి జ్ఞాపకమురాఁగా, వెంటనే లేచి, వారితో సంభాషించి చిత్తమున కుపశాంతి గలిగించుకొన వలయుననిగోరెను. అంతటనచ్చోటువదలి వెలుపలికివచ్చి మఱ్ఱివంకకుఁ జూపుల నిగిడ్చెను. బయలునందు నక్షత్రముల కాంతిదప్ప మఱియే వెలుఁగును లేదు. మఱ్ఱిచెట్టుక్రింద ననినవో గాఢాంధకారము వ్యాపించియుండెను. అట్లుండియును, నచ్చటఁ దాను దొల్లి చూచియుండిన గుఱ్ఱములజాడ యించించుక గానవచ్చుచుండెనేగాని సన్న్యాసుల పొలుపే తెలియరాలేదు. 'వారాతరు మూలములఁ బరుండి నిదురించెదరేమో' యను సందియముచే రామబ్రహ్మ మచ్చటికేఁగెనుగాని యతులచటఁ గానరైరి. వారి యశ్వములు గట్టఁబడియుండుట, చక్కఁగాఁ దెలియవచ్చెను. ఓహో, యిదేమివింత! ఈవిరాగులు దమగుఱ్ఱములను సైతమిట్లువదలి యెచటికి వలసపోయిరి? ఒకవేళ వీరీ వేషములను ధరించిన దారిదోఁపిడి దొంగలో?" అని సందేహించుచుఁ జుట్టుప్రక్కలకుఁ దన చూపులను బ్రసరింపఁజేసెను.

ఈశాన్యదిశయందొక పిలుపు దూరమునఁ గట్టెలమంట గానవచ్చెను. ఆచోటు, బాటకు దాఁపుగానే యుండుటను గ్రహించిన రామబ్రహ్మము, అచ్చటనేమివింత గానవచ్చునో యనియును, జనులకు నివాసయోగ్యమగు నీప్రదేశము వదలి, యింతదూరమున మనుష్యులేలొకో యుండవలె-

ననియును, అచట నేదోవింత గన్పట్టఁ గలదన్నియును భావించుకొనుచునే వెలుతురు గన్పట్టు దెసనుగూర్చి పయనమయ్యెను.

ఈతరుణమునకు సరిగాఁ జంద్రుఁడు సైత ముదయించుచుండుటచేత దిశలన్నియుఁ గొంత కొంతగాఁ దెలివినొందుచుండెను. కట్టెలమంటయున్న తావున నేవురు సన్న్యాసులు గూరుచుండి పాలుపోని యాలోచనకుఁ జిక్కినవారివలె మౌనము భజించుచుండిరి. రామబ్రహ్మము, అపరాహ్ణమునఁ జూచియుండిన యతులు వీరే! ఆవేళకుఁ జంద్రికయుఁ గొంత వివృద్ధమయినందున మన రామబ్రహ్మము, వారిగుర్తు గనుఁగొనఁ జాలియుండెనుగాని, వారియేకాంత మంతనములకు భంగము గలిగింపరాదని దలఁచి, రమారమి పదిపదునైదు గజములదూరమున నాపురుషుల కగపడనట్లుగా నొకచెట్టుచాటున నిలుచుండెను. వారివృత్త మరయుటయే యతని ముఖ్యోద్దేశము.

తుదకా యేవురిలో నొకఁడు, తక్కిన నలువురినిగాంచి, "ఔను, మీరీవిధముగానే మెలఁగవలయును? నాకిదియే ప్రశస్తమయిన మార్గముగాఁ దోఁచుచున్నది. మీరిట్లు నడుచుకొనిననే మన ముద్దేశించినపని కైకూడివచ్చును" అనెను. అతని పలుకుబడివలననే యతఁడు తక్కినవారికి నాయకుఁడగునట్లుగానవచ్చెను.

ఒకఁడు—మీకు ప్రశస్తమని దోఁచినది మాకు మంచిదని దోఁచవలదా? మేము న్యాయపూర్వకములయిన కార్యములను జేయుదుమేకాని సరితప్పిన పనులకుఁ బోము.

నా—యజమానుఁడు చెప్పినట్టి కార్యములను మీరెట్లు నిరాకరించెదరు?

మఱియొకఁడు—మాయజమానులు మాకట్టి కట్టడలను విధింపరే!

ఇంకొకఁడు—మీకు మేము సహాయుల మనుటను మఱచి, సేవకులుగా భావించితిరా? మీరామాకు యజమానులు? మాయజమానులు మీకుఁ దోడుపడుఁడనిరి. మీకాపద గలుగునప్పుడు మాప్రాణముల నర్పించుటకు సిద్ధముగా నున్నాముగాని సరితప్పిన పనుల కొడిగట్టము.

వేఱొకఁడు—అయ్యా, మన యజమానులు చెప్పినట్లు చేయుదము. మీకేల యీపెత్తనములు? మన మందఱమేల తప్పుత్రోవలు ద్రొక్కవలయును? మనము సరిగానే మెలఁగుదము; దానివలని ఫలాఫలములు ప్రభువులవి, మనకు వానితోడి సంబంధమేమి?

నాయ—సరి, సరి, మీరు ద్రోహులు, మీకుఁదగిన దండన విధింపవలసినది కర్తవ్యము. నన్నే ధిక్కరించెదరే! మీరెంతపని కొడిగట్టరు? ఔను, ఇంక నాయజమానత్వ మీ ఖడ్గముచేత నిలుపుకొనవలయునా, లేక నాయాజ్ఞలను నెఱవేర్చెదరా?

ఒకఁడు—అయ్యా మీకేల యింతశ్రమ? మేమట్టి దోవకు వచ్చినవారము గాము. మీరు మాకిప్పుడు నాయకులయినను గాకమానినను మీయిష్టానుసారము మెలఁగుటయే మాకుఁ గర్తవ్యము. అట్లుండియును మేము హిందువులము, గృహస్థధర్మమున నున్న మాకు సన్న్యాసివేషముల నొసఁగి

తొ. ఇట్లు మెలఁగుటచే మావారిలో నెంతో యపరాధము చేసినవార మైతిమి. ఏలనఁగా నొకతడవకు సన్న్యాసియైన వాఁడు మరల గృహస్థు కాఁగూడదు. ఇది వేషమేగదా, యని దీనికి సమ్మతించితిమి. ఇంతటితో మానక, దుష్కార్యముల కొడిగట్టి బలవంత పెట్టెదరు. మేము శుద్ధవీరులము, సరితప్పిన పనులను బ్రవర్తింపము. రణముఖమున మమ్మెదుఱు మార్కొనినను ఖడ్గపాణులమై యెదిరి, పోరాడి, సంతోషపూర్వకముగా బ్రాణములు వదలఁగలము. ఇంతేగాదు, హైదరుజంగు గారుగాని బుస్సీగారుగాని నాజరుజంగు గారిని వధించిరండని చెప్పరు. దైవము సరిపడియుండిన నాజరుజంగు గారేగదా మనకుఁ బ్రభువు లయియుందురు. మోసముగా వారిని జేరి చంపఁబోము. నిద్రించువానిని వధించునట్టిదా మాశూరత్వము? రాజమార్గమున మెలఁగుదము. మనము, జాఫరల్లీ గారికి హైదరుజంగుగా రొసఁగిన ఫరమానాను జూపుదము. పిదపఁ జరుగునట్టి సంగతులను మనయేలికలకుఁ దెలుపుదము. అప్పుడు, వారేమి యానతిత్తురో యట్లు మెలఁగుదము. ఇట్టి గొప్ప కార్యములయందు తొందరపాటు దగదు.

ఈ సంభాషణము వినునప్పుడే రామబ్రహ్మముగారికి వారి యుద్యమములను దెలిసికొనవలయునను నిచ్ఛ పొడమెను. కావుననే తన యవధానము పూర్తిగాఁ జెల్లింపవలసిన వాఁడాయెను.

నా—బళి, మీరు నాకా బుద్ధి నేర్పువారు? ఇదిగో మీబుద్ధికిఁ దగిన బహుమానము. అని యొరనుండి కత్తిదూసి కొని యుగ్రుఁడయి నిలిచెను.

వేఱొకఁడు—అయ్యా, ఏపనికిని త్వరపడరాదు; సేనను మందలించుటను జక్కఁగాఁ జిత్తగింపవలయును.

ఇంకొకఁడు—అయ్యా, శౌర్యము మీ యొకరిసొమ్ము గాదే! అది యందఱకును సామాన్యమయినది.

మఱియొకఁడు—మా చేతులు కట్టఁబడి యున్నట్లు దలఁచితిరా? కుత్తుకలు చాచుటకు మేము గొఱ్ఱెలమా?

ఇవ్విధముగానే వారిలో మాటలు పెరిగి, తుదకుఁ బోరుగాఁ బరిణమించినది. నలువు రొక వంకను నొకఁ డొక వంకను నిలిచిపోరిరి. నలువురిలో నొకఁడు త్రెగికూలెను. మిగిలిన మువ్వురికిని నేలఁగూలిన వాని దుస్థితి పరితాపము పెంచి వీరావేశము గలిగించెను. దానివలన వారా క్షణముననే యానాయకునిఁ ద్రెంపి నేలఁగూల్చిరి. ఈ వికృత కృత్యమునకు నెక్కువగా మదిలో నేవగించువాఁడయి రామబ్రహ్మము దన యిక్కఁ జేరెను.

ఈ యతి పంచకము హైదరుజంగుగారిచేఁ బంపఁబడిన షేకుమహమ్మదును వారికి బాసటవచ్చిన రాఘవరావు, సాంబాజీరావు, శంకరసింగు, బాలాజీసింగులనుట, చదువరుల కిదివఱకే తెలియవచ్చి యుండును. షేకుగారి యిచ్ఛచొప్పున నందఱును సన్న్యాసవేషమును వహించిరిగాని, యతని యుక్తిచొప్పున నాజరుజంగును మోసగించి చంపుట కొడఁబడరైరి. కాఁబట్టియే వారిలో నిట్టి యవ్యవస్థ తలచూపి, యుద్ధమున షేకుగారును సాంబాజియుఁ గూలవలసిన వారైరి.

7-వ ప్రకరణము

పరిపూర్ణసుఖంబు లధిక బాధలకోఱకే.

ఓరుగంటి కాకతీయ ప్రతాపరుద్ర సార్వభౌముల పరాక్రమభానుఁ డస్తంగతుఁడయి యాంధ్రసామ్రాజ్య సంపద యంతరించిన పిదప, అయ్యది గొల్లకొండకుఁ బ్రవాసమేఁగి స్థిరనివాస మవధరించి, యాసీమను భాగ్యనగర మని పించె ననుట సత్యోక్తి. ఈరాజధాని నైజాముషాహుల పరిపాలనకు లొంగి యసదృశ ప్రఖ్యాతితో నతిశయించుచుండెను. అందలి సంపన్నుల హర్మ్య రాజములును, ప్రాచీన శిల్పుల మేధాసంపత్తి నుగ్గడించుటకు నిదర్శనములయి నేటికిని దనరారుచున్నవి. ఈహైదరాబాదు నగరమునకు నడుమ నత్యున్నతము లయిన శిఖర రాజములను నలువలంకుల నాల్గింటిని గలిగియొక మంటపము వెలయుచున్నది. దీనినే 'బార్మినారా' యనెదరు. దీనికి నాలుగువైపుల విశాల రమణీయములగు నాలుగు రాజమార్గములు గలవు. చార్మినారాను దర్శించు ప్రతిమానవున కయ్యది భాగానగరపు భాగ్యలక్ష్మి నివాసమను నూహ పొడకట్టక మానదు. ఈమార్గముల కిరువైపుల యందును మహోన్నతములగు హర్మ్యములును పణ్యశాలలును గలవు.

అందలి వీథులు, సర్వదాజన సమ్మర్దము గలిగియుండును. అచటి ప్రజలలో ననేకులు కోటికిఁ బడగయెత్తిన సంపన్నులు, వేలకొలఁదిని ధనముగలవారు బీదలుగానే పరిగణింపఁబడుచుందురు. పౌరులలో నీప్రతి మనుజుఁడును, నుత్కృష్ట

గుణములను గలవాఁడే యయ్యును, శౌర్యౌదార్యములు వాని సహజగుణములగును.

పలుమాటలేల? మొగల సార్వభౌముల యాధిపత్యమును వహించిన డిల్లీనగరమునకును, శౌర్యోదారులగు మరాటీల పాలనమును బొందిన పూనారాష్ట్రమునకును దుల్యమయిన దీ హైదరాబాదు పుటభేదనమని చెప్పనొప్పును. రాజ్యమున కప్పటి పరిపాలకుఁడు సలాబతుజంగు. ఇతని నగరు పైని జెప్పిన చార్మినారాకుఁ గ్రిందివైపునఁ దేజరిల్లుచుండును. ఈ దివ్యహర్మ్యయమునకు నడుమ సభాభవనముగలదు. ఇచ్చటనే నైజామువా రధిష్ఠించు సింహపీఠిక యమర్పఁబడియున్నది. దానికిఁ బరిసరములయందు, ఆదేశపు సామంత ప్రభువులయొక్కయు సరదారులయొక్కయుఁ బరువులకుఁ దగినట్టి యాసనములు గలవు.

1756 వ సంవత్సరము నవంబరునెల 15 వ తేదిని నవాబుగారు సింహాసన మలంకరించి రాచకార్యములను జిత్తము చొనిపియుండిరి. మంత్రులును సేనాధిపతులును దాపుననే కూర్చుండి యుండిరి. తక్కిన యాసనములమీఁద రాజకార్య నిర్వహణ కుశలులగు సరదారులు వెలయుచుండిరి. నైజాము వారి యెడమప్రక్కనున్న యున్నతాసనముపై మూర్తీకరించిన శౌర్యరసమే యనఁజాలు హైదరుజంగు గూరుచుండి యుండెను.

నవాబుగారు మిగుల రూపవంతులు; వీరు ధరించియున్న విలువయొచ్చిన వస్త్రాభరణములు వీరి సౌందర్యమును గొప్ప చేయుచుండెను. రత్నమయమయిన కోశముతోడి ఖడ్గ మితని

చేత దైవారుచుండెను. అతని యగాధ హృదయమునుగూర్చి యతని చూపులే వెల్లడిచేయుచుండెను. ఎట్టివానిని గాని వశపఱుచుకొనుటకుఁ దగిన వచోచమత్కృతిని గలవాఁడు. రాచకార్యములయం దెంత చిక్కులుండినను క్షణముననే తీర్చునట్టి బుద్ధి సంపదయు నితనికిఁ గలదు. అన్యులకయిన వానివలె నుండియే యాత్మకార్యములను సంపూర్ణముగఁ దీర్చికొనుటయందు ఇతని కున్న చతురిమ యసదృశము. అట్టి సామర్థ్యవంతుఁడగుటఁబట్టియే యా స్థానమునందలి సులేమాన్ ఉంరా లోనగు నొక యిరువురు దక్కన్ సరదారుల కందఱకు హితుఁడయి వెలయుచుండెను.

సింహాసనమునకుఁ గుడిప్రక్కఁగా నొక యాసనముండెను. అదియే బుస్సీ దండనాథునిది. అతఁ డప్పటికి రానందున నా యాసనము శూన్యతను జెందియుండెను.

నవాబుగారు దమచిత్తము రాచకార్యములయందు చొనిపియున్నందున, వకాలత్తులను రాయబారములను నొకటివెంబడి నొకటిగా నవధరించుచుండిరి. ఆ సభయందు సందడి యనుమాట తల చూపకుండెను.

అట్టితరుణమున వీరుఁడొకఁ డాసభను బ్రవేశించెను. అతనిని దర్శించుటచేత నందలి సభ్యులందఱును భయవిభ్రాంతులయి లేచి నిలుచుండిరి. నవాబుగారు దటాలునఁ దన యాసనమునుండి దిగి యెదుర్కొనిపోయి యొక యుత్తమాసనమునఁ గూర్చుండఁబెట్టి పెల్లుగ వానిని గౌరవించెను.

ఆ వీరుఁడు మహాతేజస్వి; సూర్యునకెదుట నెత్తఁబడిన దీపకళికలవలె నచ్చటనున్న వీరవరుల తేజ మితనియెదుట

వెల్లఁబోయినది. ఇంతకుమున్ను చెప్పియున్న మహాశూరుఁడయిన హైదరుజంగు, అతని దర్శించినపిదప, నేఁటికిఁ బ్రాణములతో నిల్లుచేరఁగలుగుదునా? ఈశ్వరుఁడా, ఏమిచేయుదును? అని తనకు నెమ్మది ప్రసాదించుటకై యిష్టదైవమును బ్రార్థించుకొనుచుండెను.

ఆ వీరపురుషుని తీక్ష్ణతమములయిన చూపులు, పరమర్మభేదనచణములయి యెసఁగుచుండెను. అతని విశాలనేత్రములు గొంచెము కెంజాయ పర్వియుండినది. విరివియైన నెన్నొసలును, దట్టములయిన కనుబొమ్మలును నితని మోమునకుఁ బెట్టని భూషణములు. ఇతని మొగము, సౌందర్యలక్ష్మికి నివాసప్రదేశమే యయ్యును, నిండు పుస్తిలవలన భయప్రదముగానే కన్పట్టుచుండినది. కాయపుష్టియు శౌర్యరసాంచిత దృష్టియు నితఁడు అభినవ భీముఁడో యను సందియమును గలిగింపక మానవు. ఇతఁడు, నెన్నొసట నిడికొనియున్న కుంకుమ పుండ్రమును దల నమర్చికొనియున్న పాగయును, ధరించియున్న బట్టలును, దొడిగికొనియున్న ముచ్చెలును నితనిని బూనాసంస్థానపు వీరుఁడనుటకు నిదర్శనములుగ నెగడుచుండినవి. ఇతఁడే మన మిదివఱకు నెంతో భీకరుఁడని దెలిసికొని యుండిన సదాశివరాయఁడు.

ముహమ్మదీయ సంస్థానములను జేరునట్టి ప్రతిమానవుఁడును, దూరమునందుండు నట్లే వంగివంగి సలాములు వేయుచు, మోకరించినట్లే వచ్చి గద్దియను జేరి సంస్థానపతి యంగీని ముద్దిడుకొని పార్శ్వమున కొదుగవలసినది మర్యాదగా నుండఁగా, మన సదాశివరాయఁ డట్లు మెలఁగక, యందలి ప్రభువు

వలననే సమ్మానింపఁ బడుటవలన నతనికున్న పటిమ యిట్టిదని ప్రత్యేకముగా చెప్పవలసినది లేదు.

సలాబతు జంగుగా రతని నిట్లు సత్కరించి, చిఱునవ్వు మోమున మొలక లెత్తుచుండఁగా—"అయ్యా, మీరాక మా సంతోషమును పెంచెను" అనెను.

"ఔను, మాయుద్దేశముకూడ అట్టిదే; మీసందర్శనము వలని సంతస మనుభవించుటకే వచ్చినాము" అని మేఘగంభీర ధ్వనితో సదాశివరాయఁడు పలికెను.

కొంతదనుక సభయందు సద్దణఁగి యుండెను. పిదప, హైదరుజంగు లేచి, "మాసంస్థానమును మిగుల గారవించుటకై మిమ్మును రావించిన కార్యమెట్టిదో తెలిసికొన వలయునని మా ప్రభువులు మిగుల నాసక్తి గలిగియున్నారు" అని యుపచార పూర్వకముగాఁ బలికి, దాపుననే కూర్చుండియుండిన బొక్కసదారునిఁజూచి, రావుఁగారికి నజరులాయత్త పరుపుమని యుత్తరువొసఁగెను.

హైదరుజంగు కృషినిదెలిసిన సదాశివరావు క్షణమాగుమని యతని కానతిచ్చి, నవాబుగారిని జూచి, "మారాకను గదా తెలియఁగోరితిరి. చెప్పెదను వినుఁడు, డిల్లీ పాదుషావారికంటెఁ బ్రతాపవంతులు మీరని వింటిమి. మీ ప్రాభవమును గన్నులారఁ జూచిపోవుటకే తెంచితిమి. మేము మాపేష్వాగారి యనుమతి వహించి హుటాహుటిని వచ్చి నవారమీ యుదయముననే లింగము పల్లెలో విడిసినారము. సైన్యమువారు పురమునేల ప్రవేశింప వలయునని దలఁచి, వారినందఱ నచటనే నిలిపియుంచి, కొంత పరివారము వారితో మీదివాణమును

ప్రవేశించినాము. నాతో వచ్చిన కొద్దిపాటి పరిజనము వెలుపలనే నిలుచున్నారు" అనెను.

సదాశివరాయని దర్శనమునకే చెదరిపోయిన గుండెలు కుదుటఁ బడుటకు మున్నుగా నతనినోట నిట్టి కఠినాక్షరములు నిర్గమించినవి. ఈమాటలకు సభ్యులయెద కెట్టిదిగులు గలిగెనో చెప్పవలయునా? నైజామువారి నిలువు నీరయ్యెనో యన, శరీరమంతయుఁ జెమర్చి యుడువులు దడిసెను. మోమున విన్నందనము గదిరెను. అక్కటా! యితఁడీ గోలకొండ సంస్థానము హతముచేయుటకుఁ దోఁచిన ధూమకేతువే యని భావించెను.

"మీరు మాఖిల్లా మీఁదవిడియునంతటి యపరాధము మీపేష్వాగారి కేమియును జేయమే" అని యందలి సరదారులలో నొకఁడు లేచి తిన్నఁగా విన్నవించుకొనెను.

"ఓహో, మీరు మాకు భయపడునంతటి నిదర్శనము లేవియుఁగన్పట్టవు. రాజ్యార్హునిఁ దొలగించి, దనయిచ్చకు వచ్చిన యతనిని గద్దియమీఁది కెక్కించునంతటి శౌర్యనిధి యగు బుస్సియొక్క ప్రాపు మీకుఁగలదను నంశము నాకుఁ దెలియును. మీరు దలఁచినట్లే బుస్సీ రణకోవిదుఁడు గాఁడా?" అని చిఱునవ్వుతో సదాశివరాయఁడు పలికెను.

"అయ్యో, రావుగారు నిష్కారణముగా నలిగినట్లున్నది" అని వినయముతో దివానుగారు లేచి పలికిరి.

"మాయలుక యన నెంతమాత్రము? మాయేలిక సంతోషపడుటకు మీరు ప్రయత్నింపవలయును" అని యావీరుఁడు తనప్రభువు సంతకమును సంస్థానపు ముద్రను గలిగిన శ్రీముఖమొక్కదానిని నవాబుగారి చేతి కందించిరి.

అది మరాటీభాషయందు వ్రాయఁబడి యుండినందున, సభయందున్న యొకమునిషీ దానిని జదువ నాజ్ఞాపితుఁడాయెను. దాని యభిప్రాయ మీక్రింద సూచింపఁ బడుచున్నది.

నవాబు సలాబతు జంగుగారి దివ్యసమ్ముఖమునకు—

మీరు సింహాసన మలంకరించిన యీ నాలుగైదు సంవత్సరములనుండి, మేము మీ జ్ఞప్తికి వచ్చునంతటి భాగ్యము చేసికొనమైతిమి. ఇంకను మౌనముతో నుండుటవలనఁ బ్రయోజనము లేనిదని యెంచి ప్రకృతము భాగా నగరముమీఁదను దాని పరగణాలమీఁదను మూఁడునెలల దోఁపిడికిని, ముహమ్మదీయులమీఁద చౌతు పన్ను గాఁబట్టుకొనుటకును మా సేనాధిపతి సదాశివరావుగారికి హుకు మిచ్చి పంపియున్నాము. మీ ప్రజల సౌఖ్యమును దలఁచియును, మీ దౌలతును దలఁచియును మంచి యభిప్రాయము గలదేని యీ ఫరమానాను దెచ్చువారియొద్ద ఆఱుకోట్ల రూపాయల నగదును జెల్లించుకొనవలయును.

ఇట్లు తమహితుఁడు
పీష్వా బాలాజీ బాజీరావు.

ఇంతకుఁ బూర్వ మచటనుండిన వీరవరుల హృదయములోని యించుకంత ధైర్యసారముకూడ, ఈ ఫరమానాను జూడఁగానే భయమువలన శోషిల్లి పోయెను. ఇట్టి తరుణమున దివానుగారు లేచి, వినయము ప్రకాశించునట్లుగా, సదాశివరాయనిఁ జూచి, "అయ్యా, సేనాధిపతీ! పిచ్చుకమీఁదఁ బ్రహ్మాస్త్రమువలె సాలుకుఁ గోటిరూపాయల యుత్పత్తి కూడ లేని యీ చిన్న సంస్థానముమీఁదనా యింతభారము మోఁ

పుట! ఇది భరింపఁజాలదను నంశము దమ చిత్తమునకే విదితము కావచ్చును. మా సార్వభౌములు సింహాసన మధిష్ఠించుటకు పూర్వమునుండియే కప్పము దిన్నగా దివాణమున కందుటలేదు చాలా ధనము వెలుపల నిలువ నిలిచియున్నది. భగీరథ ప్రయత్నముచేసిననే కాని యది చేతి కందునట్లులేదు. ఇంతతోఁబోక రాజ్యము వ్యవస్థకుఁ దప్పియున్నది. అచ్చటచ్చట ద్రోహులు తిరుగఁబడి దొమ్మిసేయుచునే యున్నారు. రాజ్యము సుఖస్థితియందుండిననే కాని బొక్కసమునకుఁ బుష్టి యేర్పడదను సంగతి తమకుఁ గ్రొత్తకాదే!" అని యింకనేమో చెప్పుటకు నోరెత్తుటతోడనే సదాశివరావుగారు అడ్డుపడి—

"ఔనయ్యా, మీయొక్కరికే కాదు; ప్రతి సంస్థానాధిపతికి నిట్టి సుఖదుఃఖములు గలవు. రాజ్యభారమనిన నేమని దలఁచితిరి. మీకే యిట్లుండఁగా, మాయట్టివారి కెంత శ్రమ యుండవలయునో భావించితిరా? అది యట్లుండనిండు; మీ సుఖదుఃఖములతో మా కేమి విచారము? మా ప్రభువుల పనిని మేము నిర్వర్తింపవలయును. పీష్వాగారు దృఢసంకల్పులు. కాఁబట్టి, మీ రచ్చుకొనఁ గోరిన మొత్తమునం దొక గవ్వనైనను దగ్గింపరు. దీర్ఘాలోచన చేసియే మీకాఱు కిట్టి స్వల్ప మొత్తమును విధించిరి. వారు న్యాయబద్ధులు; కాఁబట్టియే మీయొద్దనుండి సమాధానముతోఁ బైకము గాఁబట్టుకొనుటకుఁ జూచెదరు, ఈ రీతికి మీ మనస్సొగ్గదా చెప్పివేయుఁడు. ఆఱుకోట్లేమి? పదికోట్లుగా మీ రాజ్యముమీఁద సంపాదించుకొనుటకు నాకుఁ దెలియును. ఏమనెదరు? వే

మిట్లొక్క సంస్థానమునందును నిట్లు కాలయాపనము చేయుచుఁబోయిన దక్కిన మా రాచకార్యముల గతియే మగును?" అని యదలించి పలికెను.

సలాబతు జంగుగారు మహాప్రతిభాశాలియని యిది వఱకే తెలిసికొని యున్నాము. తరుణమునకుఁ దగినబుద్ధి యతనికి స్ఫురింపక పోవునా? తత్క్షణమే బొక్కసదారుని రావించి, బొక్కసపు బీగపుఁజెవులను సదాశివరాయని యెదుటఁబెట్టించి, "అయ్యా, యిది మీస్వగృహము వంటిది. ఇందున్న ధనమంతయుఁ దమది" అని యుపచారపూర్వకముగాఁ బలికెను.

సలాబతు జంగుగారి మాటలకు సదాశివరాయఁడించుక సంతోషించినట్లగపడి, "నాకు బొక్కసముతోఁ బనియేమి?"

"అయ్యా, బొక్కసమునందుఁ బ్రకృతము 50 లక్షల కంటె ధన మెక్కువలేదు" అని బొక్కసదారుఁడ అనెను.

"ఇదెంతమాత్రము? మేముద్దేశించి కొనినట్లే కార్యమును సవరించుకొని పోయి చేరెదము" అని, యాసనమునుండి లేవఁబోయెను. నవాబువారతని ప్రయత్నమాపి యప్పటికిఁ గోటిరూపాయ లనుగ్రహించి పుచ్చుకొనునట్లు బతిమాలి యొడఁబఱచెను. సదాశివరాయఁ డొకవిధముగా సమ్మతించెను. అంత సాహుకారులయొద్ద వడ్డికి 50 లక్షలపైక మప్పు దీసి, సదాశివరాయనికిఁ గోటిరూపాయల ముడుపును జెల్లించుకొని సలాబతుజం గొకరీతి నతనినిఁ బ్రసన్నునిఁ గావించుకొనెను.

సదాశివరాయఁడు చిక్కినదానిని జుట్టుకొని పునాదేశమునుగూర్చి పోవువాఁడయ్యెను. అందలి సభ్యులందఱును, మృత్యువునకుఁ జిక్కి ప్రాణము దప్పినవారివలె దిగులునుండి తొలఁగిరి.

8-వ ప్రకరణము.

"ఆర్చువానికంటెఁ దీర్చువాఁ డుత్తముఁడు"

ఆ రేయి రామబ్రంహమున కట్టి ఘోరదర్శనముల వడినందున, అతని హృదయ నైపథ్యమున గాఢములగు చింతలు దలచూపి మఱుఁగుచు వచ్చెను. హా! దోష పరిపూరితమయిన యిమ్మహా ప్రపంచమునకు విలయకాల మెప్పుడు దగ్గఱించును? తాము చిరకాలోప జీవులుగాఁ దలఁచి యితరుల ప్రాణముల కలుగునట్టి, రాకాసిమూక. కొక్కుమ్మడి యేల మరణము తటస్థింపరాదు. అక్కటా! ఈశ్వరుఁ డొకఁడు గలఁ డందురే? అది మిథ్యయా? తథ్యమా? అట్లే యీశ్వరుఁడు గలఁ డనుకొందము. జగత్తునం దగపడు దుష్కార్యములను దుశ్శీలములను నేల యున్మూలింపరాదు? అతని కట్టిశక్తి యేల యలవడదు? అయ్యో, ఈశ్వరుని సర్వశక్తియని చెప్పుదురే? ఔను, మూఢమతులు ప్రపంచము సుఖసంపత్తికిఁ బ్రస్థానమని వచింతురు. అనుభవమునం దట్లు గన్పట్టక దుఃఖమయముగాఁ దోఁచెడిని. తమసౌఖ్యముల కితరుల భంగపఱచువారును, తమ జీవితమున కన్యుల వధించువారును, హితోక్తులు పలికి యహితములనే పచరించువారును నై మితిమీఱి ద్రోహులు

గానవచ్చెదరే! వీరందఱేల నశింపరాదు; వీరిస్థానమున సజ్జను లేల పొడమరాదు. ఈలోకమున సుఖదుఃఖాది ద్వంద్వములేల వెలయవలయును? సుఖము వేఱుగాను దుఃఖము వేఱుగాను నేల పరిగణింపవలయును? సుఖమందు దుఃఖమును దుఃఖము నందు సుఖమును నెంత చోద్యముగ మిశ్రితములయియున్నవి! పలుమాటలేల? మాటవాసికే సుఖము; సుఖమనునది దుఃఖ రూపమే; ఇట్లుండ దుఃఖమునకెట్లు దుఃఖ గుణము దొలఁగును? కావునఁ బ్రపంచమంతయు దుఃఖపూరితము.

అయ్యో, సర్వప్రాణి పరిశోషణ చణమగు నీదుఃఖ మును దుఃఖపెట్టుటకుఁ బరికరమొకటియు లేదా? బాంధవ్య మున దుఃఖము; మైత్రిని దుఃఖము; సంపదను దుఃఖము; ఆపదయందు దుఃఖము; విద్యార్జనను దుఃఖము, ధనార్జనను దుఃఖము. హా, హతవిధీ! లోకమున దుఃఖమే సర్వతోముఖ ముగాఁ గన్పట్టుచున్నదె. లోకమే దుఃఖమయము. ఇట్లు సర్వాం కషస్థితిని వెలయునట్టి దుఃఖమునకు విముక్తిమార్గ మొకటి గన్పట్టదే!

"ఔను, ఇది స్థూలవిచారుల మాట, వారికి దుఃఖములే పట్టిన చోట్లఁ బర్వతప్రాయములుగఁ గన్పట్టును. విషయలోభ మునఁ బరిభ్రమించు పామరలోకమునకుఁ బరిణమించునవి దుఃఖ ములే. కాఁబట్టి విషయవంతుఁడే దుఃఖి; విషయాతిరిక్తుఁడే సుఖి. దుఃఖములకు జన్మస్థానములు విషయములు; విషయేచ్ఛా పరిశోషణములే దుఃఖవినాశములు, స్థాణువునందుఁ బురుషుఁ డును, రజ్జువునందు సర్పమును వలెనే విషయములయందు సుఖశబ్ద మారోపితమగును గాని యది భ్రామికము. విషయో

న్మూలనమునఁ గలుగు సుఖమే సుఖము. అదియే పరమానంద సౌఖ్యము. అదియే ప్రజ్ఞాన ప్రవరులకుఁ బరమధనము. అని వెఱ్ఱిపట్టిన వానివలె నొకటికొకటి సంతనిపడని విషయము లకుఁ జిత్తమాయత్తపఱచి, సత్రపుఁ దిన్నెను జేరి యించుక మేనువాల్చెను, గాని, చిత్తస్వాస్థ్యము చెడినవాని కెట్లు గునుకు పట్టును?

వేఁకువజాము తలచూపెను. పరిసర వృక్షకోటరముల నుండియుఁ గులాయముల నుండియును బక్షిజాలముల కలకల నిస్వానములు పెల్లురేఁగినవి. చల్లనిగాలి యంతటను బ్రసరింపఁ జొచ్చెను. నిద్రలేక బుద్ధిసెదరి, పలువిధముల మనోవికార ములు గలవానికిని నీసమయ శోభలకును నెంతదవ్వు. కావున, రామ బ్రంహ మా చోటువదలి, పరిసర ప్రదేశము లనున్న తోఁపులకేఁగి కాలకృత్యములను దీర్చుకొని, కోనే టిలో స్నానమాడి, అనుష్ఠానములను దీర్చుకొనెను. సమయ సన్న్యాసి యగుటఁబట్టియే గృహస్థాశ్రమోచితమైన యహ ర్ముఖ కర్మకు లోపము గలిగింపఁడాయెను. అతఁడు, కోనేరు వదలి సత్రపుఁదిన్నెను జేరునదనున సూర్యుఁ డుదయించి యుం డెను. అతని విభూతి పుండ్రములును, రుదురాక పేరులును, కాషాయవసనములును, శరీరశోభను వృద్ధిపఱచుటకైన సాధ నములుగా శోభిల్లుచుండెను. మౌనవ్రతముతో నితఁడు సత్రపుఁ దిన్నె నాశ్రయించి గూర్చుండెను. ఇతని హృదయమునందుఁ బలువిధముల చింతలు త్రొక్కులాట పడుచుండినందున నిమీలి తనేత్రుఁడయి బాహ్యవ్యాపారమును మఱచియుండెను. అప్పు డితనిని జూచువారందఱును, సాక్షాద్దక్షిణామూర్తియే యితఁడని

భావించి సేవింపఁ దొడఁగిరి; కొందఱతని పాదముల యొద్ద యథోచితము కానుకలు సమర్పించిరి; కొందఱు సాష్టాంగ మెఱగి పార్శ్వముల కొదిగి వినమ్రులయి నిలుచుండిరి. కొందఱు, 'ఆహా, వీరెంతటి మహానుభావులో, అట్లు గాకున్న యీ యౌవనప్రాయమందే యీతురీయాశ్రమ మవలంబింతురా?" అనిరి; కొందఱు, "ఇదియొక వింతయా? జ్ఞానోదయమునకును వయః పరిపాకమునకును నెంతదవ్వు?" అనిరి. కొందఱు, "వీరు యదార్థముగా మహానుభావులు, నిస్పృహులు, తమ పాదముల కడ సమర్పించిన కాన్కలనుగూడఁ గన్నెత్తి చూడకున్నారే" యని యాశ్చర్యపడిరి. ఈ యోగి సమాధిస్థితియం దున్నారు; సద్దుచేసి యపచారము గట్టికొనకుఁడు" అనిరి. ఇట్లే పెక్కండ్రు పెక్కువిధములఁ దమ్ముఁ గూర్చి ప్రశంసించి గుసగుస లాడుచుండి నప్పటికిని, బ్రహ్మముగారి చిత్త మెచ్చటనో తొట్రుపడుచుండినందున నిజముగా నందలి వారిచర్య లతనికిఁ దెలియవు.

ఇట్లు రామబ్రహ్మముగారిని జుట్టుకొనియున్న జనులలో మిగుల భక్తిశ్రద్ధలు గల పురుషులు మువ్వురుండిరి. వారి ముఖములు దైన్యమునకు నికిపట్టులయి చెన్నఱియుండివి. ఎట్లయినను బ్రహ్మమును సుప్రసన్నునిగాఁ జేసికొని తమ జన్మముల సార్థకపఱచు కొనవలయునను తలంపు వారి యెదలలో మెదలుచుండెను. వీరు యుద్ధభటుల వేషమును వహించియుండిరి. రామబ్రహ్మమునకుఁ జిత్తస్వాస్థ్యము గలుగఁగానే, తన యెదుటనున్న పురుషత్రితయమును జూచి యాశ్చర్య

పడెను, నిన్న యట్లుండిన వీరు నేటికేల యిట్లయిరి; యని దలఁచుకొనెను.

రామబ్రహ్మము గొన్నినిముసముల దనుక వారి మోములనే చూచుచుండి తుదకు, వారు సత్పురుషులనియు, మానధనులనియు, శూరధనులనియు, పశ్చాత్తప్తులనియుఁ దెలిసికొనెను. వీరు, షేకు మహమ్మదు పరివారమువారు. పోరున శేషించిన శంకరసింగు, బాలాజీసింగు, రాఘవరావు అనువారు. వీరు షేకుగారి యిష్టానుసారము మహమ్మదుగారి యాజ్ఞలకుఁ జిక్కి సన్న్యాసులయి, యతఁడు వీరశయనములం కరింపఁగానే తమ తొంటివేషములను దొడిగికొనిరి. తాము దలఁచినట్లు కార్యములు గొనసాగక మధ్యేమార్గమున నిట్టి విపర్యాయము తటస్థించినందున నెటకుఁ బోవుటకును ఏమి చేయుటకును దోఁచక తొట్రిలుచుండి, వేఁకువనే నేత్రగోచరుఁడయిన యోగిని జేరిరి. ఇతని హితబోధలవలనఁ జిత్తమునకు శాంతి గలిగించుకొనఁ బ్రయత్నించిరి.

రామబ్రహ్మమునకు, వారు, తొలిదినమున్న యునికియును, వారి చైదములును జక్కగాఁ దెలియును. ప్రకృతము వారి చిత్తక్షోభనుఁ దెలిసికొనెను. కాఁబట్టి, వారుత్తములని దృఢపఱచుకొని, మృదులములయిన పలుకులతో నూఱడిలఁ బలికి దన దాఁపునఁ గూర్చుండఁ బెట్టుకొనెను.

"మిత్రులారా, ఎట్టి వివేకఘనులుకును బొరపాటు గలుగుట సర్వసాధారణము. కారుణ్యమునకే కారణజన్ములగు వారు సైతము, విధిప్రేరణమున ఘోరకృత్యముల కొడిగట్టవలసిన వారగుదురు. అట్టివారికిఁ బ్రాయశ్చిత్తము

పశ్చాత్తాపమనునది యొకటియే. యదార్థముగా దుష్కార్యముల నాచరించి పశ్చాత్తాప పడనివాఁడే మహాపాపి; నిజముగా మీయెడల నట్టి పరితాపము గన్పట్టుచున్నది. గాన మీరు దోషదూరులయితిరి" అని రామబ్రహ్మ ముపచారములు పలికెను.

ఇట్లు రామబ్రహ్మమువారి చర్యలను గూఢపఱచి పలుకుటచేత, అతఁడు దమ యెడల మెదలునట్టి వ్యాకుల స్వరూపమును గుర్తెఱిఁగిన మహాయోగియని నమ్మవలసిన వారైరి. అతఁడు తమ చైదములను సాక్షాత్తుగఁ జూచుచుండినది వారికి దెలియదు. వారికీ కారణమునుబట్టి తొంటికంటె నెక్కుడుభక్తి యలవడెను. అతఁడు కాలవేది గావునఁ దమ భావికాలపు టుజ్జీవనోపాయము గుర్తెఱిఁగి చెప్పి మన శ్శాంతి గలిగించునని దలఁచిరి.

"స్వామీ, ఇరువైపులను మండుచున్న కొఱవిలోని చీమవలెను, భూమ్యాకాశములఁ దన్నుఁ బొదువఁ బొంచియున్న వేఁటగానికిని డేగకును జిక్కి, ప్రాణపరిపోషణార్థము పరితపించుచున్న పావురమువలెను నేమిచేయుటకును నెటకేఁగుటకును దోఁచక వేఁగుచున్నవారము. మాకుఁ దారణోపాయము దెలిపి దరిని జేర్చు భారము మీది" అని రాఘవరావు పలికెను.

"భగవంతుఁడు మీకు మనశ్శాంతి ననుగ్రహించుగాత! రండు" అని రామబ్రహ్మము వారి నాదర పూర్వకములయిన పలుకులు పలుకుచుఁ దనగదికిఁ బిలుచుకొనిపోయి, వారికిఁ గొంత సత్తుపిండి యొసఁగెను. వారు దానిని దిని గొంత దప్పి దీఱిరి. ఇంతలో, శంకరసింగు తమగుఱ్ఱము లున్నయెడకుఁ

బోయి వానికి మేఁతఁ బెట్టి నీరుచూపి చెట్టునీడలఁ గట్టెను. బాలాజీసింగు జీని సామానులను మూటముల్లెలను దెచ్చి గదిని జేర్చెను. రాఘవరావు, రొట్టెయలను గాల్చుకొను పనియం దమరెను.

ఆసత్రమున బసదిగియుండిన ప్రయాణికులలో నొకరు రామబ్రహ్మముగారిని బిక్షకుఁ బిలిచిరి. అతఁ డతని పిలుపును దట్టివేయక, కడుపార భుజియించి యతని మనస్సునకుఁ దృప్తిని గలిగించెను. ఇతనివలెనే నాసత్రములోని వారికందఱకును బది పండ్రెండు గడియలలోనే కడుపుపని దీఱెను.

ప్రయాణికులలోఁ గొందఱు మూటముల్లెల సవరించుకొని బండ్లకు సాగించి పయనమయిరి. కొందఱు మార్గాయాసము దీఱ విశ్రమించిరి. మన బ్రంహాముగారును వీరభట త్రితయమును గది నాశ్రయించిరి.

ఈనలువురును జింతకుఁజిక్కి ద్రొక్కుట పడువారేయయ్యును మువ్వురి దొక వగవగపుగాను. ఒకని దొకరీతి వ్యాకులముగాను నుండెను. ఎట్లున్ననేమి? సూక్ష్మముగాఁ బరిశీలించినచో వీరి వగపులకుఁ బరమావధి యొకటిగానే కన్పట్టును.

మొట్టమొదట రాఘవరావు దమచరిత్రమును సంగ్రహముగా నాసంయమికిఁ దెలిపి, షేకు మహమ్మదుగారు వధింపఁబడుటచేత, నిజామువారి కొలువు దమకు క్షేమప్రదముగాదని నుడివెను.

"అయ్యో, షేకుగారు బ్రదికియున్నయెడల మనము ప్రాణములనే కోలుపోవలసి యుండును; లేదా, అతని యిచ్చచొప్పున మెలఁగవలసి వచ్చును" అని శంకరసింగు చెప్పెను.

"స్వామీ? మీతో దాఁపఱికమేల? మాయిరువురి యొక్క యజమానులు 'సులేమాన్ ఉంరా' యను వారు. నాజరు జంగుగారి కంతరంగమిత్రులు, వారు, మాప్రాణముల నైనను వ్యయపఱచి నాజరుజంగును రక్షింపవలయునని చెప్పి పంపిరి, మేమిరువురు దలఁచియున్నట్లు గానసాగక తుదకిట్లు ముగిసెను. కాఁబట్టియే మాయేలికలయొద్ద కేఁగుటకును గాక, జాఫరల్లీగారిని దర్శించుటకును దోఁచక తొట్రిల్లుచున్నాము" అని బాలాజీసింగు నుడివెను.

"నాయనా! బాలాజీసింగు సత్యము పలికితివి. సంకటములు దోఁచినప్పుడు కార్యవిధానములు శీఘ్రముగాఁ బట్టువడవు. కాఁబట్టి సమాహితచిత్తముతోఁ గార్యములను బర్యాలోచింపవలయును, దైవ మెట్లు పరిణమించి నప్పటికిని, నిశ్చయించు కొనిన కార్యముల పట్ల పొరపాటును గలిగింపరాదు. ఒకరిగూర్చి పలుకనేల? ప్రకృతము మీరు ప్రస్తావించిన నాజరుజంగు గారినిగూర్చియే యాలోచింతము. నాజరు జంగు కష్టదశలకుఁ జిక్కి శ్రమపడుచున్నాఁడని పసిబిడ్డఁడు సైతము చెప్పఁగలఁడు. కష్టపడువాని దుష్కాలము వాని యుపకర్తను సైత మాశ్రయించి పెక్కువిధముల భాధించుననుట యనుభవ సిద్ధము. కాఁబట్టి, జాఫరల్లీకి సైతము ముప్పు వేచి యున్నదనుట, యసత్యము గాఁజాలదు. ముప్పు, ఒకవిధముగాఁ బరిణమింపక పెక్కువిధముల నలమట వెట్టుచుండును. మీవైపువా రొకరే జాఫరల్లీకిని నతని యాశ్రితుఁడయిన నాజరుజంగునకును వైరులను మాట యటుండనిండు. ప్రకృతము, పార్శ్వమునందే విజయనగరాధిపతి యుద్రేకించి యుండుట నాకుఁ దెలియును.

కావునఁ బాప మాయిరువురును, మీరనినట్లే కొసలు మండుచున్న కొఱవిలోని చీమల ననుకరించెదరు" అని బ్రహ్మము అనెను.

జాఫరల్లీ కిదివఱకు మిత్రులుగానుండిన విజయరామావనీశులు తిరుగఁబడియుండు సంగతి వారికెంతో యాశ్చర్యమును గలిగించెను. ఇప్పుడు తమ శరీరపోషణముల కయిన చింత వారిని వదలి నాజరుజంగుగారి పరిపోషణకైన యాలోచన గలిగెను.

"మన మందఱమును శ్రీకాకుళమున కేఁగవలయును. అచట నాజరు జంగుగారిని దర్శించి, సంగతులను విశదీకరించి, జాగ్రత్త కొలుపవలయును. మన కీపనికి కాలముచాలదు. కావునఁ జిక్కాకోలమునకు మనమెంత శీఘ్రముగాఁ బోవుదుమో యంత మేలొనగూర్చువార మగుదుము" అని కార్యమును రామబ్రహ్మము నిశ్చయించెను.

9-వ ప్రకరణము

"గొఱ్ఱెలవృద్ధికిఁ దోఁడేలు తోడ్పడినట్లు"

ఆదినము రమారమి మూఁడుగంటలతఱికి మూసాబూసీగారు, నవాబుగారి కొలువునకు విచ్చేసిరి. వారికిఁ బార్శ్వరక్షకులుగా నిరువురు ఫరాసు వీరులుండిరి. వారుకూడ రణకోవిదులనుటకు సందియముండదు. అతఁడు సభను బ్రవేశించునప్పుడు, దొడ్డవాయిన కొంపవలె నాప్రదేశమంతయుఁ గళావిహీనమై కనుపట్టుచుండెను. సరదారులమోములు వెల్లఁబాఱియుండెను.

సలాబతు జంగుగారి మోము దైన్యమునకు వాసస్థానముగ నుండెను. హైదరుజంగు, హాసనల్లీ ఖాను లోనగు శౌర్యధనులు, వ్యాఘ్రము బారిఁజిక్కి ప్రాణములు దక్కించుకొనియున్న అజశాబములవలె నొప్పుచుండిరి. వారి నిర్వేదస్థితి, మోములను వంచి క్రీఁజూపుల నలవఱచియుండెను. మొత్తమునకు సభ యంతయు స్తంభీభూతమయి సద్దణఁగి యుండెను.

అట్టి తరుణమున బూసిగారు ప్రవేశించి సభలోని తమ యాసన మలంకరించిరి. సభయున్న చొప్పును గాంచి మిగుల నాశ్చర్యపడిరి. సభ యంతగ దైన్యమనుభవించుట కెట్టి ఘోర సంభవము సంభవించెనో యనియు, నట్టిసంభవము నాకుఁ దెలియకయే యెట్లు పొసఁగె ననియును సందేహింపఁ జొచ్చెను.

భాస్కరుని తీక్ష్ణాతపమునకుఁ జిక్కి శోషిల్లిన కోమల లతిక చంద్రికామృత ప్రసారమున కించించుక జగ్గునిగ్గుల వహించి దొంటివైఖరికి రాఁ బ్రయత్నించినట్లు బూసీని సందర్శించుటచేత నందలి సరదారుల యొడళ్లయందుఁ గొంచెము కొంచెము దిటవొనగూడఁ దొడఁగెను.

బుస్సి యచ్చటనున్న వారి ఖేదమునకు గారణమును బరామర్శింపఁగా, సదాశివరాయని రాక లోనగు సంగతులు దెలియవచ్చెను. అప్పు డాజ్యాహుతులకుఁ బ్రజ్వరిల్లు వీతిహోత్రునివలె బుస్సి భగ్గున మండిపడి—

"అక్కటా, మీరెక్కడ? రాజ్యపాలన మెక్కడ? ఇట్టి పిఱికిగుండియ వారా సింహాసన మధిష్ఠించుటకు యోగ్యులు? సామాన్యుఁడయిన యొక సేనానికి భీతిల్లి, బొక్కసము నందొక చిల్లిగవ్వనైన నిలువఁ బెట్టకపోవుటయేగాక దివాణ

మునే యప్పులపాలు చేసివైచితిరే! మరాటాలు మనవిరోధులనుటను నే నొప్పుకొనెదను. వారు యుద్ధములయం దసహ్య పరాక్రములను మాటయు నే నొప్పుకొనక తప్పదు. అట్టి గర్భశత్రువుయొక్క సేనాధ్యక్షుఁడు, హా! యొంటరిపాటున మన చేతి కబ్బిన తరుణమునందు వదలిపెట్టుటయా శూరధర్మము? వదలితిరి పోండు; కోటిరూప్యముల కట్నము సమర్పించుకొని యా వానిని సాగనంపుట? నేను వచ్చునంత వఱకయినను జాగు మూఁగలు చేయుచుండ రాదా?" అనెను.

"అయ్యా, బుస్సిగారు! వారిని బట్టుకొనుట చేతనే మన శాత్రవులు నశించిపోవుదురా? సదాశివరాయఁడా వలను దప్పి, తనయంత మనచేతుల కబ్బునంతటి యోధ! అతనిఁ బట్టి చెఱబెట్టుటయే హైదరాబాదున కగ్ని దరికొల్పుటను బోలినదిగదా!" అని హైదరుజంగుగారు పలికిరి.

"కాఁబట్టియే మీరు పిఱికిగుండియ వారని నేను నుడివినది పొరపాటుగాదు. మిమ్మిదివఱకును బోషించుచుండిన ఫరాసువారి శౌర్యము నొక్కక్షణమునందే మఱచిపోవునట్లు చేసినదియు నీ పిఱికితనమే" అని బూసీ యుగ్రుఁడై పలికెను.

"వారిని బట్టి పెట్టుకొంటిమి యనుకొనుఁడు. ఉత్తరక్షణముననే వచ్చి మూఁగునట్టి వారి సైన్యమువారి కేమి బదులు చెప్పుట?" అని హైదరుజంగు చెప్పెను.

"మీ కెఱుకచాలదు; నాయకుఁడు చెడిన సైన్యములను జెదరఁగొట్టుట సర్వసులభము. అట్టిపనికి నేనున్నాఁడనే".

"సదాశివరాయని శౌర్యాగ్ని దెలిసియుండియు నిట్లు పలికెదరే!" అని హాసనల్లీఖానుఁడు పలికెను.

"ఔనయ్యా, అతఁడు బెట్టిదుఁడని మీకంటె నెక్కువగా నాకుఁ దెలియును. అట్టి దిట్ట తన యంత వలనుదప్పి మన చేతులకుఁ జిక్కినప్పుడు, వానిని వదలిపెట్టినవాఁడు గదా మూర్ఖుఁడు! మంచిది, అతనిరాక నాకేల దెలుపరైతిరి?" అని బుస్సి చెప్పెను.

"మీకా యెఱుకపఱచుట? ఎట్లు? అతని సరదారులు మన నగరును ముట్టడివేసికొని యుండిరి. కార్యార్థము వచ్చిన వారు దమపనిని దీర్చుకొనకయే లోపలివారిని వెలుపల వదలుదురా?" అని హసనల్లీఖానుఁడు నుడివెను.

"చాలింపుఁడయ్యా, ఇవన్నియుఁ గుంటు మన్ననలు" అని బుస్సి యదలించిపలికెను.

"అయ్యో, వారికేల శ్రమయిచ్చెదరు? పీష్వాగారి శ్రీముఖమును జూచినచో విషయధోరణి వారికే తెలియవచ్చును" అని సలాబతు జంగుగారు సెలవిచ్చిరి.

ఆఘరమానా బుస్సీచేతి కొసఁగిరి; దానియందు వ్రాసియున్న సంగతిని బూసి సాంతముగాఁ జదివెను. పిమ్మట నతని చిత్తము మఱింత మండఁ జొచ్చెను. "ఔను, మీ తెలివిలేమిని స్థాపించు నిదర్శనమే యిది" అని విసుఁగుతో బుస్సి పలికెను.

హా! ఎట్టకేల కొకవిధముగా నాపదనుండి తప్పి బ్రతికితిమి గదా, అని యించుక నెమ్మది చెందియుండిన సలాబతు జంగుగారి కిప్పుడు క్రొత్తసంకటము గలిగెను. ఇది వఱకిట్లు బుస్సి తన్నెదిరి పలికినవాఁడు గాఁడు. చతుర వచోరచన యందు నిపుణుఁడు. ఇట్లెన్నటికిని నిండోలగమున సభ్యులను ధిఃకరించి పల్కినవాఁడు గాఁడు. శుద్ధవీరుఁ డగుటచే నాత్మస్తుతియుఁ [illegible]

కొని యుండలేదు. ఇతరుల శౌర్యమును డిందుపఱచియును బలికియుండలేదు. సదాశివరాయని కంటెఁ బ్రబల శాత్రవుల యందుఁ గూడ నితని కిట్టి నీతికిఁదప్పిన తలంపు గలుగలేదు. ఇట్టి యుత్తమవీరుఁడు, కారణము లేకయే, యివ్విధముగాఁ దన సత్స్వభావము వదలి మెలఁగుట దన దుష్కాల సూచనయనియే సలాబతుజంగు భావించెను.

ఆహా! రాజపదవి కెందఱు నోరూఱుదురు! అధికార సంపదయును, భోగభాగ్యములును గోరనివా రెవరు? అట్టి వారు, తమ భోగభాగ్య పరిపోషణములకైన పాటులనుగూర్చి యించుకేనియు వెనుదీయుదురా? చవినిగోరి పనసపండు తినువాఁడు కడుపు కుట్టునకు వెనుదీయవచ్చునా" వెనుఁదీసెనుపో, వదలునా? దేహయాత్ర జరుపుకాలమున మనుష్యుఁడు నిజ కుటుంబ పరిపాలనమునకే యెంతో శ్రమపడవలసియున్నది; అట్లుండ, రాజ్యపాలనమున కెంత నిర్వాహశక్తి యలవడవలయును. కాఁబట్టియే హిందువు లట్టి రాజును దేవాంశమువాఁడని గొప్పచేసి చెప్పెదరు. శ్రమల నిర్వహించునపుడు వాఁ డనుభవించు కష్టములకు వాని భోగభాగ్యములు తుల్యములగునా? రాజ్యభార క్లేశము పైకొన్న తరుణములయందు, భోగములవలని సంతోషస్ఫురణములు వాని చిత్తమున కలవడవు. అప్పుడు, సుఖమన్నమాట, బధిరునకు వీణావాదనమువలె వాని యెడల విషయవంతము గాదు. అట్లు దుఃఖపరంపరలకు విషయీభూతుఁడై, యుచ్ఛ్రాయదశ నున్న మనుష్యుఁడు, సామాన్య మానవునిఁ జూచి, 'అయ్యో నేనీ బీదవలె నేల పుట్టరాదు' అని వాని సౌఖ్యస్థితికిఁ జాపోపమిని జెందుట స్వాభావికము.

అట్లుగాక, వాఁడత్యున్నతదశను గోరఁగలఁడా? అక్కటా, అధికారము వహించుటకంటె నిష్ఠురపుఁ బని మఱియొకటి యుండదు. సుఖసంపత్తి యెంత కెంత యధికమో యంతకంత కష్టసంచయమును సర్వేశ్వరుఁడు మిశ్రపఱచియే యున్నాఁడు.

కొన్ని సంవత్సరములకుఁ బూర్వము, భాగ్యనగర సింహాసన మెక్కుటకునై, సలాబతు జంగుగారు చేసిన ప్రయత్నములన్నియును, రాజ్యము లభించుటచేత, ఫలవంతములయినవని చెప్పక తప్పదుగాని, దేనికొఱకతఁ డట్టి ప్రయత్నములను జేసెనో యట్టి సుఖానుభూతిమాత్ర మలవడలేదని ధారాళముగాఁ జెప్పవచ్చును. రాజ్యలాభమే సుఖసంపత్తికిఁ గారణమనుట మూఢుల మతము; అది దుఃఖప్రదమని పండితులు దలంతురు. అట్లు దలఁచునట్టి సుజనుల నొకరినే రాజ్యభారము హింసింపదు. వైరాగ్యప్రవరుని యెడల వారవనిత వలపు ప్రయోజనవంత మగునా?

పాపము; సలాబతుజంగుగారి కాసంధిగ్ధ సమయమునఁ దన వైభవమునందు విరక్తి పొడమెననుట యసంబద్ధాలాప మగునా? అక్కటా! తన్నును దనరాజ్యమును నిర్మూలింప వచ్చిన యాపద యొక పర్యాయముగాఁ దొలఁగిపోయెనని ధైర్యమును వహించునంతలోనే, తన కేడుగడగా భావింపఁ దగిన బుస్సి నిష్ఠురములు పలుకుటకు మొదలుపెట్టెను. అతని యట్టి మెలఁకువకుఁ గారణము దెలియగోరి——

"అదేమి? క్రొత్తగా నేఁటికి దండనీతినిగూర్చి ప్రశంసించెదరు? ఎప్పటికిని మీరు సామము నేకదా కొనియాడుదురు?" అని సలాబతుజంగు చెప్పెను.

బు-"లోకమునందు సర్వత్ర సామము ప్రయోజనపఱచుటయుఁ బొరపాటే, దండమును బ్రయోగించుటయును బొరపాటే."

స-"అట్లయినను మీ దండనీతికి సదాశివరావర్హుఁడని దలఁచెదరా? అట్లే యగుదురనుకొందము. వారా మీ దండనకుఁ జిక్కువారు?" అనిరి.

"ఔను, మీరు మరాఁటాల విషయమున నెంతో పక్షము వహించి యున్నారు. ఇంక ఫరాసు దొరలతో మీకేమిపని?" అని బూసి తన యాసనమునుండి లేచెను.

అట్టితఱుణమున నవాబు దమ యాసనమునుండి దిగి మూసాబూసీగారికిఁ గోపోపశాంతిగాఁ గొన్ని యూఱటలు పలికి యతని నాసనముపైఁ గూరుచుండఁ జేసెను. అందలి సభ్యులు కొంతదనుక మౌనమూనియుండిరి.

తుదకు బుస్సీదొరగారు, దమ యాసనమునుండి లేచి నవాబుగారి మోముపైఁ జూడ్కినిలిపి, "నా మనవిని చిత్తగింపుఁడు. నే నిచ్చటనే యింకఁ గాలయాపనము చేయుటకు వీలులేకున్నది. కాలకర్మములు సైత మట్లే పొసఁగియున్నవి. ఇంక నొకటి రెండు దివసములలో నే నిచ్చోటువదలవలసిన వాఁడను. ఇంక నెన్నో వింతలీ భాగానగరమునఁ దలచూపఁ గలవు. యజమానుల యుత్తరువుల ననుసరింపవలసినది సేవకులకు ధర్మమేకదా! మా యజమానులగు కమీషనరువారు, మీ పేర లేఖను బంపియున్నారు. మీకు ప్రబలులయొక్క మైత్రియు దొరకెను. కాఁబట్టి,

నాయునికి యంతగా నపేక్షితముగాదు" అని పలుకుచు నొక యుత్తరమును సలాబతు జంగుగారి చేతి కందించిరి. ఇదియే కమీషనరు, గొ. ధూ. దొరవారు వ్రాసియంపిన యుత్తరము.

ఆ యుత్తరము పరాసు భాషను వ్రాయఁబడియుండెను. నైజాము వారి యాస్థానమందు ఫ్రెంచి, ఉడుదు మొదలగు భాషలయందుఁ బ్రవీణుఁడయిన యొక బ్రాహ్మణుఁ డుండెను. అతఁడే యిట్టి తరుణములయందు నిపుణత మెఱయ ద్విభాషి యుద్యోగమును నిర్వహించుచుండును. ఖండాంతర భాషలయందా కాలమునఁ దెలివి తేటలుగలవాఁడుగా నుండినందున, దుబాసి లక్ష్మన్న యను నతని పేరు చుట్టుప్రక్కలఁ జాల దవ్వునకు వ్యాపించియుండెను.

అతఁడు దానిని జదివి, దిగువ జెప్పు నంశములను భాషాంతరీకరించి పలికెను.

మ. రా. రా. శ్రీ. సేనాపతి, మూసా బుస్సిగారికి—

ప్రకృతము, ఇండియాలోని ఫ్రెంచివారి రాజాంగము, ధనము కావలసి, మిగుల నిబ్బంది చెందియున్నది. తత్క్షణమే మన సంకటములను నవాబువారికి విన్నవించి 5 కోట్ల రూపాయలను పొంది, తగిన కాఁపుదలతో మా మఖామునకుఁ బంపి మఱియొక పని మీఁద గమనముంచునది. సందర్భపడనిచో, హైదరాబాదు సింహాసనమును నిమిత్తపఱచి, జంగుగారు 10 కోట్ల రూపాయల కట్నము మనకు సమర్పింప సిద్ధపడి యుండుఁడని తెలిపి, సైన్యములతో వెంటనే హైదరా

బాదును వదలవలసినది; తక్కినవిషయములు ముఖాముఖిని మాటలాడు కొందము.

మఖాము—పుదుచ్చేరి, } ఇట్లు
తేది - ౧ - ౯ - ౧౭౫౬ } గొ. ధూ.

ఈ వర్తమానము వినఁగానే సలాబతుజంగుగారు, గోరుచుట్టుపై రోఁకటి పోటన్నట్లు నొచ్చిరి. తాము క్రొత్త సంకటమునకుఁ జిక్కినట్లు భావించిరి. అక్కటా, సదాశివరాయని నుండి దప్పించుకొనుట సులభమే కాని, ఆ స్థానమునే కనిపెట్టుకొనియున్న బుస్సీకిఁ దప్పి బ్రదుకుట యెంతో కష్టము" అనుకొనిరి.

వారిదివఱకే, 40 లక్షల రూప్యములను అప్పుదీసియుండువారు; మఱియు నైదుకోట్లరూపాయ లెందుండి తేఁగలరు. అది యెట్టి విసపుగడియయో కాని, మిగులఁ బ్రతిభాశాలియగు సలాబతు జంగుగారి కెంతదీర్ఘముగా నాలోచించి నప్పటికిని గర్తవ్యాంశము గనఁబడలేదు. కావునఁ జిత్తరువు బొమ్మవలె నిశ్చేష్టితులయి సింహాసనమునఁ గూరుచుండి యుండిరి.

రాజకీయోద్యోగుల భాగ్యమయినది రాజ్యమంతశ్ఛిద్రములేక నెమ్మదిగనుండుట. రాజునకుఁ గష్టములు దోఁచుట, రాజపరివారము వినాశమునకే కారణ మనుట స్పష్టము. ఇంతేగాక, మన హైదరు జంగుగారు సలాబతుజంగుగారి రాజ్యలాభమునకై భగీరథ ప్రయత్నములను జేసిన సరదారులలోఁ బ్రథమగణ్యుఁ డనుటను నతనియుద్యోగ మే వేవిధముల నుగ్గడింపఁగలదు. కాలము సరిపడివచ్చి, నాజరుజంగుగారే సింహా

సన మలంకరించు తరుణము వచ్చునేని, యతని సింహాసనము నకు మొదటిబలిగా హైదరుజంగుగారే సమర్పింపఁబడుదురు. కాఁబట్టి, కమీషనరు వ్రాసిన యుత్తరము చొప్పున నెఱవేరు నేని, సలాబతు జంగుగారి కంటెను హైదరు జంగుగారే యెక్కువ వ్యథపడవలసి వచ్చును.

"అక్కటా! యెట్లు ఫరాసులవారను సుప్రసన్నులఁ గావించుకొనుట? ఎట్లు నాజరుజంగును హతమణఁచుట?" అను ప్రశ్నలు హైదరు జంగుగారి చిత్తమున మాఱి మాఱి దోఁచుచుండెను. తుదకొక తీర్మాన మతని చిత్తమునకుఁ గుదిరెను. "మొదటి ప్రశ్నకు అర్థము గావలసియున్నది. అది యుండెనేని బుస్సి మనమాటకు మాఱుపలుకఁడు. అతని మైత్రియు నవిచ్ఛిన్నముగాఁ గొనసాఁగఁగలదు. ఔను, ఉన్నట్లుండి మన కిప్పటికింత పైకమెట్లు దొరకును?— సరి, విధాన మేర్పడినది. ఇట్లే చేయవలయును. ఆహా! మఱచితిని; నేనేల యింతదనుక వ్యర్థముగా నాజరుజంగును గూర్చి చింతింపవలయును? ఈదినపు సంభవములకు నిజముగా నాకు బుద్ధిభ్రంశమే కలిగెను. నేనింతకే షేకుమహమ్మదు గారిని చికాకోలమునకుఁ బంపియున్నానే! అతఁడన్నిఁటికిని జాలినవాఁడు. మాయోపాయములకు మారీచునియన్న; అతఁడిప్పటికిఁ జికాకోలమును జేరియుండును. తన యుద్యోగమునకుఁ బ్రారంభించియు నుండును. ఇంకమనకు నాజరుజంగువలని భయము వలసినది లేదు. ఔను, ఒక యంశమునుగూర్చి మాత్రము చింతింపవలయును. సరి, దానికేమి? నవాబువారితోఁ బర్యాలోచించి చేయుటచేత దానికి ప్రతిబాధకము గలుగదు" అని

మదికి దిటవు దెచ్చుకొనెను. పాపము! హైదరుజంగుగా రనుకొనినట్లు ఆకార్యము దిన్నఁగా జరుగకపోయెను; షేకుగా రిప్పుడు, వీరస్వర్గమున కేఁగియున్నారుగదా! వారికీలోకముతోడి పనియేమి?

కార్యనిశ్చయము చిత్తమున స్ఫురింపఁగానే హైదరు జంగుగారు లేచి నవాబుగారి చెవిలో నొకటిరెండు మాటలు పలికిరి. ఆమాటలకు వారులికిపడి దిటవుఁ జెందిరి.

హైదరుజంగుగా రంతట, బుస్సీగారిని జూచి, "అయ్యా సేనాని! రూపాయలు మనచే సంపాదింపఁబడునవి. వానిని కోరి, తమవాగ్దత్తములను స్నేహమును ఘనులయిన మీవంటి వారు మఱచిపోరు" అని మందలించిరి.

బు—"అయ్యా, మిత్రుఁడ! అన్నిటివలె వాగ్దత్తములకును మైత్రికిని మేరగలదు."

హై—"అయ్యా, మేరనుపాటింపవలసిన యావశ్యక మిప్పుడేమియుఁ గలుగలేదే! మీకీ దివాణమునందు సర్వస్వాతంత్ర్యముగలదు. బొక్కసమున ధనము లేకపోవుటయుఁ బ్రకృతము మీకెక్కువధనము కావలసియుండుటయును సత్యములే! అయినను, ఇందలి కష్టములు దెలిసియుండియును మీరట్లు భాషించుట పొరపాటని నేను జెప్పుటకు క్షమింపవలయును. ఇప్పుడు, ధనమున కేమియుఁగొఱఁతలేదు. కొంచెము శ్రమకోర్చి సర్కారులవఱకు నాతోడవచ్చినఁ జాలును. మన్నదొరలయొద్ద నిలువనిలచియున్న పైకమును, వారు సమర్పించు జమరులను దమమొత్తమునకు జమపెట్టెదను. చింతవలదు. నవాబువారుకూడ, సర్కారులపై సర్వాధికార మొసఁగుటకు వెను

దీయురు; మీకుఁ గొలుసకిచ్చినట్లు, సన్నదు ననుగ్రహింపఁగలరు. మేము మరాటాలకుఁ జేసియున్న వాగ్దత్తానుసారము, వారి కట్నముక్రిందఁ గొంతపైకము చెల్లింపవలసియున్నది. కాఁబట్టి యిప్పుడు మనము జమాబంది వెడలుటయే కర్తవ్యము; నేనును మీతోడనే వచ్చెదను.

బుస్సి హైదరు జంగుమాటల కానంద పరవశుఁడయ్యెను. నైజామువారి హృదయమునకుఁ దోఁచిన కలవరములు ఘూాత్రము దొలఁగవయ్యెను. అవి నూత్న నూత్నములుగాఁ బొడచూపి ప్రవృద్ధము లగుచుండినవి. ఏమి సేయవచ్చును? ఇక్కట్టునుండి తప్పించుకొనవలసినది కర్తవ్యముగఁ దేలినందున విధిలేక యుత్తరసర్కారులు బుస్సీకిఁ గొలుసకిచ్చుట కంగీకరించెను; సన్నదుసైత మనుగ్రహించెను. బుస్సీ యట్లు సభలో మెలఁగుటకు సలాబతుజంగుగారి కసూయ పొడమక పోలేదు. సమయము తటస్థింపఁగానే యీ ఫరాసు మూకను దనమండలమునుండి దరుమఁగొట్టవలయునని సంకల్పించుకొనెను. వారి స్థానముల నాంగ్లేయవీరులను స్థాపింపవలయునని దృఢముగా నిశ్చయించుకొనెను.

బుస్సిదొర సన్నదును బొంది తన దండును బిలుచుకొని బయలు వెడలుటకు సిద్ధపడెను. హైదరుజంగు హాసనల్లీఖాను, సులేమాన్ ఉంరా లోనగు వీరులు స్వీయదళములతో నతనికిఁ దోడుపడిరి. వీరితోడ దుబాసి లక్ష్మన్నమున్నగు నుద్యోగస్థులును వెడలువారయిరి. ఇట్లు వీరందఱును మఱుచటి దివసమే రాజమహేంద్ర వరమునుగూర్చి ప్రయాణమయిరి.

10-వ ప్రకరణము

మేలుచేసినవానికి - మేలుకలుగు.

విజయనగరమున కాగ్నేయమునందుఁ జిక్కాకోలపు సర్కారున్నది. దీనికిఁ బ్రభువు "జాఫరల్లీఖాను." ఇతఁడు సౌందర్యమునందుఁ బ్రసిద్ధివహించినట్లే శౌర్యౌదార్యముల యందును బేరును బ్రఖ్యాతిని వహించినవాఁడు. ఇతఁడు, ప్రాణములను బెద్ద చేసి యాశ్రితులను వదలిపెట్టు బేలకాఁడు. ఇతఁడు, తెనుఁగు సీమకధికారి గావున, ఇతనికి కులభాషయందున్న తెలివికంటెఁ దెనుఁగున నెక్కువపాండిత్యము గలదు. ఇతని కాంధ్రమున సాహిత్యశక్తి యలవడియుండెననియుఁ జెప్పుకొను చుండిరి. ఇతఁడు, తెనుఁగునఁ గవియైనను గాక మానినను, ఆంధ్రకవుల కాశ్రయ దాతయన్న ప్రశస్తి పొరపాటు కాఁజాలదు. కావ్యరసానుభూతి యితనికిఁ గలదని చెప్పుటచేతనే, ఇతఁడు రసికజనావతంసుఁడను మాట వ్యక్తమగును. ఇతనిపెద్దలు హైదరాబాదు షాహాలకుఁ ఫౌజుదారులయి శౌర్యరస సమగ్రులయి వెలయుచుండిరి. బొబ్బిలి విజయనగర ప్రభువుల కూటస్థులకు వీరు పరమమిత్రులయి, వారి సుఖసంపత్తికి హేతుభూతులయి వెలయుచుండిరి. ఆవంశమునఁ బుట్టినవీరుఁడగుటఁబట్టి, జాఫరల్లీగారికిఁ దనపెద్దల యుత్తమ గుణములన్నియు నలవడియుండినవి. కావుననే యీయుత్తమ పురుషుని వాజరుజం గాశ్రయించెను.

ఇతని కొలువు సప్తాంగమును గలది. ఇతఁడు రాజ్యకార్యములయందు చిత్తము చొనిపియున్న సమయమున, రాఘు

వరావు మొదలుగాఁగల ముప్వురు భటులు, ఆసభను ప్రవేశించిరి.

ఈ భటులు జాపరల్లీ గారికి వందనములు సమర్పించిరి. వారి వేషములచేతనే వారిని హైదరాబాదు భటులని దెలిసి జాపరల్లీ మొదట నించుక కోపమువహించెను గాని, వారు దెచ్చిన వార్తలను విన నుత్సాహము గలవాఁడయి, వెంటనే తన కోప ముపసంహరించు కొనెను.

అట్లు దివాణమునుండి వచ్చిన భటుల యుపచారము నిమిత్త మచ్చటనున్న యొక యుద్యోగిని జూడఁగా, నింగితజ్ఞుఁడగు నతఁడత్తఱి నాభటుల నుపచారపూర్వకముగా నాసీనులను జేసెను.

కొన్ని దివసములకుఁ బిదప రాఘవరావు లేచి, మిగుల వినయముతో జాఫరల్లీగారిని డాసి, హైదరల్లీగారు షేకుముహమ్మదు గారి కొసఁగియుండిన ఫరమానాను సమర్పించి,

"ప్రభువా ! ఈ ఫరమానాను దమచేతి కందించునట్లు మా సేనాధిపతి షేకు ముహమ్మదుగారి చేతికొసఁగిరి. వారికి సేవకులుగా నన్నును సాంబాజీరావును నియమించిరి. మేమిరువుర మతని రక్షణమునకుఁజాలమని, సులేమాన్ ఉంరా గారు యిరువురు వీరభటులను నియమించిరి. కాలవ్యత్యస్తముచే మార్గమధ్యమున షేకుగారును సాంబాజీరావును కాలగతినొందిరి. శేషించిన మేము మీసన్నిధానమునకు వచ్చి చేరితిమి. ఇంకఁ బర్యాలోచించి యాజ్ఞపాలించుభారము దేవరవారిది" అనెను.

జాఫరల్లీగారి గుణమును గూర్చి యిదివఱకే తెలిసికొని యున్నాము. కావున నా ఫరమానా యెట్టి తలంపు నతనికిఁ గలిగించియుండునో చదువరులకే విదితముగాఁ గలదు. హైదరుజంగు దివాణమునందొక యుద్యోగి. అతఁడు, ప్రబలుఁడయి యిప్పటికి సైన్యాధిపత్యము వహించియున్నాఁడు. ఇంతే కాక, రాచకార్యములయందుఁ దన యిచ్ఛాను సారము మెలఁగుటకనువుగా రాజముద్ర నేస్వాధీనము నందుంచుకొని యున్నాఁడు. పలుమాటలేల ? రాజుగారికిఁ దెలియకయే యెన్నో కార్యములను గొనసాగించుచున్నాఁడు. జాఫరల్లీ యట్లుగాదు ; తనకుఁ బైతృపైతామహముగ వచ్చినప్రాభవ మనుభవించుప్రభువు; తగరెంత గ్రొవ్వినను సింగపుఁ గొదమయగునా ?

సలాబత్తుజంగుగారికి తనపితృవ్యుఁడయిన నాజరుజంగు నెడలఁ బ్రీతి లేదనుటకుఁ గారణము లేదు. అట్లుండియును, హైదరుజంగుకతనఁ దనపినతండ్రి యెడల విరోధించునట్లు సందర్భము లేర్పడెను. హైదరుజంగు వచ్చినఁగాని, దివాణము వదలియేగినఁగాని నాజరు సలాబతుజంగుల విరోధబంధము గొంతసడలదనుట కాక్షేపణ లేదు. కాఁబట్టి, ప్రకృతము, నాజరు జంగు గారికి సలాబతు జంగుగారికంటె హైదరుజంగే ప్రబలశత్రువనుట కాక్షేపణ గలదా ?

కాలవశమునఁ దనకాశ్రితుఁడుగా నున్న నాజరుజంగు గారిని శత్రువుల కప్పగించి తనప్రాభవమును బ్రాణములును బరిపోషించు కొనుటకుఁ బ్రయత్నించు నధముఁడా జాఫరల్లి ? అతఁడు మహాశూరుఁడు ; ఉత్తముఁడు ; న్యాయకార్యైకనిరతుఁడు. అట్లుండఁ బట్టియే, యతనికి నాజరుజంగు నెడల

మక్కువ యెక్కువ యయ్యెను. గాని, యతనికి రాజ్యమబ్బినఁ దనకు మేలుగలుగఁ గలదను దురాశగాదు.

నాజరుజంగుగారి మేలు నుద్దేశించి జాఫరల్లీగారు, విజయరామరాజు గారి యొక్కయుఁ దదితరులయొక్కయు మైత్రిని వహించెను. తానుద్దేశించిన పని నిరాఘాటముగా జరుగఁదలఁచియే ద్వితీయోపాయమున (దానమున) జాఫరల్లీ గారు గొ.థూ. దొరను స్వాధీనపఱచుకొనుటకు యత్నించెను.

కాఁబట్టి, యిప్పుడెట్లు మెలఁగుటకును దోఁచక, తొత్రుపడువాఁడయ్యెను. తన స్వాధీనమునందు నాజరుజంగుగారుండుట లోకవిదితము; కప్పిపుచ్చుట కిష్టములేదు. తానును దనయాశ్రితుఁడును దప్పి బ్రదుకుటకు భుజసారమే పరికరము గావలయును. దానికిఁ దనకుఁదోడుపడుటకుఁ గొందఱు మన్నె దొరలుగలరు. వారిలో ముఖ్యులు విజయనగరపు విజయరామ మహారాజు గారు.

వీరి తోడ్పాటు దనకు సమగ్రముగా నున్నందున శత్రువుల నొక విధముగా నెదిరింపవచ్చునను నూహయొకటి యుండెను. ఇప్పుడు శాత్రువు లెత్తివచ్చునట్టి సూచన గానవచ్చినందున, ప్రకృతాంశమును దలపోసి, తన కోట శత్రువుల కభేద్యమగునట్లు సవరించుకొనవలయు నని నిశ్చయించుకొనెను.

ఇట్లు శాత్రవుల నెదురించు సమయమునందుఁ దనకు బాసటయగుటకై తన మిత్రులకు శ్రీముఖమును పంపవలయు నని దివానుగారి కానతి యొసఁగెను. ఇంతటితో మానక, తన మీఁదికి సైన్యమువారి దండుతోడ బుస్సీగారు, ఎత్తి రాకయుండిరేని ఫరాసురాజాంగము వారికిఁ గొంత కట్నము సమ

ర్పించు కొనునట్లు గొ. థూ. దొరవారి కొకశ్రీముఖము వ్రాయించి కొత్తు లిరువుర వశముచేసి తత్క్షణమే పుదుచ్చేరికిఁ బయన పఱచెను.

ఇవ్విధమయిన ఆభటత్రితయము దన యాస్థానము చేరిన యఱగంటకు లోపలనే కార్యాలోచనయును కృషియును ముగిసెను. అవి రాఘవరావు, బాలాజీసింగు, శంకరసింగు అను నీముగ్గురకుఁ దెలియరానట్లే గొనసాగినది.

తుదకు నవాబు జాఫరల్లీ గారు, మందహాసము ముఖసీమ నలంకరింపఁగా నా భటులను జూచి, “మీనాయకుఁడు కాలగతి చెందెనంటిరే, మీరిప్పుడేమి చేయఁదలఁచితిరి ?” అనెను.

రా—ప్రభువా ? మేమేమి చేయుదుము ? మాదేశమునకుఁ బోవుటకుఁ మీకు గొన్ని యాటంకము లేర్పడుచున్నవే.

శం—అయ్యా, మహారాజ ! మాయజమానులగు సులేమాన్ ఉంరాగారు, మేమీచోటనే కొంతకాలము మసలుచుండిన మంచిదని సెలవిచ్చియున్నారు. ఉంరాగారు మీయాశ్రితుల కంతరంగ మిత్రులనుట మీకె తెలిసియుండఁ గలదు. కావున నిందు జరుగు సంగతులను రహస్యముగా వారి కప్పుడప్పుడు దెలుపుచుండినయెడల వారు వానికిఁ దగినట్లుచటఁ బ్రయత్నించుచుందురు. మఱియు నొకటి రెండు మాటలు మీతో విన్నవించునట్లు సెలవిచ్చియున్నారు—మీరు ప్రాణాభ్యధికముగా భావించి రక్షించుచున్న వస్తువెదిగా నున్నను, వెలుపలివారి కొఱకు, మీయొద్ద లేనట్లు నటించుట ; ఆవస్తువును దగినచోట భద్రపఱచుట. అనునవియె అని, జాఫరల్లీ గారికి మాత్రము వినవచ్చునట్లు రహస్యముగా విన్నవించెను.

చదువరులకు నేనీవస్తువును గూర్చి వివరింపవలసిన యవసరములేదు; నాజరుజంగు గారే వస్తువుగాఁ బోల్పఁబడిరను నూహాస్ఫురింపక పోవునా? ఇట్లు శంకరసింగుగారు మనవిచేయఁగానే, "ఆహా, నేనెట్టిమూఢుఁడను! శాత్రవులయొద్దఁ గూడ మన మిత్రులు గలరను మాటను మఱచితినే. సరి; ఇంక నేనంతగా భయపడవలసిన యావశ్యకములేదు. శాత్రవుల యుద్ధతి యణఁగుటకుఁ గొన్ని కారణము లేర్పడి యున్నవి. మంచికాలము డాసినప్పుడు శత్రువు దనయంతనే భంగ మొందఁగలడు" అని యించుక సంతసించెను.

ఈతరుణమున నొక సన్న్యాసి యాసభాభవనమును బ్రవేశించెను. అతనిచేత నొంటితంతి తంబూర యొకటి యుండెను. అతని ముఖము తేజోవంతమయి యున్నందున, నందలి సభ్యులందఱయొక్క దృష్టి యతని మోముమీఁదనే ప్రసరింప దొడఁగెను. ఇతఁడే మన రామ బ్రహ్మముగారు.

ఇతఁడు తనకంఠ ధ్వనికనువుగా శ్రుతిని సవరించి, తంతి మీటుచుఁ దనసంగీత సంపద కనువుగా సాహిత్యశ్రీలను వెలయింపఁ దొడఁగెను.

గీ. నరులలోపలనిస్లాము - నమ్ముదొరలు
వసుధఁదమయాశ్రితాళిని - వదలరెందు
సత్యమల్లొటనాజరు - జంగుగారి
ననదగాఁజేసిపుచ్చెదో - యరుల్కడకు

గీ. చక్కఁగాబుద్ధినూహింపు - జాఫరల్లి!
"వలదు బలియురతోడిదా - వైర"మనుచు

వదలఁగాఁజూచినను నిన్ను - వదలలేదు
విజయరామావనీశు వి - ద్వేషబుద్ధి.

గీ. రాజ్యతృష్ణకుఁ జిక్కిన - రామరాజు
కడఁగి బొబ్బిలి సీమ శ్రీ - కాకుళంబుఁ
బొందకయె తృప్తిసెందని - పోలుపు దెలిసె
నక్కటా! వారియాసకు - నలవిగలదె?

గీ. అధిప! నరునెక్కనిచ్చివ్వ - తూగ్రమునకు
మొదలునఱకిన తెఱఁగొప్ప - మొదటినెయ్య
నిన్నుఁబెడఁబాసియెంతయుఁ - గన్నుఁగనక
యరులశరణొందెఁగాఁ దాను - నరవరుండు.

గీ. ధర్మమార్గానురక్తులై - దనరువారి
రావువంశాభిజాత్యుల - రాణ్మణులను
దనదుదెసఁదోసమెన్నని - ఘనుల నకట!
క్రోధవశమునఁద్రుంపఁగాఁ - గోరెవిభుఁడు.

గీ. వైరమదిచిత్తమెఱియింప - ఘోరముగను
రావువారినిఖండింప - భావమందు
నిశ్చయించుటచే ధర - ణీధవుండు
చాలప్రేమించెహైదరు - జంగుగారి.

గీ. అట్టితరుణంబునకెయేను - సరిగినాను
అంతట వహించెనాహావ - యజ్ఞదీక్షు
నిన్నుసైతముస్మరియించి - నిట్టులముగఁ
బశువుగాఁజేయసమకట్టెఁ - బార్థివుండు.

గీ. అయ్యహైదరుజంగుదా - నాగ్రహంబు
విజయరామావనీశుల - విజయకాంక్షు

యనెడునివిరెంటికినిజిక్కి - పాతమయుగుదు
దావవహ్నికిఁజిక్కుపా - దపమువోలె.

గీ. మీకునిరువంకవైరంబు - మీఱియుంట
నుప్పుదప్పునెయేవంక - మొసఁగియున్నఁ
జొప్పువినిపింతు వినుమయ్య - చోద్యమనక
మంత్రబలమునఁగానని - మహిమగలదొ?

గీ. అయ్యమీవలెవిజయరా - మావనీశు
క్రౌర్యవృత్తికిఁజిక్కిన - రంగరావు
మైత్రివహియించితేని ద - న్మహిమవలన
వైరివర్గంబులను మీఱి - వరలఁగలవు.

గీ. పూజ్యులెంతయుశౌర్యవి - స్ఫూర్తిగలరు
శాంతమూర్తులు ఘనులును - సజ్జనులును
వాసికెక్కినువారిదొ - వార్తలిచటఁ
దనరుచుండెడుమన్నెసు - ల్తానులందు.

అని, తత్క్షణమే యాచోటువాసెను. నగరునకు వెలుపలనే దనయశ్వమును నిలిపి యుండినవాఁడు గాన, దాని నెక్కి యెచ్చటకో బ్రహ్మము పయనమయ్యెను.

సన్న్యాసి తన సభను ప్రవేశించుటయును, తనకు హితముపొసఁగెఁ దన సాహిత్యమును సుస్వనమున వెలయించుటయును, తన కృతజ్ఞతా పూర్వక బహుమతులనొండె; తుదకు వందనములనొండె నిరీక్షింపకయే మెఱపు మెఱసినట్లు ఆ చోటిని వదలుటయును దలఁచి నిజముగా జాఫరల్లి పరమాశ్చర్య స్వాంతుఁడయ్యెను.

బ్రహ్మముగారు సూచించినట్టి విజయరామరాజుగారి విద్వేషమును, బొబ్బిలిగారి మైత్రియును నను నీ రెండువిషయములు దన సునిశ్చితాంశములను బెకలించి వైచుటకుఁ దీక్ష్ణసాధనములుగా నుండినవి. విజయరామరాజుగారికిఁ దన యెడలఁ గ్రొత్తగా నేల విగ్రహబుద్ధి గలిగెనో, ఎట్లు సలాబతుజంగుగారి యంతరంగమిత్రులగు రంగారావుగారు దన సంధికి సమ్మతింతురో యనునంశము లతని చిత్తమును జిందఱవెట్టుచుండినవి. ఎంత పర్యాలోచించినను దేరుగడ కలుగలేదు.

అట్టి తరుణమునఁ దాము పయనముచేయు నప్పుడు, రామబ్రహ్మమువలన వినియుండువారును వారి యుద్దేశముల రీతిని మొలఁగఁదలఁచిన వారును నై యుండిన యమ్మువ్వురు భటులు, జాఫరల్లీగారి సందియములను దీర్ప సమకట్టిరి. ఇంక నూత్నముగా జాఫరల్లీ కార్యముల నాలోచింపవలసినవాఁడయ్యెను.

11-వ ప్రకరణము.

"మదికి సొంపిచ్చుసాధుస - మాగమంబు"

సంతోష మహాగహన దావదహనమ్ము శాత్రవము. చారుతరవిభూతికి విలయకారణము విరోధము. పాండితీ పరిశోషణమునకుఁ బరమ హేతువు వైరము. వనవాటికలఁ గ్రిమ్మఱుచు, కాయకసరులను దినుచుఁ బ్రొద్దు గడపు పుణ్యపూరుషులు సమాహితచిత్తవృత్తితో నెంతో సంతసింతురు.

రాజసదనముల సకల సౌఖ్యములఁ దులఁదూఁగువారు, వైభవోపేతులయ్యును వైరము కతనఁ దేఁకువసెడి, తెవులులేని వేదనలకుఁ జిక్కి సొంపఱుదురు; శత్రువులను జంపఁగోరి తామే చనిపోవుటకు మార్గము గలిగించుకొందురు. నిప్పు తానున్న చోటిని గాల్చి, పిదపఁ జుట్టుప్రక్కలకు వ్యాపించునట్లు విరోధము తన జన్మస్థలమును వినాశపఱచి పిదప వెలికి నిర్గమించును; కాఁబట్టియే తెలివిగలవారు పగను వహింపరు.

ఇట్టివ్యథ మన విజయరామరాజుగారిని మిక్కిలిగా హింస పెట్టకపోవలేదు. వారు, రాజ్య పరిపాలనమునందును రాజనీతియందును బ్రఖ్యాతులనుటకు సందియము లేదు. శౌర్యధర్మమునందును బూర్వకాలపు భరతఖండపు రాజులకు వెనుదీసినవారుగారు. వైభవమునందు వీరు భూలోక దేవేంద్రులని యాకాలమున నున్నవారు చెప్పుకొను చుండిరనుటకు నిదర్శనములు గలవు. సర్కారులయం దెక్కువ ప్రాబల్యమును బ్రాభవమును గలవారు వీరే. వీరికెంత యైశ్వర్యముండి యేమి? శ్రీరంగారావుగారి యెడల వహించిన విరోధము సుఖంపనిచ్చినదిగాదు; కంటికి నిదురఁగలిగించినది గాదు; అన్నపానముల నిచ్చగొలిపినదియుఁగాదు. అనవరతము, అతని హృదయము నెంతో యలమట వెట్టుచు నెంతమాత్రము నెమ్మది గలిగింపలేదు. ఈపగ నిన్నటిది మొన్నటిదా? ఇది తాతముత్తాతల కాలమునుండి బొబ్బిలిప్రభువుల యెడల వహింపఁబడి తన వంతునకు వచ్చినది; వారును దనవలెనే రావు వంశజులతో విరోధించుచుండిరి. బొబ్బిలి రావువారు విక్రమ విక్రమార్కులగుట వారికి సాధ్యులు గాకుండిరి. వారందఱును

కాలగతి చెందినప్పటికిని వాండ్రచే విత్తఁబడిన విరోధబీజములు చక్కఁగా నంకురించి ప్రోదిగా వర్ధిల్లి యుండినవి. "అక్కటా! పగదీర్చికొనక నేను సైతము నాపెద్దలవలెనే కాలగతి నొందనలసి వచ్చునో"యని శ్రీ విజయరామరాజుగారు పలుమాఱుఁ దనలో ననుకొనుచుందురు. కాఁబట్టి, బొబ్బిలి సంస్థానాధీశ్వరుల నిర్మూలించుటయే తన జన్మోద్దేశముగా వారు భావించి యుండిరి.

నిర్దోషులగు బొబ్బిలి ప్రభువులపై విజయనగర ప్రభువునకేల విగ్రహము గలిగెనని చదువరులకు సందియము గలుగఁగలదు. దానికిఁ గారణము లేకపోలేదు; పెద్దలనాఁటి వైర మటుండఁగా శ్రీ రంగారావుగారు, తనకుఁ దుల్యులుగా నైజామువారికి సామంతులుగ నుండుటయును, దమ వైభవమును జీరికిఁ గొనకుండుటయునే. ఇటీవల నీచింత గాఢమయి యతని నెమ్మదిని బొత్తిగ హరించివైచెను. శాత్రవ నిర్మూలనము సేయకయే తన హృదయభారము దీరనట్లు దోఁచెను.

వీరుత్తమ క్షత్రియులు గనుక వీరులయెడల వైరము దలఁచుట న్యాయవిరోధముగాదు. వీరి యుత్తమగుణముల నెంత వర్ణించినను తనివి గలుగదు; విద్యావంతులుగనుండి విద్వాంసుల నాదరించిరి. అర్థైకదాసులయి స్వాతిశయపరులుగా మెలఁగలేదు. ఆకాలమునఁ గారుణ్యమునను నౌదార్యమునను బేరెన్నికగన్నవారే మన విజయనగరావనీశులు. ఇతని సుగుణగణములలోఁ బ్రఖ్యాతములయినవి గురుభక్తియు దైవభక్తియు ననునవి.

ఆ తరుణమున విజయనగరము పొలిమేరకు వెలుపల నొక నిస్సంగి వచ్చి దిగియుండెను. ఈ యోగి, బొందిని ప్రాణములు నిలుచుటకు దినమున కొకపూట పాలను పండ్లను మాత్రమే యారగించును. ఇతఁడు పెక్కు దేశములు దిరిగి వచ్చినవాఁడు. పుర బాహ్య ప్రదేశములయందలి వృక్షచ్ఛాయలే యితని విడిదియిండ్లు, ఆఁడువారిని జూచుట లేదనియు, వారి పాకమును భుజించుట లేదనియును నితఁడు సంకల్పించుకొని యుండెను; పురుషులతోఁడను మితసంభాషణమే చేయువాఁడు; తన యెడలఁ బ్రీతిగలిగి యెవరయిన నాహారము దెచ్చి పెట్టిన వలదనఁడు గాని, ధనమును గాన్కయిడినఁ గన్నెత్తియును జూడఁడు.

జను లెక్కువగాఁ దన్ను మూఁగి పీడించిరేని నడిరేయినే లేచి యెవరికిని దెలియక మఱియొక ప్రదేశమునకుఁ బోవుచుండుట యితని వాడుక. ఇతనికి దీర్ఘములయిన నఖములును నిడుపాటి జడలును గలవు. దేహమంతటికిని కౌపీన మొకటియే వస్త్రము.

ఇతఁడు మహా మహిమగల యోగియని జను లితని దర్శింపవత్తురు. వారు దమ కోఱికల నితనితోఁ జెప్పుకొని పరిహారము వేఁడుదురు. "ఈశ్వరానుగ్రహమున మీకు నెమ్మది గలుగును" అని యతఁడు వారి కూఱటపలుకును. ఆ మహానీయుని యీ వార్తవలన వారి యార్తి దొలఁగుటయును గలదు. ఆకాలమున విజయనగరము నందంతటను నమ్మహాత్మునిగూర్చిన ప్రశంసయే వ్యాపించియుండెను.

ఈ యోగీశ్వరుని దర్శించి మనశ్శాంతి పొందవలయునని మహారాజుగారికిఁ దలంపు గలిగెను. ఆనిస్సంగి ప్రపంచమునే తృణీకరించిన వాఁడు గనుక దన ప్రార్థన నంగీకరించి పురప్రవేశముచేయ నొల్లఁడని దెలిసి యతని దాపునకుఁ దానేఁగుట యుత్తమమని ప్రభువు భావించెను.

విజయరామరాజుగా రొకదినము మిత పరివారముతో నా యోగియున్న యెడకుఁ బోయెను. అతఁడితని వినయమునకు మెచ్చుకొని యాదరపూర్వకముగాఁ దన దాపునఁ గూర్చుండఁ బెట్టుకొనెను. రాజుగారితో వచ్చినవా రింగితము దెలిసి దూరమునకుఁ దొలఁగి నిలుచుండిరి.

ఆయోగి, మహారాజుగారి మోము విన్నఁబోయి యుండుటనుగాంచి, యతని కూఱటలుపలికి మనశ్శాంతిగలిగింపఁ దలఁచెను.

ప్రభువులు ప్రాణికోటులపై నిగ్రహానుగ్రహశక్తి గలిగి వెలయువారు. అట్టి పూరుషులు మానవులలో శ్రేష్ఠులు. కాఁబట్టి, వైరాగ్యప్రవరు లట్టివారిపైఁ గారుణ్యమునించి హితబోధ సేయుట యేకాలమునందును నే ప్రదేశమునందును గలదు. వారికి హితము గఱపినచోఁ బ్రజలకెంతో మేలుగలుగునని వారి యభిమతము. ఆ కారణమును బట్టియే మన యోగి విజయరామరాజుగారి యెడల ననుకంపనించి యతని ఖేదమునకుఁ గారణ మడిగెను.

మహారాజుగారు, బొబ్బిలిరావు వంశజులయెడఁ బైత్ర పైతామహముగ వచ్చుచున్న విరోధమును, దానివలనఁ దాను భరించు హృదయభారమును విన్నవించి యుపశాంతి వేఁడెను.

"ప్రభువా? యవధానముగలిగి వినవలయును. ప్రాణికోటులకు శ్రమలను గలిగించి నీచదశకుఁదెచ్చి వదలునది విరోధము. అది చిత్తశాంతి కెడమీయదు. సుఖసంపత్తి కెన్ని పరికరములుండి యేమి? వానిని దన యనుభవమునకుఁ దెప్పింపక దొలఁగించుచుండును. కాఁబట్టి శాత్రవమును హతము చేసిననే గాని చిత్తమున కుపశాంతి గలుగదు. ఇట్లనుటచేత, మీరు శత్రువులుగా భావించిన పూరుషులను హతముచేయుట వలన నూఱట గలుగదు. నేఁటి కొకఁడయిన తేఁపటికి మఱియొకఁడు శత్రువు గాఁగలఁడు. ఒక్కొక్కనిఁగూర్చి యిట్లే చంపుచుండుట యెంతటి దుస్థితి. లోకమున శత్రువుల లేకుండ చేయుటకు మన హృదయములోని శాత్రవమునే యణఁచి వేయవలయును. అటుపిమ్మట నిమ్మహా ప్రపంచమున శత్రువే యుండఁడు. శత్రుత్వమునకు జన్మప్రదేశము మన హృదయమే. మన హృదయమున నట్టి శత్రుత్వ మంకురింపని విధమున హతముసేయుచు వచ్చితిమేని లోకులందఱును మనకు మిత్రులు. కావునఁ బ్రభువా! దీర్ఘాలోచనచేసి శాత్రవ సంభవస్థానము గుర్తెఱిఁగి యద్దాని నిర్మూలింపుఁడు. పిదప, మీకీ ప్రపంచమెంత సుఖప్రదముగాఁ గన్పట్టునో స్వానుభవముచేఁ దెలిసికొనఁగలరు. ఏల పలుమాటలు? శాత్రవ ధ్వంసమున నానందమే గలుగును. 'ఆనందో బ్రహ్మ'యని శ్రుతు లుపపాదించునట్టి బ్రహ్మానందమే యది. బ్రహ్మానందపదవికి మించినవా యిహపరములలోని యితర పదవులు?" అని యోగి హితముపలికి మౌనము వహించెను.

ఆయోగియొక్క పలుకులు, అమృతవృష్టి ననుకరించి, తనహృదయ పరితాపమును బోకార్పఁగా, మహారాజు, అతనికి నమస్కారములు సమర్పించి యచ్చోటువాసెను. పిదప, ఆయోగి యచ్చటనున్నంత కాలము మహారాజుగారే వారిని బోషించుచుండిరి.

అంతటరాజు చిత్తమున కుపశాంతి గలిగి, బొబ్బిలి వారి విరోధముకంటెను బ్రకృష్టమయినది వారిస్నేహితము, అను తలంపు గలిగెను. వారిమైత్రివలనఁ దన మదికి సొంపొనకూడుటతోడఁ దన ప్రాభవమునకుఁ బ్రఖ్యాతియుఁ గలుగఁ గలదని దలఁచెను. ఆక్షణమునుండి వారి యందలి విద్వేషబుద్ధిని వదలి, సంధికైన యంశమును బర్యాలోచింపఁ దొడఁగెను.

విజయరామ మహారాజుగారు, మఱుచటిదినము సింహాసన మధిష్ఠింపఁగానే, శ్రీబొబ్బిలినగరాధిపతుల కొక యుత్తరము స్వహస్తాక్షరములతో విలిఖించిరి. అందు—

శ్రీమన్నెహంవీర, పెఱుమన్నెమదవిభాళ
గాయగోవాళబిరుదవిఖ్యాతులగు

శ్రీ శ్రీ రంగారావుగారి సన్నిధానమునకు—కళింగదేశాధిపతి విజ్ఞాపనములు—

చిరకాలమునుండి ప్రఖ్యాతివహించియున్న యీకళింగరాజ్యరమ, తమమైత్రి వలన నెంతశోభను వహించునో ధీమంతులకే విదితము.

ఇదివఱకు మీయెడల వహించి యుండిన నిగ్రహమును ద్రెంచివైచియే యీలేఖను వ్రాసితిని. ఇది వ్రాయుటకు ముఖ్యోద్దేశము తమ స్నేహితము నపేక్షించుటయే. దీనిని జూడఁగానే

మీాయెద నిదివఱకుఁ బొదలుచుండినశాత్రవము క్షీణింపఁ గల దని యెంతయు నమ్మెదను.

ఔను, మనపూర్వికులనుండి కొనసాగివచ్చుచుఁ దుదకు మన యిరువురిలోఁ జక్కఁగాఁ బ్రజ్వరిల్లిన యీ విరోధాగ్ని యింతటితోఁ జల్లాఱి, యచ్చోట మైత్రియంకురించి దినదినాభివృద్ధి నొందఁగలదు.

ఇట్లు—కళింగ పెద్దరాజు.

రాజుగారి లేఖను దన విశ్వాసమునకుఁ బాత్రులుగా నుండిన యిరువురు భటులవశమున నప్పగించి, వీనిని శ్రీబొబ్బిలి ప్రభువులచేతి కందించి, సంధికైన పలుకులుపలికి, కార్యము సాధించుకొని రండని పంచెను. ఆభటులు తత్క్షణమే విభుని యానతి ప్రకారము బొబ్బిలిని గూర్చి పయనమైరి.

12-వ ప్రకరణము.

"పరోపకారి పాటులకు వెనుదీయఁడు"

బొబ్బిలి రాజ్యమును, దానియందలి కోటనుగూర్చి మన మిదివఱకే యించుక దెలిసికొనియున్నాము; దాని యధీశులగు శ్రీరంగారావుగారి ప్రశంసయు నింతకే కలిగియున్నది. ఈ బొబ్బిలితోఁ జేరిన క్షేత్రములన్నియును మిగుల సారవంతము లయినవి. ఆ క్షేత్రస్వాములగు కాఁపులు, తమపొలములవంకఁ బాఱుచున్న కొండకాలువల నన్నిఁటిని, దమ క్షేత్రములకు మరల్చుకొను చుండిరి. కాఁబట్టి, దక్షిణదిశకుఁగా

నా కాలువలలోని జలము పాఱకుండెడిది; కావుననే విజయనగర రాజ్యమునకు సంబంధించిన పొలములన్నియును నీరు చాలక బీడుపడియుండెను. ఇదియును నీయిరువురు రాష్ట్రాధిపతుల కలఁతల కొక కారణ మగును.

బొబ్బిలి, జలవసతియును భూసారమును గలిగియున్నందున నీ మండలములోని పురబాహ్య ప్రదేశములన్నియును దోఁటలతోను దోఁపులతోను నిండి మహాహ్లాస జనకము లయి యొప్పుచుండును. ఈ చిన్నమండలమున కాగ్నేయము నందున్న రాజాముసైతము, ఈప్రభువు పరిపాలనము లోనిదే. ఇదియును బొబ్బిలివలెనే సారవంత మయినది.

బొబ్బిలి కోటయొక్క ప్రహారీగోడలు, మట్టివిగా నున్నప్పటికిని, దానిదార్ఢ్యము కంచుతోవార్పఁబోసిన కోటలకుఁ గూడ నుండదు. అందలి వీరభటుల శరీరబలము ననుకరించియే వానికుడ్యములు సుదృఢములయి యొసఁగుచుండును.

హితపురోహితామాత్యవర్గములు దమ్ముఁ బరివేష్టించి సేవించుచుండఁగా శ్రీ రంగారావుగారు, కొలువమరి యుండిరి. ప్రతాపమే మూర్తీకరించె ననునట్లు పొలుపారుచున్న మహారాజుగారి గద్దియకు దాఁపలనున్న యాసనముపై క్షాత్రతేజోనిధియగు వేంగళరావు గూర్చుండియుండిరి. వీరు రావుగారికిఁ దమ్ములు. పోరులయం దితఁడు దుర్ధర్ష పరాక్రముఁడు. ఆకాలమువా రితని నభినవాభిమన్యువని చెప్పుచుండిరి. వలపలఁ దాండ్రపాపరాజుగా రాసీనులయి యుండిరి. ఇతనిపేరు కళింగదేశమునం దననేల? ఆంధ్రదేశమునం దంతటనే సుప్రసిద్ధము; అసహాయశూరుఁడు; ఇతని నపరభీమసేనుఁ డనుట

యందు పొరపాటుండదు. ఇంకను శౌర్యసమగ్రులయిన మన్నెదొరలా సభయందుఁ బెక్కండ్రుండిరి.

కాఁపుల తగవులను విన్నవించుటకునై వకీళ్లు వెలయుచుండిరి. పెఱమండలముల రాజుల రాయబారము వహించిన బుద్ధిమంతులుండిరి. వేగులవాండ్రు పరరాజుల మర్మములను దెలిసి వచ్చి తఱిదెలిసి మహారాజుకు నివేదింపఁగోరి గూరుచుండియుండిరి. మహారాజానుగ్రహము సంపాదించునిమిత్తముగొందఱు విలువయగు కట్నములతో సమయము గనిపెట్టుకొనియుండిరి. పండితులు బహుమతులను బొందుటకై తమ పాండితిని వెలయింప సమయము నిరీక్షించుచుండిరి. వ్రాయసగాండ్రు ఫరమానాలు వ్రాసి రాజముద్రఁబొడిచి సంతకమును గోరి పార్శ్వములకొదిగి నిలుచుండిరి.

ఇవ్విధములయిన కార్యగౌరవములయందు జిత్తము చొప్పించి, శ్రీరంగారావుగారు సుధర్మ సింహపీఠిక నలంకరించు దేవవిభునివలెఁ దేజరిల్లుచుండిరి.

వీరి యాకారము ప్రశంసార్హమయినది. రంగారావుగారి శరీరమును ఉత్తమ పురుషలక్షణములకు లక్ష్యముగా గ్రహింపవచ్చును. శౌర్యధర్మమున వీరి కెంత ప్రఖ్యాతిగలదో యంత కారుణ్యమునను గలదు. ఔదార్యమున వీరిని దలఁచియే కర్ణాదులను స్మరింపవలెను. వేయిమాట లేల? ఆ కాలపు మండలాధిపతులలో వీరికిఁ దుల్యులు వీరనియే చెప్పవలయును. వీరన్ని యుత్కృష్టకార్యములకును జాలినవారు.

ఆ తరుణమునందు హర్కారాలు నలువురు, ఆ సభను బ్రవేశించిరి. తమయెడలఁ బ్రీతిచూపి, తాము దెచ్చిన శ్రీముఖ

మును జిత్తగింప వలయునని మహారాజుగారిని బరాకు గొలిపిరి. వీరి యుడుపులే వీరిని చిక్కాకోలపు భటులని చాటించుచుండెను.

శ్రీ రంగారావుగారు, ఆ శ్రీముఖమును జిత్తగించి, దానిని దెచ్చిన భటులు విశ్రమించుట కొకవిడిదిని జూపిరండని, తన భటుల కానతీయఁగా వారట్లు చేసిరి. ఆ శ్రీముఖమునందు, తామాలోచింపఁ దగినవియుఁ దమ కనుకూలించునవియునగు, సంగతులు గొన్ని యున్నందున, వా రప్పుడే బదులు చిత్తగించుటకు వీలులేకుండెను. పలుమాటలేల? ఆ కమ్మవలన, తమకును దమవంటి యితర మాండలికులకును వేరుపురువు, విజయరామరాజుగారను నంశము దెలియవచ్చెను.

ఆ లేఖను జూడఁగానే వేంగళరాయనికి విజయనగరాధిపతిని గుఱించి కలిగిన కోపమునకు మితిలేక పోయెను. తొల్లి ధర్మరాజుగారి యాజ్ఞానిగళ బద్ధుఁడయి సొంపు దక్కియుండిన యర్జునుని స్మరణకుఁ దెప్పించుచుండెను. కాఁబట్టి, అన్నగారి యాజ్ఞకుఁ జిక్కి, వలను దగిలిన సింగపుఁ గొదమవలె రోజుచుండెను.

అప్పు డపరాహ్ణమయి మూఁడుగంటల ప్రొద్దెక్కియుండినది. ఆ వేళకు, విజయరామమహారాజుగారి భటులా సభను బ్రవేశించిరి. తమ మహారాజుగా రొసఁగుఁడనిన కమ్మను వినయవిధేయులయి రావువారికి సమర్పించిరి.

హృదయము క్రోధ రసపూరితమయి మెసఁగుచుండినందున శ్రీ వేంగళరాయుని చిత్తమున కా కమ్మయందలి విషయము లన్నియుఁ గల్పితములుగాఁ గన్పట్టినవి. అట్లు గాన

రాఁగా, నా వీరుఁడు, కోపవేగమున ముందువెన్క లాలోచింపక త్రుళ్లిపడి యాసనమునుండి లేచెను. ఎంతటి విజ్ఞాన ప్రవరుఁడయ్యును కోపాతిరేకమున కర్తవ్యాంశములనుండి తొలఁగుట సహజమే. కావున, "మన రెండు సంస్థానాధిపతులకును సంధియా? ఇది యేకాలపుఁ జుట్టఱికము? భుజబలమున బొబ్బిలివారు దుస్సాధులగుట యెఱిఁగి, యీ యొడయఁ డిట్టి కుత్సితములకా యొడిఁగట్టె. ఈ సంగతులన్నియు మాకుఁ గ్రొత్తలుకావే!" అనుచునే యా భటద్వితయమును జక్కఁగా మర్దించి, ఆ శ్రీముఖమును జించివైచెను. పెల్లురేఁగిన క్రోధముచే, అన్నగారియెదుటఁ దానిట్లు మెలఁగరాదను నీతియు నతనికిఁ దోఁచలేదు. పాపము! రామకవిగారికిఁ దొల్లి విజయరామరాజుగారి వలన నెట్టి యపకృతి సంభవించెనో దానికిఁ దుల్యమయిన భంగపాటే బొబ్బిలిసభయందీ భటులకు సైతము గలిగెను. అతఁడు బ్రాహ్మణుఁడు గావునఁ జావునకుఁ దప్పెను. వీరు దూతలగుట మరణమునకుఁ దొలఁగిరి. ఇంతయే వీరికిఁ గలిగిన భేదము.

ఆభటు లేమిసేయుదురు! తాము దెచ్చిన శ్రీముఖమునకే యచట మన్నన గలుగ నప్పుడు తాము చెప్ప నున్న సంధివాక్యములకుఁ గలుగునా? నిండుసభయం దవమానింపఁ బడిరి. చక్కఁగా మోఁదులు దినిరి. తలపాగలు పోవుటయుఁ దెలియక యా సభనుండి వెలువడి, తప్పి బ్రదికినది తమ పూర్వులు చేసిన పుణ్యమని దలఁచి, తమ యవమానమును దమ ప్రభువునకు నివేదింప విజయనగరమునకుఁ బాఱిపోయిరి.

ఇట్లు విజయనగర మహారాజుగారి భటులకుఁ దన సభయందు, నీతికిఁ దొలఁగినకార్యము తటస్థించి పోవుటకు శ్రీరంగారావు గారి కాయాసము గలుగక పోలేదు. బొబ్బిలిమేలును గూర్చి పాటుపడిన తన తమ్మునియెడల నెట్లు దోషమారోపింపఁగలరు? అట్లుండియు నీతి కెవరైననేమి? మఱియును, ఆభటులు దండ్యులే యనుకొందము. వారిని నిండోలగమున నిట్లు అవమానింపరాదే! అంతటితోఁ బోవక, వారు, మహారాజభటులు; మహారాజుగారి కార్యభారము వహించి వచ్చినవారు; వారి యెడల మనవంటివారే నీతికిఁ దప్పి మెలఁగిన నపకీర్తి చిరకాలము నిలిచిపోవునే యని వగచిరి. వేంగళరాయని వాక్పారుష్యమున దండించి, యాదోషమునుండి విముక్తునిఁ గావింపనెంచి యేమో చెప్పుటకు నోరెత్తిరి. ఆతరుణమున నొకయతి యాసభను బ్రవేశించెను. అతఁడే మన రామబ్రహ్మము. అతని నడుము పట్టయందొక తరవారియును, జేతనింతకు మున్నే చెప్పి యుండిన యొంటి తంతి తంబూరయు నుండినవి. అతని ముఖ వర్చస్సు, సభ్యులనాకర్షింపఁ జేయఁగా నతని మోముపై నందఱును దమచూపుల నిగిడించుచుండిరి. శ్రీరావుగారు దమ సభకేతెంచిన యతిని బెల్లుగా నుపచరించి యుచితాసనమునఁ గూర్చుండఁబెట్టిరి.

బ్రహ్మముగారు, దమ తంబూరను శ్రుతిమీటుచు, నీ క్రింది సాహిత్యమును మనోజ్ఞతమ మయిన కంఠధ్వనితోఁ బాడఁదొడఁగిరి. అతని సంగీతమునకును సాహిత్య ప్రౌఢిమకును, నర్థగాంభీర్యమునకును, నభిప్రాయ విశేషమునకును నందఱివారు చిత్తరువు నందలి ప్రతిమల ననుకరించిరి.

ద్విపదలు.

శ్రీవేంకటేశ సం - సేవ్య సన్మతికి
　భావజాకృతికి సం - భావిత మతికి
భ్రాజితామలగుణ - రత్నాగపతికి
　రాజేంద్రవైభవ - రాజితోన్నతికి
హృదయసమ్మోద సం - భృత కావ్యతతికి
　సదమలకారుణ్య - శార్వరీపతికి
మదరిపు జీమూత - మారుతోద్ధతికి
　సదయ శీతలవచో - సారసంతతికి
పూజితవిబుధౌఘ - పుణ్యాసక్తనికి
　రాజితామలశౌర్య - రంగరాణ్మణికి
వరకేవ శైలేశు - పరమమా కరుణఁ

* * *

　బరగు శుభోదయ - ప్రాభవావాప్తి
హా, భోగనిస్తంద్ర! - హా, భూపచంద్ర!
　హా, భూరిగుణసాంద్ర! - హా, మానవేంద్ర!
వినిచెద నాకదల్ - విభుఁడ! తొల్దొల్త,
　వినిపింతుఁ గర్జముల్ - వితివిగా నవల
కవికులోత్తంసుఁడ - ఘనుఁడ మాన్యుండ
　భువి రామ కవియనఁ - బొదలినవాఁడ
తనకాంతు మీఱఁ బె - ద్దక్ష్మాతలేశు
　ననుపమకావ్య ర - సాస్వాదుఁడంచు,
ఘనభుజ సార సం - గతి విఱ్ఱవీఁగు
　మనుజేంద్రు విజయరా-మ క్ష్మాధినాథుఁ

సెవటిదురాశలఁ - జేరంగ నరిగి
　యనుసరించితి నేను - యత్యాశ్రమంబు
సన్నుతోదారుఁడై - క్ష్మాపతినన్ను
　మన్నించియొసఁగె నీ - మహితవేమంబు
గావునఁ దనరారె - ఖడ్గదండంబు
　భూవరా! యిదిగాక - భూసురోత్తముల
రాజవంశ్యుండనై - రాజిల్లుచుంట
　నోజమావసతులు - యుద్ధరంగములు
క్ష్మాభర్త! యట్లౌట - శాత్రవాసువులు
　మాహైత్యమైయింక - మలయఁగా వలదె?
శంకింపకెంతయు - క్ష్మాపాలచంద్ర!
　యోంకార జపమీఁగి - హుంకారమూన
భావితంబదిగాదు - ప్రణవమంత్రంబు
　భావికి జానొందు - ప్రళయమంత్రంబు
తులలేని వైదగ్ధి - తోతెంచుచుంట
　వెలయు మావాండ్రకు - మంత్రిపదంబు
అదిగాన, మామంత్ర - మవధారుదేవ!
　పొదలు మీకెంతయు - భూరిసౌఖ్యంబు

* * * * *

మత్తమాతంగంబు - మహితగర్వమునఁ
　జిత్తగించిన దహో - సింగంబుఁ బొదువఁ
దనశక్తిఁ దలపోసి - దనవారిరోసి
　దనమదిఁగోర శాత్రవమైత్రి యహాహా!

* * * * *

కాలమదెట్టిదో - కనరాదు గాని
పోలనికార్యముల్ - పొలుపారఁ గలవు,
సింగము క్కటకటా - చెన్నఱిగుహను
భంగంబునొందునో - పఱపునో రిపుల?
సింగమొక్కండని - చింతింప వలదు.
చెంగలించినఁజాలు - సెదర వేకరులు?
వీరగర్జలభువి - వేఁద్రెళ్ళఁగొన్ని
ఘోరాకృతిం జూచి - కూలుగాఁగొన్ని
కటుపరాక్రమశక్తి - గాసిల్లఁగొన్ని
పటుతీక్ష్ణ నఖధార - బడలును గొన్ని
యుద్ధతికాఁగక - యురుకునుగొన్ని
యుద్ధరంగమునందు - యోధయూథంబు
అహితుని శౌర్యాగ్ని - కాఁగఁగా లేక
రహివీడి పాఱుఁ బరాఙ్ముఖంబౌచు
నట్టులుండియుఁ దన - యాధిపత్యంబు
నిట్టలంబుగనిల్పి - నెగడఁగా వలయుఁ
బొరపాటు దనవంకఁ - బొరయకుండుటకుఁ
బరమహా మంత్రంబుఁ - బాటింపవలయుఁ
బరమర్మముల నేర్చి - పరుల యూపెఱిఁగి
పరఁగిన నేకదా! - వరియించు జయము
జగములోనను వన - స్వామి దానగుటఁ
దగదు ప్రమాదంబు - దగదు మాంద్యంబు
దనగుహ సరిచేసి - దనవారిఁగూర్చి
దనమేలికాపనుల్ - దనరింపవలదె?

బాగొప్పఁ బుష్పాళిఁ - బరిమళంబనఁగ
జాగరూకతయంద - జానొందు జయము.
పగతుని పగవారి - ప్రణయ సౌఖ్యంపుఁ
దగులముల్గలిగింపఁ - దనరుదు నేను
పోయివచ్చెదనింక - భూమీశతిలక!
పోయివచ్చెదమీకు - బొలుపొందు జయము.

అని, రామబ్రహ్మము దన యభిప్రాయము స్పష్టపఱచి, తత్క్షణమే యాచోటువదలి, మునుపటివలెనే తన యశ్వము నెక్కి యెచ్చటికో యేఁగెను. ఇతని పలుకులవలన నతని కెక్కువ దెలియకపోయినను, సభ్యవర్తనుఁ డయిన బ్రహ్మమునకు విజయరామరాజుగారి వలన బన్నము గలిగినదనియు, బొబ్బిలినిగూర్చి వారికిఁగల దురాలోచన లన్నియు నతనికిఁ జక్కఁగాఁ దెలియు ననియును దనకు పగదీఱునట్లును, మనకు మేలు గలుగునట్లును బ్రయత్నించి నాఁడనియును నూహింపఁ గలిగిరి. మన రామబ్రహ్మముగారి కోర్కియును వారి కింతమాత్రము దెలిసినఁ జాలుననుటయే.

బ్రహ్మముగారి హితబోధ, వేంగళరాయని యభిమతమున కుపశ్రుతిగాఁగా, విజయరామరాజుగా రింతకుమున్ను పంపియున్న లేఖ యతని దుస్తంత్రముల నుగ్గడించునదియే యను నూహకుఁ దోడ్పడెను. శ్రీరంగారావు గారికి మాత్రమిం దేదో కిటుకున్నదను సందియము కుదిరియుండెను.

సభ్యులకందఱి కట్టి తలంపు గలుగుట వింతగాదు; అత్యధికముగా విరోధాగ్ని ప్రజ్వరిల్లి యున్నసమయమున మన నిట్లుండి సంధికిఁదగిన పలుకులు పలుకుట, తొంటిపగ

నధిక పఱచుటకేగాని చల్లార్చుటకుఁగాదు. తప్తతైలమున శీతలాంబువులు పడుట నూనెఁ జల్లార్చుటకా? బగ్గునమంటను పెంచుటకే కదా!

ఆ దినమా బొబ్బిలి సభయం దొకటి వెంబడి నొకటిగాఁ గొనసాగిన సంభవములు మిగుల నాశ్చర్యప్రదములే; మొదట జాఫరల్లీ హర్కారా లేతెంచి, కళింగ పెద్దరాజుగారి విరోధమును, దానినుండి తొలఁగుట కుపాయమును దెల్పిరి. వెంటనే, విజయనగరమునుండి భటులేతెంచి పెద్దరాజుగారి సంధికైన శ్రీముఖమును సమర్పించిరి. తదనంతరము, రామబ్రహ్మము వచ్చి, కళింగాధిపతియొక్క దురాలోచనలను దుష్ప్రయత్నములను దెలిపి యేఁగెను. కాఁబట్టి, శ్రీరంగారావు మదికి విశేషాంశము లేవియు స్ఫురింపకపోయినను, ఇవన్నియును పెద్దరాజుగారిని సంబంధించినట్టివే యనియును, వారు దమ వినాశమున కేమో కుట్రలు పన్నుచున్నా రనియును దలఁచుట కొక యతిశయ మగునా?

పిదప, రంగారావుగా రొక క్షణమయినను వ్యర్థపుచ్చక, శత్రువులనుండి తమకోటను రక్షించుకొనుట కయిన ప్రయత్నములయందుఁ జిత్తము చొనిపిరి. విరోధులు ముట్టడించిరేని కోటలోనివారికి వలయునంత వస్తుసామగ్రిని కూడఁ బెట్టుటకుఁ దగినవారినిఁ బంచిరి. కోట ప్రహరిగోడలను బురుజులను బలపఱచి వానిపై ఫిరంగుల నిలిపిరి. తమకు మిత్రులగు ప్రభువులకు సమయము తటస్థించువేళ సాయపడుటకై శ్రీముఖములు వ్రాయించి కాలరులవశమున నొసఁగి పంపిరి. రాజాముకోటను సైతము బలపఱచి, శాత్రవులకు దుష్ప్రవేశ్యముగా రక్షింపవల

యునని యానతిచ్చి, కొంతసైన్యముతోఁ దాండ్రపాప రాజుగారిని బంపియామెను. తనమైత్రిని సాహాయ్యమును గోరి, సంధికై దూతలను బంపియున్న జాఫరల్లీకి, అతఁడు కోరినట్లే యొడంబడికను వ్రాసి సంతకముచేసి, హర్కారాలచేతి కొసఁగి పంపివేసిరి.

ఇవ్విధముగా శ్రీరంగారావుగారు, తనవంకఁ బ్రమాదము గలుగని విధముగా, శత్రువులెంత గాఢముగాఁ దన్ను ముట్టడించి నప్పటికిని వారి నెదిర్చుటకైన ప్రయత్నముల నన్నిఁటిని జేసి మిగుల జాగ్రత్తతో నుండిరి.

అక్కటా! మన రంగారావుగారికి, తన్నెదిరింప నున్న శత్రువు లిట్టివారనియు, విజయరామరాజుగారు వారికిఁ బ్రోత్సాహకులనియుఁ దెలిసి యుండినయెడల, వీరిప్రయత్నము లింకనెంతో యుత్కృష్టస్థితిని జెందియుండునే; అట్టి విషయములను గూర్చి వీరు సందేహించుటకుఁ గూడ నవకాశము లేకపోయెను. చేనిపంటను గంచె మ్రింగునని యెవరు నమ్మఁగలరు? అయ్యో, నైజామునకు వీరియెడల మక్కువయెక్కువ! వీరికి వారియెడల విశ్వాస మధికము. కానికాలమునం దయిన వారే కాలసర్ప సదృశులు.

13-వ ప్రకరణము.

“ లొంగిన వారి యెదుట బలహీనుఁడును గలి యుగార్జునుఁడే ”

చాళుక్యరాజుల కాలమునందును గాకతీయ ప్రభువుల కాలమునందును మిగులఁ బ్రఖ్యాతినొందిన నగరము రాజ

మహేంద్రవరము. ఇది చోళమండలపుఁ గోస్తాలోని నగరములలో మిక్కిలి ప్రఖ్యాతమయినది. పలుమాటలేల? ఇప్పటికిని దాని రామణియ్యకమున కెంతమాత్రము లోచ్చు లేదు. గోదావరీనది దానికి జల వసతిని గలిగించుచుండును. అందలి పేటలును దోఁటలును బాటలును జనులకు హృదయంగమములయి వెలయుచుండును. భూమియు మిగుల సారవంతమయినది; అందలి కృషికులును దదితరులును విద్యయందును సంపద యందును బ్రఖ్యాతులు కావుననే దరిద్రదేవత యానగరమును వదలి యెచటికో ప్రవాసమేఁగి యుండెను.

మఱియును నైజామువారి పరిపాలనమున నున్న సర్కారులయం దిది మధ్యప్రదేశము. అచ్చట నిలిచినయెడలఁ జుట్టుప్రక్కలనున్న సామంతులును మన్నెదొరలును దమ దర్శనమునకు వచ్చుటకు వీలు గలుగుననియును, ఎందఱు విచ్చేసినప్పటికిని వచ్చిన వారికిని వారి పరివారము వారికిని స్థలమునకును సామగ్రులకును గొదవ గలుగదనియునుదలఁచి, బూసీ గారు సైన్యముతో నచట విడిసిరి.

రాజమహేంద్ర వరమునకు వెలుపలనున్న తోఁటల యందును తోఁపులయందును బయళ్లయందును గుడారములు గొట్టిరి. వీరితోడ వచ్చిన సైన్యము దాదాఁపుగా నైదువేలకుండెను. ఇంతేకాక రెండువేలకు సిబ్బందీ జనులు సైతము గలరు. పది యేనుఁగులును నూఱు లొట్టియలును రెండువేల గుఱ్ఱములును రెండువందల కంచరపు గాడిదలును నుండినవి.

ఇంత చిన్నదండుతో వారెట్లుత్తర సర్కారులమీఁదికి నిశ్చయముగా రాఁ గలిగిరను సందియము చదువరులకుఁ

బొడకట్టును; దానికి సమ్మతి చెప్పుట సర్వసులభము. హిందువులు, ప్రభు విశ్వాసమును రాజభక్తియుఁ గలవారు; వారెంత బలాఢ్యులుగా నుండినను దమ ప్రభువున కనుకూలముగాఁ దమ బలము వినియోగింతురు గాని, ప్రాణముల మీఁదికి వచ్చినప్పటికిని విరోధింపరు. హిందువులతోడి పరిచయ మెక్కువగాఁ గలిగి యుండిన బుస్సీగారికీ కిటుకు చక్కఁగాఁ దెలియును.

హిందువులు న్యాయైక నిరతులును, భిన్నాభి ప్రాయ రతులును గావున వారిలో నైకమత్యము సున్న. ఈ గుట్టు బుస్సీగారికిఁ దెలిసి యుండినట్లుగా నితరులకుఁ దెలియదు. బుస్సీగా రుపాయశాలి గావుననే యిట్టి యల్పసైన్యము దన ప్రాభవముకొఱకు వెంటఁబెట్టుకొని జమాబంది నెపమున వచ్చిరి. వీరు బయలు వెడలినది దండయాత్రగాదు గావున యుద్ధమునకు వలయు పరికరములును దక్కువగానే యుండినవి.

స్కంధావారమునందలి గుడారములకు నడుమ బుస్సీగారి పటకుటీరము వెలయుచుండినది. దానికిఁ జుట్టుప్రక్కల నమర్పఁబడి యుండిన పటకుటీరములలో హైదరుజంగు, హాసనల్లీ ఖాను, సులేమాన్ ఉంరా, అలీబేగు లోనగు వీరాగ్రగణ్యులు వెలయు చుండిరి. వీరు నైజామువారితోఁ జేరిన దళముల కధిపతులు. ఉంరా గారి కప్పుడు వేయిగుఱ్ఱముల దండుండెను.

నైజామువారి యుత్తర సర్కారులపై సర్వాధికారము వహించియుండిన బుస్సీగారు, మిగులఁ దంత్రము దెలిసినవారు గావున వ్రాయసగాండ్రచే ఫరమానాలు వ్రాయించి జమీనుదారుల కంపుచుఁ దా నున్నచోటనే వారిని రావించి, వారికి

దర్శన మొసఁగుచు, వారు సమర్పించునట్టి నగదులను నజరులను నంగీకరించుచు బొక్కసమును బూరించుకొనుచుండిరి.

ఇట్టి తరుణమున విజయ రామరాజుగారి పేరికిని, ఫరమానాలు దీసికొనిపోయిన బేగిరావులు మహారాజుగారిని దర్శించి వారిచేతుల కందించిరి. విజయ రామరాజుగారు వారిని కుశల ప్రశ్నలడిగి, వారికొక విడిదిచూపి బత్తెములు గొలిపించెను.

14-వ ప్రకరణము.

అందినఁదల, అందకపోయిన తోఁక.

విజయరామరాజుగారు, బూసిగారి ఫరమానాను బొందిన వెంటనే, కొలువు చాలించి యేకాంతభవనమున కేఁగి కార్యాలోచనలఁ జిత్తము చొనిపి యిట్లు పర్యాలోచింపఁ దొడఁగిరి.

నైజాముగారు, బూసిగారికి సర్కారులపై సర్వాధికార మొసఁగి పంపుటకు రెండు కారణములే గన్పట్టుచున్నవి. ఇవి మిగుల ముఖ్యములయినవి. నాజరుజంగును స్వవశమునకుఁ దెచ్చుకొనుట యొకటి. జమాబంది నెపమున బొక్కసము నింపుకొనుట మఱియొకటి సూక్ష్మదృష్టిని బరిశీలించినచో నీ రెండంశములును నొకటిగానే యేకీభవించుచున్నవి. నాజరుజంగు పక్షమూనిన ప్రభువులే నాలుగైదు సంవత్సరములుగా కప్పము గట్టుటలేదు. అట్టివారిలో నేనొక్కరుఁడను గానా? కాఁబట్టి, నాజరుజంగుగారి పక్షమూనిన వారిని హతము చేయవలయుననుటయే వచ్చినవారి యత్నమగును. వారి రాజ్య

ములను దోఁచుకొనవలయు ననుటయే వారి ముఖ్యోద్దేశము. ఇట్టి తరుణమున నాకు దివాణమువారి స్నేహమెట్లు గలుగును? నాఁడు, బొబ్బిలిలో నా హర్కారాలు పడినపాటులు, నేను అనుభవించినట్లే పరితాపమును బెంచుచున్నవి. ఈ చిన్న సంస్థానాధిపతిని దండింప శక్యముగాని నాకా ఫరాసులచేని మార్కొనునంతటి పటిమ యొనగూడఁగలదు? ఏమి చేయుదును? ఇన్ని సంవత్సరములుగా దివాణపుఁ బైకము గట్టక పోవుటచే నాపైఁ దప్పునుమోపి దండింపకుందురా?

'దివాణమున కిదివఱకేల పైకము చెల్లింపరైతిరి' అని వారు నన్నడిగినచో నేమి బదులుచెప్పుట? అట్లేదో చెప్పుదమనుకొనినను, ఇతఁడు జాఫరల్లీ కంతరంగమిత్రుఁ డన్నమాట వారికిఁ దెలియక పోవునా?

పలుమాటలేల? పలుతలంపులేల? దివాణమువారి నెదురింపవలసి యుండెనా, తప్పక నేను జాఫరల్లీ కక్షినే చేరవలసి యున్నది. ఔను, జాఫరల్లీతోఁ జేరుటచేత దివాణమువారి నెదురింపవచ్చును. బొబ్బిలివారిని మార్కొనుటకుఁ గాకపోవునే.

ఈకారణముచేఁ బ్రకృతము మనకు దివాణమువారి యాశ్రయ మత్యంతావశ్యక మగుచున్నది. ఈ విషయమునందును ముఖ్యాంశములు రెండుగలవు ; అందు, దివాణమువారిమైత్రిని సంపాదించుకొనుట మొదటిది. బొబ్బిలి వారియందు క్రోధమును బుట్టించి దండయాత్ర వెడలనిచ్చుట రెండవది. ఇవిరెండును మిగుల మేధాసంపత్తిని వ్యయపఱుపకయే గొనసాగునవి గావు.

ఇట్టి కఠినాంశములను బుద్ధిశాలుల తోడుపాటుతోఁ బర్యాలోచింప వలయును. అని తీర్మానించుకొని, గుండాల అప్పన్నగారిని బిలుచుకొని వచ్చున్నట్లొక భటున కాన తీయఁగా నతఁ డతనిని గొన్ని నిముసములలోనే వెంటఁబెట్టుకొని వచ్చి మహారాజుగారి సమక్షమున వదలెను.

మన్నెదొరలు, సపరివారులుగ లేఖను జూడఁగానే బయలువెడలి విజయనగరమునకు వచ్చి చేరునట్లు జాబులు వ్రాసి పంపుఁడనఁగా, నతఁ డట్లువ్రాసి బేగిరావులచేతి కొసఁగి హుటాహుటిని బయనముచేసి, దొరల కాజాబులొసఁగి వచ్చునట్లానతిచ్చెను.

ఐదురోజులలోనే బిరుదు దొరలందఱును దమ తమ సైన్యములతో విజయనగరమునకు వచ్చిచేరిరి. అప్పుడు, విజయనగరమునం దెచ్చటఁజూచినను వీరభటులు నిండియుండిరి. ఆ దినము మహారాజుగారిసభ వీరనాయకులతో మెండుకొని యుండెను. విజయరామ మహారాజుగారు మహావైభవముతో గద్దియపై వెలయుచుండిరి. పర్లాకిమిడి - నారాయణదేవుగారు, యర్రగడ్డ - రాజుగారు, అట్రగడ్డ - రాజుగారు, మాడుపులింగ రాజుగారు, కొప్పాడ - రామయ్యగారు, దూసి - వెంకప్పారావుగారు, బొగ్గులూరు - జగ్గిరెడ్డిగారు, హసన్ బేగుగారు, భైరవరాజుగారు, ప్రత్తిపాటి - పాపరాజుగారు, చిత్తాడ - సూరయ్యగారు, కడపల - బుచ్చయ్యగారు, ఆనకపల్లి - పాపారావుగారు, రామమూర్తి - నీలాద్రిగారు, అను నీ వీర పురుషులు సభ నలంకరించినవారిలో మిగులఁ బ్రఖ్యాతులు.

మహారాజుగారు, దమ సభ నలంకరించియున్న శౌర్యధనులను జూచి——

"ప్రభువులారా! మీ కీ సంస్థానము మాతృగృహమును బోలినది. మీ యందఱియొక్క యభిమాన ముండఁబట్టియే యీ రాజ్యమునకు విజయనగర మను పేరుగలిగెను. ఇది యిట్లుండఁగా, నీ రాజ్యమును ఆశ్రయించియున్న నాకు సైతము కళింగ పెద్దరాజు అను ప్రఖ్యాతి యేర్పడియున్నది. ఇన్నిటికిని మీ యిందఱి బుద్ధిబలమును భుజబలమునే కారణములు. అట్లుండఁ బట్టి, ఎట్టి యల్పకార్యముగాని మీకుఁ దెలుపకయే చేయుటకు నాకు మనస్సొప్పదు. మీకుఁ దెలియని సంగతు లేవియైనను గలవా? ఇదివఱకు మనము నిశ్చయించుకొని యుండినట్లు నాకు కార్యము లన్నియును విపరీతములుగాఁ గొనసాగు నట్లున్నవి. ఔను, నిమిత్తములుగూడ నట్లే కన్పట్టుచున్నవి."

"ఇప్పుడు, సర్కారులమీఁది సర్వాధికారమును వహించి, బుస్సీదొరగారు, రాజమహేంద్రవరమున విడిసియున్న సంగతి మీ కందఱకును దెలిసియున్నదే కదా! వారితోడ దివాణమును సంబంధించిన యుద్యోగులును, దివాణపు సైన్యమువారును నున్నారు. వారు మా కైదుదినములక్రింద ఫరమానా పంపిరి. మనము, దివాణమునకు నచ్చుకొన వలసి యున్న పైకముతోఁ బయనమయి పోయి వారిని దర్శించుకొన వలెననియును, అట్లుచేయక మానితిమా, మన పరగణాలు దోఁపిడికి గుఱియగు ననియును వ్రాయఁబడి యున్నవి. దివాణపు సొమ్మున కిప్పు డాటంకము పలుకముగాని, ఇందు

మనము దీర్ఘముగా నాలోచింప వలసిన యంశములు రెండు గలవు.

"నాజరుజంగు కక్షివారే దివాణమునకుఁ బైకము చెల్లింపనివారు. ఆ కక్షిలో మనము చేరని వారమని యెట్లు వారిని మెప్పించుట?

అన—పాపా-ఖడ్గముచేత మెప్పించుట.

మహా—ఇది కడపటి యుపాయము. దీని ననుష్ఠించితిమేని దివాణముమీఁదనే కత్తికట్టినామని యపవాదము చుట్టుప్రక్కల వ్యాపించిపోవును.

నీలా—పిండారీలుపడి రాజ్యము దోఁచుకొనిరి. కాఁబట్టి, కిస్తీపైకమునకు కస్తీ కలిగిన దనుట యసత్యముగాదు గదా!

యర్ర—మహాప్రభు! వారికిఁ బైకముతోడిదే పని; ఆ పైకము చెల్లించుటకు సిద్ధపడి యున్నాము. ఏల భీతి?

మహా—అయ్యో, వారు జమాబంది పని నుద్దేశించి వచ్చినవారా? వారి యుద్దేశము వేఱు; అట్లే యున్న యెడల మనమేల యింత ప్రయత్నింపవలయును? వారి కింత సైన్యములుకూడ కావలసియుండదే. వారి ముఖ్యోద్దేశ మయినది నాజరు జంగువారిని వారి కక్షిని జేరిన వారిని హతమొనర్చుటయే.

కిమి—నారా - మనము చిక్కాకోలము వారితోఁ జేర మనుటవలన దోషమేమి?

మహా—అట్లు చెప్పుటకు సిద్ధముగానున్నాము. ప్రకృతము మనము వారితోఁ జేరిన వారమును గాము. మనము

పరగణాలపైఁ గిస్తీ చెల్లింపమికి నీలాద్రిరాజుగారు చెప్పిన యొక కారణము చాలదు.

యర్ర—మనము చెప్పునట్టి కారణమును వారంగీకరించియే తీరవలయును. అంగీకరింపనిచో మన ఖడ్గములకుఁ ద్రుప్పు పట్టలేదే!

మహా—హా! ఇదెట్టిమాట! ఫరాసులు సామాన్యులుగారు: వారు యుద్ధములయం దారితేరినవారు; భూతములవలెనే పోరాడుదురు; వారిని మార్కొని యుద్ధమాడుటకు మనము చాలియుండము. పోరితిమి, దానివలన నెందఱు ప్రాణముల వదలవలసి వచ్చును. అయ్యో, మనుష్యునకుఁ దన ప్రాణముకంటె నభిమానింపఁ దగిన దెదిగలదు? అట్టి నా మిత్రుల యమూల్యప్రాణముల నాకొఱకు ధారవోయుఁడనుట కెట్లు సమ్మతింతును? కావునఁ గార్యములన్నియును సామమననే కొనసాగనిండు.

జగ్గిరెడ్డిగారు—పిండారీల దోఁపిడితో మానెనా? రాజ్యమున వ్యవసాయము తిన్నఁగా సాగుటలేదు. బొబ్బిలివారు, క్రిందివైపున నున్న మన నేలలకు నీరు పాఱనీయక కాలువల నన్నిఁటిని మరలించుకొనిరి. వారి వ్యథ యున్నంతకాలము మన రాజ్య మిట్టి కష్టముల ననుభవింపవలసి యున్నది యని చెప్పుకొనుటకేమి?

తమ పొలముల మీఁదికి వచ్చిన వెల్లువను బగవాని క్షేత్రములకు మరల్చి వైచినట్లుగా, మహారాజుగారి మదికి రెడ్డిగారి యాలోచన మెంతో యూఱట గలిగించెను. ఎట్లయినను దన దారిద్ర్యమునకుఁ గారణ భూతులు బొబ్బిలి వారను

టను స్థాపింపవలయు ననుటను ముఖ్యాంశముగా వారు గ్రహించిరి.

తత్క్షణమే బుస్సిగారిని దర్శింపఁ నేగుట కొఱక శుభ ముహూర్తము నిర్ణయింపఁబడెను. మహారాజుగారు, తాను వచ్చునంత వఱకును, ఆనందరావుగారుఁ దనకు బదులుగా రాజ్యపరిపాలనము చేయుచుండునట్లు నియమించిరి. చెవులు చిందఱవోవునట్లుగా ప్రస్థానభేరీల మ్రోఁత పెల్లెసఁగెను.

విజయరామరాజుగారు, నిర్ణీతసమయమున, బ్రాహ్మణాశీర్వచనములను బొంది పురము నిర్గమించిరి. అచ్చట సిద్ధపఱచియున్న శ్వేతాశ్వము నారోహింపఁగానే వీరి క్షాత్ర తేజము మహత్తరమయి చూపఱకండ్లకు విందొనగూర్చెను. వీరు వహించిన వీరవేషమునకును, ధరించియున్న ధనువునకును ననువుగా వీరిని గలియుగార్జునులని నుడువుట పొసఁగమి కాఁజాలదు. వీరు సేనానివేశము ప్రవేశించి తమ యుత్తమాశ్వమారోహింపఁగానే సైన్యమునందు జయజయ నినాదములు పెల్లురేఁగినవి. శంఖములయొక్కయు భేరులయొక్కయు, కాహళములయొక్కయుఁ బేరులివ్వులు, ఎట్టివానికిని వీరావేశము గలిగింప సమర్థములై యెసఁగుచుండినవి. నేల యీనెనోయను నట్లుతనిచుట్టును జతురంగ సైన్యములు బలిసియుండెను. వీరభటులు గజముల మీఁదను నశ్వముల మీఁదను లొట్టియల మీఁదను నాసీనులయి యుండిరి. మున్ముందుగా శతఘ్ని శకటములతోడ వీరభటులయిన కాలరులుండిరి. మహారాజుగారికిఁ గుడిప్రక్కగ నిజసైన్యములతో మాడువు లింగరాజుగారు, శౌర్యోద్దీప్తులయి ప్రకాశించుచుండిరి. ఎడమవైపున గజముల

దళముతో మహోగ్రమూర్తియగు వత్సవాయి ప్రభువు దీపించుచుండెను. ముందుప్రక్క శూరధనులును మందపాటి కులరత్నములును నగు శ్రీరఘునాథ రాజుగారును, బలభద్ర రాజుగారును వెలయుచుండిరి. పిఱుఁదిదెసను గాకర్లపూడి-జగన్నాథ రాజుగారు, సత్యవరపు - రామభద్రరాజుగారు, తమ దండుతోఁ దేజరిల్లుచుండిరి. వీరికిఁ దాఁపుననే చింతలపాటి - నీలాద్రిరాజుగారు స్వీయసైన్యముతోఁ జెలఁగుచుండిరి. తక్కిన బిరుదుదొరలును బౌజుదొరలును దమ తమ దండులతోడ మహారాజుగారిని బరివేష్టించుకొని యుండిరి. వీరి వెంటనే రస్తు సామగ్రియును, యుద్ధపరికరములును, మందులును, దివాణమునకు సంబంధించిన పైకములును బహుమతులును నుండినవి. ఇంతటి వైభవముతో శ్రీపూసపాటి విజయరామ మహారాజుగారు, మొదట నుత్తరాభిముఖులయి కొన్ని యడుగులు పెట్టి, పిదప పశ్చిమదిశఁగూర్చి రాజమహేంద్రవరము దారిఁ బట్టిరి. ఇట్లు కదలిన భటులును వారి సిబ్బందులును సంఖ్య యందుఁ బదునైదు వేలకుఁ దగ్గరు.

15-వ ప్రకరణము

ఆరడిపనులకు నూఱట గలుగదు

కోపము దావాగ్నిసదృశమై తన సంభవస్థానమునే నిర్దగ్ధపఱచునని యిదివఱకే చెప్పియున్నాము. అది యుక్తాయుక్త వివేచనములకు వేరువిత్తు; తారతమ్య పరిజ్ఞానమునకుఁ బరమద్వేషి; దాని నాశ్రయించిన యెట్టి లోకోత్తరుఁడును, నీచ

తమములును ఘోరతమములును నైనకృత్యముల కొడిగట్టి యాచంద్రార్కముగ నపనింద పాలగును. అట్టి వానికెట్లు ఇహపరములయందు సౌఖ్యము గలుగఁగలదు? సాధువు లీగుట్టు దెలిసియే కోపమునకుఁ జిత్తమునం దెంతమాత్ర మెడ మీయరు. యోగ్యుని నయోగ్యునిగాను, పండితుని పామరుని గాను, విశ్వాసిని ద్రోహిగాను క్షణకాలమునందే మార్చివైచు నంతటి యపూర్వశక్తి యీకోపమున కలవడినట్లుగా మఱి దేనికిని జొప్పడదు.

అక్కటా, యీకోపమేకదా రామబ్రహ్మముగారిని ఘోర ప్రయత్నములకు లోఁగఁజేసినదని చెప్పియున్నాము. అదియే యతని నసాధ్యకార్య కరణీయములకు లోఁగఁజేసినది. తన స్వరూపజ్ఞానమే తనకు గోచరింపనీక, బీదబ్రాహ్మణుఁడైన తన్ను మహాప్రభువుతో నెదురింపఁ జేసినదియు నాక్రోధమే కదా! కోపగుణమున కెదుట నతని పాండిత్యమును పరిజ్ఞానమును నెంతవఱకుఁ బనికివచ్చెను? అయ్యో, ఎట్టి వానికిని గోపము కారాదు; అట్టికోపికి దాపున నుండుటయును దగదు.

తన్నవమానించుట చేత రామబ్రహ్మము కుపితుఁడయి నది సహజమే; అతఁడట్లు కోపించి మహాప్రభువునకుఁ జేసిన ప్రతిక్రృతి యేమి? దానికొఱకేమి ప్రయత్నించెను? ఈయంశము దెలిసికొనవలయు నని చదువరుల కెంతో యాత్రము గలుగుట సహజము; అది మన రామబ్రహ్మముగారికే యిది వఱకుఁ దెలియకుండు నప్పుడు మన కెట్లు విదితమగును?

ఔను, అతని చిత్తమునకుఁ గర్తవ్యాంశములు గోచరింపమికిఁ గారణములు గలవు; కోపాగ్ని యించుక యుపశమిల్లి, చిత్తమున నుత్తలపాటు దీఱకయే కర్తవ్యాంశములు స్ఫురింపవు. ఇంతటితోఁ బోవక యొకటివెంట నొకటిగాఁ గొన్ని సంభవములు తటస్థించుటచేత నతనిచిత్తమునం దట్టి యాలోచనల కెడము గలుగలేదు; అవమానవశమున రిత్తవోయిన చేతముతో నతఁడు సత్రమును జేరెను. అచ్చట నాటిరేయి యతఁడు షేకుగారివథను గన్నులారఁ జూచెను; ఆవికృత దర్శనము వలన నారేయియంతయును జిత్తక్షోభగలిగి వేఁగెను; మఱుచటిదినము భటులయొక్క స్నేహము లభింపఁగా వారి వలనఁ గొన్ని సంగతులను దెలిసికొనెను.

తనకుఁ జక్కఁగాఁ దెలిసియుండియును, నిర్దోషులగు ప్రభువులు నిర్నిమిత్తముగ ధ్వంసమగుటకు మనస్సొప్పలేదు. కావుననే యాభటులతోఁ జిక్కాకోలమున కేఁగి, విజయరామ రాజుగారికి జాఫరల్లీగారియం దేర్పడిన విగ్రహమును దెలిపి, శ్రీరంగారావుగారి మైత్రికిఁ బురికొల్పెను. మఱియును నాశ్రితులను జేవదలరాదని హితము బోధించెను. పిదప, తానాచోటువదలి, బొబ్బిలిని జేరి, అచ్చట శ్రీరంగారావుగారిని ప్రబోధించి శత్రువులను మార్కొనుటకు సిద్ధపఱచెను.

బ్రహ్మముగారి కీయుద్యోగముల వలననే పగదీఱిపోయెనా? లేదు; ఇది యన్యులహితము గోరిన యాగంతుక కార్యము. ఆత్మసంతుష్టికి హేతువయిన ప్రతీకారమని యెవరందురు? ఇట్టి వ్యాసంగముల చేతనే యతనికిఁ దన పనులను గూర్చి పర్యాలోచించుటకుఁ దరుణము చిక్కలేదు. తనయొక్క

పరిభవమును, బొబ్బిలి వారియెడల మహారాజుగారికిఁ గలిగిన విగ్రహమును, దానికొఱకుఁ జేయవలసిన కర్తవ్యాంశములును, శ్రీ రంగారావుగారికి సాహిత్యరూపమునఁ దెలిపిన పిదప, రామబ్రహ్మముగారు బొబ్బిలికోట ప్రాకారములన్నియుఁ దాఁటి వెలుపలికి వచ్చి, యొకచెట్టునకుఁ దన గుఱ్ఱమును గట్టియుంచి తానొక చెట్టుసీడనుఁ విశ్రమించెను. ఇప్పు డతనిమదికిఁ దన పగనుగూర్చిన యంశములు స్ఫురింపఁ దొడఁగినవి.

"కఠినతమమైన పర్వతమును డీకొని దానిని బొడుము చేయుటకుఁ బ్రయత్నించునట్టి తగరును ననుకరించెదనే! గర్భదరిద్రుఁడనైన నే నెక్కడ? సహస్రసంఖ్యల వాహిని కధిపతి యగు మహాప్రభు వెక్కడ? నేనా యతనియెడలఁ బగఁ దీర్చుకొనుటకుఁ దగిన దిట్టను" అని,తనలో నవమాన మొందెను. "అక్కటా! నేనేల యిట్టి యశక్యకార్యమును సంకల్పించుకొంటిని? సంకల్పించుకొంటిని పో; నెఱవేఱుట యెట్లు? దరిద్రునికోపము వాని శరీర వినాశమునకే కదా కారణము?"అనుకొని చింతిల్లెను. "అయ్యో, మహారాజుగా రెందఱ కాశ్రయదాత! అతని కలిగితినే! ఇది యెంత పొరపాటు?' అనుకొనెను. "హా, వారికి బొబ్బిలిరావు వారియెడల వైరముగలదు కాఁబోలు; వారి మదికిఁ దగినట్లు మెలఁగక నేనేల రావువారిని పొగడవలయును? నా కతనివలె రావువారిని దూషింప నిష్టములే దనుకొందము; మౌనము వహింపరాదా, ఎంతో మేలుగాఁ గన్పట్టునే! పర్యాలోచింపఁగా స్థలముదెలియక పలికిన నాపలుకులే కదా నన్నీ దెసకుఁ దెచ్చివైచినవి" అనుకొనెను. ఔను, ఉత్తములు తమ విరోధులకుఁ గల సద్గుణములను గొనియాడుట లోక

విదితము. అట్టివారిని మహారాజుగారు పోలరో? ఆత్మశ్లాఘయుఁ బరనిందయు నితనియెడల మొందుకొని యుండునా? అట్లే యుండి, అతని యిచ్చకువచ్చునట్లు మెలఁగి యుంటినేని, నేను ఇచ్చకము లాడినవాఁడను గదా యగుదును! ఇచ్చకము లాడమికా నా కిట్టి యవమానము గలుగుట! హా! అపకృతి కొక ప్రతికృతి గన్పట్టకున్నదే! లోకమంతయు నే శూరశూన్యముగాను న్యాయ్య హీనముగాను నున్నదో? అట్లున్నటి కుండదు; నూటి కొక్కరైనను సత్పురుషు లుందురు. అవ్విధముగా పెక్కుఱు లేకున్నను, సౌజన్యమే జీవించియుండిన, మహారాజుగారి యిట్టి చర్యకుఁ బ్రతివిధాన మేర్పడక పోవునా?" అని యిట్టి ప్రశ్నలనే పలుమాఱుఁ దనలో రామబ్రహ్మముగారు వేయఁజొచ్చిరి. తన యవమానమునకుఁ బ్రతీకారము చేయు తలంపు దృఢపడుచు వచ్చెనుగాని విధాన మేర్పడలేదు.

"రామబ్రహ్మము బ్రాహ్మణోత్తముఁడు; విజ్ఞానప్రవరుఁడు; సారస్వతమున నుజ్జీవించువాఁడు. ఇట్టి వానియెడను విరోధమేల పాదుకొనెను? ఇదియా వివేకము కలిమికిఁ బెరువు?" అని విచారించుట పొరపాటు: ఏలనఁగా - విద్య యధికమగు కొలఁదిని, సత్యపరిపాలనమును యుక్తాయుక్త పరిజ్ఞానమును దృఢముగాఁ బట్టువడును; ఆకారణమును బట్టియే నిర్దోషియెడల దండనీతి వినియోగించుట యాకవికి దోషముగాఁ గన్పట్టెను. న్యాయమనుదానికి సంపన్నుఁడనియు దరిద్రుఁడనియు భేదవిమర్శనము గలదా? అట్టిదోషము ప్రాయశ్చిత్తములేక బ్రహ్మముగారికి యుక్తముగాఁ గన్పట్టలేదు.

ఔను, ప్రతీకార స్వరూపము దెలియవచ్చిననే కదా,

విధానమునకుఁ బెనఁగులాడుట? అతని యవమతికైన ప్రతికృతియేమి? ఏమి పొసఁగిన బ్రహ్మముగారి కింపుపెంపెసఁగును? హా! తెలిసియున్న యీయంశమును గుఱించి మన మేల యింతగా విచారింపవలయును? అతఁడు, పూర్వమే రాజుగారియెదుట నిరాఘాటముగాఁ దన యభిమతమును దెలిపియున్నాఁడు గదా? ఈబీదబాపనివలన నట్టి కార్యమెట్లు గొనసాగఁ గలదని మహారాజుగారు లక్ష్యపెట్టక వదలినట్లే మనము సైతము విస్మరించి వదలుట యుక్తముగాదు. తాను కేశవితతికిఁ దొలఁగినట్లు మహారాజుగారు దేశవితతికిఁ దొలఁగవలయు ననుటయే కదా యతని యభిమతము! కాఁబట్టి యట్టి చేఁతకు విధానముగూడ నతని కిప్పుడే స్ఫురించెను. నిజామువారి నాశ్రయించి మహారాజుగారి పదవిభ్రంశమునకు మార్గము వెదకుటయే యతనికిఁ దోఁచిన యంశము.

విజయ రామరాజుగారిని సింహాసనమునకుఁ దొలఁగించి యాచోట వారి పితృవ్యపుత్త్రులగు నానంద గజపతిగారిని నెలకొల్పుటయే యతనికోరిక. ఇది కొనసాగిన యెడల, తన పరాభవక్లేశము దొలఁగినట్లు తృప్తి వహింపఁగలఁడు. ఇంతయే కాని, మాండలికులలోఁ గలతలు పెంచి ఘోరసంగ్రామములను గలిగించుట కాదు; రక్తపాతమున కితని హృదయ మొప్పలేదు.

తుదకుఁ దాననుకొనినట్లే కొనసాగక, తన యాశ్రయులకును మహారాజుగారికిని బోరాటమే తటస్థించిన యెడల, తనకొఱకుఁ బోరాడువారితోఁ జేరి, శాత్రవ వాహినులలోఁ దూఱి, పరాక్రమకేళి సలిపి, చేతులకసివోవ వీరభటుల నుఱు

మాడి, నుఱుమాడఁబడి, వీరశయన మలంకరించుటయే బ్రహ్మానంద ప్రదమని యతఁడు నిశ్చయించుకొనెను.

నిశ్చితాంశ మొకవిధముగా నేర్పడఁగానే, క్షణకాలము నెమ్మదితోఁ బర్యాలోచించెను. బ్రహ్మముగారి ముఖము వికసించెను. "సరి, యిదియే విధానము; ఇట్లే మెలఁగవలయును" అనుకొని, రామబ్రహ్మము తనగుఱ్ఱముపై జీనిపఱచి, దాని నెక్కి మరలఁ జిక్కాకోలమునకుఁ బయనమయ్యెను.

16-వ ప్రకరణము

"ధీరులు వదలరు దేఁకువ నెప్పుడు"

అనురాగ లక్ష్మి బొబ్బిలినగరమునే వసతి చేసికొని వాసము సేయుచున్నదో యనఁ బ్రతి గృహద్వారము, దోరణములతోను, గోడలు సున్నపుఁ బూఁతలతోను, శోభాకరములగు నెఱ్ఱమన్ను పట్టెలతోను బొలుపారుచుండెను. ఇండ్లకు వెలుపలఁ బందిళ్లు వేయఁబడి యుండినవి. జను లెచ్చటను మహోత్సవము గొనియాడుచుండిరి. పురుషులును స్త్రీలును నూత్నవస్త్రాభరణాలంకారములతో నెసఁగుచుండిరి. ఎక్కడఁ బట్టినను మంగళవాద్యముల మ్రోఁత కర్ణరసాయనముగాఁ బెల్లెసఁగియుండెను.

పురమునం దెక్కడఁ జూచినను జన సమ్మర్దము. రాచనగరు, వీర శృంగార లక్ష్మియొక్క పొలుపునే వహించియున్న దనునట్లు దైవారుచుండెను. నగరుకు వెలుపల పందిళ్లులు వేసి, తెల్లని బట్టలుగట్టి శుభము సూచించు నెఱ్ఱనిసరిగ

యంచు జాలరులు గట్టియుండిరి. కంబములకు రంభా స్తంభములు జంటింపఁబడి కొనను వివిధ ఫలవర్గములను గట్టి వ్రేలవైచిరి. సర్వత్ర ధ్వజపటము లెత్తఁబడి యుండెను. నగరువారు, విలువలేని వస్త్రాభరణముల నలంకరించుకొని, కార్యగౌరవములను వహించి యీవల కావలకు నడయాడుచుండిరి. నౌబత్ ఖానాలో నెడవిడువక వాద్దెములు మ్రోఁగుచుండినవి. రాజ బంధువులు దమతమ పరివారము వారితో వైభవ స్ఫూర్తిని వెల్లడి పఱచుచుండిరి.

నగరులోపల వివాహ వేదిక నెంతో మనోహరముగ నలంకరించి యుండిరి. అది, దక్షిణ హిందూస్థానము నందలి చిత్రకారులయొక్క బుద్ధి వైదగ్ధికిని, అవనీశుల వైభవ విశేషమునకును జాక్షుష ప్రమాణముగాఁ బరిఢవిల్లు చుండినదనుట యతిశయోక్తిగాదు. ఆ మంటపము చుట్టు నున్న వేదిక, వీర రసాధిదైవత నర్తనమునకు నైపథ్యమో యనఁ దేజరిల్లు చుండెను. అచ్చటఁ గూర్చుండియుండిన వీరు లందఱును బరాక్రమ భాను లనుట దగియుండును. దామెర్ల-రామరాజుగారు శ్రీరంగారావుగారి మామగారు. వీరు నీతి విచక్షణులును శౌర్య సమగ్రులును. యుద్ధరంగములయందుఁ గలి కాలభీష్ములని వీరిని శూరలోకము పొగడుచుండెను. వీరి పుత్రుఁడు దామెర్ల-ధర్మ రాయఁడుగారు; ఇతఁ డేకాంగవీరుఁడు. ఇతని సోదరీమణియే శ్రీరావుగారి ధర్మపత్ని. ఇంకను, వెలుగోటివారు, జూపల్లి వారు లోనగు రాజబంధువులగు ప్రముఖు లందఱా చోటు నలంకరించి యుండిరి.

రాజ బంధవులకు భిన్ను లయి హిత వర్గమును జేరిన

శూరధనులు గూడ నా ప్రదేశము నలంకరించి యుండిరి. వారిలోఁ దులసీరాముగారు మహాపరాక్రమనిధి. మఱియు రాజానుగ్రహ పాత్రులయి యచ్చట గుమిగూడియుండిన శాస్త్రవేత్తలగు బ్రాహ్మణ శ్రేష్ఠులయొక్కయు వారి కుటుంబ జనులయొక్కయు సంఖ్య యెక్కువగానే యుండెను.

శ్రీ రంగారావుగారు, తన బాహ్యప్రాణ మనఁదగిన వేంగళ రాయలకు వివాహ వివాహోత్సవము నిర్వర్తింప నిశ్చయించుకొని యుండిరి. వారికా శూరనిధియగు సోదరుని యెడలఁ గల ప్రేమ వర్ణనాతీతము. తన తోడఁ బుట్టువుయొక్క గుణగణముల కనురూపయగు కన్యకామణిని, వీర విద్యాధిదైవతమో యన వెలయు యువతీ జనాభరణమును భార్యగాఁ జేయఁదలఁచి మహావైభవమునఁ బెండ్లి జరుప నిశ్చయించి యుండిరి. మూఁడవ దినము నిశ్చితార్థమును నైదవ దివసము పాణిగ్రహణ మహోత్సవమునుగా నిర్ణీతములయి యుండినవి. ఆదిన మిష్టదైవతముల పూజ. కాఁబట్టి, శ్రీరావువారు, మంగళస్నాన మాడి పీతాంబరములను రత్నాభరణములను ధరించి, తమ పట్టమహిషియగు మల్లమ దేవిగారితోఁ గుల దైవతముల పూజకు సంసిద్ధులయిరి. ఆ యదనున వారి తేజోవిశేషమును గన్నులార దర్శించిన ధన్యులు, తొంటి నలనాభాగాది రాజశ్రేష్ఠులను స్మరణకుఁ దెచ్చుకొనక పోలేదు.

మొట్టమొదట లోకైకాశ్రయుఁడైన శ్రీశేషాచలాధిపతిని, శ్రీనివాసమూర్తిని ధ్యానావాహనాదులచేత నుపచరించిరి; శ్రీ వేంకటేశ్వర ప్రీతిగా గోభూ హిరణ్యాది దానములను బ్రాహ్మణుల కవ్వారిగా నొసఁగిరి; తదనంతరము

గృహ దైవతములను బూజించియు సువాసినుల నారాధించియు విప్రులకును ముత్తైదువలకును ధారాళముగా దక్షిణాలను బట్టలను బంచిపెట్టిరి. పిదప, తారతమ్య మెంతయుఁ దలఁపక యాబాలగోపాలము తృప్తి నొందునట్లు భూరి దక్షిణ లొసఁగి యందఱ నలరించిరి.

ఇష్టదైవత పూజానంతరము, శ్రీరావుగారు దమ బంధువులతోను, కులీనులగు మిత్రులతోను గూడి భుజించి లేచిరి. పిదప, ఆదివసావశేషము ఇష్టాలాపములతోఁ గడచెను.

17-వ ప్రకరణము

"ఎలమిగల్గును సుజనుల చెలిమివలన"

రామబ్రహ్మ మాదినము సాయం సమయమునకుఁ జిక్కాకోలముఁ జేరెను. అచ్చట నుంరాగారి భటులును రాఘవరావుగారును జాఫరల్లీగారి యాశ్రయము వహించి సుఖముండిరి. బ్రహ్మము, వారు వసించునట్టి యింటిని వెదకికొని పోయిచేరెను. వారితనిఁ జూడఁగానే యనుభవించిన సంతోష మిట్టిదని చెప్పవలసినది లేదు; ఆ మువ్వురును ఇతని నెంతో యుపచరించిరి.

వీరి కందఱ కచ్చట నొకవిధముగాఁ గడుపుపని తీఱెను. రేయి తల చూపి చీఁకట్లు నల్దెసలఁ గ్రమ్ముదేరెను. అప్పుడీ నలువురును బయలు వెడలి పురబాహ్యప్రదేశము వఱకును నడుచుచుఁ బోయి యొక నిర్జనప్రదేశమును జేరిరి. లోకాభిరామములయిన మాటలాడుచుండి, ప్రస్తావవశమున బ్రహ్మ

ముగారు శంకరసింగును జూచి, నాజరుజంగుగారి క్షేమమును విచారించిరి.

శం——ప్రకృతము నాజరుజంగుగారు చిక్కాకోలమున లేరు. వారిచ్చట వసించుట యెంతమాత్రము క్షేమకరము గాదు; ఇది వారి కొకరికి మాత్రమా? జాఫరల్లీగారికిని మేలు గలుగదు. కాఁబట్టి, మే మీ సంస్థానము చేరిన మఱుచటిదినమే వారు చెన్నపురమునకుఁ బయనమైరి. అది యాంగ్లేయుల పరిపాలనము క్రింది నగరము గనుక, అందు వసించునట్టి నాజరుజంగు గారి కాపద ఘటిల్లదని నమ్మవలసి యున్నది.

రామ-అట్లు చేయుట ప్రశంసార్హమయిన కార్యమే !

రాఘ——మీరీ సంస్థానమువదలి పోవఁగానే, జాఫరల్లీగారు మంత్రాలోచన చేసి, సంధికైన శ్రీముఖములను వ్రాసి బొబ్బిలి మహారాజులకుఁ బంపిరి. పర్యవసాన మింకను దెలియకున్నది.

రామ-పర్యవసానమున మేలే గలుగును; నేను సైతము బొబ్బిలిసభకుఁ బోయి యుంటిని. అచ్చట శ్రీరావువారికి విశదమగునట్లుగా నా భంగపాటును, అన్యాపదేశముగా వారిని సంబంధించిన సంగతులను దెలిపియున్నాను.

బాలా——సరి, తాము చేయవలసిన కార్యములను బాగుగాఁ జేసి ముగించితిరి; కావున నే యిటకు మరలినట్లున్నది.

రామ——లేదు, నాపని యింతటితోనే యెట్లు ముగియును? నేను నిజామువారి దర్శనమును గోరుచున్నాను. అది యెట్లు కొనసాగఁ గలదని యిప్పుడు పరితపించుచున్నాను. మార్గము గన్పట్టకున్నది.

శం.—మీరు, నిజాము వారిని బేర్కొనుటవలన జ్ఞప్తికి వచ్చెను. మే మీ స్థలమును జేరిన సంగతిని, నాజరుజంగుగారు సురక్షితులుగఁ జెన్నపురమును జేరిన రహస్యమును, షేకు మహామ్మదుగారి దుర్గతిని మా ప్రభువుగారికి విన్నవింపవలయును. ఇవి యత్యంత రహస్యములయినవి గనుక వారికిఁ దెలుపుటకు మార్గము దెలియక తొట్రిలు చున్నాము.

రామ.—సరి, నే నెట్లయినను హైదరాబాదునకుఁ బో వలసియున్నది; మీరు మీ సంగతులను వ్రాసి యిచ్చినయెడల వారికిఁ జేర్పెదను.

బాలా.—అట్లు చేయుట కిది తరుణముగాదు; ఇంతే కాక మీ మాటలను వారు విశ్వసింపఁ గలరు. మీ కీ విషయమున సందేహాము గలదేని యానవా లొసఁగెదను. దాని బలమువలన మీ పనులు సైతము నెఱవేరఁ గలవు. అని తన వ్రేలియం దున్న యొక రత్నపు టుంగర మొసఁగెను.

ఇప్పుడు, మన బ్రహ్మముగారికిఁ దన ప్రయత్న మొక విధముగా ముగింపునకు రాఁ గలదను నమ్మకము పుట్టెను. జాగు చేయుటవలనఁ గార్యములు చెడునని తలఁచి యాక్షణమే వారియొద్ద సెలవు పుచ్చుకొని రామబ్రహ్మము హైదరాబాదునకుఁ బయన మయ్యెను.

బ్రహ్మ మారేయి మార్గమధ్యమునం దుండిన యొక సత్రమునందుఁ గడప వలసినవాఁడయి, తన గుఱ్ఱ మొకచోటఁ గట్టియుంచి, దాని రక్షణమున కచటి సేవకులలో నొకని నియమించెను. హృదయ తాప మొకవిధముగాఁ దీఱఁగలదను నమ్మకముచేత, రామబ్రహ్మముగారి యెదలో సంతోష మే

తాండవ మాడుచుండెను. కాఁబట్టి యాసత్రమును గని పెట్టుకొనియున్న యొక బ్రాహ్మణునిచేత నాలుగురూకలు పడవైచి తనకుఁ దగిన వసతిని గలిగించుకొనెను.

ఆ సత్రమునకువచ్చి దిగియున్న ప్రయాణికులతో సంభాషించు నవసరమున, రామబ్రహ్మముగారు, కొన్ని ముఖ్యములయిన సంగతులను దెలిసికొనఁ గలిగిరి. బుస్సీగారు, ఉత్తర సర్కారులపై దండయాత్ర వెడలుటయును, అతని పరివారము వారిలో హైదరుజంగు, సులేమాన్ ఉంరా లోనగు యోధు లుండుటయును దెలియవచ్చెను. బుస్సీగారి దండయాత్రకుఁ గారణములు పెక్కువిధములుగాఁ బలికిరి. అవి యన్నియు మన రామప్రహ్మముగారి కావశ్యకములు గావు గనుక, మన మిచ్చటఁ బ్రశంసింప వలసినది లేదు. వారి యభిప్రాయములును మాటలును బలువిధములుగా నుండినప్పటికిని, అందఱును బుస్సీగారు, రాజమహేంద్రవరమున విడియఁ గలరని యేకగ్రీవముగాఁ బలికిన పలుకులు రామబ్రహ్మము గారికి మిగులఁ దోడుపడినవి యనుట పొరపాటు గాఁజాలదు.

18-వ ప్రకరణము

“ ఎవరి వెఱ్ఱి వారిది ”

విజయనగరమునకు దక్షిణమున రాజమహేంద్ర వరమున్నది. ఇంతకు మున్నే యీ నగరముయొక్క రామణీయ్యకము దెలిసికొనియున్నాము. ఉత్తర సర్కారుల కిది నాయకమణిని బోలినది.

శ్రీ విజయ రామరాజుగారు, ఈ పురమును బ్రవేశించు నప్పుడు పగలు పదిగడియల ప్రొద్దెక్కి యుండెను. వీరు మూఁడు దివసములకుఁ గ్రిందనే పయనమయిన వారు. వీరీ ప్రదేశము చేరుటకు మార్గమధ్యమున నొకటి రెండు మజిలీలలో విశ్రమించి యుండిరి. వీరి సైన్యమంతయును బురమునకు వెలుపలనుండెను. ఈ సైన్యము రాష్ట్రమునకుఁ దూర్పుటెల్ల నెడ్డికొని విడిసియుండినందున పడమటి యెల్ల యందుండిన బూసీగారికి వీరిరాక గొన్ని గంటలవఱకును దెలియక యుండెను.

మిత పరివారము వారితోఁ బురప్రవేశము చేసిన మహారాజుగారు, కోనేటియందు స్నానముచేసి, మడుగుగట్టి, ఆలయమునకుఁబోయి కోటిలింగస్వామి దర్శనము చేసికొని విడిదిని జేరిరి. అచటఁ బగటి భోజనపుఁ బనులను దీర్చుకొని, బుస్సీగారి దర్శనమున కెట్లు వీలు గలిగించుకొనుట యనువిషయమును బర్యాలోచించుచుండిరి.

నగరమునకుఁ దూర్పుదెసయందు నేలయీనిన చందమున విడిసియుండునట్టి కళింగసైన్యములను గూర్చియు వారి వీర రస విశేషమును గూర్చియును ద్వరలోనే బుస్సీగారికిఁ దెలియవచ్చెను. కళింగ పెద్దరాజుగారు, దమ మైత్రిని గోరి వచ్చిరో, హాతము చేయవచ్చిరో యతని కిప్పుఁ డూహింపనలవి గాకుండెను.

"మైత్రిని దలఁచియే వచ్చి రనుకొందము, వారేల భేదబుద్ధిని దూరమున విడియవలయును? అట్లుండినను, వారికేల యింత గొప్పదండు?" అను సందియములు బుస్సికిఁ గలిగెను. మఱియును, ఇదివఱకును మహారాజుగారు నైజామును ధిఃకరించి కప్పము గట్టక యుండుటయును, జాఫరల్లీతోఁ జేరి యుండుటయును, సలాబతుజంగు మకుటోత్సవమునకు రాక దక్కుటయును సుప్రసిద్ధాంశములు. కాఁబట్టి, వారు విగ్రహబుద్ధిని వహించియే యుద్ధమునకైన ప్రయత్నములతో వచ్చి విడిసియుండునట్లు బుస్సీగారికిఁ దోఁచెను.

"హా! ఈతలంపు గలుగఁగానే బుస్సీగారికిఁ గలిగిన యదురుపాటును వర్ణింప నెవనికి శక్యము? తనయూహయే సత్యమయిన యెడలఁ దమవినాశమున కదియే ప్రారంభదివసమని యతఁ డనుకొనెను. ప్రకృతము తన యొద్దనున్న సైన్య మైదువేల కధికము లేదు. వచ్చి మూఁగియున్న దండు దీనికి మూఁడంతలు; తమరాజ్యము దాఁపుగా నుండుట చేతను, ముట్టడివేయునట్టి వారగుటచేతను, వారికి రస్తుసామగ్రికి సంకటము గలుగదు.

"అక్కటా! ఈ యాలోచన యదార్థమయినయెడల నాగతి యేమగును? అదృష్టవశమున నాకు లభించియున్న ప్రఖ్యాతి కెట్టి దుర్దశగలుగును? నాదుర్గతి యట్లుండఁగా, అయ్యో, ఫరాసువారి కేయీ హిందూదేశమునందుఁ గాలూనుటకుఁగాని దౌర్భాగ్యము తటస్థించి పోవునే! ఈసంకటమును, దొంగను తేలు కుట్టినట్లుగా నేనొక్కఁడనే యనుభవింపవలసి యున్నది. ఇచ్చటి సరదారులతో నేమని యాలోచింతును? నా పిటికితనమును నేనే వెల్లడి పఱుపవలయునా? సదాశివరాయని విషయమున నేనుబలికిన పలుకులన్నియు హాస్యాస్పదములగునే! ఏమిచేయుదును? ఏదియును దోఁచకున్నది. ఏది యెట్లుండినను బ్రకృతము, కాలస్థితిని బట్టిచూడఁగా విజయ రామరాజుగారి,

సంధియే మన కెంతో యావశ్యకమై యున్నది. మన మీ కార్యమును ఉపాయముతో సాధింపవలయును" అని బుస్సీ తనలో నిశ్చయించుకొనెను. ఇంతలో నొక యుక్తి గోచరింపఁగాఁ దత్క్షణమే దుబాసి లక్ష్మన్నగారిని, దా నున్న యెడకు రావించి, "అయ్యా, లక్ష్మన్నగారు! కార్యముల పట్ల మీకుఁ గల చమత్కారబుద్ధియును జాగరూకతయును నాకుఁ దెలియును. కాఁబట్టి, నే నుద్దేశించిన యీకార్యమునకు మీరే దిట్టతనము గలవా రని నా యభిప్రాయము. మీరు చేయునట్టి పని, రెండవచెవికి వినరా నట్లుండవలయును. మీరు దిన్నఁగా కళింగ పెద్దరాజుగారియొద్దకుఁ బోవలయును. వారి స్థితిని గనుఁగొని, రాజుగారిని మా సమక్షమునకుఁ దెచ్చి వదల వలయును" అని రహస్యముగాఁ గొన్ని విషయములు బోధించి, "కార్యవిధానములను బొరపాటు గలిగింపక మెలఁగి మా యానతిని నెఱవేర్పుఁడు" అని పంపెను.

బుస్సీ దొరగారి యనుగ్రహ సంపాదనమునకై పర్యాలోచించుచున్న తరుణముననే మహారాజుగారిని దుబాసి లక్ష్మన్న దర్శింపఁ గలిగెను. లక్ష్మన్నను జూడఁగానే మహారాజుగారు లేచి యానంద పరవశులయి కౌఁగిలించుకొని సన్మానించిరి; అతని నుచితాసనంబునఁ గూర్చుండఁబెట్టిరి; అతనియొక్కయు దివాణము వారియొక్కయు యోగక్షేమములను విచారించిరి. నాలుగైదు సంవత్సరములుగా నవాబువారి సందర్శనము దమకు లభింపమికిఁ బెల్లుగా వగచిరి. పదివేల రూపాయలను సాలువులును లక్ష్మన్నకు బహుమాన మొసఁగిరి. పలుమాటలేల? తన దర్శనార్థము వచ్చిన యొక యుద్యోగిని బెక్కువగాఁ నుపచరించి, క్షణకాలములోనే తన పనుల కనువైన పరికరముగా మార్చుకొనిరి.

లక్ష్మన్న, తాను వచ్చినపని యనాయాసముగాను దన పరిశ్రమ కొంచెమయినను లేకయు నెఱవేఱుటవలనఁ గలిగిన సంతోషమట్లుండఁగాఁ దన జన్మమాదిచేసి చూచియుండని పెద్ద మొత్తమును జూడఁగానే, నిజముగా నతని కన్నులు చెదరెను. చూడఁగాఁ జూడఁగా నతని కొడలు మఱచి తన్ను మీఱిన సంతసము పైకొనెను. "ఆహా! నా యం దెంతో గుణముండఁ బట్టియే బుస్సీగా రితరుల నెల్లక నన్నే యీ కార్యగౌరవమునకు నియమించిరి. ఆ మహిమను గుర్తెఱిఁగిన యిమ్మహారాజుగారును నా కిన్ని యుపచారములను జేసి కట్నములను సమర్పించుకొనిరి. ఔను, యదార్థముగా నాయం దట్టి మహిమయున్నచో నాకీ ధన మెంతమాత్రము?" అని తత్క్షణమే యతృప్తి నొందెను. పిదప, లక్ష్మన్న మహారాజుగారిని జూచి,

"మహాప్రభూ! మాకీ లంచము లేల? బుస్సీగారు మీ విషయమున మహోగ్రులుగా నున్నారు. వారు, విజయనగర మొకదానినా? ఈ కళింగదేశమునే పుచ్చులు వోన దున్నఁ గలరు. పగవారితోఁ జేరి దివాణమునకుఁ గనఁబఱచిన తమ యౌదాసీన్యమే యిన్ని కష్టములకు మూలము. కార్యము ముదిరిపోయినపిదప చక్కఁబెట్టుట కెవనిశక్యము? ఆ కారణమును బట్టియే గూఢముగాఁ దొలుదొల్త నేనుగా మీసన్నిధానమునకు వచ్చితిని.

మహా—అయ్యా లక్ష్మన్నగారూ! దివాణమునందు మీకుఁ జనువెక్కువ యనుసంగతి మాకుఁ జక్కఁగాఁ దెలి

యును. ఇంతటితోఁ బోక, యుద్యోగధర్మమును బట్టియే కాని, లేకున్న, మముఁబోటివారి యందు మీకుఁ గలిగియున్న మక్కువ ఇట్టిదని మాకు దెలియదా!

లక్ష్మ—ఆ హేతువునుబట్టియే కర్ణాకర్ణిగఁ గొన్ని సంగతులు దెలిపి మిమ్ము నెచ్చరిక గొలుపుటకు వచ్చినాను. నిజముగా నా రాక యజమానులకుఁ దెలియదు.

మహా—మీకు మాయందుఁగల యభిమాన మిట్టిదని మాకు బాగుగాఁ దెలియునంటిని గదా! మీ కింకను నిరువది వేల రూప్యములను సమర్పింపఁ దలఁచి యున్నాము. మే మొసఁగుట యొక గొప్ప కార్యము కాదు; కాని, మా పనులను గొనసాగించునంతటి ఘనతకు మీరు పాత్రులు గావలయును. మీ పేరెన్నటికిని మా కళింగదేశమునఁ బ్రకాశించు చుండవలయును.

లక్ష్మ—మహాప్రభు! దేవరవారి యనుగ్రహ మీ బీదవాని యం దుండినఁ జాలును. మీరు దేనికిని జింతిల్ల వలసినది లేదు. మాశక్తిని వంచన గదురక మీ విషయమునఁ బాటుపడుటకు సిద్ధముగా నున్నాము.

మహా—హా, అదేమి యట్లనెదరు? మీ రేవిషయము గాని దలఁచినఁ జాలునే! అది యట్లుండ నిందు; నేను గొన్ని విషయములను గూర్చి మి మ్మడిగెదను. మీ యీ ప్రయాణమునఁ జిక్కాకోలముమీఁద దాడి వెడలునట్టి తలంపుగలదో?

లక్ష్మ—మహాప్రభూ! మన్నింపవలయును. మిమ్ము ననుసరించిన కార్యములను సరిపెట్టుటకు మాకు సామర్థ్యము గలదు; అయినను, మేము రాజరహస్యములను బహిరంగపఱచుటకు సమ్మతింపము. అట్లు గొప్పవిషయములను దెలిసికొన

వలయునని చిత్తగించితిరేని మా యజమానుల యొద్దనుండుఁడు. వారు మీయెడల సుప్రసన్నులగుటకుఁ జేయవలసిన పనుల నన్నిటిని జేసెదను. ఇప్పుడే పదఁడు, పోదము.

విజయ రామరాజుగారు దన వాగ్దత్తముప్రకారము, లక్ష్మన్నకు నిరువదివేల రూపాయలనుగూడ నొసఁగిరి. విలువలేని నజరులను బట్టించుకొని మిత పరివారము వారితో మేనా లెక్కి బుస్సీగారి స్కంధావారమున కేఁగిరి. మున్ముందుగా లక్ష్మన్న యేఁగి, తన యుద్యోగమును నెఱవేర్చుకొని వచ్చిన విధమును దనకుఁ బ్రఖ్యాతి కలుగువిధముగా, దొరగారితో నున్నవి గొన్నియు లేనివి గొన్నియుఁ జేర్చి చెప్పి సంతోషము కలిగించెను.

ఆదినము కళింగ పెద్దరాజుగారికి బుస్సీగారి దర్శనము **లభింపలేదు.** తమ బిడారము దనుక విజయము చేసియున్న మహారాజుగారిని ఉపచరించు నిమిత్తము హైదరుజంగు నియమింపఁబడెను. అతఁడు, ప్రత్యుత్థాన పూర్వకముగా వారిని గారవించి రాఁబట్టుకొనెను. పిదప, మహారాజుగారి నొక రమణీయమయిన పట కుటీరమునకుఁ బిలుచుకొనిపోయిరి. వీరియొక్క పరివారము వారు వెలుపలనే యుండవలసిన వారయిరి. అట్లేఁగి యాచోట్లను జేరిన లక్ష్మన్న, హైదరుజంగు, మహారాజుగారు మువ్వురును గొంతదనుక నొండొరుల యోగక్షేమముల విచారించుకొనుచుండిరి. తుదకు కళింగాధిపతి, తమ కార్యస్వరూపమును, అది కొనసాగినఁ దా మొసఁగునట్టి బహుమతిని, ఇంకను గొన్ని ముఖ్యాంశములను హైదరుజంగునకుఁ జెప్పిరి.

హైద—ప్రభువా! నేఁటికి బుస్సీదొరగారు చాల పని గలిగియున్నారు. మీ యభిప్రాయములను వారికి విన్నవించి వారి యభిమతమును గుర్తెఱుఁగవలయును. వారే ప్రకృత మీ సర్కారుల కన్నిటికిని సర్వాధికారులు. వారు, సమ్మతించిన బాగు; సమ్మతింపక పోయిరి, మనమేమి చేయవచ్చును?

లక్ష్మ—యజమానులు చిత్తగించి దొరవారికి మందలించినఁ జాలును. మహారాజులుంగారి పనులన్నియును బూర్తియగును" అని యింతకుమున్ను దాను మహారాజువలనఁ బొందిన లంచము జీర్ణమగుటకయిన మాటల నుడివెను.

మహా—ఔను, సాహేబుగారు, మీరు చిత్తగించి యీ పనిని గొనసాగించియే తీరవలయును.

హైద—మహాప్రభు! నేఁటికి మీ కిచ్చకముగా మెలఁగిన ఱేపటికి హుజూరులో సవాలు గలుగునే! అప్పుడేమి బదులు చెప్పుట? ఎట్లు దప్పించుకొనుట? ఆకాలమునఁ దప్పించుటకు మీరు వత్తురా? ఎప్పటికిని జులుం పనులు దగవు.

మహా—మీ మాటల కడ్డము పలుకుటకు సాహసింపము. అయినను, మీరు పడునట్టిశ్రమకుఁ బర్యాయముగా నైదు లక్షల ధనము బహుమానింపఁదలఁచి యున్నాము.

రూపాయలమాట ప్రస్తావింపఁ బడఁగానే, హైదరుజంగు ప్రక్క లెగుర వైచెను. అతని హృదయమున నాలోచనలు, పెక్కు లాక్షణమునందే యంకురించినవి. అంతట రాజు రిగాని జూచి,

"మహారాజ! ఱేపటికి విజయము సేయుఁడు. మీ యుద్దేశ మిట్లుండినయెడల దొరగారిని మందలించిచూతము."

లక్ష్మ—'దొరగారు పేరికిమాత్రము సర్వాధికారులు ఆధిపత్యమంతయును దమదేకదా! అని హైదరుజంగునుజూచి మహారాజుగారికి హితము పలుకువానివలెఁ బలికెను.

మహా—అట్లుగాదు; మే మెన్నటికిని దృఢ సంకల్పులము. మావలెనే యితరులుగూడ మెలఁగవలయుననుట మా కోరిక! మా యభీష్టము గొనసాగించుటకు మీరు సమ్మతించెదరా?

హైద—చిత్తము-మీ రానతిచ్చినట్లే జరుగఁగలదు. తమరు వాగ్దత్తముచొప్పున నడుచుకొనెదమనెదరే, అట్లుండఁగా మీ పనులకు మేము వెనుదీయమనుటను జెప్పవలయునా?

మహా—సరి, మీ యిష్టప్రకారమే మేము మీచోటికి వచ్చెదము. ఇంతలో మా వాగ్దత్తము పూర్తియగుటకుఁ దన యంతనే సొమ్ము మీ యొద్దకు వచ్చి చేరఁగలదు.

అయినను, మాపనులను శ్రద్ధయుంచి చేయునట్లు మీరు ప్రమాణము చేయవలయును.

హైద—కళింగమహారాజ! ఏల పలుమాటలు? మీ రానతిచ్చిన సంగతులు నాకుఁ గొప్పకావు. ఇదిగో నా యీ చేత ధరించియున్న ఖడ్గమును గొట్టి ప్రమాణము చేసెదను. మీ యిచ్చను దప్పక నెఱవేర్పఁగలను. అట్లు చేయకపోతినా, మరల నే నీ ఖడ్గమును బట్టను. ఇంతటితో ఖడ్గముపట్టుటనే వదలివేసెదను. మీరు ఱేపటికీ వేళకు వచ్చిచేరుఁడు. నే నీ రేయియే దొరవారిని దర్శించి, మన కనుకూలులుగాఁ జేసియుంచుకొనెదను. మహాప్రభూ! సలాములు; పోయిరండు.

మహారాజుగా రొకవిధముగాఁ దమ ప్రయత్నము సుఖ

పరిణామక మగు నన్న కుతూహలముతోఁ దమ పరివారము వారిని గలిసికొని మేనా లెక్క యాత్మీయ స్కంధావారమును జేరువారైరి.

19-వ ప్రకరణము

చింతకు మించినదా చితి?

లోకమున జాగ్రదవస్థకుఁ బ్రతిస్పర్థి రాత్రి. సమస్త ప్రాణులయొక్క యింద్రియముల గాఢముగా మూర్ఛిల్లఁ జేయునది నిద్ర. జీవరాసుల సుఖ విశ్రాంతిని దలఁచి భగవంతుఁ డనుగ్రహించు నీ నిద్రకుఁ దగిన కాలము రేయియే. ఇట్టి కాల విశేషమును సృజించి, భూతకోటికి సమముగా నింద్రియ విశ్రాంతి గలిగించుటం బట్టయే యీశ్వరునకు సర్వసముఁడను ప్రఖ్యాతి గలిగెను. ఐంద్రజాలికుని విద్యకుఁ జిక్కి సొక్కిన ట్లీ నిదురకుఁ జిక్కి ప్రాపంచిక స్ఫురణమునుం దొలఁగని ప్రాణి యొకటియు లేదు. ఆహా! బాహ్యప్రపంచమును గూర్చి యననేల? తన్నే మఱువఁ జేయునది గాదా నిద్ర! ఈ నిదుర పశ్యతోహరుని వలెఁ బ్రాణికోటులు జాగ్ర దవస్థ ననుభవించుచున్న కాలముల యందే హఠాత్తుగా నావరించి, వాని ప్రజ్ఞాధనమును గొల్లగొట్టును. నిద్రకుఁ గలిగిన యిట్టి యపూర్వశక్తి లోకమునందు దేనికిఁ గలదు? కాఁబట్టియే సర్వము దాని శాసనములకు లొంగి పారవశ్యముఁ జెందును.

అయినను, లోకమునం దెదియు నజేయ నైఖరిని దన కారునది లేదు. ఈ నిద్రకు మీఱినవారును గొం దొక సమ

యములయందుఁ గొందఱు గలరు. విరహులును విరోధ పరితప్త మనస్కులును నిద్రను ధిక్కరింతురు. విరహమునకును విరోధమునకును నెట్టి పాటవము గలదో గాని యివి నిద్రకు నిద్రను గలిగించు నట్టివి.

ఆ కారణమును బట్టియే విరోధ మహాదహన దందహ్యమానచిత్తులగు మన విజయ రామరాజుగారి కా రేయి నిదురపట్టలేదు. వారి హృదయ రంగమునందుఁ బెక్కు తలంపులు దలచూపి మఱుఁగుచు వచ్చెను. శత్రువులను సాధనముగా వహించి శత్రువులను నిర్మూలించుట యనునది భాగ్యశాలి కబ్బునట్టిదిగాని సామాన్య మయినదిగాదు. సమ్మోహనాస్త్ర ప్రయోగమునకువలె, ధన వ్యయమాత్రమున శత్రువుల నొండొరుల మార్కొన నిచ్చి మ్రగ్గనిచ్చుట యాత్మలాభమునకే హేతుక మనుట నెవ్వ రొప్పుకొనరు? ఇప్పుడు తాను బ్రబల ద్వేషులుగాఁ దలఁచి యున్న దివాణమువారును బొబ్బిలివారును నొండొరులను మార్కొని మ్రగ్గునట్టి కాలము డాసెను. ఇట్టి తలంపులే పెక్కులు పెల్లురేఁగి వారి చిత్త సద్మమునందుఁ జిందులు ద్రొక్కుచుండఁగా నిద్రపట్టక పోవుట యొక వింతగాదు.

ప్రొద్దు పొడిచెను; దిశ లన్నియుఁ దెలివి వహించెను; జనులు కార్య గౌరవములను వహించి పురమునం దంతటను నడయాడుచుండిరి. మహారాజుగారు, కాల్య కరణీయములను నిర్వర్తించుకొని తొంటి దినమువలెనే యుచిత పరిజనముతోఁ బుర ప్రవేశముఁ జేసిరి. కోనేటియందు స్నానమాడి మడుగులు ధరించి దేవాలయము ప్రవేశించిరి. తొంటి దినముకంటె నెక్కువఁగా నీశ్వరునియెడల భక్తిని జెల్లించి, విడిది గృహమును జేరి

పరివారము వారితోడఁ గూర్చుండి భోజనకార్యముఁ దీర్చికొనిరి.

తదనంతరము, విజయ రామరాజుగారు గొంతసేపు విశ్రమించియుండి, తమకు విశ్వాసపాత్రుఁడుగా నుండిన వెంకన్నను రావించి, రహస్యముగా వానికిఁ గొన్ని మాటలు నేర్పి, "మీ బుద్ధిశాలితనము ప్రకాశించునట్లు ఈ రాయబారము నెఱవేర్చుకొని రావలయును" అని దిట్టపఱచి బుస్సి దొర యొద్ద కంపి తాను దన స్కంధావారమును జేరెను. శత్రువుల బిడారమునొద్దకుఁ బలుమా ఱేఁగుటవలనఁ బ్రమాదము గలుగునని యో, తన ప్రాభవమునకు నైచ్యము గలుగునని యో వారా దిన మచ్చట కేఁగుటకు సాహసింపరైరి. కావుననే ప్రతినిధి వలననే కార్యము సాధించికొనవలయునని వారు దలఁచినది ప్రశంసార్హమే.

అప్పుడు, బుస్సీ, సరదారులు గొలుచుచుండఁగా, సభ తీరి గూరుచుండి యుండెను. సరదారు లందఱునే బుస్సీకి లోకువ యనుట పొరపాటు. అందు న్యాయ బద్ధులును స్వేచ్ఛారతులును నగు ప్రభువులుకూడఁ గొందఱు గలరు. సుళేమాన్ ఉంరా గారు వీరి తెగలోఁ జేరినవారే. హాసనల్లీగారును ఇట్టివారే యనుటకు సందియ ముండదు.

హైదరుజంగు, సరదారుల పెద్దగా నుండినప్పటికిని ఎట్టి కార్యమునుగాని స్వతంత్రీకరించి చేయుట కసమర్థుఁడు. అతఁడు చిన్న యుద్యోగిగా నుండి గొప్పస్థితికి వచ్చినవాఁడు గనుక భీతి యెక్కువ. ఇంతే కాదు; ఎట్టి వాఁడైననేమి? న్యాయపూర్వకములయిన పనులు చేయుటయందు నిర్భీకుఁడు కాఁగలఁ

డుగాని కుత్సిత కార్యములకు సాహసించు వాఁ డితరులకు భయపడ వలసినది సహజమే కదా?

అట్లు తమ బిడారమునకు వచ్చిన రాయబారి వెంకన్నను, హైదరుజంగు మర్యాద పూర్వకముగాఁ బిలుచుకొనిపోయి బుస్సీ గారున్న సభను జేర్చెను. పోవునప్పుడే యతఁ డీ రాయబారికి సమయోచితము లయిన యొకటి రెండు విషయములను జెప్పి యుంచెను. వీరు కళింగాధిపతుల ప్రతినిధులనియును, నిన్నటి దినము మహారాజుగారు స్వయముగా విచ్చేసి యుండిరనియును, బుస్సీ దొరకుఁ జెప్పి, అతని నొక యుచితాసనమున, హైదరుజంగు కూర్చుండఁ బెట్టెను.

బుస్సి—అయ్యా, కూర్చుండుఁడు, మీరు మహారాజుల రాయబారులరా? సంతోషము, ప్రభువువారు మాకేమి యానతిచ్చి పంపిరి?

వెం—రామ - రామ - దివాణమనిన మా ప్రభువుల వారికిఁ దల్లి యిల్లువంటిది. వారా యాన తిచ్చునంతటివారు? తమ యుత్తరువుల కొఱకు చూచుచున్నారే!

హై—ఔనయ్యా, సర్కారులలోని దొర లందఱును బడా హిమ్మత్ దారులు. దివాణమనిన ఫర్వా లేదు.

వెం—అట్లు తమరు సెలవీయరాదు; మా రాజుగారి స్వభావము మీకుఁ గ్రొత్తగాదే.

హాస—చాలా తదబీరుతో మాటలాడెదరు.

వెం—వజీర్ - మీ మాటలకు రజామందీ చెప్పుటకు రాలేదు. నిజమునే చెప్పుచున్నారు.

బుస్సి—జమీన్ దారులందఱు 'బలాసిఫాయీ' లయిరి కిస్తీ పైకమడిగిన కత్తికట్టుకొని వచ్చెదరు.

వెం—మా కితరులమాటతోఁ బనియేమి? మాప్రభువులపై యట్టి యపరాధ మారోపించుటకు హేతువు లేదు.

బుస్సి—హేతువు లేదనెదరా? కావలసినన్ని గలవు. ఈ మైదు సంవత్సరములుగా కిస్తీపైకమేల చెల్లింపరు? దివాణమునుగూర్చి వారికి భక్తి లేదు; భయమును లేదు.

వెం—దొరగారు! మనవిని చిత్తగింపవలయును. వారికి పైకముండి మీకుఁ గిస్తీ చెల్లింపక పోయిన యెడల నేనుగూడ వారిని అపరాధులనియే చెప్పఁ గలను.

బుస్సి—మాకు మీమాటలతోఁ బనిలేదు. మీపరగణాలమీఁది కిస్తీపైకము మాబొక్కసము చేరలేదు. ఆ కారణమును బట్టియే మేమెంతో యిబ్బందిపడి జమాబందికి వెడలితిమి. మాకేర్పడు నటువంటి సెలవు లేమని దలఁచితిరి. ఇంత నష్టము మీప్రభువులనే సంబంధించుచున్నది. మీకీ పైక మంతటిని జెల్లించితిరా, మహారాజులకు రాజ్యమును ప్రాభవమును దక్కఁగలవు. ఇష్టపడక యెదిరింపఁ దలఁచితిరా—

వెం—దొరవారికేల యంతశ్రమ. మాప్రభువులవారే, తమ పెద్దలకు తొంటి నిజాముషాహాలు, అనుగ్రహించియున్న కౌలును మీపాదములకడఁ బెట్టి, యెచ్చటికైనను ప్రవాసము పోవఁ దలఁచియున్నారు. అయ్యో, వారిప్పు డనుభవించుచున్నట్టి శ్రమలు వర్ణింప నలవిగానివి. వారిచేతికి పైకము లభించుటకు సందర్భములు దప్పియున్నవి. వానిని సవరించి యిచ్చియుంటిరేని మీకు కిస్తీపైకము మాత్రమా? అహా, యిదివఱకెంతో

ధనమును మీ దివాణమునకు మాప్రభువులు చేర్చియుందురు. వారి యౌదార్యము దివాణమువారికిఁ గ్రొత్త కాదే.

ఉంరా—వారికట్టి కష్టములు గలవని మేమిదివఱకు వినము. వారు బాగుగా నున్నారనియే మాకు వినికి.

వెం—ప్రభువా! వారు మానధనులు. అభిమానవంతులు, దమ లేమిని వెలికిఁ గాన్పింపరుగదా! ప్రకృతము మా రాజుగా రనుభవించు కష్టములను జెప్పఁబూనిన నొకగ్రంథమగును.

హైద—ఊరక వారికిఁ గష్టము లనెదరే కాని, అవియెట్టివని స్పష్టముగా దెలుపరాదా? ప్రతిసంస్థానాధిపతికిని గష్టములు గలవు. ఆ పూఁట కూఁటికి లేని బీదవాఁడుకూడ కష్టపడుచున్నాఁడు. కష్టపడనివాఁడు 'దునియా' లో నెవ్వఁడును లేఁడు,

వెం—మీరు చిత్తగించినఁజాలును మాప్రభువువారు పడునట్టి కష్టములను గొంతకుఁగొంత వివరించెదను—నేనట్లు బహిరంగ పఱచుటచేతఁ బొరపాటు గలుగదు. ఔను, మా ప్రభువుల యానతియుఁ గలదు. మా యొడయలు దమ మాటలుగా విన్నవింపుమని యాజ్ఞ పాలించిన విధముగానే పలికెదను. "సర్కారులలో నిటీవల మన్నెదొరలు పౌరుషశాలులై దివాణమును లక్ష్యపెట్టక దిరుగఁబడియుండుట మీకుఁ దెలిసిన యంశమే. వారిలో నెఱమగఁటిమి గలవారు బొబ్బిలి - రంగారావుగారు. వారివలన మాకుఁ దటస్థించు నుపద్రవములకు మేర లేదు. ఒక్కప్పుడు, పిండారీలను బ్రేరేచి మాపరగణాలపై దోపిడికిఁ బంపిరి. తమ రైతులను బ్రోత్సాహపఱచి, దక్షిణముగా మా నేలలకుఁ బాఱుచున్న కొండ కాలువల

నన్నింటిని మరలించుకొనిరి, కాఁబట్టి, మా సారవంతము లయిన నేల లన్నియు నాకసము నిరీక్షించునవి యయ్యెను. నీరు లేవడికి మా రైతు లందఱును దమ మడులను మాన్యములను బంజరు పడవేసి పొరుగూళ్లకు వలస యేఁగిరి. ఎంత తక్కువ పన్నుకు భూము లిచ్చెదమన్నను దరఖాస్తు పెట్టుకొనువారై తొక్కఁడును లేఁడు. వారు బలాఢ్యులు; మాట చనువుగలవారు; కాఁబట్టి, వారితో కలహించుటకు సమ్మతించక మా యొడయలు, పెక్కు తడవలకు వారితో సంధినిగోరి దూతలను బంపిరి. అట్లు పంపఁబడిన దూత లందఱు వారి సభలో నవమానింపఁబడక మరలి వచ్చుటలేదు. ఇటీవలఁ బంపఁబడిన వారు సైతము, వారిలో నవమానితులయి చక్కఁగా దెబ్బలు తిని ప్రాణావశిష్టులుగావచ్చిచేరిరి. దేవర! యిట్టి యవస్థకు సంస్థానము చిక్కి సంకట పడుతఱిని దివాణమున కెచ్చటి నుండి కప్పము గట్టుట.

సులే.—అయ్యా! ఏమీమాట లన్నియు వింతలుగా నున్నవి. రంగారావుగారు యోగ్యులు; మాకు వారిని జక్కఁగాఁ దెలియును. వారా మీ రాజుగారి కష్టములకుఁ గారణభూతులు?

వేం.—దేవరా! రంగారావు గారిని మే మెన్నటికిని దక్కువపఱచి పలుకము. వారు యోగ్యులని మీకంటె మాకుఁ జక్కఁగాఁ దెలియును, తమచర్య లెట్లున్నను, దివాణమునకుఁ గాలము దప్పక కప్పము చెల్లించెదరు. మీరనినట్లే దివాణమున వారికి మంచిపేరు గలదు. ఇంత మాత్రముననే వారిని సర్వత్ర నొక్క తీరుగా నుందురని విచారించుట యెట్లు?

మీ కణఁగియున్నవారు, మా ప్రభువులకు సైత మణఁగి యుండవలయు నను నియతి యొకటిగలదా? వారికిఁ గళింగ రాజ్యమునే యాక్రమించు కొనవలయునను తలంపేల గలుగరాదు. తమ చిత్తమునకుఁ దోఁచనిది కాదు.; ఐనను జెప్పెదను. వజీరుగారూ! రాజమత్సర ములకుఁ గారణములు గని పెట్టుటకెవని శక్యము?

హాస.—మీ రాజుగారు దండివారని విని యున్నామే. బొబ్బిలి వారితోఁ గలహించి జయింపరాదా?

వెం.—హా! అట్లు చేయుట కెవరు సాహసింతురు.? మా ప్రభువులు శూరులు. శూరధర్మము వారికిఁ జాల యెఱుక గలదు. అట్లుండియును, దివాణమున కత్యంతాప్తులుగ నున్న రావువారిని మా రొక్కనుట దివాణము వారినే మారొక్కనుట గాదా? ఇట్టి పనులకా మా ప్రభువులు, వివేకము గోలుపోయి సాహసించువారు? అట్లు యుక్తాయుక్తములను బాగోగులను బరిశీలించుటయుఁ దప్పుగలవారినిఁ దండించుటయును మీపని; మా శ్రేయమునుగూర్చి పాటుపడఁ దగినవారు మీరు; అట్టి తరుణములయందుఁ దోడ్పాటును గోరితిరేని, శక్యమైనంతవఱకు మా ప్రభువులుతోడు సహాయ పడుదురు. ఇంత కెక్కువగా నేమి చేయుటకును వారికధికారము లేదే. వేయిమాటలేల? దొరగారు! విజయనగరము పరగణాలను గూడ బొబ్బిలివారికే యొసఁగి మా ప్రభువులను బొమ్మని సెల విచ్చితిరా, ఇప్పుడే రాజ్యము వదలి యడవుల కేఁగెదరు. రాజ్యపుఁ గష్టములకంటెను వారి కరణ్యాటనమే యుత్తమము. అట్లు చిత్తగింపక, అనుగ్రహించి, మా దొరవారికే బొబ్బిలి రాజాముల కౌలు నొసఁగి దృఢపఱచి

తీరా, నిలువ నిలిచియున్న కిస్తీ పైకమంతయును, మీ యుద్ధ ఖర్చులును, బహుమానముక్రింద కోటిధనమును సమర్పించు కొనఁగలరు. ఇంతేకాక దమ సైన్యముతోఁ జేరి విరోధులతోఁ బోరాడుటకు సిద్ధపడెదరు. మీ యిచ్చను చిత్తగించి దెలుప వలయును.

లక్ష్మ—ఈ పెద్దాపురము మండలమునం దంతటను దీని చుట్టుప్రక్కల నున్న ప్రదేశములయందును రావువారిని దూషింపని వాఁడు లేఁడు. పసిబిడ్డనికి సైతము వారిపేరు భయప్రదముగానే యున్నది; వీరు నిజమే పలికెదరు. నేనీ ప్రాంతములవాఁడను గనుక నాకుఁ జక్కఁగాఁ దెలియును. అని గుటుకలు మ్రింగుచు మెల్లగాఁ బలికెను.

హై—ఔనయ్యా, జాఫరల్లీఖానుఁడు మీకు స్నేహితుఁడే కదా ?

వెం—వారికిని మాకును నేకాలపుఁ జుట్టరికము! మా దొరవారు సూర్యవంశ్యులుగారా? వారి కిట్టి తగవు మాలిన పనులతో నేమిజోలి? ఇంక నొకటి చెప్పెదను. మా ప్రభువులకు బొబ్బిలికోట పట్టుపడఁగానే, చికాకోలపుఁ గోటను ముట్టడించుటకు మీకుఁ దోడుపడెదరు. అట్లు వారు చేయుటకుఁ బ్రతిఫలముగాఁ జికాకోలము సర్కారును గూడ వారికే కౌలున కియ్యవలయును; కావునఁ జక్కఁగా బర్యాలోచించి యేమి యుత్తరు విత్తురో యట్లు మెలఁగుటకు సిద్ధముగా నున్నాము.

బుస్సి—సరి, మీరింక పోయిరండు. తేపటికి మీకు

సంగతులను దెలిపెదము. అని రాయబారిని జూచి పలికి యుచటనుండి పంపివేసిరి.

వెంకన్న యాచోటు వదలినపిదప యా విషయమయి వారిలో గొప్ప చర్చ గలిగెను. "వెలమదొరలు పోటుమగలు. వారితోఁడి పగ మనకేల ?" అనిరి గొందఱు, "ధర్మము దొలఁగనివారు బొబ్బిలివారు ; వారి శౌర్యము మన కెంతో యాదరువైనది; న్యాయము గుర్తెఱుఁగక మనము తప్పుత్రోవలఁ ద్రొక్కరాదు. ఇంతేకాక యిప్పటి నైజాము వారికిఁ రావువారి యెడల నభిమాన మెక్కువ" అనిరి గొందఱు. ఇట్లే పెక్కుఱు పెక్కువిధముల కార్యనిర్ణయమునకైన పలుకులు పలికిరి. ఇందఱి యభిప్రాయములును వివిధములుగా నుండినప్పటికిని, రావువారి పక్షమును వహించుటయం దేకీభవించినవి. ఒక్కఁడుగాని విజయ రామరాజుగారి కనుకూలముగాఁ బలుకలేదు.

తుదకు హైదరుజంగు బుస్సీదొరగారిని దదితరులను జూచి, "మనము దప్పక విజయ రామరాజుగారికిఁ దోడుపడ వలయును. ఇట్లు చేయుట రాజనీతికి విరోధముగాదు. శత్రువులనుండి మన సామంతులను రక్షించుట మనకుఁ గర్తవ్యము గాదా! ఈ న్యాయ మిట్లుండ నిండు. మన కిప్పుడు సొమ్మున కెంతో కష్టము గలిగియున్నది. వారికి హితము చేసినయెడల మనకుఁ జేరవలసిన సొమ్ముతో నింకను గోటిధనము లభించుచున్నది. వారికి హితము చేసినయెడల మనకు మేలు గలుగు ననుటయు నట్లుండ నిండు. దుర్దముఁడైన జాఫరల్లీని సాధించుట కతఁడు తోడు పడుచున్నాఁడు. మన మిప్పు డుదాసీనపఱచిన

మునకుఁ గలుగు నష్టమున కలవి యుండదు. తుదకు విజయ రామరాజుగారు మనలనే మార్కొనె ననుకొనుఁడు. మన గతి యేమగును? ఆతఁ డుత్తముఁడు గనుక అట్టిచేతకు సాహసింపఁడు" అనెను.

"సరి, మీ యిష్ట మిట్లుండినచో బొబ్బిలి జమీన్‌దారు వారి కొక లేఖ వ్రాయుఁడు" అని, బుస్సి, కొన్ని మాటలు పలికెను. ఆ ప్రకారమే లేఖ వ్రాయించి తేఁగా బుస్సిగారు క్రిందఁ దమ సంతకము పెట్టి, 'లకోటా' చేసి, చిరునామ వ్రాయించి కార్యమును నేర్పుతోఁ గొనసాగించుకొని రండని యానతిచ్చి యాకమ్మను హాసనల్లీఖాను గారి వశ మొసఁగెను.

ఈచేత యయుక్తమైనదని తెలిసియును సులేమాన్ ఉంరా గారును, హాసనల్లీఖాన్ గారును ఆటంకములు పలుకరైరి. అట్లు వారు మిన్నకుండుటకుఁ గారణములు గలవు. వీరు జాఫరల్లీకి మిత్రులు. ఇది వఱకును విజయ రామరాజుగారు జాఫరల్లీకి మిత్రులుగా నుండి యున్నట్లుండి యిప్పుడు తిరుగఁబడుట వారి కాశ్చర్య ప్రదముగానే యుండెను. కావునఁ గళింగ పెద్దరాజుగారి సైన్యములు బొబ్బిలివారితోఁ బోరి నశించిన యెడల జాఫరల్లీకిఁ గలిగిన కష్టములలో నొకటి దీఱునుగదా?" యని తలఁచిరి. వారికి స్ఫురించిన యీ యూహ యప్పటికేఁ బొసఁగి యుండినదనుట యుచితమే కదా!

హాసనల్లీఖాను, తనకుఁ గొందఱను సహాయపఱచికొని, బుస్సిగా రొసఁగిన యుత్తరమును దీసికొని బొబ్బిలి రాజ్యమున[illegible]ర్చి తత్క్షణమే పయనమయ్యెను.

20-వ ప్రకరణము

పరోపకారార్థ మిదంశరీరమ్.

విజయనగరము మహారాజుగారి రాయబారము జరిగిన రెండవదినము, అరుణోదయమున, సులేమాన్ ఉంరాగారు కాల్యకరణీయములను దీర్చుకొని, శిబిరమునకుఁ బడమటి దెసను గొంతదవ్వున బాట మీఁదుగాఁ బచారి తిరుగుచుండిరి. వీరితోడఁ బరివారము వారెవ్వరును లేరు. ఆ వేళకు సూర్యుఁ డుదయింపకుండినను దిక్కులన్నియుఁ దెలివిచెంది యుండెను. దిననాథుని రాకకుఁ గైవారములు సలుపుచున్నవో యనఁ బక్షిజాలములు, రుతములు సేయుచు పరిసరములయందున్న వృక్షములపైఁ జెలరేఁగి యెసఁగుచుండినవి.

ఉంరాగారు స్థూలదేహి గాకపోయినప్పటికిని బలసిన వారే. వారియొక్క నిండిన ముఖమును విశాలమయిన నొసలును వారా లోచనాపరలనుటకు నిదర్శనములుగా నుండినవి. దట్టమైనదియు మూరెఁడు నిడివికిఁ దగ్గనిదియు నగు వారి దాఢి సహజ గాంభీర్యమునకు వన్నె దెచ్చునదిగా నుండెను; అందు మూఁటి కొకటివంతున నరసిన వెండ్రుకల వలన వారి వయస్సు 45 సం॥ లకుఁ దగ్గర యుండునని చూపఱకుఁ దెలియవచ్చును. వీరి విశాలనేత్రములు నిడుపాటి ముక్కు వీరి శౌర్యమును వెల్లడిపఱచు చిహ్నము[illegible] [illegible] మండుచును. అట్లుండియు వారి ముఖము కారుణ్య

మునకు వాసస్థలమనుటను సూచింపకపోలేదు. వేయిమాట
లేల ? శౌర్యధనులు 'దయామయు లనుటకు వీరిని నిదర్శన
ముఁజూపవచ్చును.

ఉంరాగారు, పరమైకాంతులయి, క్రీఁజూపులతో మెల్ల
మెల్లఁగ నడుగులుపెట్టుచు ముందుకుఁబోవుచు వెన్కకు మర
లుచు నడయాడుచుండిరి. ఇతఁడేదో యంతము గనుపెట్టు
టకుఁగాని విషయమును గూర్చి, దీర్ఘాలోచనకుఁ జిక్కినట్లు
గానవచ్చుచుండెను. ఆ యాలోచన దేనిని గూర్చినది ? అతఁ
డేలఁ యట్టియాలోచన చేయవలయు ననుటను గూర్చి యిచ్చట
విమర్శింతము.

నాజరుజంగు భార్య ఛాంద్ బీబీ. ఈబిడ, ఉంరాగారి
మేనమామ కూఁతురు. ఈ యువతికి బాల్యముననే తల్లిదం
డ్రులు కాలగతి నొందుటచేత నుంరాగారే పోషకులయిరి.
వీరికి సంతానము లేనందున నామెయందే యితని మక్కువ
యతిశయించి యుండెను. ఛాంద్ బీబీకి యుక్తవయస్సు రాఁ
గానే నాజరుజంగుగారి కిచ్చి యెంతో వైభవముతోఁ బెండ్లి
చేసిరి. ఆమెకు భర్తయందుఁగల భక్తికి మేరయే యుండ
లేదు. నాజరుజంగుగారికి సైతము భార్యయందుఁ బ్రణయ
మెక్కువ. అక్కటా ! దైవగతిచే నిట్టి యన్యోన్యానురాగము
గల దాంపత్యమునకు వియోగము ఘటిల్లెను. ఎడఁబాటులతోఁ
దీఱెనా ? పెనిమిటి ప్రాణభీతుఁడై దేశత్యాగి యగుటయును,
డా నెచ్చుతక్కువగాఁ జెఱకుఁ జిక్కినట్లే భంగపడుచుండుట
యును ఆబిడకెక్కువ దుఃఖప్రదములుగ నుండినవి. గోముగాఁ
బెంచఁబడిన ఛాంద్ బీబీగారి దుస్థితి, చూచువారి గుండియలు

బ్రద్దలుచేయక మానదు. తనకు పుత్రికా నిర్విశేష యగు
ఛాంద్ బీబీయొక్క దుఃఖస్థితి కోర్వఁజాలక ఉంరాగారు, ఎట్ల
యిన నామెను భర్తతోఁ జేర్చి నెమ్మది గలిగించుటకుఁ దరు
ణము గనిపెట్టుకొని యుండెను. ఆతని వినాశమునకు ధూమ
కేతువుగా షేకుమహమ్మదు పంపఁబడెను, అతని మాయో
పాయములను జక్కఁగా గ్రత్తెఱఁగిన వాఁడగుటచేతనే, నాఁడు
షేకుతోడ బాలాజీసింగును శంకరసింగును ఉంరా పంప
వలసి వచ్చెను. చూచువారీ యిరువురు యుద్ధభటులు షేకు
నకు బాసటగాఁ బంపఁబడిరని దలఁచినప్పటికిని, యదార్థము
గా వారు నాజరుజంగు ప్రాణరక్షణమునకే పంపఁబడినవారు.

ఇప్పుడు, ఉంరాగారికి షేకును గూర్చిగాని యతని
ప్రయత్నములను గూర్చి గాని యెంతమాత్రము తెలియదు.
బాలాజీసింగు శంకరసింగులలో నెవ్వఁడుగాని యా సంగతి
నిదివఱకును దెలుపఁడాయెను. అట్టి భటులు మిన్నకుండుటకుఁ
గారణమేమని యతఁ డూహించెను. "ఒక వేళ, వీరందఱు
జాఫరల్లీ చేతికిఁ జిక్కఁగా నతఁడు వీరి విషయము గుర్తెఱిఁగి
చెఱయం దుంచెనో, లేక చంపివేసెనో? అట్లుగాక, నావిశ్వాస
పాత్రులగు భటులయొక్క యభిప్రాయము దెలిసి షేకే వారిని
చంపివేసెనో ?" అని యెదియు నిశ్చయించుటకు వీలుగాక
తొట్రుపడుచుండెను.

తుదకతఁ డేమియుఁదోచక మోమెత్తి చూచునప్పుడు,
ఒక హిందూ సన్యాసి గుఱ్ఱము నెక్కి నగరమును గూర్చి పోవు
చుండెను. తనకుఁ దాపుగా నతఁడు రానురాను, సన్న్యాసి
దూరప్రయాణము చేయుచు వచ్చువాఁడుగా నుంరా గ్రహింపఁ

గలిగెను. ఇతఁ డొకవేళ చిక్కాకోలమునుండి వచ్చువాఁడుగా నుండిన నితని కచటివింత లేమయినను దెలిసియుండునే కదా! అని యూహించి, అతనికి వినయముతో సలాము చేసి, గుఱ్ఱమును గొంతసేపు నిలుపునట్లు సైఁగఁజేసెను. అట్లు హుటాహుటిని వచ్చునతఁడు మన రామబ్రహ్మము.

సులే—అయ్యా, స్వాములుగారు! మీ రెచ్చటనుండి వచ్చెదరు.

రామ—మాకొకచో టనుట గలదా? మే మిట్లే రేయింబగళ్లు సంచారముచేయునట్టి విరాగులము; ప్రకృతము చిక్కాకోలమునుండి వచ్చుచున్నాము.

సులే—అచ్చట వింతసంగతు లేమయినను గలవా?

రామ—మీ మాటల కర్థము కాలేదు; వింత సంగతులన నెట్టివి?

సులే— అందలి రాజ్యాంగమునుగూర్చి యడిగెదను.

రామ—సరి, అంతపట్టుదలతో నడుగుట వలన మీ నామధేయము దెలిసికొనఁ గోరెదను. అని, యించుక సందేహముతో నతని మోముపైఁ జూడ్కి నిలిపెను.

సులే—నాపేరునా తెలియఁగోరితిరి? నన్ను సులేమాన్ అందురు.

రామ—ఆహా, మహాభాగ్యము! ఆడఁబోయిన తీర్థ మెదురొగ్గొని వచ్చినట్లున్నది. నాకుఁ బ్రయాసలేకయే యితని దర్శనము లభించెను. అని సంతసించి, "అయ్యా, నేను మీ యొద్దకే వచ్చుచున్నాను. దైవానుగ్రహమున నాకు మంచి తరుణమునందు మీ దర్శనము లభించెను" అనుచునే గుఱ్ఱము

నుండి దిగెను. ఇరువురును దాపుననే యున్న యొక తోఁపులోనికిఁ బోయి యొక చెట్టునీడను గూర్చుండిరి.

సులే—స్వామీ! మీ రెవరు? నన్నేల వెదకికొని వచ్చినారు. మీ వేసముచేత ఫకీరుగాఁ గన్పట్టుచున్నారు; వైఖరిని జూడగా మహాశూరునివలెఁ గనఁబడెదరు. మీ రేదో లౌకికవ్యవహారమవలంబించి యిట్టి యుడుపులను ధరించినట్లును మీరు మహాశూరులనియును మీ రెక్కియుండిన గుఱ్ఱమును, ధరించియుండు ఖడ్గమును జాటి చెప్పుచున్నవి.

రామ—ఔను, మీయూహ సరియైనదే. అయినను, నేనుస్వార్థపరుఁడనై మీదర్శనము గోరిరాను. ఇప్పుడు రెండు సంస్థానములు మీ కారుణ్యమెదురుచూచుచున్నవి. మీరిప్పుడించుకంత యుదాసీనత వహించితిరో యన్యాయముగ నవి మునిఁగిపోవును.

సులే—ఆసంస్థానములెవి? అవి యెట్లు నా దయవలన మునిఁగిపోవక నిలువఁ గలవు?

రామ—మనవి చిత్తగింపవలయును. విజయనగరము మహారాజుగారు బొబ్బిలి చిక్కాకోల సంస్థానములను ధ్వంసముచేయవలయునని కంకణము గట్టికొని యున్నారు.

సులే—జాఫరల్లీగారికిఁ బెద్దరాజు గారు ప్రాణాధికమిత్రులుగా నుండిరే నిర్నిమిత్తముగ నేల విరోధించిరి?

రామ—వారు జాఫరల్లీగారిని విరోధించుటకు నిమిత్తము గలదు. బొబ్బిలి రావు వారి యెడల వారికిఁ బగగలదు. వారిని హతమణఁచుటకు వారికి దివాణము వారి యాశ్రయము గావలసివచ్చెను. జాఫరల్లీ గారిని జేవదలినఁగాని యతని కట్టి

పని గొనసాగదు. కాఁబట్టి, చేవదలుటయే కాక వారినిహతము సేయవలయుననియు నుద్దేశించి యున్నారు.

సులే—ఆలాగా! మహారాజుగారి సంకల్పము మీకెట్లు దెలియవచ్చెను?

రామ—"ఈ సంగతినే మీరు గమనమంచి వినవలయునని కోరెదను" అని, తాను విజయనగర మేఁగినది మొదలు ఆచోటికివచ్చి చేరినదనుక జరిగినసంగతుల నన్నిఁటిని దెలిపెను.

సులే—సరి, సంగతులు దెలియవచ్చెను. అయినను నాకొక విషయమునందు మాత్రము సందేహము వదలకున్నది. మీయిట్టి ప్రవర్తనమునకుఁ గారణమయిన యుద్దేశమేమి?

రామ—నా యీ ప్రవర్తనమునకు ముఖ్యోద్దేశము, మీవంటి ప్రభువుల నాశ్రయించి, వారివలన షాహావారి యభిమానము సంపాదించి మహారాజుగారిని బదవిభ్రంశులనుజేసి యాస్థానమున నతని పితృవ్యపుత్రుని స్థాపించుటయే. ఈలో మట్టుమీఱి, మహారాజుగారు చిన్నసంస్థానాధిపతులను ముట్టడించి, నాతలంపునకు విరుద్ధముగా నెక్కువ ప్రసిద్ధిని జెందిరేని, వారిఖ్యాతి కోర్వలేసి నేను, నాపగను దీర్చుకొనుటయందే, చిన్నసంస్థానాధిపతులును న్యాయబద్ధులును నగుజాఫరల్లీగారికిని బొబ్బిలి మహారాజు గారికిని ఉపకరింప సంకల్పించుకొంటిని. కావుననే, వీరు పరస్పరము తోడ్పటుకుఁ దగినట్లు ప్రేరేచితిని. వారిరువురును నాయభీష్టము చొప్పుననే మైత్రిగలిగి యున్నారు; అని మీభటులవలన వింటిని. మాటల పరాకున మఱచినాను; మీరు నన్ను నమ్మి నాయిచ్చ నెఱవేరుటకై యుపకరించు నిమిత్తము మీ భటులలో నొకఁడైన

బాలాజీసింగు మీకానవాలు చూపు నిమిత్త మొసఁగిన యుంగరమిదిగో యున్నది; చిత్తగింపుఁడు. అని యాయుంగర మతని చేతి కొసఁగెను.

ఆయుంగరమును జూడఁగానే యుంరాగారికి బ్రహ్మాము గారి మాటలయందుఁ జాలనమ్మకము గలిగెను. అతఁడు నిష్కపటియు సత్యసంధుఁడును అని దలఁచి, "సరి, ఇప్పుడు నాజరు జంగు గారెట్టి స్థితియందున్నారు?" అని బ్రహ్మాము గారి నడిగెను.

రామ—వారు మంచిస్థితియందే యున్నారు. వారికిఁ జిక్కాకోలము క్షేమకరము గాదను మీయూహయే స్థిరపడి, ప్రకృతము చెన్నపురమునకుఁ బంపఁబడిరి. అది యాంగ్లేయపరిపాలితము గాన వారికి హింసగలుగదు. ఇంతేకాక, వారచ్చట మిగుల గూఢముగాఁ బరిపోషింపఁ బడుచున్నారు.

సులే—సంతోషము—నాకిప్పుడు సంగతులన్నియు విశదమయ్యెను! సందేహము దొలఁగెను; మీరనినట్లే, విజయరామరాజు గారీ సంస్థానములను రెంటిని దనయధీనమునకుఁ దెచ్చుకొనఁగోరి ప్రయత్నము చేయుచున్నారు. వారి ప్రయత్నములును గొనసాగి వచ్చినవి. ఇఁకఁ దాము బొబ్బిలి చిక్కాకోలములకుఁ బ్రభువులుగాఁ జాటించుకొనుట యొక్కటియే యవశిష్టము. కొన్ని దినములలోనే బుస్సీవారి సైన్యముతోఁ జేరి బొబ్బిలికోటను ముట్టడింపఁ గలరు. అది హతమయి స్వావశమునకుఁ రాఁగానే చిక్కాకోలమున కెత్తఁగలరు.

రామ బ్రహ్మాము గారి కీమాటలు పిడుగుల ననుకరించినవి. హా, హతవిధీ! ఏమి నాప్రయత్న మిట్లు విపరీతముగా

ముగిసెను? నేనొకటి దలఁప దైవ మొకటిగ తలఁచెడినే! అయ్యో, మీవంటి సజ్జనులుండియూ యిట్టికార్యమునకు బుస్సీని వదలుట? ఇది యనుచితమని మీచిత్తమునకే కన్పట్టక పోయెనో? దీనికింకనైనను బ్రతివిధాన మొకటి లేదా? మీరు వారి సరదారులలో ప్రముఖులని విని యున్నానే. మీరే కూడదని పట్టుపట్టిన యీయుద్యమము నిలిచి పోవదా? ఆటంకపఱచుటకుఁ దమ కిష్టము లేదా? పిచ్చుకమీఁద బ్రహ్మాస్త్ర మనినట్లే చిన్న సంస్థానాధిపతుల మీఁదనా మీ మగఁటిమి. ఈయుద్యమము మీకందఱకును—హా! షాహావారికిని అపఖ్యాతిని దప్పక గలిగింపఁ గలదు.

సులే—ఏమి చేయవచ్చును? మాయత్నమునకు మీఱియే కార్య మిట్లు ముగిసెను—ఔను, మేము బొబ్బిలిని ముట్టడించిన యెడల జాఫరల్లీ కేమి నష్టము?

రామ—అతనికిఁ గలుగఁబోవు కష్టమును నష్టమును గూర్చియే మీతో నింతగా మందలించుచున్నాను. బొబ్బిలిని ముట్టడించినయెడలఁ జిక్కాకోలమును ముట్టడించి నట్లును, జిక్కాకోలమును ముట్టడివేసిన బొబ్బిలిని ముట్టడివేసినట్లును, ఇంతకుమున్ను నేను జెప్పిన మాటలవలననే మీచిత్తమునకు విశదమయి యుండును. వారిరువురలో నేర్పడిన యొడంబడిక యభిమత మిట్టిది. నేనొకటి చేయఁబోయినఁ గాల దోషము వలన మఱియొకటిగాఁ బరిణమించుచున్నది. నేను మహారాజా గారి పదవి భ్రంశమును, ఆచిన్న సంస్థానాధిపతుల క్షేమమునుగోరితిని. దానికి విరుద్ధముగా కదా యేర్పడెను! ఇందుల కుపాయమేదియు లేదా?

సులే—ఉపాయముగలదు. ఒకసంస్థానము చెడినప్పటికిని, మఱియొకటి యైనను దప్పించుకొనుటకు మార్గము గలదు. ఇప్పుడు బొబ్బిలి మీఁదికి దాడివెడలుట నిశ్చయింపఁ బడెను. ఇట్టి తరుణమున జాఫరల్లీ రంగారావు గారికిఁ దోడురాకయుండెనా తప్పించుకొనుటకు హేతువు గలుగును.

రామ—అదియెట్లు? ఆయిరువురు సంస్థానాధిపతులలో నొకరి నష్టము మఱియొకరికి శ్రమయొసఁగునది యని మఱి యొక తడవకును జెప్పుచున్నాను. నేఁటికి మానినను మఱి యేనాఁటికైనను, మహారాజుగారి బలసమగ్రత జాఫరల్లీ గారికిఁ గష్టప్రదమే యగును. దివాణము వారికి సైతమతని ప్రాబల్యము నెమ్మది గలిగింపదు. మొన్నటి వఱకతఁడు దివాణము వారిని నిర్లక్ష్యపఱచినది మీకుఁ గ్రొత్తగాదే!

సులే—ఔను, ఇప్పుడు మీఱిపోయిన పనిని సవరించుటకుఁ దగినయుక్తి గనఁబడకున్నదే.

రామ—ఈయల్పవిషయమునకుఁ బన్నవలసిన యుక్తి యేమున్నది? మీరు మహారాజు గారికిఁ దోడుపడకుండినఁ జాలును.

సులే—అది మవ యత్నమునకు మీఱిపోయినది. మహారాజుగారి పైకమిచట నుండు వారికి ధారాళముగ నెక్కిపోయెను. వీరు ధన పిశాచములు; వీరికి ధనమున్నఁ జాలును; న్యాయ మన్యాయము గాను, అన్యాయము న్యాయముగాను క్షణకాలముననే మాఱిపోవును" అని, కొన్ని నిముసముల దనుకఁ దన దాడీని దువ్వికొనుచు దీర్ఘాలోచనా పరవశుఁ డయ్యెను. తుదకు, "సరి, మీయభిప్రాయ మిప్పుడే విశదమా

యెను. మీయిష్టప్రకారము గార్యము కొనసాగుట కొక్క యుపాయమే యున్నది. మీచేతి కొకజాబొసంగెదను. ఆలస్యము చేయక దానిని మన షాహా వారి కందింపవలయును. వారికి జాఫరల్లీని గూర్చి విరోధమున్నను, బొబ్బిలిరంగారావు గారి యం దెక్కువ మక్కువ గలదు. వారి కతనియం దెంతో విశ్వాస ముగలదు. అట్టి తమయంతరంగ మిత్రుని వినాశమునకు వారు సమ్మతింపరు. సంగతి వారికిఁ దెలిసినఁ జాలును. సైన్యములను వెనుదీయుటకే యుత్తరువు చేయుదురు. ఈకార్యము త్వరగాఁ జేసి ముగింపవలయును. ప్రకృతము నేను జేయఁజాలిన సహాయమింతకంటె నెక్కువలేదు” అని, యతని నందేయుండనిచ్చి తన గుడారమునకేఁగి, శాయి, కలము, కాగితము దెచ్చి యొక యుత్తరము నైజామువారి పేరికి వ్రాసి, బ్రహ్మము చేతి కొసఁగెను. అతని పయనము నిరాఘాటముగా సాగునిమిత్తము, దారి వెచ్చము క్రిందఁ గొంతపైకముఁగూడ నొసఁగెను. చేతికి జాబు చేరఁగానే రామబ్రహ్మమున కించుకతృప్తి గలిగెనని చెప్ప వచ్చును. అంతట నతఁడు హుటాహుటిని బయనము సేయుచు భాగానగరము చేరఁగల వాఁడయ్యెను.

21 వ ప్రకరణము

“ శత్రుముల కష్టమునకుఁ బగవారును జాలిపింతురు”

శ్రీ రంగారావుగారు కరఁగునఁ గాచి, పోఁతపోసిన వీర రసమో యన గద్దియపైఁ దనరారుచుండిరి. వారి పార్శ్వము నందు, పెండ్లికొడుకు నలంకారములతో దుర్నిరీక్ష్య తేజముగలిగి

వేంగళరాయఁడు వెలయుచుండెను. దండనాథులును, రాజ బంధువులును నగు నేకాంగవీరులు దమతమ పరువుల కనువైన యాసనము లలంకరించుచుండిరి. అట్లా దినము కొలువమరి యుండిన శ్రీ రంగారావును దర్శించియుండినచో నెట్టి కవియును వారిని త్రిలోకజేతయగు శునాసీరునితోఁ బోల్పక మానఁడు.

ఇట్టి తరుణమున హాసనల్లీఖానుఁడు దన మితపరివారము వారితో నగరు కెదుట నిలిచి, మహారాజుగారికిఁ దన రాక యెఱింగించునట్లచటి ద్వారికునితోఁ జెప్పెను. వాఁడేగి, మహారాజుగారికి బరాకుగొలిపి, హాసనల్లీఖానుఁడు వచ్చి నగరు వాకిట నిలుచుండుటను దెలిపెను. అంతట, రాజుగారి యానతిపై పటాలపు రామన్న లేచిపోయి, హాసనల్లీని బిలుచుకొని వచ్చి యుచితాసనమునఁ గూర్చుండఁ బెట్టెను.

హాసనల్లీఖానుఁడు మన రంగారావుగారి కాప్తుఁడు. ఈ న్యాయ మట్లుండఁగా, నాసభనలంకరించి యున్న వెలమ దొరలు ప్రళయకాల భైరవులవలె భీకరాకృతులతోఁ గన్పట్టు చుండిరి. కాఁబట్టి, తాను వచ్చిన కార్యమును గూర్చి ప్రస్తావించునంతటి సాహస మతనికిఁ గుదురలేదు. దుర్నిరీక్ష్యులగు వెలమవీరుల దర్శనమువలనఁ గలిగిన హాసనల్లీయొక్క గుండియ యదురుపాటు దీరుటకుఁ గొన్ని నిముసములు గావలసి యుండెను.

“అయ్యో, ఇతఁడు నాకు మిత్రుఁడు; శూరపుంగవుఁడు. నిదురించు సింగమును మేలుకొలిపి, దాని డెందమునకుఁ గ్రోధరసమును బూరించి, దన వినాశమునకు దారి యేర్పఱచు కొనిన మూఢునివలె, నే నెట్లీ సంగతి నిచ్చట వెల్లడిపఱు

తును?" అని భయపడెను. "అక్కటా! ఇట్టి వైభవోపేతులను, ఇట్టి యుదారమూర్తులను గష్టములపాలు సేయుటకు నాకు మన స్సొప్పకున్నదే" అని పరితపించెను. అతని హృదయ మీ పరితాప మనుభవించునప్పుడు, కన్నులనుండి రెండు నీటిబిందువులుగూడ రాలినవి.

తమ సభ కేఁగుదెంచిన హాసనల్లీయొక్క క్లేశమున కందలి సరదారు లందఱును జింతిల్లిరి.

ఇతనికి దివాణమునం దేమయినను బోరామిగలిగెనో యని వగచిరి; దాని కారణము దెలియక, మహారాజుగారు సైతము చింతిల్లి, "అయ్యా, ఖానుగారు! దివాణమువారు సుఖమున్నారే కదా! మీకందలి మన్ననల కేమియుఁ గొఱఁత గలుగదే?" అని కుశలప్రశ్న యడిగిరి. ఆ యమాయికపుఁ బలుకులకు హాసనల్లీకి దుఃఖము మఱింత పొంగివచ్చుట యొక వింతగాదు. "హా! యీ ధర్మనిధికి, అనిష్టవిషయము నెట్లు దెలుపుదును?" అని వగచెను. ఆ వగదీఱుటకుఁ గొంత యవకాశము పట్టెను. తుదకు, తన వచ్చిన కార్యమును గొనసాగింపవలసినది తన ధర్మమని భావించెను. పిదప, ఎట్టకేలకు హాసనల్లీఖానుఁడు, "అయ్యా, మాకెట్టి కొఱఁతయుఁ గలుగదు. మీకుఁ గలుగఁబోయెడు శ్రమల నుద్దేశించియే వగచెదను" అని బదులు పలికెను.

అతని మాటల కచటివా రందఱును దిగ్భ్రమకు లోనయిరి. "శ్రీరావువారిని దేఱిచూచునంతటి దిట్ట యెవ్వఁడును లేఁడు. ఇతనికి నైజాము సంస్థానమునఁ జను వెక్కువ; అట్లుండఁగా నితఁడేల యిట్లశ్లీలముగాఁ బలుకుచున్నాఁడు. ఇట్లు

పలుకుట కితనియందున్మాదలక్షణము లెవియుఁ గానరావే!" అని పలువిధములఁ దలపోయఁ దొడఁగిరి.

ఇంతలో హాసనల్లీఖానుఁడు, దాను దెచ్చిన బుస్సీగారి ఫరమానాను శ్రీ రావువారిచేతి కందించెను. దాని సారాంశమే యిచ్చట సూచింపఁ బడుచున్నది.

శ్రీ బొబ్బిలి మహారాజుగారయిన రంగారావుగారి సన్నిధానమునకు—ఉత్తర సర్కారులపై సర్వాధికారము వహించిన నేను, విన్నవించుట యేమనఁగా—ప్రకృతము దమయధీనమునందున్న బొబ్బిలి రాజాముకోటలు రెండును వాని తాలూకు భూములను శ్రీ పూసపాడు విజయరామరాజుగారికే కౌలున కిచ్చివేసితిని. కాఁబట్టి, మీరు, మీకుఁగల జంగమవస్తువులతోడను మీ పరివారముతోడను ఈ ఫరమానా చూచిన 24 గంటలకు లోపల బొబ్బిలికోటను వదలి, కళింగరాజ్యపు టెల్లలకు వెలుపలనున్న భూములకుఁ బ్రవాస మేఁగవలయును. అట్లు చేయక మీరుగాని మీతోఁ జేరినవారుగాని యాజ్ఞోల్లంఘనముచేసి యున్నచోటనే మెలఁగుచుండినచో, పోరొనఁగూడునని దీనివలనఁ దెలియఁజేయుట యగుచున్నది.

ఆఫరమానా చదువఁబడఁగానే యాసభ్యులందఱును గుపితులయిరి. వారి హృదయములోని కోపాగ్ని బహిర్గతము గాఁజొచ్చెనో యనఁ గన్నులయందును జెక్కులయందును గావిరి పర్వఁదొడఁగెను. ఆయదనున శ్రీరంగారావు గారొక్కరే తటస్థులై యుండిరి. వారి గాంభీర్యమున కెంతయు లోపముగలుగ లేదు. ఇట్టి సమయమునం దెట్లు సభ్యులలోఁ బెల్లురేఁగిన

కోపాగ్ని తన్నుఁ బ్రథమాహుతిగఁ జేసికొనక తప్పునని వగచి హాసనల్లీ ఖానుఁడు పెల్లుగ దిగులు ననుభవించుచుండెను. అందలి శూరపుంగవులలోఁ బటాలము రామన్న గారును, దామెర్ల ధర్మరాయఁడు గారును, వేంగళరాయఁడు గారును దమ్మెఱుఁగని కోపమునకు వశులయి రోజుచుండిరి.

అప్పుడు, కార్యజ్ఞుఁడును, శూరనిధియు, నగు ఇనగంటి నృసింహరాయఁడు లేచి, అయ్యా, హాసనల్లీగారు! మాప్రభువు దివాణమునకుఁ గానిపను లేమి చేసిరి; వీరియందింతగా నలిగి శత్రువులను దెచ్చి కోటలో నిలుపునంతటి ప్రమాదము వీరి వలన నేమి గలిగెను?" అని సాధువచనములు పలికెను.

అంత హాసనల్లీఖాను ప్రభువులను జూచి, " అయ్యలారా! ఈపొరపాటు దివాణము వారిది గాదు; నడుమ నేర్పడినది. ఇప్పటికిని కార్యము మీఱదు; మహారాజుగారొక నెల దినముల వఱకు బొబ్బిలిని దొలఁగి యుండినఁ జాలును; మరల వీరి నీస్థానమును జేర్చుటకు నేను బ్రయత్నించెదను. హా! కష్టము లెట్టి చక్రవర్తులను వదలినవిగావు. విషజ్వాలలచే క్షణ కాలముననే విలయమొందించు కాలసర్పములు గూడ, వేసవికాలములయందు పుట్టలలో నణఁగి పడియుండుట లేదా!" అనెను.

"ఓహో మా శరీరములయందుఁ బ్రాణము లుండఁగానే, మా యావాసములు శత్రువుల కప్పగించి యడవుల పాలగునంతటి హైన్యమునకా లోఁబడుట? మాభుజసారము చూఱపోయెనో?" అని గర్జిల్లి వేంగళరాయఁడు పలికెను.

"ప్రభువా, మీరిట్లుపలుకఁ దగదు. ఎప్పటికిని దివాణమువారు బలాఢ్యులు; వారితో నెదిరిపోరాడరాదు. ఉపాయమును వదలి భుజసారమునే నమ్మియుండువాఁడు శూరవరేణ్యుఁడయ్యును ఘోర మరణమునకే గుఱి కావలసివచ్చును" అని హాసనల్లీఖానుఁడు పలికెను.

"అయ్యా, ఖానుగారు! మేమిది వఱకు దివాణమునకు న్యాయము దప్పి మెలఁగము. అట్లు మెలఁగిన వారికిఁ గదా మీహితబోధ కావలయును. కప్పముఁ జెల్లింపమంటిమా? ఆపత్కాలములయందు దివాణము వారికిఁ దోడుపడమంటిమా? అట్లుండ నిర్నిమిత్తముగా మాయందలుగ వలసిన న్యాయమేమి? అట్లు నీతిదప్పి మెలఁగిరేని, హా! దివాణము వారేమి, ఈప్రపంచమే వారికిఁ దోడుపడి మామీఁది కెత్తి వచ్చినప్పటికిని, మాభుజబలము చూఱపుచ్చి వంశమున కపఖ్యాతి గలిగింపము" అనెను ధర్మరాయఁడు.

"ప్రభువులారా! ఈసర్కారులకుఁ బూసిగారు సర్వాధికారియనియు, బొబ్బిలి రాజాము గడీలు విజయ రామరాజుగారిచే నేలింపవలె ననుట, వారి యభిప్రాయమనియునుమీరింకను నూహింపకున్నారే" అనెను హాసనల్లీ.

"వారినేల పీడించెదరు? చెడినకార్యమును సవరించుకొనుటకుఁ బ్రయత్నింపవలయును. అట్టి పనికితఁ డసమర్థుఁడు" అని యింత దనుక మౌనముతోనున్న మహారాజుగారు సెలవిచ్చిరి. వారి ప్రగల్భములగు పలుకులకు సభ్యులందఱును సిగ్గుచెందవలసిన వారైరి. హాసనల్లీఖానుఁడును, "ఏమి వీరియొక్క ప్రాగల్భ్యము! గాంభీర్యము! ఆహా, వీరు బొబ్బిలి సర్కారును

మాత్రమా? ప్రపంచమునే పరిపాలించునంతటి దిట్టతనము గల వారు!" అని తనలో మెచ్చుకొనెను.

అచ్చటి వారిలో వృద్ధుఁడును, గార్యవేదియు, శౌర్యవంతుఁడును నగు దామెర్ల-రామరాజు, రాజహృదయము దెలిసి, "అయ్యా, ఖానుగారు, మీరు దెచ్చిన ఫరమానా నంగీకరించితిమి; మాగడీలకొఱకు, మాశత్రువు లెంతపైక మొసఁగెద మనిరో యంత మేమొసఁగెదము. అధికారి యొద్దకు మారాయబారిని బంపెదము. మీరు కార్యమనుకూల పఱచి పంపినఁ జాలును" అని యుక్తి యుక్తముగఁ బలికెను.

అప్పుడింగి తజ్ఞుఁడయిన బొక్కసపుటుద్యోగి, మహారాజుగారి యభిమతము దెలిసి పైఁడి పళ్లెముల నిండుగ బహుమతి ద్రవ్యములను సిద్ధపఱచి తెప్పించెను. నగరు పారుపత్తెమువాఁడు, హాసనల్లీని ఉపచరించి వానిని బహూకరింపఁ బోవఁగా నతఁడు, "అయ్యో! మీకీశుభవార్తను దెచ్చిన నాకా యీబహుమతి? నేనర్హుఁడను కానే" యని వాని నంగీకరించుట కించుక సందేహించెను.

"అట్లు చేయరాదు, అది న్యాయవిరుద్ధము. మాసంస్థానమును బ్రవేశించువారు మా సత్కారమున కర్హులు. అయ్యా, ఖానుగారు! పలుమాటలేల? మా విరోధియే మా సంస్థానమునకు వచ్చి మమ్ము వేఁడికొని యుండినయెడల నింత శ్రమలేకయే యతనికి మా బొబ్బిలి రాజాము గడీల నొసఁగి యతని యిచ్ఛానుసారమే మేము ప్రవాస మేఁగుదుము. అట్లుచేయక యతఁడు కుత్సితమార్గముల మెలఁగుటవలన మా నిగ్రహ స్థానమునందు నిలువవలసి వచ్చెను. ఇప్పు డతఁడు మిమ్ము నేకాదు. మఱియా

లోకమునంతటినే ముందడుకొని వచ్చినప్పటికిని మాప్రాణము లుండునంతకు బొబ్బిలి రాజాము గడీలు లభింపవు. అట్లుండియు మేమేల నీతిదప్పి మెలఁగ వలయును? (బంతెన, బుచ్చన్న పంతులను జూపి) ఇతఁడు కార్యవేది; వాగ్మి; ఇతనిని రాయబారిగా మీ యజమానుల కడకుఁ బంపెదము. కర్తవ్యాంశములు మీయిష్టానుసారము గొనసాగింపుఁడు" అని రావుగారనిరి.

తత్క్షణమే బుచ్చన్నపంతులుగారు లేచి, "మహాప్రభు! తమచిత్తమున కెక్కునట్లుగాఁ గార్యము నిర్వహించుకొని వచ్చెదను; నిర్వహించికొనియే బొబ్బిలికి వత్తును" అనెను. అంతట, హాసనల్లీ, బహుమానముల నంగీకరించెను. రాజకీయోద్యోగుల కైదండతో నతఁడా సభనుండి తరలునప్పుడు, రావువారిని జూచి, "మహాప్రభు! నేను మీ పట్ల మేలు గలుగునట్లే మెలఁగువాఁడను; పోయివచ్చెదను" అని ముమ్మాఱులకు సలాములు సమర్పించెను. పిదప, హాసనల్లీ పరివార సమేతుఁడయి, బుచ్చన్నతోను అతని వెంటవచ్చు భటులతోను బొబ్బిలి వదలి, రాజమహేంద్రవరమును గూర్చి పయనమయ్యెను.

22-వ ప్రకరణము

"సంపదలు దోఁచుతఱి మహా-జనుల హృదయ
మభినవోత్పల కోమలం - బై తనర్చు
నాపదలు దోఁచునపుడు మ-హామహీధ
రాశ్మసంఘాత కర్కశం - బై యొసంగు."

హాసనల్లీఖాను రాజసభను వదలి పోయిన కొంతదనుక సభ్యులలో సద్దణఁగియుండెను. హృదయమంతయు నిండి

కొనియున్న క్రోధరసము వారిలో నెవ్వరిని పలుకనిచ్చినది గాదు. తుదకు మహారాజు సభ్యులను జూచి, మందహాసము మొ మలరించుచుండఁగా—"నాకుఁ గార్య మివ్విధముగానే పరిణమించునని గొన్ని దినములనుండి దెలియును. ఆ తీరుననే యిప్పటికీ విధముగాఁ దేలెను. నేను నా బిడ్డలకంటె నెక్కువగా నా ప్రజలను భటులను నుద్యోగియులను బెంచుచుంటిని. నిర్నిమిత్తముగా వారిని శాత్రవుల ఖడ్గముల కప్పగించి, నేను విజయలక్ష్మిని వహించుటకు మన స్సొప్పకున్నది. విజయరామరాజుగారి విరోధమంతయును రేచర్లవారి కుటుంబము వారిని గూర్చియే; వారు దేశమునుండి తొలఁగిరేని వారి విరోధము సైతము నశించును; నా ప్రజలుకూడ సుఖింతురు. ఏమి? యీ యభిప్రాయము శ్లాఘాపాత్రమే కదా?" అని రావుగారు పలికిరి.

"మహాప్రభు! ఈ పలుకులు భుజసార సమగ్రులగు వెలమదొరలకుఁ దగినవా? హా, ఏమి మా దౌర్భాగ్యము! వీర పుంగవులగు తమవలన నిట్టిపలుకులు వినవలసివచ్చెను. ఈ శరీరము మీయది; ప్రభువునిమిత్తము ప్రాణము వదలుట వలనఁ జిరకీర్తులు గలుగును. ఇట్లుండ, ఫరాసులయిననేమి? విజయరామరాజుగారి సైన్యము వారైననేమి? ఈ సాళువపుఁ డేగకు వారందఱును గొక్కెర గుంపులే. నన్నొకనిఁ బంపుఁడు. శత్రుసైన్యముల ధ్వంసముచేసి విజయలక్ష్మిని దెచ్చి తమ పాద పీఠమునొద్ద నిలిపెదను. హా! ఇదెంతమాత్రము! శాత్రవుల పుఱ్ఱెలను దెచ్చి దమ పాదపీఠికకుఁ బొదవెదను. అని మహోగ్రుఁడై పలికెను పటాలము-రామన్న.

"అన్న దేవరగారు! విరోధి వరూథినిలోఁ దూఱి వీరవిహారము సలుప నా కనుజ్ఞ నిండు. మీ మెచ్చునకు వచ్చునట్లు మెలఁగనేర్తును" అనెను వేంగళరాయఁడు.

ఇవ్విధముగానే యాసభ నలంకరించియున్న యేకాంగవీరు లొక్కరొక్కరును దమ్ముఁ బగులమీఁదికిఁ బంపునట్లుగా రాజుగారి యానతిని వేఁడిరి.

"అన్నలారా! మీ శౌర్యము లీపాటివని నాకుఁ జక్కఁగాఁ దెలియును. మనము నీతిదప్పి మెలఁగరాదు. పరులు నీతిదప్పి మనమీఁదికి వచ్చిరేని వారి నెదుర్కొనవలసినది మనధర్మము. కాఁబట్టి మనము ప్రమత్తులముగాక జాగ్రత్త పడవలసినది యావశ్యకమే" అని రావువారు వీరవారమును బొగడి, కోటగవనులకుఁ దగినశూరులను సైన్యములతో నిలిపిరి; బురుజులమీఁద నిలిపియున్న ఫిరంగులను దరుణము దటస్థించునప్పుడు ప్రయోగించుటకై దిట్టతనముగల పౌజు దొరలను వలయు సామగ్రులతో నా యా చోటుల నిలుప నట్లానతిచ్చిరి.

సభ్యుల హృదయము లా దిన మనుభవించిన శోకక్రోధవీర రసములను వర్ణింప నెవనికి శక్యము? సభ కలియఁగానే యొక్కరొక్కరు నొక్కొక్క విధముగా మాటలాడికొనుచుఁ దమ నివాసముల కేఁగిరి. కొందఱు, ఆహా! ఎందును గానఁగాని సౌజన్యనిధిని నిర్నిమిత్తముగాఁ జెఱుపఁ దలకొనినవారు, బ్రహ్మకల్పములు బ్రదుకఁబోయెదరు?" అనిరి; కొందఱు, విజయనగరాధీశుల కెంత చూపోపమి? "చెఱుపకురా చెడుదువు" అనునట్లు, ఇతరుల చేటునకుఁ బ్రయత్నించునట్టి యతనికిఁ గీడు

మూడకయే పోవును?" అనిరి; ఇంకఁ గొందఱు, "అయ్యో, విజయనగరాధిపతి యెంతటిబేలతనము చెందిరి; తమకుఁ దెలియక పోయెనా రావువారి శౌర్యవహ్ని! తొడి కట్టి పూసి యుండఁజాలక బలవద్విరోధమునకు సాహసించిరే! దీని పరిణామమున వారికి వినాశము దప్పదు" అనిరి. మఱికొందఱు, "అక్కటా! ఇందులకు బుస్సికూడఁ దోడుపడవలయునా? ఇట్టి తెగువచేత కతనికి దివాణము ఋణము దీఱెను గాఁబోలు" అని, హెచ్చుపగల వగలఁ గుందిరి. క్షణకాలముననే కార్చిచ్చు వనము నందంతటను వ్యాపించునట్లుగా నీ సంగతి నగరమునందంతటను నల్లుకొనెను. పౌరులందఱును బెల్లుగాఁ బొగిలిరి. క్షణమునకు మున్ను కోటలోని పెండ్లినిగూర్చి యుత్సవములను గొనియాడినవారు, ఉత్తరక్షణముననే పురివోని యాలోచనకు చిక్కి తొట్రువడిరి.

23-వ ప్రకరణము

"రాజభక్తి"

కతిపయ పయనముల హాసనల్లీఖానుఁడును బుచ్చన్నయు రాజమహేంద్రవర నగరమును జేరి, అచట విడిసియున్న స్కంధావారమును బ్రవేశించిరి. బుచ్చన్న తనతోడఁ బిలుచుకొనివచ్చి యుండిన యిరువది నలువురు భటుల నందందు నంచెలు నిలిపి తుదకుఁ దా నొక్కఁడుగానే యాఖానునితో బిడారమును జేరెను.

అచ్చట బుస్సీగారున్న గుడారము రమణీయతమముగాఁ గై సేయఁబడి లోపల మేలయిన యాసనము లమర్పఁబడి యుండినవి. బుస్సీని బరివేష్టించుకొని శూరవరేణ్యులగు మహమ్మదీయులును హిందూజమీన్‌దారులును వెలయుచుండిరి. బుస్సీగారికి దాపున నొక యుత్తమాసనముమీఁదఁ దన వైభవము వెల్లివిరియునట్లు విజయరామావనీశులు గూరుచుండియుండిరి. తృప్తియును సంతోషమును సంపూర్ణముగా వారి మోమునందు వెలసియుండినవి. ఆ వీరవారమున నితనిమాటయే మేలుబంతిగా నుండునట్లు గాన వచ్చుచుండెను. తక్కిన వారందఱును, దమచూపు లతని మోముమీఁదనే నిలిపి యాజ్ఞల నిరీక్షించువారివలెఁ గన్పట్టుచుండిరి. ఇట్టి తరుణమున బుచ్చన్నపంతులును హాసనల్లీయును నా ప్రదేశమునకు వచ్చిరి.

అప్పుడు వీరులందఱియొక్క దృష్టి యీ యిరువుర మీఁదికి మరలెను. హాసనల్లీఖాను రాకను వీరు నిరీక్షించుచుండినట్లు వారి చూపులవలనఁ దెలియ వచ్చుచుండెను. అట్టియెడ విజయరామరాజుగారి మోము కోపాతిశయమునఁ జేవురించుటను బుచ్చన్నపంతులు గనుఁగొనిరి.

"కార్యమును బండించుకొనియే కద వచ్చితిరి" అని మిక్కిలి యాత్రముతో హాసనల్లీని జూచి హైదరుజంగు పలికెను.

"రావువారి రాయబారిని వెంటఁబెట్టుకొని వచ్చితిని; బొబ్బిలి వారి యభిప్రాయమును వీరివలన మీరు ముఖాముఖిని దెలిసికొనవచ్చును" అనెను హాసనల్లీ.

అచ్చటఁ దన్నెవ్వరు నాదరింపక పోవుటను బుచ్చన్న గనుఁగొనెను. తన కందలి యేర్పడునట్టి యవమానము తనప్రభువునే యనుసరించునది గావునఁ దనయంత నచ్చటనున్న యొక యాసనముపైఁ గూర్చుండి, తమ కనువుగాని యాచోటునందు మిక్కిలి జాగ్రత్తగలిగి ప్రవర్తింపవలయునని యనుకొనెను.

రాయబారమా? వారు చక్రవర్తులు గాఁబోలును! జమీన్‌దారులు చాల క్రొవ్వియున్నారు. మా తాలూకు గడీలను వదలుటకా రాయబారములు?" అని హైదరుజంగు మహారాజుగారి కిచ్చకముగాఁ బలికెను.

"మే మిదివఱకే చెప్పియున్నాముగదా!" అని మహారాజుగారు నిట్టూర్పు నిగిడ్చిరి.

"దొరగారు! నేను శ్రీ బొబ్బిలి రంగారావుగారివలనఁ బంపఁబడిన వకీలను గాని, రాయబారి యను నంతటి గొప్ప మాట కనర్హుఁడను. మీ యొద్ద నొకటిరెండు న్యాయముల నడిగి దెలిసికొని పోవుటకు వచ్చిన వాఁడను; మీ యెడల కాయాసము గలిగింప ఖాలేను. ఎలనఁగా-మా దొరవారు, మహాశూరులయ్యును న్యాయబద్ధులు; నీతిదప్పి స్వప్నమునందుఁ గూడ మెలఁగఁజాలరు. వారు దమపక్షమున మాటలాడునట్లు నాకాన తిచ్చుటయే కాక మీ రంపిన ఖాను గారి తోఁగూడఁ జెప్పి యున్నారు" అని బుస్సీగారిని జూచి బుచ్చన్న పలికెను.

"ఏమి, బమ్మన్! చాలా తెగువరిగా నున్నావే! మీ దొర గడీలను వదలెదరా? యుద్ధమునకు వచ్చెదరా?" అని హైదరుజంగు చెప్పెను.

"చిత్తము, ఈ రెంటిలో నేమిచేయుటకును దోఁచక మా దొరవారు తొట్రిల్లెదరు. మీరుత్తరు విచ్చునట్లు మెలఁగుటకు వారు బద్ధులు; అయినను, వారికృత్యము న్యాయపూర్వకముగా నుండవలయును.

"వారు, ఇతర జమీన్‌దారులవలెఁ దమ గడీలను వదలిపెట్టునంతటి గొప్ప యపరాధ మేమి చేసిరి? వారు, మీతో యుద్ధమాడునంతటి దోషమును మీయెడల నేమి కనుఁగొనిరి. దివాణమునినఁ దల్లి యిల్లని మా రాయల యభిప్రాయము. షాహా విషయమున వారికిఁ గల ప్రీతి యనిర్వాచ్యము. షాహా వారును మాదొరను సోదరునిగాఁ దలఁచునారు. వారు తమ, 'జమీ అత్తుకు' .వీరిని నాయకమణిగఁ దలఁచి యుందురు."

"చాలింపు నీమాటలు! చోటు దెలియక ప్రేలెదవు; మీ దొరగారు మా ఫరమానా నలక్ష్యపఱచియేకదా యిట కురారు" అని యదలించి హైదరుజంగు పల్కెను.

"మనవి చిత్తగింపవలయును. కార్యములపట్ల పొరపాటు గలుగరాదు. అందు, మీవంటి ప్రభువుల కది యెంత మాత్రము తగదు. శరీరములకు నాశము గలిగినను గీర్త్యపకీర్తులకు వినాశము గలుగదు. బొబ్బిలి మహారాజుగారు, ధర్మరాజును బోలినవారు. ధర్మాత్ములు వారిని యుధిష్ఠిరు లనియును జెప్పనొప్పును. అట్టి సుగుణ నిధులను, ఆశ్రితవత్సలులను, ఆశ్రయహితులను, మార్కొనవలసిన యవసరమేమి గలిగెను? మీచిత్తమునఁ జక్కఁగాఁ బర్యాలోచింప వలయును జుఁడీ! అవసరపాటునఁ బనులుచేసి, తేఁపటి కెవ్వరు

గాని యపనిందలకు లొంగరాదు. బొగ్గులను గోరి మందార మహీజమును గాల్చి వైచినట్లు, అహితుల మేలునకై హితులను తెగఁజూచెదరు; పరులయెడల మీరు పొందఁగోరిన ప్రయోజనము మాయొడయల వలనఁ గలుగఁజాలదా? అంతకు నాలుగు మడఁగులు గలుగవచ్చును. అట్లుండ మాయొడయ లెట్లు మీయాగ్రహమునకుఁ బాత్రులయిరి?

అతని మాటలకు బదులు పలుకుట కచ్చటనున్న వారి కేమియుఁ దోఁచలేదు. "న్యాయమున వీరిని జయింపరాదు; బాహుబలమున సైతము వీరిట్లే దుర్జయు లగుదురో?" అని బుస్సి తొట్రిల్లెను. ఆయదనునందు రామరాజుగారి కంతటితోఁ దన యత్నమునకుఁ భంగము కలిగిపోవునో యను సందియమేర్పడి నిట్టనిలువునకుఁ జెమ్మట గ్రమ్మెను. అప్పుడు వారేమిచేయుటకును దోఁచక దన దాపునఁ గూర్చుండియుండిన హైదరుజంగు చేతిని గూఢముగా నొక్కిరి.

"ఔనయ్యా, మా ప్రశ్నకు బదులు పలుకకున్నారే! మాఘరమానాను గొప్పచేసి యుండిరేని వారే యిచటికి వచ్చి యుండరా! మిమ్మేల పంపెదరు?" అనెను హైదరుజంగు.

ఈయభిప్రాయ మొక్కటియే రావువారియెడల దోషమారోపించుటకుఁదగిన పరికరముగాఁ దోఁచఁగా, సభ్యుల హృదయముల యందుఁ బొదలుచుండిన సందేహము దొలఁగి తృప్తి తలచూపెను. బుస్సీకి మదిలోని తొట్రుపాటు దీఱెను. ముఖముపైఁ దెలివి తేటపడెను. విజయరామరాజుగారి కప్పుడు గలిగిన యానందమునకు మేర గన్పట్టదు. వారు స్థూలశరీరము

గలవారే యయ్యును జివాలున నొకమాటు లేచి దమ యాసనమలంకరించిరి.

"ఔను, నేనింతకే విన్నవించుకొని యున్నాను. వారికేమి చేయుటకును దోఁచకున్నది. అట్లు చేయుటకు బూర్వము వారొకటి రెండు విషయములను తెలిసికొన వలసినది యత్యంతావశ్యకము. పిదప వారు, మీదర్శనమునకు రాకపోయెదరా? మేము వచ్చుటచేతనే, వారు ఆజ్ఞోల్లంఘనము చేసినవా రగుదురా?" అనెను బుచ్చన్న.

"ఆవిషయము లేవి?" అని మోమునఁ జిఱునగ వంకురింపఁ బుస్సి పలికెను.

"చిత్తము, దొరగారు! ఆవిషయములు మిక్కిలి ప్రధానము లయినవి. అవి మాయొడయలకుఁ దెలియవలసినవి.—అయినను, ధర్మస్వరూపము గొందఱకహితముగాఁ గనఁబడును. మిముబోటి ఘనుల కది సంతోషప్రద మగునని నాకుఁ దెలిసి యుండియును, దానిని మూఢుఁడు భీతిపెంపున చేవదలునని దలఁచి, న్యాయమునే యనుసరించెదను.

"మీ యిష్టానుసారమే వారు దమ యధీనమునందున్న గడీలను వదలిపెట్టెద రనుకొందము. అట్లుచేయుటకుఁ బ్రబలములయిన కారణములుండి తీరవలయును. షాహాలు, దమ చిత్తమునకు రామెలఁగిన వివేక నిధులకును శౌర్యధనులకును బుత్రపౌత్ర పారంపర్యము, అవిచ్ఛిన్నముగా ననుభవించి సుఖించు నిమిత్తము జాగీరులును జమీనులును శాసన పూర్వకములుగా ననుగ్రహించుట సుప్రసిద్ధము. పాదుషాహాలు మాఱినను గాలగతి నొందినను, వారొసఁగిన శాసనములు

మాయివు. న్యాయ మట్లుండఁగా, మా ప్రభువులవారి పెద్దలకుఁ బ్రకృతపు పాహాల పెద్దలు, అనుగ్రహించిన శాసనపూర్వకము లయిన మన్నెములను, ఆ వంశముననే జనించియున్న దివాణమువారు మార్చివేయుటకు ప్రబలములయిన కారణము లుండవలయును. అందు ముఖ్యములయిన కారణములు రెండు గలవు. ప్రకృతము, దివాణమువారికి ధనముతోఁ బని గలిగియో, బలముతోఁ బని గలిగియో యిట్టిసాహసకార్యమునకుఁ బ్రయత్నించి యుండవలయును. బలములనుగూర్చి విచారించుచో, మాయొడయల భుజసార మిట్టిదని సంస్థానమువారికిఁ జక్కఁగాఁ దెలియును. ధనమునుగూర్చి ప్రసక్తి గలిగెనా, ఇతరులు మాయధిపుల యెదుట నిలువఁ జాలరనుట మీకుఁ దెలిసిన న్యాయమే.

"మాకీ యంశములతోఁ బనిలేదు; మేము సర్కారుల మీఁది సర్వాధికారమును వహించియున్నాము. మాయిచ్ఛానుసారము ప్రవర్తింపఁగలము" అని మీరు సెలవీయ వచ్చును. ఈ యంశమునందే మేము దెలిసికొనవలయు నంశ మొకటి గలదు. మీపేర నవాబువా రనుగ్రహించిన కౌలులో, నుత్తర సర్కారులమీఁది పన్నునుగూర్చిన యధికారమును జారీచేసి యున్నారా? పరిపాలనమును గూర్చి జారీచేసి యున్నారా? అనుటలే—మొదటఁ జెప్పిన యంశముగా నుండిన మేమీ గడియవఱకును దివాణమువారికి చిల్లిగవ్వ యైనను బాకీ పడము. అట్టి కృతఘ్నతకు మా మహారాజు, ఇతర మాండలికులవలెఁ బాత్రులుగారు.

"ఇట్లుండియును దివాణమువారి కష్టసమయములకుఁ దోడ్పడవలసినది మా ప్రభువులకుఁ గర్తవ్యాంశమగుట, దమకు శక్య మగునంత మీకు సాయముచేయ సిద్ధపడియే యున్నారు. రెండవ యంశముగానుండిననే యిట్టి యాలోచన కాస్పద మగుచున్నది. కాఁబట్టి, గౌరవా రనుగ్రహించి, తనుపేరికి పాహావారు చిత్తగించిన కౌలును జూపవలయును. ఔను; వ్యవహారము లట్లు బహాటముగా జరుపఁబడుటయే ప్రశస్తము" అని, బుచ్చన్న తనయాసన మలంకరించెను.

ఆచోటనున్న మేధానిధులయిన సరదారులలో నెవ్వనికిఁగాని బుచ్చన్నకు బదులు పలుకు విధానము దోఁచలేదు. బుస్సి మాఱుపలుకుటకుఁ గాక విన్నఁబోయి యుండెను. హైదరుజంగు హైవముదక్కి గూలఁబడియుండెను. హసనల్లీయును ఉంరాయును ముసిముసి నగవులు నవ్వుకొనుచు నొకరి నొకరు చూచుకొనుచు నుండిరి. తక్కిన సరదారులు దిగ్భ్రమను భజించుచుఁ జేష్టలుడిగి యుండిరి. ఇట్లా వీరవరులు సమయోచితముగఁ బలుకుటకుఁ దెలియక నిర్వేదస్థితి ననుభవించు నాకాలమునందు, కొట్టిలేపిన సింగపుఁగోదము ననుకరించుచు, శ్రీవిజయరామరాజుగారు, కోపావేశ పరవశులయి, గంభీర ధ్వనిలో, "ఇట్టి ప్రదేశములయందు పరువుమాలిన పలువలను జేరనిచ్చుటయే పొరపాటు; అంతటితో మానక యించుక చనువిచ్చిన నోరికి వచ్చినట్లు ప్రేలుట సహజమే" అని యదలించి పలికిరి.

తదనంతరము, బుచ్చన్న పంతులుగారు లేచి, "దొరగారు! నామనవి నిప్పుడే చిత్తగింప వలయుననుట నాకోర్కి—

గాదు. తిన్నగా విచారించి కార్యమును జరిపిన బాగు. నాకుత్తరువిందు; పోయివచ్చెదను” అని బుస్సితోఁజెప్పి, యచటి సరదారుల కందఱకును వేర్వేఱ సలాములు సమర్పించి, రామరాజుగారిని దిరిగియైనను జూడక యచ్చోటు వాసిరి. అతని చర్య మహారాజుగారి కింకను గోపమును వృద్ధిపఱచిన దనుట వింతగాదు.

బుచ్చన్న, ఫరాసుల స్కంధావారమును వదలి కొంత దవ్వేఁగి యచట నిలిపియున్న యంచెలవానితో నొకటిరెండు మాటలు చెప్పి, త్వరగా నవి శ్రీరావువారి కందునట్లానతిచ్చి పంపెను. ఆతఁడు మున్ను దానువచ్చిన దెసనుగూర్చి పోవక, పశ్చిమోత్తరదిశాభిముఖుఁడయి హుటాహుటిని స్వారిచేయఁ దొడఁగెను.

24-వ ప్రకరణము

“సేవాధర్మమున కాభరణము నిష్కాపట్య ప్రవర్తనము”

చదువరులారా! మన బుచ్చన్నగారు, దనతోఁ బిలుచుకొనివచ్చి యంచె నిలిపిన భటునితో నేమిచెప్పి యెచటికిఁ బంపెను? మిక్కిలి తొందరపాటుతోఁ దా నెచ్చటికిఁ బోయెను? అను సంగతులను మనము దెలిసికొనవలసినది యత్యంతావశ్యకము. ఏలనఁగా స్వామిభక్తిగలవారును బరోపకారపరులును నాత్మసౌఖ్యములకుఁ బ్రయత్నింపరు. వీరిలో మొదటఁ జేర్కొన్నవారి తెగను జేరినవారే మన బుచ్చన్నగారు; రెండవవారి తెగలో రామబ్రహ్మము గారిని జేర్పవచ్చును.

బుచ్చన్నగారు, బుస్సీగారి స్కంధావారము వదలఁగానే దాపుననున్న యంచెలవానిని జూచి, కార్యము మన కనుకూలింపలేదు; ఇచ్చటి స్కంధావారమున విజయరామరాజుగారు మిక్కుటయుగాఁ జనువుగలిగి యున్నారు. వీరివలన నిటీవలనేర్పడిన కుతంత్రమేగాని యిది నిజామువారి సమ్మతిని గొనసాగినది గాదు. కాఁబట్టియే, కార్యావసరము నుద్దేశించి నేను దిన్నఁగా దివాణమునకే యేఁగుచున్నాను. అచట మన ప్రయత్నము జయింపఁగలదని తోఁచెడిని; దేనికిని దేవరవారు, నిర్నిద్ర జాగరూకతను వహింపవలయును” అను సంగతిని జెప్పి యవ్వార్తాహరుని బంపెను. వాఁడంచె నిలిచిన మఱియొకని తోడను వాఁడింకొకని తోడను జెప్పఁగా నంచెలమీఁద నీ సంగతి గొన్ని గంటలలోనే శ్రీరంగరావుగారి కందెను.

వెంటనే, మహారాజుగారు దమ భటుల రావించిరి. ఆజ్ఞ పాలించిన విధముగానే, భటులందఱును రాజ సన్నిధానమును జేరువారై వారి యుత్తరువుల నిరీక్షించుచుండిరి.

బొబ్బిలికోటకు నాలుగు గవనులుండినవి. గవనొకటికి నైదువందల భటుల వంతునను, బురుజొకటికి వందభటుల చొప్పునను గోట కొమ్మ యొకటికి నలువురు భటుల విధముగాను గాఁపు నిలిచిరి. ఉత్తరపు గవను దళమునకు తులసీరాము గారధ్యక్షులు; పడమటి గవను భటులకుఁ గాకరల-సూరపరాజుగారు నాయకత్వమును వహించిరి; దక్షిణపు గవనునందలి దండునకుఁ జెలికాని వెంకన్నగారధిపతులయిరి; తూర్పు గవనున మసలునట్టి వరూధినికి నాథుఁడుగా మహమ్మదు ఖాసీము పాలుపారఁ దొడఁగెను.

దీసికొనిరి. ఇట్లే మజిలీ మజిలీకిని వారద్దె గుఱ్ఱములను బొంది హుటాహుటిగాఁ బయనము చేసిరి. భోజన సమయముదప్ప, వీరు విశ్రమించిన స్థలములు గుఱ్ఱముల వెన్నులే. ఇట్లేఁగి నవాబువారి నగరును జేరి.

సలాబతుజంగు షాహాగారొక వారముగా సభ చేయక యాదినమే సభ చేయుటకు విచ్చేసిన లోకవదంతి పుట్టియుండెను. సదాశివరావు వలనను, బుస్సిగారి వలనను వారికిఁ దటస్థించిన గుండెల యదురుపాటువలని యస్వస్థతయో లేక యొక వారమయినను నెమ్మదిగా నుందమను తలంపో మనమేమి చెప్పుటకును వీలు పడదు.

ఈ కారణమును బట్టియే దేవిడీలోఁ బ్రవేశించుటకుఁ గాక, మూఁడు దినములు వెలుపలనే, రామబ్రహ్మము తరుణమును గనిపెట్టుకొని యుండెను.

బుచ్చన్నగారు రాచనగరునకు వెలుపలనున్న బ్రహ్మమును గుర్తుఁ బట్టఁగలిగెను. ఇతఁడు బొబ్బిలి సంస్థానమును జేరి, రావువారి నెచ్చరికగొలిపి చివాలున మరలినప్పుడు, ఆ సభయందు బుచ్చన్న గారుండిరి. ఆ సభ నెందఱో ఘనులలంకరించి యుండినందున, వారిలో నీబుచ్చన్న సైతము మెలఁగుచుండెననుట మన రామబ్రహ్మముగారికిఁ దెలియక పోయెను.

మన బుచ్చన్నకు బ్రహ్మముగారి చరిత్రమించుక దెలిసి యుండెను. కాఁబట్టి యితఁ డేదో గొప్పకార్యముమ గోరి దేవిడీని. గనిపెట్టుకొని యున్నాఁడని దలఁచి దగ్గఱించి—

"స్వామీ! తమరు నైజామువారి సందర్శనమునుగోరి యిచ్చటఁ గనిపెట్టుకొని యుండునట్లు దోఁచెడిని."

రా—ఔను, నేను మూఁడురోజులుగాఁ గనిపెట్టుకొని యున్నాను. వారు, సభకు విచ్చేయనందున దర్శనము లభింపలేదు. నేఁటికైనను నాకా భాగ్యమబ్బునా యని సందేహించెదను.

బుచ్చ—ఔను, వారిని ప్రత్యేకముగా నేల సందర్శింపరాదు?

రా—నేనీ దివాణమునకుఁ గ్రొత్త. ఎవరినిఁబట్టి, యీ కార్యము సాధించుకొనవలయునో తెలియదు. కావుననే యెంతో తొట్రిలుచున్నాను."

బు—ఆలాగా! మీరు పూనివచ్చినపని మిగుల ముఖ్యమయినదా?

రా—ముఖ్యమనియా ప్రశ్నించెదరు? అయ్యో, ఎందఱో ప్రాణులు రణక్షోణిని ఘోర మరణ మొందక దమ జీవితావశిష్ట దినములను నెమ్మదిగాఁ గడుపఁగలరే. ఐనను, ఇంత శ్రద్ధాళువులై నన్ను విచారించెదరేల? నన్నిచ్చట నైనను నింతకుమున్ను చూచియున్నారా?

బు—స్వామీ, మిమ్ము దర్శించియున్నాను. మీరు కరుణానిధులయి, మా బొబ్బిలి మహారాజుల సభను ప్రవేశించునప్పుడు నే నచ్చటనే యుంటిని. ప్రకృతము నేనామహారాజుల పనిఁబూని షాహావారిని సందర్శింపఁగోరియే వచ్చితిని.

"ఆలాగా, సంతోషము" అని, రామబ్రహ్మము మనస్సార నతనిఁ గౌఁగిలించుకొనెను. పిదప, "అయ్యా, మనము

తామసించుట కిది తరుణముగాదు. ఎట్లయినను షాహాగారిని దర్శించుటకు వీలు గలిగింపుఁడు" అని రామబ్రహ్మము మందలించెను.

బుచ్చ—అదియొక గొప్పపని కాదు; క్షణకాలముననే వారి సందర్శనము మనకు లభింపఁగలదు. అని, బ్రహ్మముగారిని బిలుచుకొని కొలువులోనికిఁ బోయెను.

ఆవేళకు నైజాముగారు సింహాసన మలంకరించియుండిరి. వారు, తమ సభకు విచ్చేసిన బొబ్బిలి వకీలుగారిని వారితోడ వచ్చిన బ్రహ్మముగారిని జూచి, మిక్కిలి గౌరవించి యుచితాసనాసీనులను గావించిరి. అప్పుడు, రామబ్రహ్మముగారు లేచి—

"మహాప్రభు! ఇదివఱకు మీ గొడుగుక్రిందఁ బ్రజలెంతో సుఖమనుభవించుచుండిరి. ఇంతకుమున్నున్న క్షోభ దొలఁగి నెమ్మది చెందియుండిరి. అట్లుండియును, వింతసంగతులు గొన్ని సంభవించుటవలన జనక్షోభ, పూర్వముకంటె నెన్నో మడఁగు లతిశయించియున్నది. తమకు సామంతులయ్యును గళింగ ప్రభువు, మీకు లొంగక యెన్నో కుట్రలు పన్నుచు శత్రుపక్షపాతులయి యుండిన సంగతి దమ చిత్తమునకు విదితమే కదా! దివాణమనిన వారికిఁ దృణప్రాయముగ నుండెను. అట్టివారిప్పుడు మాయోపాయములు పన్ని దేవరవారి నౌకరుల కేలికగా నున్నారు. ఇప్పుడు వారేమి చెప్పినను బుస్సీదొరవారికి వేదవాక్యములుగాను, ఎట్టి నీచకార్యములు చేసినను ఘనకార్యములుగాను గన్పట్టుచున్నవి. బుస్సీవారిని బరికరముగాఁ గొని వారింకను నెట్టి ఘోరకార్యములకు సాహసింతురో చెప్పఁజా

లను గాని, దేవరవారికిఁ బ్రాణతుల్యులుగా నుండునట్టి శ్రీ బొబ్బిలి రంగారావు గారిని ద్రుంచివైచుటకును, వారి గడీలను నేలమట్టములు సేయుటకును దెగించియున్నారు. అయ్యో, బొబ్బిలివారి శౌర్యము మీ కెంత సహాయకారి యైనది. వారిని హతమణఁచుట మిమ్ము బలహీనులనుగాఁ జేయుట కాచరించు ప్రయత్నమే కదా! ఇది యట్లుండగా మీ నిగ్రహమునకుఁ బాత్రులయిన విజయరామరాజుగారిని సన్మానించుటయు మీ యెడలఁ గావించునట్టి మహాపరాధ మనుటకు సందియము గలదా? ఇదియా రాజనీతి? ఇచటి సరదారులతోఁ బ్రముఖులు, వలదని యెంత చెప్పినప్పటికిని, విజయరామరాజుగారి మాటలకుఁ జిక్కి బుస్సీదొరయు హైదరుజంగును దమ మూర్ఖపుఁ బట్టును మానక యున్నారు. దీనిని జిత్తగించినయెడల, దేవరవారి దివ్యచిత్తమునకు సర్వము విదితము గాఁగలదు" అని బ్రహ్మముగా రొక యుత్తరము షాహాగారిచేతి కందించిరి.

నవాబుగారు, రామబ్రహ్మము మాటలు వినఁగానే, వారిగుండియలు పెల్లడరెను. శ్రీరావువారిని గొనియే సర్కారుల యందలి మన్నెదొరల నణఁచి, వారి మన్నెములను సైతము వారిచేతనే యేలింపవలయునని దలఁచియుండిరి. ఇంతేగాక, వారిని నంతరంగమిత్రునిగా నెంతో ప్రేమించుచుండిరి. తన యెఱుక లేకయే, తన మిత్రునకుఁ గలిగిన యాపద కా ఘనుఁడు మిగుల వెతనొందెను. పిదపఁ దనచేతి కందించిన యుత్తరమును విప్పి చదువుకొనఁగా నందలి యంశము లుడుదు భాషను వ్రాయఁబడి యుండినవి—

"షాహావారి దివ్య సన్నిధానమునకు—పెక్కు వేల సలాములు; తమ యుత్తరువును శిరసావహించి, మే ముత్తరసర్కారులమీఁదికిఁ బయనమైన దినముమొదలు, దమ విశ్వాసమునకుఁ బాత్రులమయిన మావంటి భృత్యులకు సరిపడని వింతసంగతులు గొన్ని జరిగినవి; అవి యన్నియుఁ బ్రధానములు గావు. ఇప్పుడు, మీయెడల భక్తిగల బొబ్బిలిరావువారిని, వారి విరోధియగు విజయరామరాజుగారితోఁ జేరి, హతము సేయుటకు నిశ్చయించి యున్నారు. ఇట్టిచేత దేవరవారి కనిష్టము గలిగించునది యని యూహించి యీ లేఖను వ్రాసి వీరిగుండా సన్నిధానమునకుఁ బంపితిని. కర్తవ్యమును ద్వరలోఁ జిత్తగింపవలయును.

ఇట్లు విధేయుఁడు
మిర్. సులేమాన్.

ఈ యుత్తరము చదువఁగానే, నవాబువారికిఁ బిడుగు పడినట్లాయెను. "ఈ ఫరాసువానివలన, హా! మన కెట్టి యాపద కలుగనున్నదో?" అని అతఁడు సందేహించెను. "అయ్యో! బొబ్బిలివారిమీఁద నేమి నేరము మోపి యిట్లు దండింపఁ గోరిరి. నాకు సంగతులు విశదపడకున్నవే!" అని వ్యసనముతోఁ నవాబుగారు పలికిరి.

"మహాప్రభు! మా యేలిక నిరపరాధులు. వారికి మీ యెడల భక్తిగలదనుటకు మీరే సాక్షి. ఉన్నటులుండి, దొరవారి యొద్దనుండి హసనల్లీఖాను గారొక ఫరమానాను బట్టించుకొనివచ్చిరి. దానియందు మా యొడయలు దమగడీలను 24 గంట

లలో విజయరామరాజుగారి కప్పగించి వేయవలయు ననియును, అట్లు చేయక దక్కిన శిరసాజ్ఞ విధింపఁబడుననియు సూచింపఁబడి యుండినవి. దొరవారి కడకు, మా ప్రభువులు నన్నుఁ బంపిరి. నేను, మా రాజుగారు, దివాణమునకు బాకీదారు గారనియును, అట్లుండియు దమ యేలికయగు షాహావారికిఁ గావలసియున్నంత ధనము సమర్పించుటకు సిద్ధపడి యున్నారని యును, నిర్నిమిత్తముగా మా రాజునెడల అలుగుట దోషమునకు గారణ మగు ననియును జెప్పితిని; ఎంత చెప్పినను నా మాట లచ్చటఁ గొనసాగవయ్యెను. తుదకు విజయనగరాధిపతి నన్ను ధిక్కరింపఁగా నా యత్నము గొనసాగదని చక్కఁగాఁ దెలిసికొని, షాహావారికి విన్నవింపఁదలఁచి, హుటాహుటిని వచ్చి చేరితిని. సంగతులను విన్నవించితిని; ఇంకఁ గర్తవ్యాంశమును జిత్తగింప వలసినది దేవరవారి భారము" అని బుచ్చన్న వినయముదోఁప విన్నవించెను.

"వారి ప్రయత్నము లెట్లుండినవి? ఇంతకే విపరీతము లేవియు జరిగియుండవుగదా! మీ రచ్చటికిఁ బోయి చేరునంతకేమియుఁ బొరపాటు గలుగకుండవలయును" అని, షాహావారు బుస్సీదొర పేరి కొక ఫరమానాను వ్రాసిరి. అందు, బొబ్బిలిని ముట్టడింపరాదనియును, అట్లు, తెలియక ముట్టడివేసి యుండినయెడల, వెంటనే సైన్యములను వెనుదివియఁ జేయవలయుననియును, తత్క్షణమే, ముందున కొక యడుగైనను బెట్టక తన సన్నిధానమునకు వచ్చి చేరవలయు ననియును సూచింపఁబడి యుండెను.

ఈ ఫరమానాలో ముద్రమొత్తి సంతకముచేసి, శ్రీ నైజామువారు రామబ్రహ్మముచేతి కొసఁగిరి. అంత నా యిరువురు బ్రాహ్మణులు నవాబువారికి వందనము లర్పించి, యనుమతివడసి మరలిరి. వారి మనస్సులకు నెమ్మది యలవడినందునను, ఒండొరుల సహాయ మేర్పడినందునను దొంటివలెఁ బ్రయాణము కష్టప్రదముగా వారికిఁ దోఁచలేదు. వా రిరువురును బొబ్బిలిని గూర్చియే వచ్చుచుండిరి.

25-వ ప్రకరణము.

"కాలమునకుఁ దగిన బుద్ధి"

బుచ్చన్న పంతులు బిడారము వదలి పోయిన పిదప, కొంత దనుక వీరవారమునందు సద్దణఁగి యుండెను. తుదకు బుస్సీగారు దమ సరదారులను జూచి, "హా, యితఁ డెంతటి వాఁడో? నిమిషకాలములోనే మనల నందఱను జయించెను. అతనికి మీఱి పలుకు వాచాలత మనలో నెవనికిని గలుగ దాయెను. అతని మాటలవలనఁ గలిగిన దిగులు నన్నింకను వదలినదిగాదు" అనెను.

"ఇదేమి వింత? వాని మాటలకా మనము దిగులు పడుట! నామాటల కతఁడు భయపడి పాఱిపోవఁడా?" అని, కేరుచుఁ హైదరు జంగు పలికెను.

బుస్సి—మీ రేమి చెప్పినను జెప్పుఁడు; వారి యెడల న్యాయము గలదు. మన ప్రయత్నములు తుదకపఖ్యాతినే కలి

గించును. అక్కటా, మనకీ కట్టడిపని యపఖ్యాతినే కలిగించు ననుటకు సందియముండదు.

ఉంరా—అయ్యో, దొరగారు! మన మొక విషయమున నా దిగు లనుభవింప వలసిన వారము! వెలమ దొరలు న్యాయనిధులు; శౌర్యధనులు; అందు, రేచర్లవారిపరాక్రమము వర్ణనాగమ్యము. ఇంటికగ్గిదరి కొల్పి, సుఖనిద్ర చెంద శయ్యను జేరినవానివలె, వారిని జెనకి ప్రాణములతో నీవలకు రాఁగలుగుట.

మిర్ రహిమాన్—అక్కటా, వారి పరాక్రమాగ్ని యెట్టి వరూధిని గాని క్షణకాలములో నిర్దగ్ధపఱచి వైచును. వారు, పోటునకు నలువు రేవురుగా, గుదులపోటులు పొడిచి దొంతరపెట్టవలంతులు; వారు, అభిమాన ఘనులు: మన సామ్రాజ్యమున కొక చిల్లిగవ్వయైన నప్పులేరు. మన యెడల విశ్వాసము గలరు. మన యందలి భక్తిచే నెట్టి భయంకర సైన్యము నైనను భేదించి, మన షాహావారికి విజయలక్ష్మిని సమర్పింపఁజాలు నిపుణులు. శాత్రవవాహినులు, పిడుగులను బోలిన గుండ్లను వర్షించుచుండినను భీతిల్లక, మైమఱచి, లోపలఁ దూఱి, విరోధులను జెండాడునట్టి ధీరోత్తములు. వారు, మనల నెదిరింపక, ధనమెంత యడిగినను, ఒసఁగెదమని ధర్మమార్గమున వెలయుచున్నారు. అట్టివారితో నిష్కారణ విరోధమూని తాఁకుట మనవినాశమునకు మార్గము గలిగించుకొనుటయే యగును. మన కెవ్వరెదురు గలరని యిట్లు మెలఁగుట యపఖ్యాతికే కారణమగును. షాహాగారికిఁ దెలిసిన మన ప్రాణములకే హాని గలుగును.

హైద—ఇట్లు పగవారిని గొనియాడు నంతటి రణభీరుల నే నిదివఱకుఁ జూచి యుండలేదు, మీకు సరదారునామము వ్యర్థము. మన బలమును లెక్కపెట్టకున్నారేమి? ఫరాసులసైన్యము సాధారణ మయినదిగాదు. మహారాష్ట్రుల నేమి రాజపుత్రుల నేమి చెదరఁగొట్టి బీభత్స పఱచినది. అందఱికంటెను మీరని నట్లే తెలగాల బలము బలిష్ఠమని యనుకొందము. అట్టిపోటు మగలు, మన విజయరామరాజు గారి సైన్యమున లేరా?

హస—ఇదియా కార్య విచారము! ఇది, ఎదిరి చావును మన చావును విచారింపక పెట్టుకొనిన దుష్కార్యము. ఈ కార్యమును పర్యాలోచింపక చేయుదుమేని చాల చెఱుగు సంభవించును. ఆలోచింపని పని కారంభించుటయే ప్రమాదమునకు హేతువగును. ఎట్లనఁగా—నీవిజయరామరాజు గారు మన చక్రవర్తిగారి విరోధియనుట కెన్నో నిదర్శనములు గలవు. ఇతఁడు మనలను ద్వితీయోపాయ (దాన)మున జయించెను. అంతటితో మానక మన కనకూలునిఁ జంపుటకయిన యత్నములకుఁ దలపెట్టెను. మనము, ఇతఁడు పన్నునట్టి యీమూఁడవ తంత్రమునకు లోఁబడితిమేని, పరిణామము దుఃఖప్రదమగును. మీయెత్తికోలు మానుఁడు: ఇంతటితో వదలుఁడు; వెలమదొరలు సామాన్యులుగారు.

బుస్సి—ఔను, ఈపని యెట్లుపోయి యెట్లు పరిణమించునో? అని సందేహింప వలసియున్నది.

ఉంరా—ఓహో, అఱచేతి యుసరికకాయకా యద్దముగావలయును? ఇట్టి కార్యము మీకు సందేహాస్పదముగా

నున్నదో? మీకు మనచక్రవర్తిగారి స్వభావము చక్కఁగాఁ దెలియను కాఁబోలును. వారి కొకతడవ కొకనియంతసూయ పొడమెనేని మరల వానిని గన్నెత్తియుఁ జూడరు. కాఁబట్టి, అసూయాజనకములగు మీకార్యములు, వారి సంస్థానమునుండి మిమ్ము దప్పక తొలఁగింపఁగలవు. మీరొకరు దొలఁగిన మాకుఁ దృప్తికరమే యగును; మీకును దృప్తికరమే; అయ్యో, వారిదీర్ఘక్రోధము మీ తెగవారిపై వ్యాపించి, ఫరాసువాఁడనిన నవాబువారి పరగణాలయెల్లలకు వెలుపల నిలువ వలసి వచ్చును. మీరిట్లు ప్రవర్తించినచోఁ బరిణామమున నిటే కాఁగలదని మీహితమునుగోరి ప్రమాణపూర్వకముగఁ జెప్పెదను.

అబ్దుల్లాఖానుఁడు—మన కేల యీపెత్తనము? మనవిషయములను నవాబువారికిఁ దెలిపి వారి యనుజ్ఞచొప్పున మెలఁగుట యుత్తమము.

హైదరు—ఇది మంచియాలోచనయే, మీ కుబేరము చాలదు. ఇట్లున్న చెప్పెదను; నేనొక్కఁడనే బొబ్బిలి రాజుముగడీలను ధ్వంసపఱచి వచ్చి చేరెదను.

ఇది వఱకు నోపికతో నందఱి సరదారుల కార్యాలోచనల వినుచుండిన శ్రీ విజయరామరాజుగారు. ఇంక నిమిష మూరకుండినచోఁ దనుకార్యము లన్నియును జెడునని యూహించి—

"అయ్యా, దొరగారు! నా మనవిని జిత్తగింపుఁడు. ఒక పనిని జేయుటకుఁ బూర్వము, అనుకూల ప్రతికూలములను విచారించుట బుద్ధిశాలుల మతము. ఇంతకు మున్ను రావు

వారి వకీలును గూర్చి మీకుఁ గలిగిన యభిప్రాయము పొరపాటుగాదు. అది న్యాయమో యన్యాయమో? అతఁడు దన వాచాలతను బరికరముగాఁ గొని, మనల నందఱను జయించె ననుటసత్యమే — ఔను—అతని మాటలు న్యాయానంతము లనుట కెవ్వరు సాహసింతురు? నైజామువారు, దొరవారి కనుగ్రహించిన సర్కారులమీఁది సర్వాధికారమునే యతఁడు సందేహించెను. అట్లు గానిచో షాహావారి కొలువు గన్నులారఁ జూడఁ గోరునా? అట్లగుటచేత నతఁడు, నైజాము వారిని మిమ్ము సందేహించె ననుటకుఁ బ్రత్యేక ప్రమాణము వలసినది లేదు. కావున, అతఁడు తన పరుసకు మీకట్టి [illegible]దెలియక యెంత గుండియదిటవుతో పలికెను. అతని యధిక ప్రసంగమునకు నాకుఁ గలిగిన కోపమింకను జల్లారకున్నది. ఇంతకే యతని ప్రాణములను నాఖడ్గము గ్రోలియుండును. హా, బ్రాహ్మణుఁడగుట వలన నంతకు సాహసింపదు; సహించితిని. నాకు మీఱిన కోపమును మిగుల సామర్థ్యముతో నిగ్రహించితిని. రక్తపాతమునకు భయపడునట్టి బ్రాహ్మణునకే యిట్టి సాహసముండిన నందఱి యితరులను గూర్చి చెప్పవలయునా?

"ఈ యంశమును గూర్చి యిందఱి సరదారులు పలికిన పలుకులు సత్యములని నేను ముమ్మాటికిని జెప్పఁగలను. వారు బలాఢ్యులనుట నిర్వివాదాంశము గాని దివాణమువారికే పరమభక్తులనుటను స్థాపించుటకు మనకు నాధారములేదు. నావంటి ప్రభువును గష్టములకు లోఁబఱచి, దివాణమునకుఁ బైకము చెల్లించుటకు శక్తిహీనునిగాఁ జేసి వైచినంతనే యతఁడు పరమయోగ్యుఁడాయెనా?

"నేఁటికి విజయనగరపు రాజును గష్టపెట్టిన రంగారావు, ఱేపటికి దివాణము వారి కెల్లు హృదయశల్యముగాక మానును? ఇది ప్రభువులకు సహజగుణమే; ఈ ధర్మసూక్ష్మము సర్దారులందఱిలో మన హైదరుజంగుగారొక్కరే సుస్తైఱుఁగఁ గలిగిరి.

"మన దివాణమువఱకును జక్కఁగా నడుచుకొనినఁ జాలును; వారి యితర చర్యలతో మనకేమిపని?" అని యొకరిని మీఱనడలుట రాజనీతిగాదు. కొన్ని విషయములకుఁ జిక్కి, అట్టి బెట్టిదుఁ డొక్కప్పుడు అణఁగియుండునే కాని, తనకు సమయ మనుకూలించినప్పుడు వ్యాపింపఁ బ్రయత్నించును. ఇట్టివాని ననుకరించువారే బొబ్బిలి మహారాజుగారు; పలుమాటలేల? సర్కారులలోని వెలమదొరలలో నతనికిఁ జనువెక్కువ; అతని యిచ్చచొప్పుననే యితరులు మెలఁగుదురు.

"శ్రీరంగారావుగారి ప్రస్తావము వచ్చినందునఁ జెప్పెదము; ఏలనఁగా—దూరమునందున్న మీకంటెను బొరుగున నున్న మాకు వారి సంగతులు చక్కఁగాఁ దెలియును. వారి వశమునం దొక బెబ్బులి గలదు. దాని జన్మభూమి బొబ్బిలి; కావున, దానిని బొబ్బిలిబెబ్బులి యనవచ్చును; అది మానవాకారమును వహించిన వ్యాఘ్రము; భీతి యన్నది దానికి స్వప్నావస్థయందును దెలియదు. అది దళములలోఁ దూఱిన నెట్టి దృఢవ్యూహమునుగాని హతముచేసి క్షణకాలముననే తన యొక్కఁ జేయుచుండును. అట్టి తరుణములయందు వాహినీపతులు ప్రయోగించు నాయుధములు దాని శరీరముమీఁది వెంట్రుక నొకదానిని గాని త్రెంపలేవు. ఆ వ్యాఘ్రమున కట్టి మహా

శక్తి యెట్లలవడెనో చెప్పుటకుఁ గాదు. అయ్యో, ఆ మానవాకార క్రూరమృగమే తాండ్ర-పాపరాజ నామకము. అది, ప్రకృతము రాజాము కోటయను గుహలో విజృంభించియున్నదని విని సంతోషించెదను. అది, బొబ్బిలిలో నుండెనా మనజయము సందేహాస్పదమే. అది బొబ్బిలిని జేరుటకు మున్నే మన మా నగరమును ముట్టడింప వలయును.

"మన మెట్టి కార్యమునకుఁ బ్రారంభించుట యనునదియే యింకను నాకుఁ బట్టువడకున్నది. ఔను - అది యయుక్తమని యెవరందురు? అయినను, ఈ కార్య ముద్దేశపూర్వకముగా మీరు చేయుటకాదు; మేము చేయునది. ముసల్మానులకుఁ జెప్పెదము; ఈ కార్యమున కొడిగట్టినవారము మేము; దీనివలని ఫలాఫలములు భుజించువారమును మేము. అయ్యో! ఏమిచేయుట? విధిప్రేరణమిట్లున్నది. ఆలోచింపక యారంభించితిమేని, దుస్తరముగాను, దుర్దమముగాను గన్పట్టును; సరి, మీరు వచ్చినను రాక దక్కినను మా దండయాత్రకు భంగము గలిగింపము. సరి, యుద్ధచింత, మా చిత్తమునందుఁ దొందరపాటు గలిగించి, అనుక్షణము మమ్ముఁ ద్వరపెట్టుచున్నది. మీరు దయయుంచి మాతోడ విచ్చేసితిరా యందులకుఁ దగిన లాభమును బొందఁ గలరు; మానితిరా పొందలేరు. ఈ తరుణమున విచారింపఁ దగిన యల్పాంశ మిదియే. నాకు మీ స్నేహమున్నఁ జాలును. హా! పగవారిని క్షణకాలములో నిర్మూలపఱచి రాఁగలను. ఇదియే దండయాత్రకు ననువైన సుముహూర్తము; ఇప్పుడు వెడలిననే మనకు జయము లభించును. ఔను, పాపరాజు

బొబ్బిలిలో నేనిప్పుడే యీ కోటను ముట్టడింపవలయును." అని వేగిర పఱచెను.

అక్కటా! విధిప్రేరితమగు కార్యమునకా యభ్యంతరములు గలుగును? కలిగె ననుకొందము; అవి సుస్థిరములై నిలుచునా? తుద కందఱేక మనస్కులయి కదలిరి. వారిలో నుంరాగారికిని హసనల్లీగారికిని ఈ కార్యము రుచింపలేదు. ఏమిచేయుదురు? వారుకూడ నిజసైన్యములతో వారి వెంటఁ దరలిరి.

26 వ ప్రకరణము.

రణవిహారమే రాజులమతము

ప్రళయకాల రుద్రుని ఫాలలోచనమువలె, భానుబింబ మరుణారుణ కాంతులతోఁ బూర్వ దిక్సంధిని బొలుపారుచుండెను. విలయకాలకాలుని ప్రతాపానల జ్వాలలం బోలి లేయెండలా నభోంతరాళములఁ దిన్నఁగా వ్యాపింపఁ దొడఁగెను. 'పక్షులముగా నుండియు మేము సపక్షులము; అక్కటా! మానవులయ్యు మీరలు విపక్షులరే" అని బొబ్బిలి నగరోపాంతవనముల విడిసియున్న దళపతులను జూచి గేరుచున్నవో యన విహంగమ నికరములు, మనోజ్ఞరుతములతోఁ బింఛులుగట్టి వినువీధిని దిరుగుచుండినవి.

విజయనగరాధీశుల యానతిచొప్పున సైన్యములలోఁ గొందఱు రాజమహేంద్రవరము వదలి, సద్దులేక రేయితో రేయి పయనము…, యుదయమునకు మున్నే బొబ్బిలిపుర

బాహ్యప్రదేశముల యందు విడిసిరి. వారి ముట్టడివలన వెలుపలివారు నగరములోనికిని, లోపలివారు వెలుపలికిని బోవుటకును వచ్చుటకును వీలులేకుండెను. ప్రొద్దు, కానుగాను దళములలో వ్యవస్థలేర్పడి, భటుల యుద్యోగములు నిర్ణీతములయినవి.

కోటకు దక్షిణపు వైపున నొక గుడారమున మహారాజుగారు విడిసిరి. వారి యావాసమునకు దాపుననే బుస్సీగారి పటకుటీర మమర్పఁబడి యుండినది. దాదాపుగా నిరువదివేల భటులలోఁ బ్రకృత మచట ముట్టడివేసినవారు పదివేవురకు నుండిరి; వారిలో నేఁబది వందల భటులు లగ్గలు పట్టుటకు నిర్ణీతు లయిరి.

కోటగవనులు నాల్గింటికిని వేయేసి వీరభటులతో నలువురు శూరనాయకులు నిలిచిరి. దక్షిణపు గవనునకు నీలాద్రిరాజుగారు; పడమటి గవనుకు భైరవ రాజుగారు; ఉత్తరపు గవనునకు జగ్గిరెడ్డిగారు; తూర్పుగవనునకు హసన్ బేగు గారు నాయకత్వము వహించిరి. వీరందఱును విజయరామావనీశులను జేరినవారు. తక్కినవారు గొన్ని క్రోశములదూరమునందు విడిసియుండిరి. ఈముట్టడివేసియున్న భటవర్గమును బరివేష్టించి బుస్సీవారి బలము పొలుపారుచుండెను. బొబ్బిలి వారి కోత్తలకు నాఁగలేక వెన్నుచూపి పాఱిపోవు స్వపక్షబలము వారిని గాని, వారిని దరుముకొని వచ్చు విపక్షబలము వారిని గాని క్రూరముగాఁ బొడిచి చంపుట వారిపని. ఫరాసు బలము వారు పరాకునఁ గర్తవ్యాంశము మఱచియున్నచో వారిని దండించు వ్యాజము వహించి, సులేమాన్ ఉంరా గా రాత్మ

సైన్యముతో దళముల నన్నింటిని బరివేష్టించుకొని వెలుపలనే యుండిరి. హైదరుజంగుగారు స్వీయసైన్యముతో దండునందంతటను దిరుగుచు, భటులకు వీరరసము పూరించుచు, సమయము తటస్థించినప్పుడు నిలిచి పోరాడుచుఁ దెఱపి గలిగినప్పుడు చుట్టివచ్చుచు నుండుటకు సిద్ధపడిరి.

ఇట్లొక విధముగా దళములలో వ్యవస్థ లేర్పడఁగానే రణదుందుభు లొక్కుమ్మడి మ్రోఁగెను. ఈసైన్యముల వీర రభసముయొక్క నిజస్వరూపము వర్ణింప నెవనికి సాధ్యమగును?

బొబ్బిలికోట, సుభటులవలనఁ బరిరక్షితమని యిది వఱకే చెప్పియున్నాము. పోతుటీఁగ కయినను గోటలోఁ బ్రవేశింప వీలులేకుండెను. అయోమయ కవాటములు మూయఁబడి యుండినవి. ఈసైన్యముల కొత్తలకు భీతిలువారలా బొబ్బిలివారు? ఎప్పటివలెనె కోటలో ధాంధామని భేరీలు మ్రోఁగుచుండినవి. ఇంతకు మున్ను చెప్పియుండిన చొప్పుననే వారు దమకు నిర్ణీతములయిన స్థలములయందుఁ గాలు కదల్పక నిలుచుండిరి.

శత్రువులు, సన్నిహితులయి తమకోటను ముట్టడించిన సంగతి, రావుకులహేళి యగు రంగరాణ్మౌళికిఁ దెలియును. ఆప్రభు వంతట నొక నిముసమయినను వ్యర్థపుచ్చినవారు గారు. సుగంధయుక్త సమశీతోష్ణజలముల జలకమాడిరి; తమ కులదైవతమగు శ్రీవేంకటాచలపతిని, ధ్యానాద్యుపచార పూర్వకముగఁ బూజించి శుద్ధాంతరంగులయి ప్రార్థించుకొనిరి. అనంతరము, గ్రహప్రీతిగాఁ దిలహిరణ్యాది దానములను భూసురుల కొసఁగి తదాశీర్వచనముల వహించిరి; మిత్రబాంధవ పరివా

రము వారితోఁ గూర్చుండి మితభుక్తి సలిపి లేచిరి. శుభలగ్న మరుగుదేరఁగను శస్త్రశాలను బ్రవేశించిరి.

అచ్చట నమర్పఁబడి యుండినవియును, దమ పూర్వకులకు భండనములయందు విజయలక్ష్మిని బ్రసాదించినవియును నగు యుద్ధసాధనములకు భక్తిపూర్వకముగ నమస్కరించిరి. తొలుదొల్త నుక్కుమైమఱవులను దొడిగికొనిరి. పిదప నయశ్శిరస్త్రాణమును ధరించిరి. ఎఱ్ఱని కాచదొడిగిరి. నడుముపట్టి గట్టికొని యందు యుద్ధసాధనములను జెరవికొనిరి. పిదప రావువంశజుల ప్రఖ్యాతి ప్రాభవములకుఁ బట్టుగొమ్మయు, మత్తారికంఠ నికృంతనచణమును నగు కృపాణవర మున్నచోటిని జేరిరి; వలగొనిరి; వందనములర్పించిరి; వహియించిరా ఖడ్గరాజమును దమదక్షిణ హస్తమున. ఇంతలోఁ దక్కిన ప్రభువర్గము వారును గవచాదులఁ దొడిగికొనుచుండిరి.

ఆహా, వీరశృంగార మూర్తిగాఁ బొలుపారుచుండిన రావువారి తేజోవిశేషమును, సౌందర్యాతిశయమును స్వభావోక్తిగ వర్ణింపనెట్టి సత్కవికిని శక్యముగాదు; అతనికాంధ్రమున మాటలును జాలవు.

ప్రభువా యాయుధశాల వదలి, తిన్నఁగా, దేవిగారున్న యంతఃపురమును జేరిరి. అచ్చట, మూర్తీకరించిన తేజఃపుంజమో? సచేతనమయిన హిరణ్మయ విగ్రహమో యన, వీరలక్ష్మివలె శ్రీమల్లమదేవిగారు వెలయుచు, తమ పుత్రులగు శ్రీవేంకటగోపాల రంగారావుగారి నుపలాలించుచుండిరి. దాపుననే పుత్రికామణి, సుందరమ్మగారు పొలుపారుచుండిరి.

“దేవి, విరోధి వరూధినులలోఁ దూఁటి, కసిదీఱ చేతులార శత్రు నిర్మూలనముచేసి నీ పాదసేవకు విజయలక్ష్మిని దెచ్చెద నొండె—

“హా! చాలింపుఁడు; జీవితేశా! పైమాటలను విన నొల్లను. అజాతశత్రువులగు మీకు నేఁటి కొక శత్రువు గలిగెను. ఇది యెంతమాత్రము? మీకుఁగల యుధిష్ఠిర ఖ్యాతి దొలఁగఁజాలదు. ధర్మస్వరూపులరు గావున విజయలక్ష్మి మీకుఁదక్క నన్యులకు లభింపదు. ఇది దృఢము. అయినను, నాకీ తరుణమున నొక వరము ప్రసాదింపవలయును. ఒకవేళ పోరామియే కలుగు ననుకొందము; మీరు శాత్రవులను జెండాడుచున్న తరుణముననే, ప్రాణేశా! నాకుఁ దెలుపవలయును. నేను స్వర్గద్వార కవాటముల భేదించికొని నగరు ప్రవేశించి———.

“దేవీ! నా యిచ్ఛయు నట్టిదే! కర్తవ్యములయందుఁ బొరపాటు గలిగింపను. పగవారు మనకోటను మూగియున్నారు; వారిని జెదరఁగొట్టకయే నాకు నెమ్మది గలుగదు.”

అప్పు డింగితజ్ఞ యగు చేడియ తాంబూలము దేఁబోయెను. అంతలో, శ్రీ మహారాజుగారు పుత్రికారత్నము మోముపైఁ జల్లని చూపులు నిగిడ్చిరి; బిడ్డని గోపన్నను జేతుల కందుకొని పుత్రస్నేహము పాటించి మరల దేవిగారి చేతుల కొసఁగిరి.

పైడిపళ్లెమునఁ దాంబూల ముంచి, చేడియ దేవిగారున్న యెడకుఁ దెచ్చెను. వారు, తట్టునదమ దక్షిణహస్తమున స్పృశిం

పఁగా నది, మహారాజుగారి కొసఁగెను. వారంగీకరించి తత్క్షణమే పరలిరి.

ఆవేళకు సరిగా నంతిపురి వాకిలియొద్ద విలువగల తొడవులు తొడవి సజ్జీకృతముచేసిన పట్టపుగుఱ్ఱమును నిలువ పెట్టియుండిరి. భటులు ఏకాంగవీరు లగు వెలమదొరలును దదితరులును గ్రిక్కిఱిసి ఖడ్గపాణులయి తమ గుఱ్ఱముల చెంత నిలుచుండిరి.

అప్పు డంతఃపురమునుండి శ్రీరావువారు వెలుపలికి వచ్చిరి. తను యుత్తమాశ్వమును జేరి, దానిని దడివి యిచ్చినప్పుడు, శరీర లాఘవము మెఱయఁగా నా తత్తడి చెవుల ఱిక్కించి ముమ్మాఱులకు సకిలించెను. ఇది, శ్రీరంగారావుగారికి శుభసూచనగాఁ దోఁచఁగాఁ దత్క్షణమే దానిపై నారోహించిరి. వీరవరులును వెంటనే తమ గుఱ్ఱముల నెక్కిరి. అప్పుడు, మహారాజుగారికి దక్షిణ భ్రూ భుజము లదిరి విజయచిహ్నములుగా నవచ్చెను.

మహారాజుగారు, హయాధిరోహణ మాచరింపఁగానే భేరీ కాహళాది వాద్యముల మ్రోఁత పెల్లురేఁగెను. వందిజనులు పురోభాగమున నిలిచి—

ఘననిర్ఘోషదుందుభిధ్వానబధిరీకృత దిగ్వేదండ ప్రకాండా!
జయీభవ దిగ్విజయీభవ!
ప్రతాపాన్తరీప శిరఃఖండ నోద్దండ బాహుదండా!
జయీభవ, దిగ్విజయీభవ!
ఏకాంగవీర! వీరావతార! మన్నెహంవీర! జయీభవ, దిగ్విజయీభవ
పరమన్నెమదవిభాళ! గాయగోవాళా! జయీభవ, దిగ్విజయీభవ

అతివిషమ హయారూఢ ప్రౌఢరేఖా రేవంత రేచర్ల వనవసంతా!
జయీభవ, దిగ్విజయీభవ
శ్రీ వేంకటేశ సమారాధన సమధిగత మహాశౌర్యధనా!
జయీభవ, దిగ్విజయీభవ!
గండరగండాంక, జగనొబ్బగండ, వీరప్రతాపా!
జయీభవ, దిగ్విజయీభవ!
ప్రణత ప్రకటనరపతి మకుటమణి నీరాజనారుణిత పాదారవింద!
జయీభవ, దిగ్విజయీభవ!
ప్రతీప ప్రతాపసముపార్జిత విజయ శ్రీ చూఱకార!
జయీభవ, దిగ్విజయీభవ!
కదనజయభీమా; ఖండితారిస్తోమా! జయీభవ, దిగ్విజయీభవ!
సమరగాంగేయా, శ్రీరంగరాయాభిధేయా! జయీభవ, దిగ్విజయీభవ!

అను వీరరసాంచితము లయిన బిరుద వాక్యములచేత శౌర్యరస మతివేలముగాఁ బూరించుచుండిరి. వారి సాహసోద్యమములను, శౌర్య విస్ఫురణములను గన్నులారఁ గాంచినచో నెట్టి రణభీరువునకును బోటుమగఁటిమి గలుగక మానదు.

ఆతరుణమున శ్రీరంగారావు గారి మేనియందుఁ బరాక్రమశక్తి యావేశించెనో యన నెడలు పెల్లుబికెను. మోమున కెంజాయపర్వ వింత సోయగము వెల్లి గొనుచుండెను. "మహాప్రభూ! సాహసమునవలె శత్రుసైన్యములఁ దూఱి దమ యిచ్చకు రా మెలఁగ నేర్తున"ని ప్రమాణముసేసి చెప్పుచున్నదో యన రావు వారి యుత్తమాశ్వము గిట్టతో నేలఁ ద్రవ్వుచుఁ మోరవంచినిక్కి సకిలించుచు సమయస్ఫురణను దెలిపెను. అంత నొక్కుమ్మడి నందఱు దమ గుఱ్ఱములను ముందునకు సాగించిరి.

భేరీధ్వానములును, వందిజనముల కైవారములును, శంఖకాహళముల ధ్వానములును, భటుల వీరగర్జలును నొక్కపెట్టున పెల్లురేఁగి యా పెనుసవ్వడి కోట యంతయు నిండి మెండుకొని ప్రతిధ్వను లుప్పతిల్లెను.

మహారాజుగారు, ఉత్సవమున కేఁగు వారివలెఁ గోట కడపటి ప్రాకారమునకు వచ్చిచేరిరి. విరోధుల యుద్యమములను స్థానములను దెలియఁగోరి, పరిజనముతో నశ్వావతరణము చేసి యొక బురుజునెక్కిరి. చుట్టుప్రక్కలనున్న సైన్యములను వాని నాయకులను నోకునఁ జూచి, యేఁబది ఫిరంగులు కోట చుట్టు నుంచఁబడి యుండుటను, మితపరిజనముతో హైదరుజంగు, తమ కోటను ప్రదక్షిణము చేసి వచ్చుచుండుటను గాంచిరి. నలువలంకుల జలప్రవాహము మెండుకొనినట్లు, వాహినులు కోటను ముంప యత్నించుచుండుటను గనుఁగొనిరి. దవ్వుల విజయరామరాజుగారి గుడారముండుటయు, దాని దాపున బుస్సీగారి డేరా యమర్పఁబడి యుండుటను దెలిసికొనిరి. "అక్కటా! తోడి కట్టి పూసి నెమ్మదిగనుండఁ జాలక యిమ్మహేంద్ర వైభవములకిట్టి బుద్ధి యేలకో పొడమెను? ఎదిరికిని దమకును వినాశమును గలిగించు యత్నము ప్రశస్తమయినది గాదే" యని వగచిరి. అట్టి తరుణమున సైత మాశౌర్యనిధి భూతదయ యొక్క మహిమను విస్తరించిన వారు గారు. "అయ్యో! క్షత్రియులకు రణమరణము యశఃప్రదమే: వీరి వినాశమునకు దురపిల్లను. ఆచంద్రార్క మపకీర్తి పంకమునఁ బడెదరే యని చింతిల్లెదను" అని దలఁచిరి. అప్పుడు, తమ దాపున నున్న మఱఁదిని ధర్మరాయనిఁ జూచి, "నాయనా, దమ్మన్న! మనము

తుట్టతుదవఱకు ధర్మము చేవదల రాదు. ఇందఱ వినాశమునకు మనస్సొప్పకున్నది; నీవు చతుర వచో నిధివి. బుస్సి యొద్దకు రాయబారము పొమ్ము. నీయత్నము కొనసాగునేని, నశింప నున్న భటులకుఁ బ్రాణ ప్రదాత వగుదువు. ఈప్రఖ్యాతి కల్పాంతము నిన్నాశ్రయింపఁ గలదు: పోయిరమ్ము" అనిరి.

ధ—చిత్తము—దేవరయానతి శిరసావహించి బుస్సి దొరవారి యొద్దకు రాయబారిగ నేఁగెదను. అతఁడు మనమాటలకు సమ్మతించిన బాగు, కానిచో—

మహా—చాలు, నిలుపుము; వారు ధర్మబద్ధులయిన సరి; అటులుగాక మూర్ఖులయిరా యీ వాహినులు నాయాటోపమున కెంత ? అని వీరావేశముతోఁ బెటపెట బండ్లు గీటుచుఁ బలికిరి.

అప్పుడు, దాపుననే నిలుచున్న వృద్ధయోధయగు, దామెర్ల-రామరాజుగారు, తనయునిఁజూచి, "నాయనా, దమ్మన్న ! మనము వెలమ దొరల మనుమాట మఱచితివా? నీపరివారము వారితో బుస్సీ బిడారమును జేరుము. మేము బొబ్బిలి కధీశుల మనుము. వారు సంధికి వచ్చిరా, దివాణమువారికిఁ గావలసి యున్నంతపైకము సమర్పించుట కొప్పుకొనుము. ఈ యదనున లంచముల కొగ్గకుము. వారు విగ్రహమునే స్థాపింపఁ జూచిరా చివాలున మన కోటలోనికి వచ్చి ప్రవేశింపుము. పోయిరమ్ము" అని కర్తవ్యము దెలిపిరి.

27-వ ప్రకరణము

సామముసగానిదా శౌర్యమున నగును

దుర్బిణినిబట్టి చూచుచున్న బుస్సీదొర, "మన మున్న చోటినిగూర్చి తిన్నఁగా వచ్చునట్టి యా వీరభటు లెవ్వరు ? వీరి కగ్రేసరుఁడుగా నొక శూరుఁ డగపడుచున్నాఁడు. అతని వెంబడి దాదాపుగ నూర్వురు భటులు గలరు. ఔను, వీరు కోటనుండి మనయొద్దకే వచ్చుచున్నారు" అని మహారాజుగారి నడిగెను.

మహా—ఔను, దొరగారు! మనముండు చోటినిగూర్చియే వచ్చుచున్నారు. మనయొద్దకే వచ్చెదరు. వారి నడలను నాకృతులను జూడఁగా నాకు సందేహముగా నున్నది.

బు—ఏల సందేహించెదరు ? వారు సంధివేఁడి వచ్చునట్లున్నది.

మహా—అయ్యా, వారిచొప్పు సంధిని గోరినవారికి వలెఁ గన్పట్టదే !

బు—(చిఱునవ్వుతో) ఆ మొదటవచ్చు వీరపురుషుఁడు రంగారావుగా నుందురా ?

మహా—వారు రంగారావుగారు గారనుట నిశ్చయము; వారిట్లు లాఘవపాటుతోఁ బాదచారులయి మన మున్నెడకు వచ్చువారు గారు. (అనునంతనే వారించుక దాపునకు వచ్చుచుండిరి.)

"హా ! తెలిసెను. ఆ వచ్చువతఁడు, దామెర్ల-ధర్మరాయుఁడు. తక్కినవా రతని పరివారమువారు. వారు పిసుగులను

బోని వారు. అయ్యో, ఆ యువుఁడే బొబ్బిలి గుహలో వసలు నట్టి సింహకిశోరము. మనలను బొడుచు నిమిత్తమే యతఁడిట్లు వచ్చెడిని; ఔను, మనము పోటరులము గామా? వారి మాటలను వినవొల్లను. అవి నారసములకంటెఁ దీక్ష్ణతరములై నా హృదయమును బాధించెడిని; నేనిచట నుండరాదు; ఉంటినా ప్రమాదము గలుగును: రాయబారిని వధించెనను నపయశము నాకుఁ గలుగును."

అని, మహారాజుగా రాచోటు వదలుటకు యత్నించుచుండఁగా, వారి బాహుదండమును బట్టుకొని యాసనముపైఁ గూర్చుండఁబెట్టి, "అతని నిచటికి రానియ్యను" అని, వచ్చువారి నాటంకపఱుచునట్లు బుస్సీదొర భటులకు నాజ్ఞయొసఁగెను; ఇంతలో వారును దాపునకు వచ్చి చేరిరి.

భటులు:—ఎచ్చరిక! మమ్ము మీఱి లోనికిఁ బోరాదు.

ధర్మరాయఁడు:—మమ్మాటంకపఱచునంతటివారా మీరలు. మేము యుద్ధమును గోరి రాము; సంధిని వేఁడి వచ్చువారము; అని నిర్భీకుఁడుగా, వారిని మీఱి దన యీఁటెఫౌజుతో లోనికిఁ దూఱెను. సంధినిగోరి పోవునట్టివారే యయ్యును వారు నిరాయుధపాణులుగారు. ఆ కాలమున నిందలివారు సామాన్యులు కూడ నాయుధపాణులుగ నుందురు. అందు వారు వీరభటులు; కాఁబట్టి, ధర్మరాయఁడును నతని పరివారమును వారును స్కంధావారములో నాయుధపాణులుగాఁ బ్రవేశించుట యొక వింత సంగతి కాదు.

విజయ రామరాజుగారి భటులు కోశములనుండి ఖడ్గముల దూసికొని యాభటులను మార్కొనఁ జూచిరి. వారి

యత్నములను దెలిసి ధర్మరాయఁడు, "అలసులారా! మా బలగము వారిపై వ్రేలువంపఁ బోయెదరు; ప్రాణములను గాఁపాడుకొనుఁడు" అని గర్జిల్లుచునే బుస్సీగారి డేరాను డాసెను.

దాదాపుగా నైదువందల వీరభటులను మీఱి, ధర్మరాయఁడు, తానున్న చోటికే వచ్చిచేరుటయును, అతని ఫౌజువారు సైతము శరీరమును ఛాయయును వలె, నొకఁడయినను వెనుకకుఁ జిక్కక, తమ నాయకుని వెన్నంటియే వచ్చుటయును గాంచి బుస్సీదొర, "ఇట్టి యనుపమాన సాహస మెచటను జూచియుండమే; ఆహా, కళింగ పెద్దరాజుగారు నిష్కారణముగా సందేహింపరు. వీరికిమాత్ర మిట్టి యప్రతిమాన శక్తి యెట్లలవడెను?" అని యాశ్చర్యపడి, కృత్య మెఱుఁగక స్తంభీభూతుఁ డయ్యెను.

అప్పుడు, బుస్సీ పరిసరమునందున్న మహారాజుగారిని ధర్మరాయఁడు చూచెను. ఆ సమయమునం దతని హృదయ మనుభవించిన క్రోధమును వర్ణింప నెవనికి శక్యము? కన్నులును జెక్కులును నెఱ్ఱఁబాఱెను. పెదవులు వెల్లదురఁ దొడఁగెను. అనాయాసముగా నగపడిన యీ పగవాని వీరి పక్షపాతి బుస్సీని నొకవ్రేటునకే పొరిగొందునా?" అని దలఁచెను. హా! ఇదెట్టి తలంపు? ధర్మమునకుఁ దొలఁగిన చింత దగదు. కులమునకు నపఖ్యాతిని సుస్థిరముగా నెలకొల్పినవాఁడ నగుదును. బావగారు నాముఖము చూడనొల్లరు. పరాకున నున్నవారిని బొడిచిన పంద యని నన్ను నాభుజసారము జనులు లాఘవపఱతురు. అని తన తలంపునకై తనలో లజ్జించి యట్టి యుద్యమము మానుకొనెను. "వీరి యధర్మమే వీరికి

ముప్పు గలిగించును" అని యోర్పు దెచ్చుకొనెను. ఇంతలో బుస్సి యచ్చెరుపాటునుండి దెప్పిఱి, తనయొద్దకువచ్చిన వెలమదొర నుపచరించి యొక యాసనముపైఁ గూరుచుండఁ బెట్టుకొనెను.

బు—అయ్యా, మన్నెదొరగారు! మీరు బొబ్బిలి మహారాజుగారి కేమి గావలయును? ఏమికార్యము మిమ్మిచ్చటికి రావించెను?

ధ—దొరగారు! మేము బొబ్బిలి మహారాజుగారిని సంబంధించిన వారము. వారి రాయబారుల మనుకొనుఁడు; మేము పగదీర్చుకొనుటకు రాము. హా! యట్లే యుండినఁ జెప్పెదరా! ఇంతకే,—ఔను, ఆమాట లేల? మేము దివాణమువారి మన్ననలకుఁ బాత్రులము. నిష్కారణముగా మాకోటను ముట్టడించిన మీతోఁ గొన్ని సంగతులను మాటలాడి పోవ వచ్చితిమి.

"మేము దివాణమునారికి మిత్రులము; సహాయులము. వారిపైఁ జేయెత్తుట లేదను ధర్మమును స్థాపించు నిమిత్తము వచ్చినారము. అట్లే దివాణమువారు మాయెడలను విశ్వాసము గలిగి మెలఁగవలయును. వారికి మాగడీలను వదలిపెట్టి, అరణ్యవాసమున కేఁగునంతటి యపరాధ మేకాలమునందును జేసి యెఱుఁగము. ఇంక నెన్నఁటికిని స్వధర్మమును మీఱి మెలఁగువారముగాము. కాఁబట్టియే, అట్టి ద్రోహచింత మాయందుండ నొల్లక మావిరోధుల నాశ్రయించెను. అట్టివారే యిప్పుడు దివాణమువారికి యోగ్యులుగఁ గన్పట్టెదరో?

బు—అయ్యా, మీరీ గడీలను వదలిపెట్టితిరేని, మీకు వీనికంటె మించినవాని నొసఁగెదను. నేనే యీసర్కారుల కన్నిఁటికిని సర్వాధికారిని.

ధ—అట్లు కారణము లేకయే మాగడీలను పగవారికి వదలి యడవుల కేఁగు నవసరమేమి గలిగెను?" అనుటయే నేను దెలియఁ గోరునది.

బు—మీరీ పెద్దారాయనిగారికి విరోధులమని యొప్పుకొనెదరు గదా! అట్టి విరోధికిదాపున మీవంటి యోగ్యులు వసింపరాదనుటయే మాయభిమతము.

ధ—సెబాసు! మీయభిమతము పొగడఁదగినది. ఒక ధర్మసూక్ష్మము గలదు; వినుఁడు. మాశౌర్య స్థైర్యములను గాంచి యసూయ పడువారందఱు మాకు శత్రువులు; మా సత్య సచ్ఛీలములఁగాంచి సంతసిల్లు వారెల్లరును మాకు మిత్రులు; అట్టివా రెచ్చట లేరు?

బు—ఔను, మా యభిమతాను సారమే బొబ్బిలి రాజాము గడీలను విజయ రామరాజుగారి కొసఁగియున్నాము. ఇంక వీనికి మీరు యజమానులుగారు; మీ రధికారులగు మాకు నవిధేయులగుట ధర్మమార్గ మగునా?

ధ—అయ్యా, పొరపాటుచేసి సవరించుకొన యత్నించెదరు. పొరపాటనునది యెన్నఁటికిని బొరపాటే. విధేయుల మగుటకు నవసరములు గలవు. సర్వత్ర విధేయులుగా మెలఁగుట మూఢుల మతము; మేము ధర్మమునకు విధేయులము; బానిసలమును. అట్టి ధర్మము మా యధికారులగు మీ

కలవడవలదా? మాయెడల విధేయతను మీ యెడల ధర్మమును స్థాపించు నిమిత్తమే మేము వచ్చుట! అట్లు వచ్చుటచేత మీ కోటలకు భీతిల్లిన భీరువులని దలఁపకుఁడు.

"దొరగారూ! మీవంటి బుద్ధిశాలులా యుద్ధము గోరువారు! అయ్యో, మీ విజయమును గోరి యెందఱు దమ యమూల్యములగు ప్రాణములను రణక్షోణికి నర్పింపవలయును? తెలివిగలవారు ప్రజానాశమునకు వెనుదీయుదురే! ఎట్లయినను బ్రయత్నించి జననాశమునకు సాహసించునంతటి ఘనకార్య మిప్పుడేమి తటస్థించెను? చక్కఁగా నాలోచింపుఁడు. అధికారము మన చేతియందుఁ గలదని, దుర్వినియోగ పఱుపఁదగదు. దానివలనఁ దప్పక యపయశము గలుగును. అపయశమునకు భీతిల్లక, ప్రాణిహింసకు వెనుదీయక, జయము లభించినఁ జాలునని కోరువారు మూర్ఖులు. యుద్ధరంగమున జయాపజయములు సునిశ్చితములుగావు. అట్టి సందిగ్ధలాభమునకా భటుల యమూల్యప్రాణములను ధారవోయుట?

"హో, దొరగారు, ఈ బొబ్బిలి గడీమీఁదనుగానా మీకు విజయము గలుగును? అక్కటా, యిట్టి యిక్కట్టులకుఁ గారణభూతులగున యీ పెద్దరాజుగారి నింతకే విచారించుకొని యుందును; వీరికిఁ దోడుగా మీవంటివా రెందఱుండి యేమి? వీరి కాసన్నమయిన దుస్థితిని మాన్పలేరు. అట్టులుండియు వారి ప్రాణముల కలుగక మిన్నకుండుట, మాకుఁ గల జీవకారుణ్యమని మీకు విశదముగాదా?

మహా—మీరు, శౌర్యసమగ్రులమని చెప్పికొని యెదరే! మీకేల సంధివిచారములు? వీరవరేణ్యు లిట్టి యాచకవృత్తికిఁ దెగువసేయుదురా?

ధ—ఔను; మహారాజ! మా కార్యము మీకు దృష్టాంతపూర్వకము గావలసియుండిన—ప్రభువా! మీ రిదివఱకే—ఆమాటలేల? మేము భుజబలము నమ్మక యన్యుల శరణుఁ జొచ్చి యితరుల రాజ్య మపహరింప యాచింపము; మాకు మీతోడి సంభాషణ యేల?

"బుస్సీగారు! మాయిరువురిలో నెన్నో కలఁతలు గలవని యే యనుకొందము. అట్లుండియుఁ బోరునకుఁ దెగింపక మేముండుటకు మీరు సంతసింప వలదా? అట్టిచేత మాని మీ సామంతులలోని కలహమునకు మీరే కారణభూతులగుచున్నారు. పోరు మానిన వారికి మీరే పోరుసలుపఁ బ్రోత్సాహ పఱచెదరు. అంతటితోఁ బోక మీరు సహాయమే తెంచితిరి. ఔను, కల్పవృక్షమును బొగ్గులకై పొడుచుట మీ బుద్ధిశాలితనము?

ఈ యదనున మహారాజుగారికిఁ గోపమతిశయించెను. తమ్మును దమ ప్రాభవమును దృణీకరించి పలుకుచుండిన ధర్మరావుగారిని ఖండింపఁ దలఁచి యొఱనుండి కత్తిదూసిరి. అది గాంచి, ధర్మరాయఁడు నిర్భయుఁడై, యతని చేతను నిర్లక్ష్యపఱచువానివలెఁ జిఱునగ వంకురింపఁగా బుస్సిని జూచి—

"దొరగారు! అట్లు గాక బొబ్బిలి రాజాముగడీలు, వీరిని బోలిన శూర పుంగవులే పరిపాలింపవలయునను కోర్కెయుండెనా, క్షణకాలము మీరు దొలఁగియుండి, మాయుభయుల పోరులనుజూచి జయశీలునకు బొబ్బిలి, రాజాము, విజయ నగరము పరగణాల నొసఁగుఁడు.

"మాకు శూరులతోఁ బనిలేదు; ప్రకృతము సొమ్ముతోఁ బని కలిగి యున్నదనెదరా? బొబ్బిలి రాజాములకు వారొసఁగెదమను ధనమునకు ద్విగుణముగ, విజయ నగరమున కొసఁగు పైకమునకు నిబ్బడిగ నొసఁగెదము. మారాయల పేరికీ పరగణాలన్నిటి మీఁది కొలువు ననుగ్రహింపుఁడు.

"అయ్యా, ఇప్పుడు నేను విన్నవించు సంధి వాక్యము లన్నియు మిమ్ము నుద్దేశించి పలుకఁ బడినవి. ఔను, మీరు మాపాహా వారి వలనఁ బొందిన యధికారమాత్రమును గౌరవపఱచి పలుకఁబడినవి. కాఁబట్టి, దీనిఁ జక్కఁగాఁ బరిశీలింపవలసినవారు మీరలే—ఏలనఁగా, మన యుభయులలో నెవరికిని శ్రమగలుగరాదనుట మాయభిమతము.

"మఱి యొక ధర్మసూక్ష్మము గలదు వినుఁడు. మిగుల నెచ్చరికతో వినవలయునని గోరెదను. మేము పాహా వారికి మిత్రులము; వారు మాకాశ్రయ దాతలు. మావినాశమునకు వారు సమ్మతింపరు. అట్లే వారిమీఁదికిఁ గృతఘ్నుల మయి మేము గత్తికట్టము. హా! వారి విషయమునఁ బ్రాణము లే తృణీకరించియుండు మాకు, వారు గోరిన ట్లీగడీలను వదలుట మాకు భారముగాదు. ఇసీ, వారేల యీనైచ్యమునకు లొంగుదురు? కాఁబట్టి, ధర్మబద్ధుల మగు మేము విజృంభించితిమా మీకు ముప్పుదప్పదని ముమ్మాటికిని జెప్పఁగలను. దివాణము మీఁదఁ గత్తి యెత్తిరను నపయశము మాకెన్నఁటికిని గలుగదను నంశమును మీరు చక్కఁగా నూహింపవలయును.

ఇట్లు ధర్మరాయఁడు, నయభయముల వెలయించి నిర్భీకుఁడయి పలుకుచుండినప్పుడు, అతనికి బదులు పలుకుటకుఁ గాక బుస్సీదొరవారు మౌనవ్రతమునే వహింపవలసిన వారైరి. "సరి, ఈదినమే నాయాయువునకుఁ బరమావధి" అని యొక్క మాటయుఁ బలుకక పెద్దరాజుగారు మిన్నకుండిరి. తమకాదినమెట్లయినను శస్త్రమరణము దప్పదను తలంపు గలిగెను. ఈ తలంపున కిది కారణమని యూహింప వీలులేకుండెను.

తుదకు, పెద్దరాజుగారికిఁ జిత్తమించుక స్వస్థతను జెందెను. "ఇంక నూరకుండినఁ బ్రమాదము వాటిల్లును" అని తలఁచి, బుస్సీని జూచి, అతనికి మాత్రము వినవచ్చునట్లుగా, "అయ్యా, నిద్రించు నాగుఁబామును ద్రొక్కి లేపితిమి. ఇంక దాని బారినుండి తప్పించుకొన యత్నింపవలయును. వీరిని దివాణ మెక్కునంతకు వదలితిమా యెంతో యాపద ఘటిల్లుట నిశ్చయము. మాశ్రమ కంతగాఁ జింతిల్లముగాని మాకునై శ్రమ పడునట్టి మీకుఁ దటస్థింపఁగల యాపదకు మామన స్సొప్పదు" అనిరి.

బు—(అయ్యో, వీరు చాల భయపడియున్నారు అని యూహించి) "మహారాజ! కర్తవ్యము నాకుఁ దెలియును. మీరు మందలింపవలసిన పని లేదు" అని చిఱునవ్వుతోఁ బలికెను.

ఈ తరుణమునకు సరిగా హైదరుజంగు, మొగ్గరించి యున్న తమ బలములలో నొకచుట్టు చుట్టుకొని యాచోటికి వచ్చి చేరెను. అతనిఁ జూడఁగానే విజయరామ రాజుగారికిఁ దొంటిధైర్యము కుదిరెను.

ధ—దొరగారు ! కర్తవ్యాంశము చిత్తగించి మా గడీలమీఁది కొలును మాకే స్థిరపఱపుఁడు.

హై—ఎవఁడవయ్యా నీవు ?

ధ—మేము శ్రీ రావువారి రాయబారులము.

హై—రావువారికి రాయబారు లొకరా! మన్నె దొరలకు గర్వ మధికమైపోయెను. వారే యేల రారు ?

ధ—అయ్యా, హైదరుజంగోజీ! ఆ సంగతి నీ కొకనికే తెలియును. మా కేమి యెఱుక? వారే మీయున్నయెడ కేల రారు ?

మహా—అయ్యా, ఈ యువుఁడే మేమి ప్రేలుచున్నాఁడు-

హై—అట్లయినచో నేల పట్టి చెఱనుంచరాదు? "ఎవఁడురా!" అని కూయునంతలో నైదువందల భటులను వచ్చి ధర్మరాయని బరివారసమేతునిఁగాఁ జుట్టుకొని నిలిచిరి.

"ఓహో ! ఇంతదనుక నీ ధర్మరాయఁడు ధర్మపాశబద్ధుఁడుగా నుండెను. ఇంక మీ ప్రాణములకు యమధర్మరాయఁ డనుకొనుఁడు" అని యా వీరపుంగవుఁడు గర్జిల్లి, కొల్లో కొలు అని యఱచెను. ఆ యఱపున కతని భటులు దమచేతుల నున్న యీఁటెల నేల కానించి యెత్తి, తమ్ము మూఁగి నిలచిన మూఁకనవలీలగాఁ బొడిచి చెదరఁగొట్టిరి. వారి యాయుధ ప్రయోగ చమత్కారమును గూర్చి యేమి చెప్పను! క్షణకాలములోనే తమ్ము మూఁగియున్న భటులను, పోటునకు నలువురేవురుగా దొంతరపోటులు పొడిచి నేల కొరగించిరి.

బొబ్బిలి వీరభటులు, యీఁటెలను ద్రిప్పుచు, చిత్రపదన్యాసములతో విజృంభించినప్పుడు, ఆహా, ఏమి చెప్పుట! పిడు

గునుఁజూచి భయపడి పరుగులిడు జనులవలె, విరోధిభటులు దవ్వుదవ్వులకుఁ దొలఁగిరి; వారి రభసోద్వృత్తికిఁ బ్రతికృతి యిదియను నూహ యెవరికిని బొడమలేదు. తుపాకులతోఁ గాల్తమనినను వారి యొడళ్లు లక్ష్యమునకుఁ జిక్కనవిగావు. పరదళములలో బొబ్బిలిభటుల సంఖ్య యెంతో తక్కువగా నుండియును, వారు, వీరావేశ పరవశులయి రణవిహారము సలుపునప్పుడు, ఆ యేకాంగ వీరులు, పగవారి శిబిరమం దెక్కువ స్థల మాక్రమించుకొని, ఎచ్చటను దాముగాఁ గాన వచ్చిరి. విరోధి సేనాధిపతుల బృందములకుఁ గృత్యము దోఁచని యనువున గొప్పకలవరము నించిరి.

ఆహా, వారి శౌర్యోద్యమ మేమని పొగడుట ? ఱెప్పపాటు కాలములోనే యిట్లు రణవిహారము సలిపి, తమ్మెదిరించు వారిని నారాయణ నారాయణ యనుచు నప్పటికప్పుడే పొడిచి త్రోయుచుఁ జూటిగాఁ గోటలోనికి బాణవేగమున వచ్చి చేరిపోయిరి.

"బాపురే, ఏమి యాయుధపాండిత్యము! ఏమి శరీర లాఘవము! త్రుటిమాత్రనే, తన్ను మూఁగిన వీరభటులఁ జెదరఁ గొట్టియుఁ బొడిచి త్రోసియుఁ జెక్కు చెమరక తన యావాసమున కీ ధర్మరాయఁడు పోయి చేరెను. ఇతఁడు మాత్రమా ? ఇతని పరివారము వారు సైతమిట్లే మెఱపు మెఱసినట్లు దొలఁగిపోయిరి. అక్కటా! వారి పోటులకు నేలఁగూలిన వీరభటుల కళేబరము లింకను దన్నుకొనుచునే యున్నవి. వీరి ప్రాణవాయువులకంటె మున్నుగానే, వారు దమ యావాసమును జేరి

ప్రాంత కాపులయిరే! ఇది గదామగంటిమి! ఆహా, శుద్ధవీరులను మాట వీరి కొకరికే కదా చెల్లును! బొబ్బిలిలోని యొక యువునకే యింత పౌరుషము గలదనుచో, ముక్కాఁకలనారితేరిన వీరవరేణ్యుల శౌర్య మెట్లుండునో కదా! ఈపెద్ద రాజుగారి భీతికి విస్మయ పడితినే! అది సకారణమయినది యని యిప్పుడు గదా తెలియవచ్చెను. బొబ్బిలి శూరులు, ఏకాంగ వీరులు; దుర్జయులు; యుద్ధకళాకుశలులు. అనునవి యన్నియు నాకిప్పుడే దృష్టాంతపూర్వకము లయ్యెను. ఇట్టి యోధల మార్కొని జయము నిశ్చయించుట వెఱ్ఱితనమే; శరీరబలము, ధైర్యసమగ్రత, శస్త్రపాండితి, సాహసోన్నతి అను శూర లక్షణము లన్నియు నొకటి కొకటి మిన్నయై వీరియందుఁ గన్పట్టుచున్నవే" అని, బుస్సి దలపోసి నివ్వెఱపాటొందెను.

బుస్సిగారి యభిప్రాయము దెలిసి, యది బలమయినచో దన యుద్యమములకు భంగము గలుగునని యూహించి చిఱునగవు మోమున నంకురింపఁగా, హైదరుజంగునుజూచి, కంటిరే కద యీయవిధేయతను! దివాణము వారికింతకంటెనా యపరాధము గావలయును? తనసేవ్యుల యెడలనే యితని మెలఁకువ యిట్లుండ, మముఁబోటి వాండ్ర కితనివలని శ్రమ యెట్టిదిగా నుండునో యిప్పటికైనను మీకు వ్యక్తముగాక మానదు" అనిరి.

28-వ ప్రకరణము.

వేళకుతగిన బుద్ధి

తను యాలస్యము సంస్థానముయొక్క వినాశమునకే హేతువుగాఁ దలఁచి, ఎంత త్వరగాఁ బయనము చేయనగునో యంతకు వెనుదీయక రామబ్రహ్మము గారును బుచ్చన్న పంతులుగారును బొబ్బిలినిగూర్చి వచ్చుచుండిరి.

ఇట్లు పయనమయి వచ్చుచుండినవారు, ఆదినము రేయి రమారమి యొకగంటవేళకు నాలుగుబాటలు చేరునట్టి యొక చోటికి వచ్చి చేరిరి. వీరు, భాగా నగరమునుండి తూర్పుగా వచ్చి, ఇచటనుండి యుత్తరమునకుఁ బోవుబాటగుండ తిరుగవలసినవారు. అట్లు పోయిననే వీరు బొబ్బిలిని జేరఁగలరు. తిన్నఁగాఁ దూర్పునకే పయనము చేసిరేని గొన్ని క్రోశముల దూరమునందున్న రాజామును జేరఁగలరు. అచటనుండి దక్షిణమునకుఁ బోవు బాట రాజమహేంద్రవరమునకుఁ గొంపోయి చేర్చును.

పరోపకార పారీణులగు నీబ్రాహ్మణు లిరువు రొక యతిశయమును జూడకపోయిరేని, ఇదివఱకుఁ దలఁచివచ్చిన బొబ్బిలిని గూర్చియే పోయి చేరఁగలరు. కాఁబట్టి, వీరి యుద్దేశ మిచ్చోట మాఱెను.

నాలుగుబాటలు చేరునట్టి యాస్థలమున కర్ధక్రోశము దూరమునం దుండునప్పుడే, కరదీపికలతో వీరభటులు దమ కడ్డముగా నున్న బాటపై దక్షిణమునుండి యుత్తరమునకు సాగుచుండు జాడ దెలియవచ్చెను.

ఇంతకుఁ బూర్వమే యీబ్రాహ్మణు లిరువురును రాజమహేంద్రవరమున కేఁగి యందలి బుస్సిగారి యుద్యమములను దెలిసియుండు వారు గావున, అల్లేగుచున్న భటులు వారిని జేరినవారే యనియును, బొబ్బిలిని ముట్టడి వేయుటకే యేగుచున్నారనియును నిశ్చయించుకొనిరి.

కావున, దూరమునందే తామెక్కియున్న యశ్వములను జెట్లకుఁ గట్టియుంచి, పాదచారులయి, తిన్నఁగాఁ జెట్ల చాటులనుండిపోయి పోయి, బాటకుఁ బ్రక్కన నున్న యొక మహోన్నత వృక్షమెక్కిరి. వీరింత జాగరూకత గలిగి మెలఁగుటకుఁ గారణము దాము విజయరామరాజు గారి భటులకుఁ జిక్కరాదనుటయే ; అట్లే తటస్థించియుండిన వీరి యత్నములన్నియును వెల్లిగలిపిన చింతపండయి, తుదకా బ్రాహ్మణులకే యాపద ఘటిల్లును.

వీ రావృక్ష మధిష్ఠించియుండినట్లే బాటవెంబడిఁ బోవుచున్న భటులను జాగ్రత్తతోఁ జూచుచుండిరి. ఆభటు లందఱును సాగిపోవునంత దనుక తెప్పవాల్పక చూచియును, బుస్సీనిగాని, మహారాజును గాని, హైదరుజంగునుగాని, ఉంరాగారిని గాని గనుఁగొనలేక పోయిరి. వారిలో ముఖ్యుఁ డయిన సేనానియొక్కరుఁడయినను గానరాఁడయ్యెను. మిగులఁ బరిశీలించి పరికింపఁగా నట్లేగువారు కళింగ పెదరాజుగారి భటులుగానే కానవచ్చిరి. మహారాజుగారు, తమ భటులకు ముట్టడి కానతిచ్చి, తాము బుస్సీ మొదలగు వారినిగూడి వచ్చుచున్నారని యూహించి యాదండేగిన యొక గడియవఱకును వేచియుండిరి. పిదప నాదారి నొక ప్రాణియుఁ గానరాఁడయ్యె

ను. ఆదండు గొంతదవ్వేగి యాప్రాంతములం దేవిడిసి యున్నట్లు దెలియవచ్చెను.

దీనివలన వీరికి సందేహ మధికమయ్యెను. ఏమి సేయుదురు? "ఈదండే ముట్టడి వేయుటకుఁ బంపఁబడినదిగా నుండిన యెడల దీనిలో నాయకు లుండవలదా? నాయక విహీనమయిన దళమెందులకుఁ బనికివచ్చును? ఏమి సేయనోపును? అట్లుగాక, వీరే తమలో నొక నాయకుని నేర్పఱచుకొని యతని యుత్తరువుల మేరకుఁ దమ యుద్యోగముల నెఱవేర్తు రనుకొందము ; ఇది వఱకుఁ జూటిగావచ్చిన యీభటులు, పరిసరమునందే యేలనిలిచి పోవలయును? వీరు దాము నాయకుని నిర్ణయించుకొను నంతటి దుర్గతియు నిప్పటి కీదళముల కలవడదే. వీరు విడిసియున్న యీప్రదేశము మానవ నివాసమునకును దగిన ప్రదేశము గాదు గదా ? ఇంతేకాక, యిది వఱకును బుస్సీగాని దదితరులు గాని గానరాకున్నారు. కావున వారు గొంత దళములతో ముందేఁగి యున్నారనియె నిశ్చయింపవలయును. ఈసైన్యమును దవ్వులయందే నిలిపి తరుణమున కుపయోగించుకొనఁ దలఁచినట్లు దోఁచెడిని. ఈయూహయే నిజమయిన, వారింతకు మున్నే బొబ్బిలిని ముట్టడించి యుండవలయును గదా !

"హా, ఏమిసందిగ్ధ సమయము ! మనమింత ప్రయాసపడియును దుదకు నిష్ప్రయోజన మగునట్లున్నది. మనకు బుస్సీగానరాకున్న మానెను. ఉంరాగారి దర్శన మవశ్య కర్తవ్యము. అట్టి నాయకు లిట్టి తరుణములయందెన్నో పారాయందుందురే! సాహసించిపోతిమి; అందలి భటులు పగవారు

గానఁ దమ ప్రఖ్యాతిఁ గోరి మహారాజు గారికి మనలను బట్టి యిత్తురు; వారు మనలఁ దప్పక పోలి యింతురు. విజయరామ రాజుగారు మనల నిట్టి సమయములయందు మన్నించి వదలు నట్టి వెఱ్ఱివారు గారే! వారెంతో జాగరూకులు. ఇస్సీ, చావునకు వగవము, మానవున కెన్నఁటికిని జావుగలదు; అట్లుండియు నెందఱ చావులకో చావును గలిగించు మన యుద్యమమునకుఁ జావుగలిగిన ప్రయోజన మేమి? ఇందులకేమి దగిన యుపాయము?" అని నిక్కుటముగా వగచిరి. అంతటి మేధానిధుల కా సమయమునం దేమియుఁ దోఁచకపోయెను, ఏ యుపాయ మూహించి నప్పటికిని దాని కొక యపాయము గన్పట్టుచుండెను.

"అయ్యా, పంతులుగారు, నేను జన్మించినది మొదలిది వఱకుఁ గార్యనిర్ణయముల కొఱకిట్లు దొట్రుపడినది లేదు" అని, బ్రహ్మాము నిట్టూర్పు నిగిడ్చెను.

"మీవలెనే నాకుఁగూడ గర్తవ్యాంశము తేటపడకున్నది. అయినను, మనము సులేమాన్ ఉంరాగారిని దర్శింపవలసినది యత్యావశ్యక మనుట నిర్ణీతమయ్యెను. అతని బహాటముగా దర్శించుట కిప్పుడు వీలు గలుగదు. మనకుఁ దగినతోడుండినచో నిర్భయముగా స్కంధావారములోఁ దూఱి, ఉంరాగారిని దర్శించి కార్యము సాధింపవచ్చును. ఇందులకొక యుక్తి నాకుఁ దోఁచుచున్నది. అట్టి చేతకు, దేహప్రయాసయు కాలతామసమును ఘటిల్లునే యని భయపడెదను" అని బుచ్చన్న చెప్పెను.

బ్ర—చింత లేదు సందిగ్ధకార్యమునకుఁ బ్రయాస పడుట కంటె నిశ్చయాంశములకుఁ బాటుపడుటయం దెంత శరీర శ్రమ సంభవించినను చింత లేదు. కాలతామసమున కొకటికే చింతిల్ల వలసి యున్నది. ఎక్కువ కాలము వ్యర్థపుచ్చక మనకు శక్యమైనంత పాటుపడుదము. అది యెట్టి యుపాయమో చెప్పుఁడు" అనెను.

బు—ఇప్పుడు మనము బొబ్బిలి కేగుట మాని దిన్నఁగా రాజాముదారిఁ బట్టవలయును. అట్లు చేయుటచేత, ఆఱు గడియలకే రాజామును జేరఁగలము; రాజామును జుట్టుకొని బొబ్బిలిని జేరుటకు ముప్పది గడియలగును. ఇట్టి యవసరములయం దొక్కొక్క విఘడియయు మిగుల ముఖ్యమయినది. ఇంతలో నేమి విపరీతము సంభవించునో? ఎందఱ ప్రాణములు రణావని కర్పింపఁబడునో ? యని సందేహించెదను.

బ్ర—"కార్యనిశ్చయము లేక మన మిప్పుడే బొబ్బిలిని జేరియుఁ బ్రయోజనము లేదు. మనము, తక్కిన విషయముల నీశ్వరాధీనములుచేసి, పొరపాటు పొరయని విధమునఁ గార్యము దెలిసి మెలఁగవలయును. సరి, మీయిష్టానుసారమే రాజామున కేఁగుదము. అచ్చట మనకుఁ దోడుపడువారు గలరా?

బు—మనవారే మనకుఁ దోడుపడవలయును. అదియు శ్రీరావువారి నగరమే. అచ్చటికిఁ దాండ్రపాప రాజుగారు పంపఁబడియున్నారు. ప్రకృతము వారే రాజాముకోటకు సంరక్షకులు, మన ప్రయత్నము వారికిఁ దెలిసెనేని దప్పక తోడ్పడుదురు. వారద్వితీయ పరాక్రమశాలులు గనుక మన కార్యము దిన్నఁగా గొనసాగఁ గలదు. ఏమి సెలవిచ్చెదరు ?

ప్రబలమైన నొకత్రోవ ద్రొక్కక తీఱదు. ఇట్టి తొట్రుపాటు వలన ప్రయోజన మించుకైనను లేదు. మినమిట్లు చేయక యింతకాలము వ్యర్థపుచ్చితిమే యని వ్యసనపడెదను. పోదము పదఁడు.

అంతట వారిద్దఱును వృక్షావతరణము చేసి, తాము కట్టియుంచియున్న గుఱ్ఱములయొద్ద కేఁగి, వాని నారోహించి సూటిగా రాజామును గూర్చి పయనమైరి.

29-వ ప్రకరణము.

"కాలముసరిపడివచ్చిన కళియుగాజ్ఞుఁడే."

బురుజులను ఘోరదంష్ట్రలను గలిగి శోణధ్వజపటములను జిహ్వాలను కరాళాభీలముగ నార్చుచు, సకలప్రాణిభయావహముగ నున్న మృత్యుదేవత ముఖమో యనఁ బొబ్బిలికోట తనరారుచుండెను తద్వదన గహ్వరమునుండి నిట్టూర్పుల మొత్తములో యన, బురుజులమీఁది భటనిచయము గాల్చు శతఘ్నుల ధూమజాలములు భూనభోఽంతరములు గుప్పుగుప్పున వ్యాపింపఁజొచ్చెను. మృత్యువు, క్రోధదుర్నిరీక్ష్యమై నిప్పుకలు సెదరఁ బ్రత్యేకనిపతులఁ గాంచుచున్నదో యన, పటపటార్భటులతోడి నిర్ఘోషతో నాగ్నేయాస్త్రపటలి ప్రేలఁజొచ్చెను.

తమ యెడల సుప్రసన్నత వహియించుపొంటె, విజయరామావనీశులభటులు, కోటయను మిత్తి నోటికి నందియిచ్చు కబళములో యనఁ బరితప్తాయోమయ పిండములు ఫిరంగుల నుండి నిర్గమించి, కోటయొక్క మట్టిగోడలఁ బొడిగి కొను

చుండినవి; కొన్ని యుక్కుదలు పులకుఁ దవిలిచెవ్రులు చిందఱవోవునట్లు ఘణిల్లు ఘణిల్లుమను శబ్దములను పెరరేఁపుచునుండినవి. మఱియుఁ గొన్ని మీఁదికిఁ బోవనేరక దమ్మునియోగించిన వారినే ధ్వంసపఱుప వెనుకకు మరలు క్షుద్రదైవతములవలె, నాగుండ్లు పిఱుఁదికి దివిసి దమనియోక్తలనే హతముసేయఁ దొడఁగినవి. ఇఁకగొన్ని, ఎత్తునుండి వచ్చు బొబ్బిలివారి గుండ్లను మార్కొని పైకతిశయింపలేక, తామున్న యెడలకే మరలి యందలి భటవర్గముల హతముసేయఁ దొడఁగెను. వానికట్టి సామర్థ్యమలవఱచిన బొబ్బిలి వారి గుండ్లు తిన్నగామరలి, లగ్గలు పట్టుటకునై ప్రహరి గోడల కెగఁ బ్రాఁకు విజయనగరపు భటులను నాశమొందింపఁ దొడఁగినవి.

వీరావేశము పెరరేఁపఁగా రామరాజుగారి భటులు, అప్రతిమానవీరులయి, లగ్గలుపట్టఁ దలఁచి, యాగ్నేయబాణపరంపరలకు వెనుదివియక మొగ్గరించి కోట కెగఁబ్రాఁకుచు, పైనున్న వీరవారము నీఁటెపోటులకుఁ జిక్కి దబీలుదబీలున నేలఁ గూలుచుండిరి.

ఇట్టి యుద్ధ మొకగంటసేపు దనుక జరిగెను. ఇంతలో రామరాజుగారి భటులు మూఁడువేలకు హతులయిరి. తక్కిన వారు ప్రాణములమీఁది యాసను వహించి దిక్కునకొకఁడుగా బాఱఁదొడఁగిరి. విరోధుల దళములలో గొప్ప కలకలమును కలవరమును దలచూపెను. కోటచుట్టును నెత్తుటియేఱులు ప్రవహింపఁ దొడఁగినవి. ఎక్కడఁ బట్టినను బీనుఁగుపెంటలు! ఎక్కడఁ గాంచినను భటుల మరణవేదనవలని మూల్గుల ధ్వనులు!

ఆ భటులలోఁ గాందిశీకులయి పాఱినవారిని వేవురను బట్టి, సులేమానుగారి భటులును బుస్సీగారి భటులును ఘాతముచేసి వైచిరని యుద్ధానంతరము దెలియవచ్చెను.

ఇప్పటికి మన రంగారావుగారి భటులలో విరోధుల కోత్తులకు జిక్కి యుసురువదలినవారు నూటికెక్కువ యుండరు: కోటగోడలలో నచ్చటచ్చటఁ గొన్నిగండ్లు పడినవి.

వానినే మఱియింతపెద్దవి చేసికొనినచో విరోధులు ధారాళముగాఁ గోటలోఁ బ్రవేశింపవచ్చును. అట్లు పొసఁగినచో నెంతో యాపత్కరముగ ముగియును.

ఆయదనునఁ గోటను మొగ్గరించిన బలములలోఁ గొన్ని హతమయ్యెఁ గొన్ని పలాయనమయ్యె బీభత్సస్థితి దలచూపి యుండెను. ఆహా! ఇట్లు రణభీరువులయి పాఱుచున్న యల్పసంఖ్యాకులను వెన్నంటి దఱిమి జయలక్ష్మిని జేకొనుట సర్వసులభము.

కొంత యాలస్యముచేసిన వీరికోత్త లధికమగును. గోటితోఁ బోవునట్టిపనికి గొడ్డలి వెదుకవలసి వచ్చును" అని రంగారావుగారు దలఁచిరి. పరాక్రమ నిధులగు తమ్ము శాత్రవులు ముట్టడించి యుండుటకు వారి మనస్సొప్పకుండెను. తత్క్షణమే గండ్లు పడియున్న ప్రహరిగోడల పొంతఁ గొంత రక్షక సైన్యముంచి, తమ దళములతో వెలికి నిర్గమించిరి.

వారితోడవచ్చినవారు దళపతులేకాక 2000-వీరభటులుండిరి. వారందఱు తుల్య బలపరాక్రమ సంపన్నులు; ఏకాంగవీరులు. కలఁత నొంది క్షోభిల్లుచుండిన విరోధివరూథినియందు దాదాపుగా నైదువేల భటులుండిరి. మఱికొంద ఱుండియు

వారు యుద్ధమాడుట కసమర్థులుగాఁ దెలియవచ్చిరి; వారికి గాయములు దగిలి యుండెను.

శ్రీరంగారావుగారు, విజయరామ మహారాజుగారు విడిసియున్న వంకకే గనను తలుపులు దెఱచికొని విచ్చేసిరి. అట్లు వారేతెంచుటను గాంచి, హైదరుజంగు మహోగ్రుఁడయి, ఆత్మసైనికులను జూచి, పెటపెటఁ బండ్లుగీటుచు, 'పందలారా! పాఱిపోవఁగానే చావునుండి తప్పి బ్రదికితిరా? యుద్ధవిముఖులయి ఘోరముగాఁ జచ్చుటకంటెను, విరోధులను మార్కొని గొందఱఁ జంపి మీరు చచ్చుట యెంతశ్లాఘ్యమయినది" అని యఱపులఱచుచు జేతులనాచ్చి రండని సైగఁ జేయుచు, సొంపుచెడి చెదరి పాఱునట్టి భటుల నొకవిధమగు నిష్ఠురోక్తులతో భండనమునకుఁ బురికొల్పెను.

"ఓరి, వారు పందలు; నీవు మహాశూరుఁడవు" అని సక్రోధుఁడయి పలికి ధర్మరాయఁ డాత్మసైన్యమును గూడి యాసేనానిని దాఁకెను.

విజయరామరాజుగారిని బొడుచుటకు శ్రీరంగారావుగారుద్దేశించి యుండిరి. వారు, తమ గుఱ్ఱ మభియాతిపైఁ బఱపిరి. వీరికి వెంగళరాయఁడుగారును, తులశీరాముగారును పార్శ్వరక్షకులయిరి. అట్లు దమ మీఁదికి వచ్చుచున్న రావువారిని జూడఁగానే క్షత్రియావతంసులగు విజయరామరాజుగారికి నావిర్భవించిన వీరరసమును వర్ణింప నెవనికి శక్యము. వారు నిలిచి పోరాడుటకే సమకట్టిరి. వీరులకు వీరులను జూచుటయు వారితోడి భండనము గలుగుటయుఁ బూర్వజన్మ పుణ్యపరిపాకము. అట్టిరణములయందు వారికిఁ బొడమునానందమునకు

మితిగలదా? అక్కటా యిట్టిధర్మము కవులయందును విశేషముగ నాంధ్రపండితుల యందును వైపరీత్యమునొంది యుండు నని చెప్పనవసరము లేదు.

అట్లు మహోగ్రులయి వచ్చునట్టి యభియాతులకు మహారాజుగారిని వదలుట యెంతటి ప్రమాదమని, త్వరితగతితో హాసనల్లీయును భైరవరాజును సిద్ధపడిరి. ఇట్లే, తక్కిన బొబ్బిలివీరభటులు పగవారిపైఁ గవిసిరి.

ధర్మరాయఁడు, పావురముల మీఁదికిఁ బ్రాఁకు డేఁగవలె హైదరు జంగుసైన్యము మీఁదఁ బడెను. కీలుమీటిన జంత్రపు బొమ్మయోయనఁ దన్నెదిరిన వీరవారమునడుమఁ దనయశ్వమును బోనిచ్చి భండనము సేయఁదొడగెను. దుర్నిరీక్ష్యుఁడును; దుర్లక్ష్యుఁడునునై యతఁడు పరిభ్రమించుచుండఁగా, దబీలు దబీలున భటులయొక్క తలలు తాళఫలముల వైఖరి నేల గూలుచుండినవి. అతఁడు సుదృఢమయిన కవచము ధరించి యున్నందున శాత్రవభటుల ఖడ్గప్రహారములు బండలమీఁదఁ బడునట్టి తుషారములవలె నిష్ప్రయోజనములగు చుండెను. ఇంతటితోఁ బోవక, తామధర్మముగా ధర్మరాయని మాఱ్కొనరాదనియో కొన్ని ఖడ్గములు చెదరిపోయినవి; మఱికొన్ని భగ్నములయినవి. ఇవ్విధముగా నతఁడు దన శస్త్రపాండితి వెలయించుచుఁ దుదకు హైదరుజంగును దాఁకెను. అతఁడు మహాయోధ; పెక్కుభండనముల గడి తేఱిన వాఁడు. కావునఁ దన్నుఁ దాఁకిన మన్నెవీరుని నొక వ్రేటునకే ఖండించి వైచి తనసైన్యమునకుఁ బట్టిన దురవస్థను దొలఁగింపఁ జూచెను. ఇంతలోఁ బటాలపురామన్న హైదరుజంగు సైన్యములపైఁ బ్రళయకాల రుద్రునివలెఁ బడెను.

నిముసములోను నలువురిని నేవురినిగాఁ ద్రెంచి కూల్చుచు రణకేళి సలిపెను. "హా! పురాణ ముఖముల కుంభకర్ణయుద్ధము విని యుందుమే! అతఁడితని యెదుట నెంతమాత్రము?" అని యందలి ప్రతిభటులు పొగిలిరి. "అక్కటా! యితఁడు పిశాచమో? కాకున్న నిట్టియమానుషశక్తి యెట్లలవడఁగలదు?" అని బెగడిరి. అట్టి తరుణమున రామన్న, దనకు భీతిలి పాఱు మృగములఁదరుమునట్టి వేటగానివలె నాసుభటులను వెన్నాడి తరుమఁజొచ్చెను.

ధర్మరాయఁడు హైదరుజంగును ఖడ్గాఖడ్గిని మాఱ్కొనెను. "ఓరి లంచగొండీ! నీవు మముఁబోటి మన్నెదొరలను సాటిగా నశ్వమొకటియా?" అని పెల్లుఁగేఁగిన కోపవేగము నాఁపలేక ధిక్కరించి, ఖడ్గముద్రిప్పి యతఁడెక్కియున్న గుఱ్ఱపు మోరద్రెగునట్లొక వ్రేటువైచెను. ఆయశ్వము పెల్లుద్రుళ్ళి, తనమీఁది సాదితోఁ బ్రక్కకొరఁగి పడెను. హైదరుజంగు నేలఁ గూలియును, భూమిక మోఁదిన బంతివలెఁ జివాలునఁ ద్రుళ్ళి లేచి, 'సెబాసు, ధర్మరాయఁడ! చెప్పినట్లే చేసితివి! ఇంక నిన్నొక వ్రేటున నిల్లించెదనుచూడు' మని పంతము పలికెను.

ఔను, నావంటిశూరుఁడు నీవనినట్లే చేయును; చేయుటకు మున్నే చెప్పును; అయినను నీవంటిపంద చెప్పియును జేయఁడు; ఇదియే తారతమ్యము. నిన్నుఁ జిత్రవధచేసి రణమునఁ గూల్పవలయునని నాయంతరాత్మ ప్రేరేచుచున్నది. ఇదిగోచూడు, కళింగ పెద్దరాజు గారియొద్ద లంచము పుచ్చుకొనిన నీబాహువును ద్రెంచెదను" అనిఖడ్గముద్రిప్పి వైవఁగా, నావ్రేటు పాటు గొంచెము లక్ష్యముదప్పి యతఁడు పట్టుకొని యుండిన

ఖడ్గమును దట్టి వైచెను ; కరవాలముతో నతని వ్రేళ్లు మూఁడు తెగినవి.

హైదరుజంగా బాధకుఁ దాళలేక, త్రుళ్లిపడి, అల్లాను బేర్కొనుచుఁ జేతులను బరితాపకరముగా విదిర్చుచుఁ బాఱి పోవఁదొడఁగెను. "ఓరి! నీవెంతటి పోటరివి? అందఱను బందలను జేసి పౌరుషశాలివై పరుగులిడుచున్నావో" అని, ధర్మరాయఁడా రణభీరుని వెన్నంటిపోయి పోవునెల్లక ప్రక్కకుఁ దిరిగెను. ఇంతలో, మహోగ్రుఁడైన భైరవరాజు, తులశీరాముతో యుద్ధమాడుచుండి, యారాజపుత్రుని శౌర్యాగ్ని కాఁగలేక, వెన్నుచూపిన పరాభవముగలుగునని తనదళములతో ధర్మరాయనిఁ దాఁకెను. ఓహో, నీవు నాతోటి కడివిగదా! యనుచునే పటాలపు రామన్న యున్నటులుండి యతనిమీఁదఁబడి రెండుతునియలుగా నఱికివైచి, తన పూర్వవైరమును దీర్చికొనెను. భైరవరాజున కంతరంగ మిత్రుఁడు హాసన్ బేగు ; ఇతఁడు శౌర్యాటోపుఁడగు, రామన్నను దాఁకెను.

రామన్నయొక్కయు బేగుయొక్కయుఁ బోరు ఘోరతమముగాఁ జూపట్టెను. ఈయోధులిద్దరిలో జయాపజయము లెవరిపాలిటివో యను సంశయములతో నుభయబలములలోని వీరభటులు దమ పోరాటముల నాపియుంచుక తడవు వారి యుద్ధనైపుణిని గనులారఁజూచుచుండిరి.

ఆవీరు లిరువురు మదించిన పొట్టేళ్లవలెఁ డీకొనుచు, కుక్కుటములవలె నొకరి శిరస్సులపై నొకరెగిరి బ్రాకి

మీఁదుచు, వ్యాఘ్రములవలె నించుక దొలఁగి పొంచియుండి హఠాత్తునఁ బైఁబడుచు వినోదించుచుండిరి.

ఇంతలో మహమ్మదు ఖసీము శరవేగమునవచ్చి, ఒక్కవ్రేటునకు హాసన్ బేగును నేలఁగూల్చి తనతోంటి చోటిని జేరి పోరాడఁ దొడఁగెను.

ఇవ్విధముగాఁ దమ స్కంధావారములోని యుత్తమ సేనానుల భంగపాటును జూచి, హాసనల్లీ మితికి మీఱిన కోపమును వహించెను. సేనలను బురికొల్పికొని మహోగ్రుఁడయి విరోధులను దాఁకెను. వారిలో జగ్గిరెడ్డి పౌరుషశాలియై వేంగళరాయని దాఁకెను. "ఈయువ్వఁ డొక్కరుఁడు, రణకర్కశులగు పగవారికిఁ జిక్కినఁ బరిణామమెట్లగునోకదా!" అని, కాకర్ల-సూరపరాజుగారు తన సైన్యములను బురికొల్పికొని, వేంగళరాయనికి బాసటగా విరోధులను మార్కొనెను. అప్పుడు, రెడ్డిగారికిని సూరపగారికిని మహోగ్రమగు భండనము జరుగఁ దొడఁగెను. ఈయవకాశమున, వేంగళరాయఁడు, సింహకిశోరము మదగజములమీఁదికివలెఁ దెంగలించెను. హా! యువమాత్రుఁడా యతఁడు? అభినవాభిమన్యుఁడని గదా చెప్పవలయును! దట్టముగా మూఁగియున్న శాత్రవుల దళములోనే వంకగాంచిన నతని విగ్రహమే కానవచ్చుచుండెను! ఆతఁడు వాలినచోటులందు భటులగాత్రములు దునియలుదునియలయి నేలఁబడుచుండినవి. నూటికి నటికి 'సెలగో సెలగ' యని యాపీరోత్తుంగుఁడు గర్జిల్లఁదొడఁగెను. ఈగర్జ యెడపెడక నలువలంకుల వినవచ్చుచుండుటచేత, "వేంగళరాయఁ డొక్కరుఁడే వేవురుగాఁ బ్రతిఫలించెనో? ఇట్టిమాయా విశేష మీకలియుగమున

సైతము కొనసాగెడినా?" అని ప్రతివీరులు భయవిభ్రాంతులయిరి.

ఆహా, ఇది గదా ప్రశంసార్హమయిన శస్త్రపాండిత్యము! ఇదిగదా, శ్లాఘాపాత్రమయిన రణవిజృంభణము!

ఇంతలో జగ్గిరెడ్డి యప్రతిమాన శౌర్యనిధియై తన్నుఁ మార్కొన్న సూరపరాజును లాఘవము మెఱయఁ బొడిచి నేలకుఁ ద్రోసెను. వేంగళరాయని వీరావేశమునకు భీతిల్లి, పాఱిపోవు హతశేషులను బెద్దయెలుంగునఁ జీరెను. అతని వీరరభసమునకును సూరపరాజు పాటునకును నోర్వలేక బటాలరామన్న విహంగవేగమున వచ్చి ఖడ్గముతోడ దక్షిణబాహువును ధారావిశుద్ధిగ నఱకివైచెను. అతఁడా బాధనోర్వలేక పెనుకేక వేయఁగా, నతఁడెక్కియున్న యశ్వము బెదరి రెండుకాళ్లతో నర్తనము సేయఁ దొడఁగెను. దాని నణఁచుటకు శక్యముగాకపోవుటచే రెడ్డిగారు నేలకు దొర్లిరి. ఆయశ్వము, తుదకుఁ దన పాదిమీఁదనే చిందులు ద్రొక్కినదియై యతనిని యమసదనముఁ జేర్చెను.

వీరరభసముతోఁ బోరాడుచున్న హసనల్లీ మీఁదికి నప్పుడే వేంగళరాయఁడును బటాలము రాముఁడును దుముకఁబడిరి. ఆతరుణమున నాతురుష్క వీరునితోడనే పోరాడవలయునను తలంపు గలిగి ధర్మరాయఁడును వచ్చుచుండెను.

హసనల్లీఖానుఁడు ప్రశస్తములయిన గుణములు గల నెఱజోదు. రాజనీతి విశారదుఁడు. యుద్ధకళాపారంగతుఁడు. ఇట్టిశూరునకు హానిగలిగిన శ్రమగొప్ప దళములకుఁ గలుగునని తలఁచి, పరసైన్యములలోని ప్రఖ్యాతులగు సరదారులు

గూడపట్టిరి. అప్పుడు జరిగిన సంకుల యుద్ధము యొక్క యుగ్రతను వర్ణింప నెవనికి శక్యము?

అచ్చట, నీలాద్రిరాజుగారు గానరాఁగా, బగ్గున మండిపడి, వేంగళరాయఁ డతనిని మార్కొనఁ బోవఁగా, ఓరి, నీవు బాలుఁడవు నీచెక్కులయందింకను బాలుగారెడిని; తప్పించుకొని పాఱిపొమ్ము; నాబారికిఁ జిక్కి నీల్గెదవేల?" అనుచునే మెల్లగాఁ దప్పించుకొనుటకుఁ జూచుచున్న సమయమున, చెలికాని-వెంకన్నగారతనినిడాసి; అయ్యో! రామరాజుగారి మన్ననలకుఁ బాత్రులుగారా! మీరెన్నటికిని మాకుఁ బూజ్యులు; అతఁడు బాలుఁడనిమన్నించి వదలితిరిగో? ఆహా, ఎంతయక్కటికము! ఎంతజీవకారుణ్యము! అనుచునే యున్నట్లుండి తనచేతనున్న తుపాకిదండము త్రిప్పుకొని బలముగా శిరముపై మోఁదిరి. ఆహా! ఆమోఁదున కితఁడైన విలవిలఁదన్నికొని ప్రాణానిలము వదలియే యుండును. అట్లు దటస్థింపక యతని యదృష్టవశముననో, భార్యగారి మంగళసూత్రబలముననో చావుదప్పి నీలాద్రిరాజు పెనుమూర్ఛకు లోనయ్యెను.

ఇప్పుడు, హసనల్లీయు బటాలపు రామన్నయు వీరావేశములతోఁ బోరఁ దొడఁగిరి. ఒక్కప్పుడొక్కని యొక్కయు మఱియొక్కప్పుడు మఱొక్కనియొక్కయు చేతలు మీఱుచుండినవి. తుదకు రామన్న హసనల్లీఖాను వ్రేటుదిని పెనుమూర్ఛ యావరింపఁగా నేలఁగూలెను. "ఈరామన్న నీల్గినచో బొబ్బిలిబలమున నర్ధక్షీణింపఁగలదని దలఁచి హసనల్లీఖాను దానెక్కియున్న గుఱ్ఱమునుండి రామన్నమీఁదికి"దూఁకెను.

పరిసరముననే పోరుచుండిన ముహమ్మదు ఖాసీము, అతని చర్య దెలిసి "ఓయి, ప్రజ్ఞదప్పినవానిని బొడుచునంతటి సిపాయివా నీవు?" అనుచునే చేతి ఖడ్గము గిఱ్ఱునఁద్రిప్పి వైచెను. రామన్న మీఁదుగాఁ బొడుచుటకునై గరుడాసనమునఁ గూరుచుండఁ బోవు హాసనల్లీకిఁ దవిలి రెండుతునియలుగాఁ జేసి వైచెను. ఆవీరుని మొండెములు రక్తము స్రవింపఁ ద్రుళ్లి ద్రుళ్లి రామన్న మొడలిమీఁదఁ బడుచు నతని మూర్ఛదీఱుట కుపచరించినవి.

ఇదివఱకు, శాత్రవసైన్యమున బిరుదువోరలు గూలిరి. ముఖ్యసేనాధిపతి యగు హైదరుజంగు ప్రేవ్లు త్రెగెను. కాయమునిండుగ గాయములును దగిలియుండెను. హాసనల్లీ కూలెను. భైరవరాజు కైలాసమేఁగిరి. జగ్గిరెడ్డి వీరస్వర్గమరిగిరి. నీలాద్రి గారు మూర్ఛమునిఁగిరి. వీరిగతులే యిట్లున్నఁ దక్కినభటులను గూర్చి యేమిచెప్పుట? పదివేవురభటులలో నెనిమిదివేలకు రణాంగణమున నొరఁగిరి. బొబ్బిలి వీరభటులలోఁ దెగినవారు గొందఱే: ఇదివఱకు రెండువందల వీరభటులును సూరపరాజు గారును వీరశయన మలంకరించినవారు.

ఈవేళకుఁ జెక్కు చెమరక శేషించియున్నవారు బుస్సీ గారి భటులును ఉంరాగారి భటులునే: విజయరామరాజు గారి భటులలో ముప్పాతిక భాగమువారును నైజామువారి భటులలోఁ గొందఱును దెగిరి.

బొబ్బిలివారి కోత్తలు దుర్భరముగానుండెను; క్షణకాలమాఁగినయెడల వారి శౌర్యాగ్నిచే బలములన్నియు భస్మీభూతములగుట సందియము లేకుండెను. "ఏలయిట్టిచేతకుఁ దెగిం

చితిమి? వినాశకాలమునకుఁ దోఁచిన విపరీతబుద్ధియో? ఇప్పటికైనను జాగ్రత్తపడినఁగదా మేలు గలుగును! తెలిసి యుండియును దెగువచేయుట యుక్తముగాదే" అని బుస్సి తనలో నూహించినవాఁడై, దాపుననేయున్న పెద్దరాజుగారిని జూచి—

"అయ్యా, అనర్థమునకు మూలమయ్యెను; ఏమిచేయవచ్చును? మన యిట్టి పనులు బుద్ధిశాలుల మెప్పునకు రాఁదగినవి గావు; ఇంతటితో విరమింతము. వారిమండలములను వారికే యిచ్చివేయుదము. ఏల బలవద్విరోధము? పాపము! నిష్కారణముగా మన సైనికులెందఱు దెగిరి? ఇఁక మనబ్రదుకులు సైతము సందేహాస్పదములుగానే యుండునట్లు నిమిత్తములు గన్పట్టుచున్నవి.—

"దొరగారు! ఏల చింతిల్లెదరు? ఒకపనికిఁబూనితిమేని యది చేకూఱువఱకును బూనిక వదలరాదు; కాలదేశాది భేదములచేత జయము గొన్నియెడల శీఘ్రముగాఁ జేకూడివచ్చును. కొన్నియెడల నాలస్యముగాఁ గైకూడును. ఇందులకు మనవంటి శూరులా వెనుకజ్జవెట్టుట? వెనుక నిలిపియున్న భటులలో 5000 వీరులువచ్చి చేరునట్లానతి యిచ్చియున్నాను. వారిప్పుడేవచ్చి మనలను గలియుదురు. భండనమునకు వెనుదీయకుఁడు. జయము మొట్టమొదటనే నిర్ణయింపఁదగినదిగాదు. అది స్వపక్ష విపక్షములకు మాఱిమాఱి, తుదకు మనలనే యాశ్రయింపఁగలదు" అనెను మహారాజుగారు.

ఇంతలో గాయములకుఁ గట్లుగట్టుకొని హైదరుజంగు అచ్చోటికి వచ్చిచేరెను. అతఁడు బుస్సీగారినిజూచి, వ్రణముల [illegible]ప్పులతనిని మహోగ్రునిగాఁ జేయఁగా, ప్రళయకాలభైరవుని

వలె మండిపడి, ‘ఇదేటిమాటలు? ఈబొబ్బిలివారి గడీలను నిర్మూలపఱుపకయే నేను భాగానగరమునకు ‘మరలలేను. మీకుఁ బ్రాణభీతి గలదేని మీయిచ్చకు వచ్చినచోటికిఁబొండు’ అనెను.

ఈమాటలు, శూరపుంగవుఁడైన బుస్సీ చెవులకు ములుకులవలె నుండెను. అయినను, సైరించుకొని, “ఆలాగా! శూరధర్మము పాటించెదవా? వచ్చుదాని ననుభవింపుము” అని బుస్సి మౌనము వహించెను.

30-వ ప్రకరణము

“శ్రీ రంగారావుగారి శౌర్యాగ్ని.”

“విదళింప నుఱుకు సింగపు, గొదమయు మదమలినగండ - కుంజరములపై,
నిదిబలశాలికి నైజమ, కద తేజో నిధికివయసు - కారణమగునే”

మానవావళి దుష్కర్మలకు మనంబెరియ మండిపడెడినోయనఁ బ్రపంచమునకంతటికిని దుర్నిరీక్ష్యుఁడుగా నుగ్రుఁడయి మింటినడుమఁ దేజరిల్లు కర్మసాక్షివలె శ్రీ రంగారావుగారు, శాత్రవవాహినికి దుర్ధర్షులుగాఁ దోతెంచుచుండిరి. వారెక్కియున్న గుఱ్ఱము, ఉత్తమ గాంధర్వమనుటను స్థాపింపఁదలకొనెనో యనఁ జిత్రగతుల విరోధివరూధినిలోఁ జొచ్చి, లక్ష్యమునకుఁ జిక్కక తిరుగఁదొడఁగెను. అటవిని నిర్మూలపఱచు దావాగ్నివలె, శ్రీరావువారిచ్చట నచ్చట యనక విరోధుల నున్మూలించుచు, నెచ్చటఁ జూచినను దమ యాకృతిగాను, ఎక్కడఁ

బట్టినను దమ వీర హుంకారములుగాను, ఎక్కడఁ గాంచినను దమ ఖడ్గ ప్రహారముగాను, విరోధుల దళములలో క్షోభనించుచు, భయము వెంచుచు, గాలికి జ్వాలలు వ్యాపించుతీరుగా విజృంభించిరి.

రావువారి హస్తవిన్యస్త ఖడ్గమునకు సైతము నిష్పక్షపాత బుద్ధియలవడినదా యనఁ దన వాదరకుఁ జిక్కినవాని నెల్లను ధారావిశుద్ధముగ నఱకుచుఁ బోయెను. అసములత్రోడి యుద్ధము దగదనుటను స్థాపించుటకు వలె, పెద్దరాజుగారికి రాజ్యతృష్ణ యతిశయించి యుండుటకుఁ దీటుగా శ్రీ రావుగారికి రక్తతృష్ణ పెల్లుమీఱెను. రణక్షోణిని నెత్తురు మడువు లతిశయించిన కొలఁదిని, శ్రీరావువారికి వీర రభసము ప్రౌఢత వహింపఁ జొచ్చెను. వారి ఖడ్గధారకుఁ జిక్కి కూలిన యశ్వములయొక్కయు నాశ్వికులయొక్కయు సంఖ్య గణుతింప నెవనికి శక్యము?

విజయ రామరాజుగారును, బుస్సీ దొరగారును, హైదరుజంగును గుఱ్ఱములెక్కి తమ భటులు శత్రువులయొక్క విజృంభణమునకుఁ బాఱిపోవనట్లు, వీరరసము వారియెడలఁ బూరించుచుఁ బ్రేరేచుచు నుండిరి. ఆయెడ నీముప్పురు వీరవరేణ్యులను బరివేష్టించుకొని రెండువేల భటులుండిరి. తక్కినవారు బొబ్బిలి వీరులతోఁ బోరాడుచుండిరి. ఇట్లు రామరాజు మొదలుగాఁగల ముప్పురిని బరివేష్టించుకొనియున్న సైన్యము వారి యభిరక్షణము నిమిత్తము సుదృఢమయిన వ్యూహముగా నేర్పడెను. అట్టివ్యూహమును భేదించుకొని మన వేంగళరాయఁడు ప్రవేశించెను. ఇతని వెన్నంటియే పటాలపు రామన్నయు:

దూఱెను. వీంద్రకుఁ గాఁపుదలగా స్వసైన్యముతో వీరాగ్రగణ్యుఁడు ముహమ్మదు ఖాసీమును జొచ్చెను.

వేంగళరాయ శౌర్యనిధి, బలముగా మీటిన బంతివలె ననివార్యజవము గలిగి వీరవిహారము సలుపుచు, శత్రువుల కంఠనాళములఁ ద్రెంచుచుఁ బోయెను; విరామ మనునది లేక యెందఱినో కూల్చి, వీరవిహారము సలిపెను. పలుమాఱు ఉపయోగించుటచేత నచేతనములగు యంత్రములకుఁ గూడ జవము దగ్గునే; ఇతఁడు, మానవ మాత్రుఁడేకదా! ఇతని యొడలికి శ్రమ దొట్టక పోవునా? ఇంతేకాక, ఇతఁడు రణకర్కశులగు వీరులతోఁ బ్రతిఘటించి యుద్ధమాడిన వాఁడుగాన మేనికిఁ గొన్ని గాయములయినను దగులకపోవునా? రక్తస్రావమున నితని కప్పుడు దాహ మతిశయించెను. అది రానురాను బ్రవృద్ధమయి బాధ యెక్కువ యయ్యెను. అట్టి స్థితియందుఁ గూడఁ దన్ను మూఁగునట్టి భటుల నున్మూలించుచునే యుండెను. ఇతని తొంటిజవమునకుఁ గాని వీరావేశమునకుఁ గాని లోపము గలుగలేదు; అయినను, దన పార్శ్వమునందే పోరు సలుపుచున్న పటాలపు రామన్నను జూచి, "నాకు దప్పి గలిగియున్నది; కొంచెము నీరు దొరకినఁ జాలును" అని దన యిచ్ఛ వెలిఁబుచ్చెను.

రామన్న—అన్నా, వేంగళరాయఁడ! దప్పియా? దప్పి యధికముగా నున్న నీ విరోధి భటులలో నొకనిఁ జీల్చి వానిరక్తము ద్రాగరాదా, నీదాహ మాఱునే!

వేం—హా! నాదాహము, ప్రళయదాహము; అది భటసామాన్యుని రక్తమాత్రమున దనివి నొందదు.

రా—అట్లయినచో రాజరక్తము లభించునంతకు నీ దప్పిని నోర్చికొనుము.

వీరవరేణ్యుఁడయిన రామన్న మాటలు వేంగళరాయనికిఁ బ్రోత్సాహ మొనకూర్చెను. ఈ శూరద్వితయముచే నాదళమునఁ గూల్పఁబడిన వీరభటుల సంఖ్య దాదాఁపుగాఁ బదునైదువందలకుఁ దగ్గదు. ఈ యదనునఁ దమ సైన్యమునకుఁ గలిగిన మహా విపత్తునుజూచి, బుస్సిదొర, శేషించియున్న యైదువందల భటులను వెనుకకుఁ దివిచి, విరోధులపై నెక్కుడమ్మడిని దుపాకులఁ బ్రేల్చుడని యానతిచ్చెను. మఱియును, ఫిరంగుల నన్నింటిని లక్ష్యము దప్పక యొక్క పెట్టిన విరోధవరూధినిపైఁ గాల్ప నాజ్ఞాపించెను. ఈ మాటలను జక్కఁగా వినుచుండిన మహాయోధ, ముహమ్మదు ఖాసీము, తత్క్షణమే తన సైన్యమువారిలోఁ గొందఱను రామన్నను గూడి పోరుసల్పునట్లానతిచ్చి, తక్కినవారిని వెంటఁబెట్టుకొని ముందుకు వెళ్లెను. అట్లు శరవేగమున నేఁగుచున్న ఖాసీమును నెందఱో విరోధు లడ్డపెట్టఁ బ్రయత్నించిరి. ఇతఁడు వారికి వ్రేఁగుగాఁ జూపట్టి తుదకు బుస్సీగారి దళమున్నచోటిని జేరెను. అచ్చట ఫరాసు భటులును సులేమాన్ భటులును వచ్చునట్టి ముహమ్మదును మార్కొని నిలచిరి. వారిని దాఁకి పోరునట్లు దన భటులలోఁ గొందఱి నియమించి, మితపరిజనముతోఁ దాను గోరివచ్చిన నిధిని బరిశీలన దృష్టితో నెమకెను. తుదకానిధి వంద ఫరాసులచేతఁ బరిరక్షిత మగుటను దెలిసికొనెను. ఆనిధి సంపదతో నిండినదిగాదు; ఐనను సంపదలను గలిగించునది. ఆ నిధి పెక్కు ఫిరంగి మందుపెట్టలను మాత్రమే గలిగియుండెను. అదియున్న

జాడ దెలియఁగానే, పెన్నిధిని గన్న బీదవలె, ఖాసీము దానిపై చిచ్చుఱమ్ముల వర్షము గురిపించెను. అతని కోర్కె కృతకృత్యతను వహించినట్లు దుదకా మందు నిప్పుదవిలి యొక్కుమ్మడిగఁ బ్రేలెను. అది యంటుకొన్న సంగతి దెలియఁగానే యాత్మ సైన్యముతో నీవలికి బాణవేగమున నాతఁడువచ్చి చేరిపోయెను. అయ్యది, ఒకటే పెట్లు పెటిలి, దాపుననున్న వానినన్నిఁటిని నిర్దగ్ధపఱచెను. వారి గుడారములను మంట గవిసినది. భటులనేకులు గూలిరి. ఆ పెనుసవ్వడి చుట్టుప్రక్కల నెన్నియో యామడలవఱకు వినవచ్చెను. పగవారి దళములలోని యెఱగుండియవా రందఱును గుండుదెబ్బయు కత్తివాటును దగులకయే యా పెనుసవ్వడికి నేలఁగూలి విలవిలఁ దన్నికొని ప్రాణవాయువులఁ బరిత్యజించిరి.

ఈ యదనున బొబ్బిలి వీరభటులు ఘోరముగాఁ బోరి, పగవారిని జేతులార నఱికి వీరశయన మలంకరించిరి. పెద్దరాజుగారి సైన్యమంతయు నీవేళకు హతమయ్యెను. వారి సేనలోని పెక్కుఱు బిరుదు దొరలును, వీరి సేనలోని పెక్కుఱు మన్నెదొరలును హతులయిరి. పగవారి సైన్యమునకు జేరిన భటులలో నీల్గినవారు పోవఁగా శేషించిన వారియందు గొప్ప కలవరపాటు గలిగెను. వ్యవస్థ దప్పెను. మందుకొఠార మగ్నిదగ్ధ మగుటవలనఁ బెల్లుఱేగిన ధూమజాలములు, ఆ ప్రదేశమంతటను గ్రమ్ముకొనెను.

ఆచోటు దనకు క్షేమప్రదము గాదని దలఁచు నవసరముననే మందునకు నిప్పంటుకొని పెల్లెను. ఇప్పు డితనిమదికిఁ దోఁచిన దిగులునకు మేర గల్పింప నెవనికి శక్యము? ఇతఁడు

జన్మమెత్తిన వెనుక దిగులనుదానిని దెలియుటకిదియే ప్రథమదివసము; కావున, దవ్వుల నిలిపియున్న తన సైన్యమువారికెట్టి యాపద ఘటిల్లెనో యని భీతిల్లి, హైదరుజంగును గళింగరాజును వెంటఁ బెట్టుకొని తన సైన్యమున్న చోటికిఁ బోయెను.

సైన్యముల నాయకులగతియే యిట్లగునప్పుడు హతశేషులగు నొకరిద్దఱు భటుల యవస్థనా చెప్పవలయును? ఈ పెనుకలవరమునందు వారు సైతము పలాయనమయిరి.

ఇప్పు డపరాహ్ణము దలచూపి రెండుగంటల ప్రొద్దెక్కియుండెను. శ్రీరంగారావుగారి హృదయమువలెనే భానుమంతుని యుగ్రత యించుక యుపశమిల్లెను. తన్నెదిరి పోరుటకొక్కరుఁడుగాని వీరభటుఁడు లేఁడయ్యెను. ఆ మహా సంకుల యుద్ధమునందుఁ దమకొఱకు, రణక్షోణియం దప్రతిమాన శౌర్య మగపఱచి, వీరశయన మలంకరించియున్న యోధులపై వారిదృష్టి యప్పుడు ప్రసరించెను.

తమకు బాహ్యప్రాణ మనఁదగిన చెలికాని వెంకన్నగారు, ఉగ్రముగాఁ బగవారిని బొడిచి వారినడుమ వీరశయన మలంకరించి యుండిరి. నచ్చికకెక్కిన నెచ్చెలి, ముహమ్మదు ఖాసీము, చిచ్చుఱమ్ముల పాటునకు నేల యొరగియుండెను. రాజుగారి దృష్టి ప్రసరించిన తరుణమే యతని ప్రాణప్రయాణ సమయముగా నేర్పడెను.

ఇంతలో హతశేషులగు భటులు మహారాజుగారియొద్దకేతెంచిరి. వారితోడ దళపతులును నేగుదెంచిరి. వీండ్రలోఁ బెక్కుఱకు గాయములు బలముగాఁ దగిలియుండినవి. వారందఱును బలమునను శౌర్యమునను సమగ్రతను జెందినవారు

గనుక గాయములనుండి పెల్లుగా రక్తము స్రవించి యుండి నప్పటికిని శోషిల్లకుండిరి. ప్రభువు తత్క్షణమే వారికందఱకు నిలిచిన తావునందే చికిత్స చేయించెను. ఆతుముల యుద్ధము నందుఁ జెక్కు చెమరకున్నవారు వేవురు భటులవఱకును గలరు. శ్రీరంగారావు గారికిని, ధర్మరాయనికిని, తులశీరామునకును, ఇఁక నొకరిద్దఱు నాయకులకును నొక గాయమయినను దగుల లేదు.

రావువారు, ఆ యుద్ధరంగమునందు స్వపక్ష పరపక్ష భేదములు విచారింపక గుట్టుసురుతోనున్న ప్రతిభటునకును వలయునంత యుపచారములు జరుప ననుమతి యిచ్చిరి; మూర్ఛాక్రాంతులకును మరణవేదన లనుభవించు వారికిని శైత్యోపచారములు సేయఁ బరిజనమును దిట్టపఱచిరి.

ఇట్టి తరుణమున నింతదనుక, తమ్ము విజయలక్ష్మి వరించియున్న సంగతి దెలిసియును శ్రీరంగారావుగారి హృదయమున గర్వమన్నది యంకురింప లేదు. జాలియే మెండుకొని యుండెను. "హా, శరీరధారులకు నిలుకడ యెక్కడిది? శరీరములు క్షణభంగురములు; దాని ప్రఖ్యాతికిఁ బాటుపడువాఁ డెంతటి మూఢుఁడు!" అనుకొనిరి. "అట్టి నశ్వరగాత్రమును చిరకాలోపజీవితముగా భావించి యితరులను బొరిపుచ్చు వాఁడు, భూతదయచేత నుత్కృష్టతను జెందిన మానవ సమూహములోఁ జేరఁదగునా?" అని దలఁచిరి. "అయ్యో, నాకుఁ బుత్రాభ్యధికులుగాఁ బరిపోషితు లగుచుండిన, యీ విశ్వాసపాత్రులగు వీరభటులను శాత్రవుల ఖడ్గముల కప్పగించితినే!

ఇది వారు నాయందుంచిన విశ్వాసమునకుఁ దగిన ప్రతిఫలమా!" యని వగచిరి.

అప్పుడు, శరీరమంతటను గాయములతోఁ దనతమ్ముఁడు, వేంగళరాయఁడును, పటాలపు రామన్నయును గొందఱు భటులును నచ్చోటికి వచ్చిచేరిరి. వేంగళరాయఁడు, అన్నగారి ముఖచంద్రామృతము గనులారఁ గ్రోలి శ్రమయాఱఁ దలఁచి వచ్చి, రెండునిముసముల దనుక మహారాజుగారినే దర్శించుచుండి సత్వహీనుఁడయి నేలఁ గూర్చుండెను. అతని దప్పిదీర్ప జలములు దెప్పించి యియ్యఁగాఁ దనివిదీఱఁ గ్రోలియును, పెల్లురేఁగిన యాయాసవశమున గాఢమూర్ఛకు లోనయ్యెను. అతని శరీరము నావరించిన మూర్ఛ త్వరలో దీఱునదిగాఁ గన్పట్ట లేదు. అతని యొడలికిఁ జేయఁబడిన వ్రణవైద్య మతని కెంత మాత్రము దెలియదు.

శ్రీరంగారావుగారు, పటాలపు రామన్న గాయములకుఁ గట్లుగట్టించి, దప్పిదీర్చి, యించుకతడవు విశ్రమించునట్లు లానతి యొసఁగిరి. పిదప, తమ్మునివంకకు దృష్టి సారించునప్పుడు, హా! యేమిచెప్పను? అలవిలేని చింత యతని డెందమున నిండి మెండుకొనెను.

"అక్కటా, లోకమే దుఃఖపూరితము! ఇట్టి జగత్తున జన్మమెత్తుటకంటెఁ బాపకార్య మొకటిలేదు. తనకుఁ జుట్టు ప్రక్కల శోకవ్యాకులములు నిండియుండఁగా, నేను సుఖియని దలపోయువాఁ డెంతటి వెఱ్ఱివాఁడు! ప్రాణివర్గములో మానవ జన్మ ముత్కృష్టమయిన దందురు పండితులు. తామావర్గము వారు గాన వారివాక్యము లభిమాన పూర్వకములని నాయభి

మతము. అయ్యో, మానవుఁడుగాఁ బుట్టిన నేమి? బీదగాను జోగిగాను జన్మమెత్తరాదా? ఒకరి కబాధకమయిన పుట్టుకయే పుట్టుక; లోకమున మానవావళిఁ బవిత్రుఁ డెవ్వఁడనిన బీదయగువాఁడే. వానికి దినవెచ్చమున కుండినఁ జాలును. భోగములతోను భాగ్యములతోను వానికిఁ గావలసిన దేమి? హా, యిట్లేల జన్మింపమైతిమి? నిరపరాధులగువారి కలుగువాఁడును, తన హితులను బగవారి ఖడ్గధారల కర్పించువాఁడును నగు మావంటి శస్త్రోపజీవియొక్క బ్రదు కొక బ్రదుకా? ఇట్టి పుట్టుక విరోధికిఁ గూడవలను.

"నాయనా! వేంగళరాయఁడ! కనులారఁ జూచిన నీమేను కందునో యని చూడవెఱతును. ఎక్కువ పలికిన నీకంఠము శోషిల్లునో యని పల్కరింప వెఱతును. హా! అట్టినిన్ను, సుకుమారగాత్రుని, పెండ్లికొమరుని, గఠినహృదయుఁడ నయి శత్రువుల మీఁదికిఁ బంపి యిట్టి యవస్థకుఁ దెచ్చితినే, నేను నీకు సోదరుఁడనా? అక్కటా, ఈ మందభాగ్యునకు సోదరుఁ డుండరాదనుట దైవసంకల్పమో? లేక శాత్రవసంకల్పమో? శాత్రవుఁడా?—ఔను—నాతమ్ముకుఱ్ఱ నిట్టి స్థితికిఁ దార్చిన శాత్రవుని, ఈ ప్రపంచమంతయుఁ దోడుగా నెత్తి వచ్చినప్పటికిని, హతముసేయక వదలను. వేంకటేశ్వర సాక్షిగా శత్రునిర్మూలనము సేయకయే కోటలోఁ బ్రవేశించుటలేదు" అని ఘోరముగా శ్రీరంగారావుగారు ప్రతినవట్టిరి.

31-వ ప్రకరణము

"విధికి మది లోఁబడినది."

"హా, ఏమిపని చేసితిని? ఎట్టిపనికిఁ దెగించితిని? అయ్యో, దురభిమానవశమున వెలమదొరల శౌర్యాగ్నిని దెలియనైతినే! వీరు నాపేరిని వినఁగానే పాఱిపోవఁ గలరని నమ్మియుంటిని. ఎన్నియో సముద్రముల కావలనుండు ఫ్రాన్సు దేశమునఁ బేరును బ్రఖ్యాతియును గలయింటఁ బుట్టి, ప్రతాపమహితుఁ డనిపించుకొనిన నాకు సమాధిస్థల మీ బొబ్బిలియే. నేనిదివఱ కెందఱితోడనో పోరియున్నాఁడను. పరాక్రమ మహితులగు మహారాష్ట్రులతోడను, యుద్ధకళాకుశలులగు నాంగ్లేయులతోడను, నరమాంస భోక్తలగు నీగ్రోలతోడను, శౌర్యసమగ్రులగు రాజపుత్రులతోడను, కర్కశహృదయులగు నాఫ్ఘనులతోడను బోరుసలిపి యున్నవాఁడను. ఇఁక. నేను బ్రతిఘటించి పోరుసలిపిన వీరులతెగలను వారి వీరవిహారములను బనిపూని దెలుపవలసి యుండిన నొక పెద్ద గ్రంథమగునే.

"నేను నా జీవితకాలములో నెదురుకొనిన వీరుల కిట్టి శౌర్యసాహసములు గన్పట్టవే! వేయేల? ఇట్టిశూరులు ప్రపంచమునం దెచ్చటను లేరని నేను దృఢముగాఁ జెప్పఁగలను. వినుఁడు, కళింగ పెద్దరాజుగారు! పలుమాటలేల? గొప్ప సేనానియను ప్రసిద్ధి వహించి, చరిత్రములు వహింపఁదగిన ప్రసిద్ధములయిన విజయములను బొందిన నేనుగూడ వారి బాహాటోపమును, శుద్ధవీరమును గాంచి లజ్జించెదను. వారి

శౌర్యపటిమయు నీతి విచక్షణతయును నాయందలవడియుండినఁ జెప్పెదరా? నేనీ ప్రపంచమున నేకాధిపత్యము వహింపఁదగి యుందునే!

"ఆహా, ఏమి పౌరుషము! నాకింతనష్టము గలిగియును, ఇదివఱకును—ఏమి? స్పష్టముగా నపజయమే కలిగియును, వారి శౌర్యస్థైర్యములను దలఁచునప్పుడు, నామదియందెంతో యానందము గలుగుచున్నది. మాయాశ్రయదాతయగు నైజామువారి కిట్టి సామంత ప్రభువుండుట యెంతో గౌరవాస్పదము. అట్టి ప్రఖ్యాత సౌజన్యమూర్తిని, విఖ్యాత శౌర్యఖనిని ద్రెగఁజూచుట పాహావారికి—ఏల—ప్రపంచమునకే ద్రోహమాచరించుట యగును.

మహారాజ! సహవాస దోషమున మానవుఁడు, చిరకాలము నశింపని అపకీర్తికిఁ గారణభూతుఁ డగుచున్నాఁ డనుటకు నాచరిత్రమే నిదర్శనమగును. మీయిరువుర మాటలకుఁ జెవియొగ్గి కార్యవిధానమునకు వివేకమునెడి, ఇట్టి యపకీర్తి పంకమునఁ బడనున్నాను. చరిత్రములు వ్రాయువారును, కథల రచించువారును, నాయీచర్యను బలువిధములుగఁ బలుభాషలను వెలయింపఁగా, దానిని జదువునట్టివారు నన్ను దూషింపక భూషింతురో? అక్కటా, నాయొకనికీదుర్యశము దగిలినఁ జింతలేదు; హా, మాఫరాసువారియందే లోకుల కసూయ పొడఁగట్టి, వారిచటఁ గాలూనుటకుఁ గాకపోవునే. ఇంతయు నేను విమర్శింపక చేసిన పనులవలని ప్రయోజనములు గదా!

"అయ్యా, హైదరుజంగు! ఆచారము చెడిన దనుకొందము. సుఖమైన నబ్బెనా? మనము మొదటనే బిగువుగలిగి రావువారి యిష్టము వొప్పున మెలఁగి యుంటిమేని, వారీ ప్రభునొసఁగునట్టి యీవికిబ్బడిగా నిచ్చి యుందురే! నాజరుజంగువారును వారితోడ్పాటున సులభసాధ్యులయి యుందురు. అట్టి లాభము మన కింక నెక్కడిది? పేసనకా ఫిరంగిగుండ్లను మ్రింగుట? అవి యెట్లు జీర్ణమగుచు.

"విజయరామరాజుగా రట్టి హితము మనకుఁ జేయఁగలరని యనుకొందము. వీరు దమకున్న బలములను బొబ్బిలికోటకు బలియిచ్చి యామెను. ఇంక వీరి జీవితమే నిశ్చితము గాదు—హా వీరినిమాత్రము చెప్పనేల? మన బ్రతుకులు సైతము సందేహాస్పదమే! అథవా, తప్పి బ్రతికెదమను కొనుఁడు. ఇప్పుడీ ప్రభువు దుర్బలులు. వీరెట్లు చికాకోలము కోటలో సింహమువలె గర్జిల్లుచున్న జాఫరల్లీని జెనకి యీవలికి రాఁగలరు?

"ఔను—నిశ్చయముగాఁ జెప్పఁగలను. నన్ను దూషించుకొనుటచేతఁ బ్రయోజనము లేదు; సరియైన కారణములును లేవు. నే నీప్రాంతములకుఁ గ్రొత్తవాఁడను. సర్కారుల రహస్యములు నా కంతగాఁ దెలియవు; ఇతర దేశీయుఁడను. ఈ పెద్దరాజుగారిని దూషించుట వలనను బ్రయోజనము గానరాదు; ఏలనఁగా—పాపము! వీరిని ఆశాపిశాచము పీడించుచున్నది. రాజులకు రాజ్యతృష్ణ స్వాభావికము. కావున వీరెంత చెప్పినప్పటికిని గార్యముపట్ల జాగరూకత గలిగి మెలఁగవలసిన వాఁడవు నీవు; సర్కారులను పాలించునట్టి సామంతప్రభువుల

బలాబలములును గుణావగుణములును నీకుఁగదా తెలిసి యుండవలయును ? భ్రమిసి, అయుక్తకార్యముల కొడిగట్టి యిట్టి యిక్కట్టును దెచ్చిపెట్టితివి గాన నీవీ యుద్యోగమునకుఁ దగవు. నీవలననే యింతయాపద సంఘటిల్లెను. కార్యవిధానములం దిట్టి స్వేచ్ఛను వహించుటయు, విచారింపక తలదిరిగిన పనులుచేయుటయును, నీ యట్టి యుద్యోగికి లక్షణములా ? కాఁబట్టి, ఇన్ని యనర్థములను దెచ్చిపెట్టిన నిన్నిప్పుడే పొడిచి నేల కొరగింతును. అక్కటా ! అట్లే చేసితిననుకొనుము ; ఇదివఱకే భంగపాటును జెందియున్నావు. ఇంతటితోఁ బోవక, "విరోధులలో భేదము జనించి హత్యలు పిక్కటిల్లెడిని" అని పగవారు పలుకు నెల్లిదములకును గుఱి కావలసివచ్చునే యని వగచెదను. కాఁబట్టి నిన్నుఁ బొడుచుటకు నా మనస్సు దెగువ సేయదు" అనెను బుస్సీ.

హై—అయ్యా, ఇది పొరపాటని నాకుఁ దెలియును. ఏమిసేయుదును ? నేనును మీవలెనే మోసపోతిని. దుబాసీ లక్ష్మన్న మాటల నమ్మితిని.

బు—అతఁడెక్కడ ?

హై—అతఁడు ఫిరంగిమందునకు నిప్పంటు కొనినప్పుడు రస్తుసామగ్రి యుద్యోగస్థులతోడ మండిచచ్చెను.

బు—అతనిచేఁతకుఁ దగిన ప్రతిఫలమే యది. దేవుఁడు క్రూరముగా—హా, ఘోరముగ దండించెను. అతనిమాటలకుఁ జెవియొగ్గి చెడుత్రోవ త్రొక్కిన మనకును నట్టి చావు గలుగక పోదు.

మహా—"దొరగారు, చిత్తగింపుఁడు. నాబలము లెంత దెగినను సరి ! ముందిడిన యడుగును వెనుకకు మరల్పను. ఇంచుక మీరు దవ్వుల నుండునట్లు చూచుచుండుఁడు. విజయలక్ష్మిని వహించి మీకు నేత్రోత్సవము గలిగించెదను. శేషించిన నాబలములకుఁ జెప్పి యంపియున్నాను. కొన్ని గడియలలోనే వచ్చి చేరఁగలవు. అయ్యా, రిణశేషము దగదు. అది ఋణశేషమువలెఁ బ్రభువులను ముంచివేయును. అంతటితోఁ బోవక వీరు దుర్జయులు ; బెట్టిదులు ; వీరిని హతమొనర్పకయే నాకుఁగాని, దివాణము వారికిఁగాని, తుదకు, దొరగారు ! మీకుఁగాని నెమ్మది గలుగదు. తన పుట్టలో నెమ్మదిగాఁ బరుండియున్న కాలసర్పమును, దండముతోఁ దట్టి లేపియాయెను. దాని క్రోధాగ్నిని బ్రవృద్ధిపఱచి యాయెను. ఇంక క్షణమాఁగిన నది తన విషజ్వాలలచే నెదుటివారిని దగ్ధపఱుపక వదలునా ? మీకుఁ దెలియని యంశములు లేవు ?" అని మోమున విన్నఁదనమును బరాభవ ఖేదము... గానరాఁ బలికెను.

బు—అయ్యా, మీకింకను దురాశవదలకున్నది. ఇదివఱకును మనకుఁగలిగిన రెండు యుద్ధములయందు నపజయమే కలిగెను. పోటుదొర లెందఱో క్రగ్గిరి. ఎందఱో భటులు బొబ్బిలికోటకు బలియయిరి. పగవారికి మనవలె నష్టము గలుగదు. వారి శౌర్యసంరంభమును దగ్గదు. చూచితిరే కదా వేంగళరాయని యుద్ధమును ? ఆ యువుని నెందఱు పొడిచిరి. అతఁడు పూర్వయుద్ధముల నలిసి యుండియును, దన్నుఁ బొదివిన వీరులకుఁ జిక్కక, పగవారి ప్రాణవాయువులను దన ఖడ్గాహిచేఁ గ్రోలనిచ్చెను. అయ్యో, ధారాసారముగు

వర్షమువలెఁ జిచ్చరమ్ములెన్ని ప్రేల్చియేమి? ఆ మహాగ్ని కణ వర్షమున, వడగండ్లవాన కానంద పరవశులయి దమ పొలములఁ ద్రిమ్మరుచున్న కర్షకులవలె, వీర రభసమునఁగో పొలికలనిలో విహరించెదరే, వీరుగదా శూరులు! వీరి యెదుట మీకును శూరనామములు సెల్లునా? ఖడ్గాఖడ్గి వీరి నెదిరి పోరుసలుపుట కెవనికిఁ దరము. వెలమదొరలజేయులని విని యుంటిని. అది యిప్పుడుగదా దృష్టాంతపూర్వక మయ్యెను. ఇంక, మీరు భటులను దెచ్చుకొని కోటను ముట్టడింతమనుట వ్యర్థకార్యము. వారట్లు సులభసాధ్యులు గారే! ఏల పనికి మాలి మీ బలముల నిర్మూలించుకొనెదరు? మీ పగవారున్న చోటికేవచ్చి, వారి కెల్లిదముగా, వారి వాకిలికెదుట ప్రాణ పరిత్యాగముచేయు దుర్దశయేమి గలిగెను. రావువారిని భుజ బలమున మీరు సాధింపలేరు; అది దుస్సాధము—ముమ్మాటికిని జెప్పెదను-మీరు సాధింపఁజాలరు. నామాటవినుఁడు; మన మిప్పుడు వచ్చినదారిఁ బట్టుదము. అదియే సుఖప్రదము. మఱియొక తరుణమున, శాత్రవ మర్మములనుఁ జక్కఁగా గుర్తెఱిగి ముట్టడించి జయింతము. ఇప్పటికీ ప్రయత్నమును జాలింతము. "అయ్యా, హైదరుజంగు! మీ యభిమతమేమి?"

హై—మీ యుభయుల యిష్టానుసారమే కార్యము నెఱవేఱనిండు. అదియే నా యభిమతము. ప్రకృతము కత్తిని బట్టునంతటి స్థితియందు లేను; నాకేల ఖడ్గపుమాటలు?

బు—యుద్ధమాఁపవలయుననియే వీరు సైతము దలచెదరు. చూచితిరా—

మహా—యుద్ధమును వదలి, పందలవలెఁ బాఱిపోవుటకు మన మాలోచింపవలసిన పనియే లేదు. అది యెప్పటికైనను జేయవచ్చును. ప్రకృతము వారిని జయించుటను గూర్చియే యాలోచింపవలయును. అట్లు జయించుటకు బొబ్బిలి వారియెదుట మన భుజసారములు పనికిరావని జెప్పితిరి. మఱి యేమిచేసిన జయము గలుగును?

బు—శౌర్యనిధులు, శౌర్యమునకు నజేయులు; వారు, సర్వసాధారణముగాఁ గుతంత్రములకుఁ జిక్కిపోవుదురు. అట్టి యల్పకార్యములను బరికరముగా వహించితిమేని, ఈ క్షణమునకు మేలు గలిగింపఁగలవుగాని, చిరకాల మపయశమునకును గుఱిసేయును. ఆ హేతువునుబట్టి, కీర్తికామి యిట్టి లాఘవకృత్యముల కొడిగట్టఁడు. తన కాచేత దెలిసియుండియును దవ్వులకుఁ దొలఁగును.

మహా—మత్సితము లపయశమునిం మననుట నేనొప్పుకొనక తప్పదు. అయినను శత్రువులయెడలఁ బన్నునట్టిది యపకీర్తిదము కాదు. అపకీర్తియే కలుగు ననుకొందము. అది మనస్సంపదవలన మాటుపఱుప వచ్చును. లోకమునకు రామణీయ్యకముగాఁ జంద్రికాశ్రీలను వెదఁజల్లు చంద్రునియందలి కళంకము గణింపఁబడుచున్నదా? కావున మీరు పన్నునట్టి జయావహమయిన తంత్రమును బేర్కొనినఁ జాలును. నెఱవేర్ప నేను సిద్ధమయ్యెదను.

బు—అది మిగుల శ్రమావహమయినది గాదు. రంగారావుగారు, ప్రకృతము, రణావనిలోఁబడిన భటులను బరిశీలించునట్లు గానవచ్చెదరు. మనభటులు సైతము రణమునఁగూలిన భటు

లను గనుఁగొనువారివలె నాయుధములను ధరింపక గొందఱు ముం దేఁగవలయును. వారిమాటున నొక్కరుఁడు చక్కఁగా గుఱివెట్టి శ్రీరావువారిని గాల్పవలయును. మన జయమంతయును వాని లక్ష్యమునందే యుండఁబట్టి, వాని గుఱి గొంచెమయినను జెదరరాదు. ఈచేత వారికి సందియము గలిగింపనట్లు గొనసాగవలయును. అయినను మనమిందు గమనింపవలసిన ముఖ్యాంశ మొకటిగలదు. అతని ప్రాణమున కాపద గలుగునట్లు గాల్పదగదు. అతని పాదములను గుఱివెట్టి కాల్చి, కూల్చినఁ జాలును. ఇట్టి మహాశూరునిఁ జంపుటయందుఁగాని, యతని కోటల నపహరించుటయందుఁ గాని నాకెంతమాత్రము ఇష్టములేదు. అట్లు గూలిన రంగారావుగారిని మనము సులభముగాఁ బట్టుకొనవచ్చును, అనెను.

నిరాయుధ పాణులయిన ప్రబల శత్రువునుగాని, నోటఁ బూరి కఱచుకొని పోరునం దగపడునట్టి గర్భవిరోధినిగాని హిందువులలోని యుత్తమవీరులు చంపుటకుఁ దెగింపరను న్యాయము మన బుస్సీకిఁ జక్కఁగాఁ దెలియును.

మహా—ఆహా, మీ యాలోచన మిగులఁ బ్రశంసార్హమయినది.

హై—మనకీ మార్గమే యిప్పటి కనుకూలించినది. ఆలస్యముచేసినఁ గార్యము సెడును.

బు—అట్లే చేయవలయునని మీ యిరువుర కిచ్చయుండనేని యీకార్యమునకు మీ భటులు చాలియుండరు. మిక్కిలి కాపట్యముతో మెలఁగి కార్యము సాధింపవలయును. కావున నా భటులలో 200 లకుఁ బంపుట కుద్దేశించితిని. వారు

కార్యము నిర్వహింపఁ గలరను దృఢ నిశ్చయము మాకుఁగడు. అని తన భటులను బిలిచి కర్తవ్యాంశములను దెలపి పంపెను.

వా రట్లేగి, వంచనతో మెలఁగి, పరాకున నున్న రంగారావుగారి పాదములు ద్రెగునట్లు ఒక్కుమ్మడి నాగ్నేయ బాణములను గాల్చిరి.

"హా, వేంకటేశ! అధర్మమా ధర్మమునుజయించుట" అని పండ్లుగీటుచుఁ దమ్ముఁడగు వేంగళరాయని ప్రక్క శౌర్యనిధి రంగారావు మోకరించిరి.

"బావదేవుగారూ! ధర్మరాయఁడు బ్రదికియున్నంతవఱ కట్లు సంభవింపనేరదు" అని దమ్మన్న దొర చెప్పుచునే మదగజములమీఁదికిఁ బ్రాఁకునట్టి సింహకిశోరమోయన ఫరాసు మూకమీఁదికిఁ జెంగలించెను. విశ్రమించియున్న పటాలపు రామన్నయు నతనికి బాసటయయ్యెను. హతశేషులగు భటులు కోటకట్టినట్లు వారినిఁ జుట్టుముట్టి చిత్రవధ గావించిరి. వారందఱా క్షణముననే రణావనికి బలి యొసఁగఁబడిరి.

అంతటఁ బెల్లుమీఱిన దుఃఖముతో ధర్మరాయఁడు, బావగారియొద్దకు వచ్చి నిలచెను. ఆశౌర్యనిధి కండ్ల నీరు నించుట కిదియే ప్రథమ దివసము.

"నాయనా, దమ్మన్న! ఏల దురపిల్లెదవు? ప్రపంచమునం దేదియు శాశ్వతముగాదు; మన మార్జించు ధర్మాభిమానములే నిత్యములు. ఈశ్వరానుగ్రహమున మనము వానికిఁ జేటు గలిగింపము. మనము ధన్యులముగామా? ఈ తరుణమున నీవు చేయవలసిన కర్తవ్యాంశ మొకటిగలదు. నీ యప్పగారియొద్దకుఁ బొమ్ము. నే నింక నొకటిరెండు గంటలకాలమే

జీవించువాఁడ నని దేవిగారికి విన్నవింపుము. కృత్యమూ బిడకుఁ దెలియును. త్వరగాఁ బొమ్ము" అనెను మహారాజు.

శ్రీ రంగారావుగారి యానతి నిర్వహించుటకునై ధర్మారావుగారు శరవేగమునఁ గోటలోనికిఁ బ్రవేశించిరి. బొబ్బిలి గోటలోనఁ గాఁపున్న భటులు వేవురకు నింకను శేషించి యుండిరి. కోటకు వెలుపలనున్న హతశేషులు, ఏడువందల కుండిరి. విరోధుల భటులలోఁ బదునైదు వేలకు నైదువందల భటులే శేషించి యుండిరి.

"లోకోపకారులు చిరకాలోప జీవులుగా రనుటకు మన రావువారి జీవితమే తార్కాణ యగును. ఆ వేళకు సూర్యుఁడు దన ప్రతాపము డించి అస్తంగతుఁ డగుచుండెను. సాయాహ్నమయి యాఱుగంటలయ్యెను. బుస్సీగారును బెద్దరాజును హైదరుజంగును దమ శేషించి భటులను జూచి, రంగారావుగారిని దమ డేరాకుఁ దెచ్చునట్లు గట్టడచేసి దమ పటకుటీరముం జొచ్చిరి.

విజయరామరాజుగారి హృదయమున నిప్పటికి విరోధ భారము డిందెను. మదిలో నానందము చిందులు ద్రొక్కఁ దొడఁగెను. ఈ ప్రపంచమే వారి యఱచేతికిఁ జిక్కినంత సంతసమలవడెను. ఇదివఱ కెంతో శ్రమచెంది యున్నవారు గావున నించుక దమ శరీరమునకు విశ్రాంతి గలిగించువారై మంచముపై మేనుఁ జేర్చిరి.

పగవారి భటు లుగ్రముగాఁ దుపాకులు గాల్చుచు బొబ్బిలి భటులమీఁదఁ బడిరి. వారిలోఁ గొందఱు రంగారావుగారిని ప్రాణములతోఁ బట్టుకొని పోవుటకుఁ బ్రయత్నించిరి.

పిడుగును బట్టుటకు యత్నించువారివలె వారి ప్రయత్నము లన్నియు నిష్ఫలము లయ్యెను.

ఆ శూరవరుఁడు పాదములు ద్రెగి నిలువలేక పోయినను మోకరించినట్లే దన్ను మూఁగిన వీరులలో మూఁడువందల భటులను ఖండించివైచెను. అట్టియదనునఁ బటాలపు రామన్న దన పరిసరమునందే పోరుచుండి పగవారి వ్రేటునకు నేల కొరగెను. అది చూడఁగానే రావువారి డెందమునం దుప్పతిల్లిన యుమ్మలికమునకు మేర యుండలేదు.

"హా! నాకేల యీ ప్రపంచముతోడి తగులాటము! అక్కటా! మహా పుణ్యభూమియగు నీ ఖండమునందు— నీ మండలములందుఁ గుత్సితులే కానవచ్చెదరు. ఇది కుత్సితుల కనుకూలకాలము కాఁబోలును. ఆహా! ఈ ఫరాసులదొరయును ధనతృష్ణగలిగి యెట్టిచేతకు లొంగెను. వారి ప్రఖ్యాతి నశింపఁ గలుగు కాలము దగ్గఱింపఁగలదు"—అనుచునే యొఱనుండి బాకు నూడఁబెఱికిఁ దన ఱొమ్మునఁ బొడుచుకొని రంగారావుగారు నేలకొరగిరి.

"హా, మహాప్రభు! ఇదేమి యిట్టిపనికిఁ దెగించితిరి? అక్కటా! మహారాజ! ఇదేమి యిట్టిచేతఁ గొడిగట్టితిరి." అనుచునే యొక వీరపురుషుఁడు రంగారావుగారి చెంతకు వచ్చి నిలచెను; అట్టి సంకట సమయమునందును, ఆ పురుషునిఁ జూచుటవలన శ్రీ మహారాజుగారి హృదయము ఆనందపరవశ మయ్యెను.

ఈ తరుణమునకు సరిగా శేషించిన సైన్యమంతయును విజయరామరాజుగారి గుడారమునొద్దకు వచ్చి చేరెను; ఈ

గడియయందే కోటకు వెలుపలను లోపలను బెక్కు-వింత సంగతులు గొనసాగినవి.

32 వ ప్రకరణము

"పడఁతులకల భాగ్యము ప్రాతివ్రత్యము"

ధర్మరాయఁడు, మహారాజుగారి యానతిని వహించి త్వరితగతిఁ గోటలోఁ బ్రవేశించెను. లోపలనున్న భటులు, దా మిదివఱకును మహారాజుగారి యుత్తరువు మేరకు నిలిచిన చోటులనే కాలు గదల్పక నిలుచుండిరి గావున, ధర్మారాయఁడు వారన్నపానముల పనిఁ దీర్చుకొనుట కనుమతి యొసఁగెను. వారు, కోటకు వెలుపల జరిగిన సంగతులను దెలిసి దమకు నన్నపానముల మీఁది యాస లేదనియును, జీవము లున్నంతవఱకు శాత్రవులను బొడిచి రణమునఁ బడుటయే ముఖ్యాభిలాషయనియు నందుల కనుమతియొసఁగిన నప్పుడే కోట వెలువడి, తమ ప్రభువును సందర్శించుకొని విరోధి నిర్మూలమునకుఁ బ్రయత్నించునట్లు, ఆతురపడి యా ధర్మరాయని వేఁడుకొనిరి. ధర్మరావు, మీ యిచ్చచొప్పుననే జరుప వచ్చుననియును, నంతఃపురమున కేఁగి వచ్చునంతలో నాహారముపని దీర్చుకొని సిద్ధపడియుండిన యెడల మీకు నేను నాయకత్వము వహించి మీ యిష్టము గొనసాగింతు ననియును జెప్పి యంతిపురిని చేరెను; అచ్చట, దేవిగారిని జూచి, "అప్ప దేవిగారు! మహారాజుగా రింక రెండుగంటలలో, నీ పాపభూ-

యిష్ఠమగు భూమిని వదలి, శోకవ్యాకుల రహితమయిన వీర స్వర్గమునకుఁ దామేఁగునట్లు మీకు విన్నవింప నానతి యొసఁగిరి" అని, మొదటి రెండు యుద్ధములయందుఁ దమకు సంభవించిన జయములను, తుదకు వంచించి యభియాతులు మహారాజుగారి పాదములను దెగనేయుటయును వారు మోకరించు నట్లే తన కిట్టి యానతి యొసఁగి పంచుటయును దెలిపి యంతిపురినుండి వెలికి నిర్గమించెను. అచ్చటనుండి సైన్యమువారిని జేరి ధర్మరాయఁడు కోట వెలువడెను.

ఆ తరుణమునందుఁ గూడ మల్లమదేవిగారు పుత్రరత్నమును, వేంకట గోపాల రంగారావు గారిని దమ యిరుకేలఁ బట్టుకొని యుపలాలించుచుండిరి. సోదరుఁడు పలికిన పలుకులకు దేవిగారి హృదయము శతధా భిన్నమయ్యె ననుట యతిశయోక్తి యగునా? వారి కప్పుడు పెనిమిటియొక్క దివ్యమంగళ విగ్రహము గట్టెదుటఁ బొడఁగట్టినట్టు లాయెను.

అంత దమచేత నొప్పుచున్న కుమార రత్నమును జూచి, "హా, గోపన్న! నీ సొబగును మఱియొక తడవకుఁ గన్నులారఁ జూచెదను; ఈ చూపే కడపటిచూపు. ఇంత కెవ్వవ నోచుకోనైతిని. మహా శౌర్యనిధికిఁ బుత్రుఁడవయ్యును, సర్వసంపదలకు నాకరమయిన యింటఁ బుట్టియును అక్కటా! ఈ శైశవముననే నీ వనదగావలసి వచ్చెనే! ఈ కొఱనోముల భాగ్యవిహీనకుఁ బుత్రుఁడవగుట చేతనే కదా, ఈ దుర్దశ నీకు ఘటిల్లెను! బీదలకు బిడ్డవై యుంటివేని యెంతో గోముగా వర్ధిల్లఁగలిగి యుందువే. నీ తలిదండ్రులును నీ ముద్దు చైదముల కెంతో మోహమొందుదు రే! తండ్రీ, గోపన్న! ఇంక నీ యిలు

వేల్పులే నీకుఁ బరిపోషకులు; నీకులదైవమగు వేంకటాద్రి విభుఁడే నీ కభీష్ట ప్రదుఁడు.

"హా, దైవమ! ఇదేమి? మాయాంధకారము నన్నిట్లా వరించి బుద్ధి ముసింపఁజేసెను. తల్లిదండ్రు లెవ్వరు? తనయు లెవ్వరు? ఈ బాంధవ్యములు నిమిత్తమాత్రములు గదా! జన్మింపఁగానే తల్లిదండ్రులకు నోచుకొనని బిడ్డ లెందఱున్నారు. వా రెల్లరు దమ జనకుల తోడనే కాలగతినొందిరా?"

అని యా యుత్తమ వీరపత్ని, దన గుండియ ఱాయిచేసికొని పలుకునప్పు డా బిడ్డఁడు మాతృహస్త లాలితుఁడు గావునఁ బెల్లుఱేఁగిన యానందాతిశయమున, ముఖమండలమున లేనగ వంకురింప పాదములు విదిర్చి యొడిపైఁ జిందులు ద్రొక్కుచును దల్లి ముక్కర ముత్తెము లేవ్రేళ్లతోఁ బుడుకుచు నభిరామ శైశవ విలాసముల నించెను.

హా, చదువరులార! తల్లిగారి యుద్యమమునకును దనయుని విచేష్టితములకును నెంత దవ్వు! అయ్యో, వినువారి గుండియలే బ్రద్దలగునప్పుడు గన్నవారి యెద యెట్లుండును? కన్నతల్లి కడుపెట్టిఱిసియుండునో? దేవిగారి సునిశ్చితమంతయును నాక్షణమే బగ్గున మండి, నీఱుగవిసెను. ఆయమ హృదయము వేయివ్రక్కలయి రూపఱెను. మౌక్తిక మణులను ద్రింగఁబోయి వలనుపడమిఁ గ్రక్కివేయు గండుమీల ననుకరించెడి నోయన నాబిడ నేత్ర కోణములనుండి కన్నీటిబొట్లు రెండు రాలినవి. తత్క్షణమే దేవిగారు దమ చేతులనున్న బిడ్డను దాపుననే నిలుచున్న యొక చేడియచేతి కొసఁగి—

"అమ్మా, వీఁడు, రావురాణ్మణులు వంశాంకురము. వీనివలన నీవంశ మవిచ్ఛిన్నముగా వర్ధిల్లగలదు. వీఁడు, భావి కాలపు బొబ్బిలి ఱేఁడుగా నా కన్నీటఁ బట్టాభిషేక మాచరించితిని. అని ఱివ్వునఁ బెడమొగము పెట్టెను. ఆసైగఁ దెలిసి, యా చేడియ యా శిశువును నగరివారి కంటఁబడని విధమున గూఢ పఱిచి యావలిదెసకుఁ దొలఁగించుకొని పోయికోట నిర్గమింపఁ బ్రయత్నింపఁజొచ్చెను.

దేవిగారికిఁ బెనిమిటిపంపిన సందేశము జ్ఞప్తిరాఁగా, నడుమునఁ జెరవికొనియున్న బాకును జరీలున దూసికొనిరి. ఆయమహృదయమునఁ బొడసూపిన కోపతాపము బహిర్గతమగుచున్నదో యనఁ జెక్కులను గండ్లను గెంజాయపర్వెను. వీరరసమును వెలయించు నామె విగ్రహమా యంతిపురి చేడియలకెంతో గౌరవార్హముగను, సేవార్హముగను నుండెను. అంత దేవిగారు దమ చూపు మిన్నువంక నిగిడ్చి—

"తమ సంతోషము గొప్పచేసి యితరుల కిడుమలు ఘటించువా రెంతటి పుణ్యాత్ములు? ఒకరి ప్రాణములఁ గుత్సితముగా నపహరింపఁ దలఁచువారు, దమ ప్రాణముల వెంబడినే యపహరింప మఱియొకరు వేచియుండుటను గానలేరు. హా! పూసపాటి ప్రభువ! మీరేమి యాభూమియున్నంతకు బ్రదుకఁ గలుగుట! నిరపరాధులమగు మాజీవితముల కలిగితిరి. ధర్మమార్గమున జయింపఁగాక కుత్సితమార్గమున మెలఁగితిరి. తుదకెట్లో కోర్కెకొనసాగించుకొంటిరి. మీయత్నములును మనోరథములును ఫలించెను-బొండు. మీరనుకొనినట్లే, యెవి యెట్లయినను, బొబ్బిలి రాజ్యముల పరిపాలనము మీకు లభిం

పుడు. ఔను-ఈశ్వరాదేశమట్టిదే! మీ ఘోరకృత్యమునకుఁ బ్రతిఫల ముత్తరక్షణముననే యనుభవింపఁగలరు. మీరొక్కరు మాత్రమా? మీదుశ్చర్యకుఁ దోడుపడిన యలసుల కందఱకును భయంకరమగు దండనము గలుగునుగాక!

మత్సర గ్రస్తులనా రాజ్యలక్ష్మి వరించును? మీకీ కోటలు దక్కునని స్వప్నమందును దలఁపకుఁడు. మిమ్మననేల? మహాకుత్సితుఁడా ఫరాసులమేటి; అతఁడధర్మపరుఁడై మీకుఁ దోడ్పడి మాకుటుంబ మీగతికిఁ దెచ్చెను. అక్కటా, ఫరాసులు స్వార్థపరులన్న వదంతిపొల్లగునా? ఎట్టి దుష్కార్యములకును వెనుదీయరు; కాఁబట్టియే పుణ్యభూమియగు నీభరతఖండమునఁ దలయెత్తలేక యీఫరాసుల ప్రాభవమంతరించును గాక! మత్సరగ్రస్తులును దురభిమాన పీడితులును నగు హిందూ మహమ్మదీయుల రాజ్యలక్ష్మియైనది, ఫరాసులకుఁ బ్రబలద్వేషులగు నాంగ్లేయ రాణ్మణుల నాశ్రయించును గాత! ఆదయానిధులే, ఆవీరవరేణ్యులే మద్రాజ్యములను మద్వంశీయుల కొసఁగియు; వారి కాశ్రయదాతలయ్యు, శ్రీబొబ్బిలి రాజ్యసంస్థాపనాచార్య బిరుదమునకుఁ దగి పొదలువారు. వారే మావిరోధుల గుండియలఁ బెకలించి వైవ నిర్ణీతులు. ఆమహనీయులే, ఆచక్రవర్తులే యీభరతఖండమున కేకచ్ఛత్రాధిపతులయి, ఇందుండి ప్రవాసమేఁగియున్న సహనమును మరల స్థాపించి, ఆచోటఁ బాదుకొనియుండు దౌష్ట్యక్రౌర్యములను నిర్మూలపఱుపఁ గలరు. వారి యధీనమునందే యీ పుణ్యభూమి భావికాలమునందెంతో ప్రఖ్యాతినొందఁగలదు.

"హా, ప్రాణనాథ! ఇదిగో, మీయాదేశము చొప్పున నా యభీష్టము గొనసాగించుకొనెదను. భావికాలపు బొబ్బిలి ఱేఁడు-నాకొమారుఁడు - "శ్రీవేంకట గోపాలరంగారావు"

ఆమహావీరపత్ని, తనయెదను భర్తసన్నిధానమును గలిగించుకొనెను. తత్క్షణమే చేతిబాకున ఱొమ్ము పొడిచికొని, గోవింద! గోవింద!! యని నేలకొరఁగెను. దేవిగారి హృదయాంతరాళమున నిదివఱకు నెలకొని యుండిన కరుణారసపూరము నిలుచుటకు వీలుపడమిచే వెలికి వెడలుచున్నదో యనఁ గ్రొన్నెత్తురు పొంగివెడలెను.

"అమ్మ, దేవిగారు! మీరొంటిపాటున నేఁగుట ధర్మమో" యనుచు నాయంతఃపురకాంతాజనులందఱును, దేవిగారికిఁ జుట్టుపట్టుల నొకరినొకరును, దమ్ముఁ దామును గాఁ బలువిధములఁ బొడిచికొని గూలిరి. హా! మానవతులకుఁ బ్రాణాభ్యధిక మభిమానమను న్యాయమును దేవిగారి యీకృత్యమే స్థాపించెను గదా!

33-వ ప్రకరణము.

"చేసిన పాపము చెనకక పోవదు."

సూర్యుఁ డస్తంగతుఁడయి, సంజకెంజాయ దిక్తటములయందంతటను బర్వియుండెను. అప్పుడేవురు రాశ్వికులు, హుటాహుటిని బొబ్బిలికోటను గూర్చి వచ్చుచుండిరి. వారివెంటఁ జాలదవ్వున నొకపెద్ద దండు వచ్చునట్టి సూచనలు గానవచ్చు

చుండెను. అప్పుడు రమారమి యాఱు నాఱుగంటల వేళయై యుండవచ్చును. ఇట్లు వచ్చుచున్న యాశ్వార పంచకము బొబ్బిలినుండి వచ్చుచున్న యొకయింతినిఁజూచి, తమ హయములను మందపఱచిరి. ఆయువతియును జెట్లమాటున నడుగు లిడుచుఁ జుట్టుప్రక్కలకుఁ జూపులు ప్రసరించుచు నిలిచి నిలిచి యడుగు లిడుచుఁ దమ కభిముఖగానే వచ్చుటను ఆ రౌతులు గాంచిరి. ఆయువతి భుజము మీఁదఁ గొన్ని బట్టలను వేసికొని వానిఁ దనయిరు కేల భద్రముగా నెదకణఁచికొని వచ్చుచున్నట్లు వారు గనుఁగొనిరి. బొబ్బిలి సంగతి నాయతివ వలనఁ దెలిసికొనవలయునని వారాత్రపడి నిలిచినప్పుడా స్త్రీ వారిని జూచెను. అది మిగుల దిగులుపడి పాఱిపోవుటకే ప్రయత్నించెను గాని యావీరులలోఁ దనకుఁ దెలిసినవా రొకరిద్దఱుండుటను గాంచి, ధారాళముగా వారున్న చోటిని గూర్చియే వచ్చునది యాయెను.

"అమ్మా! బొబ్బిలినుండియా వచ్చుచున్నావు? అచ్చట వింత సంగతులేవియు లేవుగదా!" అని యాయేవురిలో నొక పురుషుఁడు ప్రశ్నించెను. అతఁడే మహాశౌర్యనిధియగు తాండ్ర పాపరాజుగారు. తక్కినవారు నలువురును బుచ్చన్నపంతులు, రామబ్రహ్మము, బాలాజీసింగు, శంకరసింగు అనువారు.

"అన్నా, బొబ్బిలియందేమున్నది? బొబ్బిలి బొత్తిగా శత్రువుల పాలయినది. నేను బొబ్బిలినుండియే వచ్చుదానను. దేవిగారు బొబ్బిలికి భావికాల మహారాజుగా నాశీర్వదించి నావశమున కొసఁగిన యీకుమార రాజుగారి నెత్తుకొని శత్రువులకంటఁ బడక యిదివఱకుఁ దప్పించుకొని వచ్చినాను. ఇంత

మార బాలరాజుగారిని రక్షించు భారము వహింపవలయు" నని గోడుగోడున దుఃఖించినది యాయతివ.

"ఆలాగా! బొబ్బిలికోట విరోధుల పాలయ్యెనా? ఎట్లు?" అని పాపరాజు ప్రశ్నించి జరిగిన సంగతుల నన్నిఁటిని దెలిసికొనెను. ఇంతలో వెంబడినే వచ్చుచున్న దళములా చోటికి వచ్చి చేరినవి. అందు రెండువేల భటులుండిరి. వారిలో వేవురు, బాలాజీ శంకరసింగుల నాయకత్వముల క్రిందఁ జికాకోలమునుండి పంపఁబడిన వారు. ఈసంగతి దెలియ రాఁగానే జాఫరల్లీ తన యొడంబడిక ప్రకారము, రావుగారు గోరకయే తానుగా నీదళమును బంపెను. వీరు మార్గమునఁ బాపరాజు గారిని బ్రహ్మముగారిని బుచ్చన్నగారిని గలిసికొనిరి.

ఆచేడియవలనఁ బాపరాజు సంగతిని సంపూర్ణముగాఁ దెలిసికొని దైవము సేతకు మిక్కిలి దురపిల్లెను. బ్రహ్మము యొక్కయు బుచ్చన్నగారి యొక్కయు వ్యథలకు మేరయే యుండలేదు.

అంతఁ బాపరాజుగారు, కుమార రాజుగారి రక్షణము నందు బుచ్చన్నగారిని నియోగించి, వారి భద్రమునకుఁ దన సైన్యముంచి, తత్క్షణమే తమ ప్రభువున్న పాలికలనిఁ జేరెను. ఇతఁడు కొన్ని నిముసములకు ముందుగావచ్చి యుండిన యెడల, గ్రంథకర్త లాహా మఱియొక విధమునఁ గదా యీచరిత్రమును వ్రాసియుందురు! పరిణామము సంతోష ప్రదముగా వెలసి యుండునే! చదువరుల డెందముల నతివేలముగ శోకరసము వ్యాపింపక పోవునే! మహారాజుగారు, బాకుతో నెదను బొడుచు కొను తరుణమున వారి కృత్యమునకు దురపిల్లి, చెంతఁ జేరి,

వారికి నేత్రోత్సవ మొనకూర్చిన యతఁడీ కులాభిమాన ఘనుఁడగు తాండ్రపాపరాజు.

బాలాజీ శంకరసింగులు దమ సైన్యము నచ్చటనే నిలిపి ఉంరాగారి దర్శనార్థమేఁగిరి.

రామబ్రహ్మము ఖడ్గపాణియై పాదచారిగా నవాబువారి ఫరమానా నందింప బుస్సీగారి గుడారమును గూర్చి పోయెను.

పాపరాజు, మహారాజుగారిని జేరిన కొన్ని నిముసములకే ధర్మారావుగారు కోటలోని సైన్యము వెంటఁబెట్టుకొని యచటికి వచ్చిచేరెను.

మహారాజు గారు, పాపరాజును జూచి, "అయ్యో, మన కోటకీ దశపట్టువడఁ గలదని నేను నమ్మలేదు; దీని పరిపాలకులు మన పగవారని దలఁచుచో నాహృదయ మెఱియుచున్నది" అనిరి.

"మహాప్రభు! మనకోటకుఁ బరిపాలకులు కుమారరాజుగారు. వారీ ప్రళయమునకుఁ జిక్కరు. సురక్షితులుగా నున్నారు. అంతఃపుర కాంతాజనము మడిసినట్లు వింటిని. ఇంక నాఖడ్గధారకు మడియ వలసిన వారు విజయరామరాజుగా రొకరే యవశిష్టులు. అంత దనుక మీ యెడలఁ బ్రాణములు నిలుచునట్లు దైవమును బ్రార్థించు కొనెదను" అనెను పాపరాజు.

మహా——సం-తో-ష-ము-పో-యి-ర--(మూర్ఛిల్లిరి.)

పాపరాజచ్చట శ్రీరావు వారికిని వేంగళరాయునికిని బొబ్బిలిసైన్యమును గాఁపువెట్టి, ధర్మరాయనితో విజయరామరాజుగారున్న గుడారము వెదకికొని పోయిరి.

ఆవేళకు దాదాపుగా నెనిమిదిన్నఱ తొమ్మిది గంటలుండి నప్పటికిని, స్కంధావార మంతయును జల్లపడియుండెను. భటులు, దినమంతయుఁ బ్రయాణము చేసిన వారు గాన మైమఱచి కూర్కుచుండిరి. తమశత్రువు రణక్షోణిఁ బడెననుట వారి యజాగ్రత్తకు మూలకారణమనియుఁ జెప్ప నొప్పును. అప్పుడా గుడారము చుట్టు నున్న భటులలోఁ గలకలము దలచూపరాదని దలఁచి, పాపన్న ధర్మరాయని దవ్వులనే నిలిపి, నేలపైఁ బరుండినట్లే పాముదండములు దీయుచు, నాగాఢాంధకారమున నెక్కనికిఁ గాని సందియము పొడమని విధమున, విజయరామరాజు గారిడేరాను డాసెను.

విజయరామరాజు గారి హృదయ మాదివసమెంతో లంపటపడి యుండినందున వారు మితముగా భుజించి శయ్యనలంకరించిరి.

వారి హృదయభారము దీఱి సంతోషమే యాశ్రయించినదని నప్పటికిని, ఏలకో యతని మదికి సమాధాన మలవడలేదు. కన్నులు మోడ్చి, మైమఱచి, ఇంచుక కూర్కుతఱి, వారి హృదయమునకు ఘోరదర్శనములు గానవచ్చుచు, భయంకరమగు నాకృతు లగపడి మఱుఁగుచునుండెను. బొబ్బిలి భటులు, తన గుడారమునకుఁ జూటిగా ఫిరంగులను గాల్చుచున్నట్లు గాంచును. మహోగ్రరూపముతో నొకమానిసి, చేత శూలము ధరించి తన్నుఁ బొడువ వచ్చినట్లగును. ఆంగ్లేయ భటులు, దన్ను దుష్కార్య రతునిఁగ నిరూపించి, ఫరాసులతోడఁ దన్ను నోడమీఁది కెక్కించి మధ్యేసముద్రమునఁ బడఁద్రోసినట్లు త్రుళ్లిపడును. ఇట్లే యాయల్పకాలమున వారి

హృదయ మనుభవించిన ఘోరదర్శనములకు మితిగలదా? అట్లొక్కొక్క తడవకుఁ దాను గనునట్టి ఘోరదర్శనమున కతని గుండియ జల్లుమన నులికిపడి లేచును. అట్లు లేచి లేచి కూర్చుండి యా ప్రభువాయాసపడును. ఆసమయముల యందంతటను గుడారమునకు వెలుపలనున్న భటులు లోనికివచ్చి చూతురు. వారేగుదెంచు నంతలో మహారాజుగారు పరుండి గూర్క నారంభింతురు. "ఏమియును లేదు; మహారాజు గారీ దినము చూచిన ఘోర సంకులయుద్ధమునకుఁ జిత్తము చెదరి యున్నది" అని తృప్తివహించి భటులు దమచోట్లు సేరుచుందురు.

"ప్రభువారికి తేఁపటికిఁ జిత్తము స్వస్థపడఁగలద"ని భావించి, రక్షక భటులందఱును బరుండి నెమ్మదిగా నిదురింపఁ దొడఁగిరి.

అయ్యది ముందుజామే యయ్యును, దౌర్భాగ్యము యొక్క మహిమాతిశయమున గాఢనిద్రా పరవశులై స్కంధావారములోని భటులందఱును మైమఱచి శవాకృతులుగ నేల నప్పళించుకొని పడియుండిరి.

పాపరాజు, తన కార్యమునకుఁ గొంచెమయినను బొరపాటు గలిగింపక, కాల తామసము చేయక చేతి ఖడ్గముతో గుడారపు బట్టను జింపికొని లోపలఁ బ్రవేశించెను.

ఆసమయమునఁ గళింగ పెద్దరాజుగారు, తొల్లిటివలెనే యొక ఘోరదర్శనము దర్శించుచుండిరి. బొబ్బిలిరంగరావుగారు మందహాస రోచి రుద్దీపిత సుందర వదనారవిందులయి, తమ చెంతఁ జేరి గూర్చున్నట్లును, అయ్యా, మన యిరువురిలోని శాత్రవము నేటితోఁ దీఱెను. మనమిరువురమును మిత్రులము

గామా? ఇంక జంకులేక నాతోడరండు సుఖదుఃఖములు శత్రుత్వ మిత్రుత్వములు లోనగు ద్వంద్వకష్టములు లేని చోటికిఁ బోవుదము" అని పిలిచినట్లాయెను. "అయ్యో, నేనెంతో యపకారమితని కాచరించితిని. ఇప్పటికి నితఁడు సౌజన్య నిధియై సాంత్వన వచనములతో నన్నుపచరించెడినే" అని యాతఁడు లజ్జించెను. ఇంతలోఁ గొంత నిదుర దేఱి, పూర్వ ప్రజ్ఞపొదలఁగా, "హా! రణావనిఁ బడిన రంగారావుగారు పిశాచమయి నన్నుఁ బ్రతిబాధించెదరే" అని చుట్టుపట్టి సెజ్జపైఁ గూరుచుండి హా యని యఱచిరి. ఇదియే వీరుగాంచిన భయంకర స్వప్నములలోఁ గడపటిది.

ఇఁక బాలాజీ శంకరసింగులను గూర్చి విచారింతము. వారిరువురును దిన్నఁగాఁ బోయి, ఉంరాగారిని గలసికొని చాలదవ్వన కేఁగి, కొన్ని ముఖ్యాంశములను గూర్చి మాటలాడిరి. అవియన్నియుఁ బ్రకృతకథాంశమున కావశ్యకములు గావుగాని, తుదకు వారి కార్యాలోచనము యొక్క పరిణామము మాత్రము మనకించుక సహాయమగుచున్నది. విజయరామరాజుగారి బలముల క్షీణింపజేయుటయే వారి ముఖ్యాశయము. కాఁబట్టి, వారికిఁదోఁచిన కొన్ని నిమిత్తములవలన రేయిని భండనమవశ్యముగా సంభవింపఁ గలదని తెలియ వచ్చెను. అట్టియదనున శ్రీకాకుళపు దళములతో నాయిరువురు వీరులు, విజయరామ రాజుగారి సైన్యములను హతము సేయ వలయుననియు, వెలుపలికి వచ్చువారిని ఉంరాగారు దమ దళములతో హతముసేయునట్లును సమయ మేర్పఱచికొనిరి.

ఉంరాగారి నిశ్చితాను సారము బాలాజీ శంకరసింగు లిద్దఱును దవ్వుల నిలిపియున్న తమ దండును బిలుచుకొని యారేయి రంగారావుగారు వీరశయన మలంకరించిన చోటికే వచ్చి చేరిరి.

ఈ సమయమున దవ్వులనున్న బొబ్బిలిభటులు దమ ప్రభువు నంతటి స్థితికిఁదెచ్చిన విజయరామ రాజుగారి దళముల నిర్మూలపఱచి పగదీర్చుకొను నంతవఱకును దమ హృదయ భారము దీరదని యచటనున్న బుచ్చన్న పంతులుగారితో విన్నవించు కొనిరి.

అతఁడు కాలదేశముల విచారించి, ఆ భటులలో నూర్వురను దనకును శ్రీవేంకటగోపాల రంగారావుగారను భావికాలపు బొబ్బిలి మహారాజుగారికిని, వారిని దెచ్చియున్న దాదికిని గాఁపుదలగా నుంచి, తక్కినవారిని బొలికలనికిఁ బోవ నుత్తరు వొసఁగిరి. తాము హుటాహుటిని భాగానగర మునకుఁ బోవుచున్నట్లు రామబ్రహ్మముగారితో మనవిచేయు నట్లు వారి కనుమతియొసఁగి తరలిరి. ఆవీరభట నికాయము, దనలోనున్న దేవులపల్లి - పెద్దిరాజుగారిని నాయకునిఁగా జేసి కొని రావువారు మూర్ఛితులయి యున్నచోటికే వచ్చిచేరెను.

ఇంక రామబ్రహ్మముగారిని గూర్చి యించుక విచారింపవలసి యున్నది. ఈ బ్రాహ్మణుఁడు బుస్సీగారి డేరాకేఁగుచున్నప్పుడే కోశమునుండి ఖడ్గముదూసి యుంచుకొనెను. బుస్సీగారి గుడారము చేరఁగానే, యచ్చటఁ గాఁపున్న ఫరాసు హర్కారా లతని నాటంకపఱచిరి.

యుద్ధరంగమునందుఁ దెగికూలిన భటవర్గముల మరణవేదనలవలని మూలుఁగుటలును, పీనుఁగులను బెరికి దినఁగోరి వచ్చి చేరియున్న నక్కపిండుల యూళలును దప్ప నారంగమునందే సవ్వడియు వినరాకుండెను. ఆ గుడారమునందే యొక మంచముపై హైదరుజంగుగారు మేను సేర్చియుండిరి. పరిపరి విధముల నాలోచనలవలనను, బరితాపము వలనను భయము వలనను బుస్సీగారి గుండియకు నెమ్మది గలుగదయ్యెను: ఇవియే యితని నిద్రాభంగమునకుఁ గారణములు. వీరికిఁ దుల్యుఁడుగా హైదరుజంగు వ్రేళ్లుదెగిన బాధవలన నిద్రావిహీనుఁడై సెజ్జమీఁదఁ బొర్లుచుండెను.

"మేము, హైదరాబాదునుండి మీ దొరగారి దర్శనమునకు ఫరమానా పట్టించుకొని వచ్చినవారము. ఇప్పుడే వారిని జూడవలయును; తెలుపుఁడు వారికి మారాకను! శీఘ్రముగాఁబోయి తెలుపుఁడు!" అని యొక పురుషుఁడు దమ హర్కారాల నదలించి పలుకునట్టి పలుకులు బుస్సీగారికి వినరాఁగా నతఁడు ఉలికిపడి లేచి, డేరా వెలుపలికివచ్చి, మహాతేజోనిధిగాఁ బ్రకాశించు రామబ్రహ్మముగారిని జూచి, ఉపచార పూర్వకముగా లోనికిఁ బిలుచుకొనిపోయి, యొక యాసనముపైఁ గూర్చుండఁ బెట్టుకొనెను. ఈ తరుణమున హైదరుజంగు మెల్లఁగాలేచి దన మంచముపైఁ గూరుచుండెను.

రామ—అయ్యా, మీరు నాగరకమునకుఁ బుట్టినిల్లనఁదగిన ఫరాసుదేశమును జేరినవారు. మిగుల బుద్ధిశాలులని వినియున్నాము. ఇట్టి దుష్కార్యమున కెట్లొడిగట్టితిరి? ఎర్రద తెన్నివిధముల వలదని ప్రార్థించుకొనినను, హితబోధ

యెంతగాఁ జేసినను వినక, మూర్ఖపుఁబట్టు పట్టి యిట్టి దుశ్చర్య కొడిగట్టితిరే! మీ యిట్టి దుష్కార్యమునకు మిమ్ము దండించువారు లేరని భావించితిరా?

బు—స్వామీ, యథార్థము పలికితిరి. మానవులలో నన్ను దండించువా రెవ్వరును లేరనియే యనుకొందము తుద కీశ్వరుఁడు నన్ను దండింపక వదలఁడు. నే నేమిసేయుదును? ఈపాపము నాదికాదు; దీనికి విజయరామ రాజుగారును, ఈ హైదరుజంగు గారును గారణభూతులు.

రామ—అయ్యా, మీ రొప్పుకొనక పోయిన వీరి ప్రయత్నము లేమిచేయఁ గలవు? అట్లుండియు వారికిఁ దమ దుష్కార్యమునకుఁ దగిన ప్రతిఫల మిప్పుడే లభింపనున్నది. (హైదరుజంగును జూపి) ఇతఁడుకూడ ననుభవింపఁ గలఁడు. వీరితో మాకేమిపని? మీ యోగ్యతకుఁ దగిన పనినా చేసితిరి?' అని కన్ను లెఱ్ఱఁబాఱ గద్దించి పలికెను.

హైదరుజంగు, అతనిమాటలకుఁ బాదతాడిత భుజంగమువలెఁ గుపితుఁడయి కండ్లెఱ్ఱఁబాఱఁగా, బ్రహ్మముగారిని జూచి, "ఎవఁడవయ్యా నీవు? మాకు బుద్ధినేర్పనా వచ్చితివి? ఫకీరు, ఫకీరుతరహాగా లేవే? ఇంక నొకమాట నోటినుండి రప్పించితివా నీనాలుక కోయింతును. ఇప్పుడే యిచ్చోటు వదలి వెడలిపొమ్ము" అనెను.

రా—నీవంతటి శూరుఁడవే! క్షణమాగుము. అంతటి పని నీకుఁ జేయించెదను. నన్నెవ్వఁడని కదా ప్రశ్నించితివి? అది నీకుఁ దెలియవలసినది యావశ్యకమే; అట్లు దెలుపుట కవకాశము గలుగును. మొదట దీనిచూడుము. నేను వచ్చిన

కార్యము దెలియవచ్చును" అని నవాబుగా రొసఁగిన ఫరమానాను బుస్సీగారి చేతికిచ్చెను.

అతఁడా యుత్తరము చూడఁగానే నిర్జీవిని బోలెను. నిలువు నీరయ్యెనో యన నుసురచెమ్మటలు గ్రమ్మెను. ఊపిరి మందమగుచు వచ్చెను. నేను దేనికి భయపడుచుంటినో యదియే నాకిప్పుడు సన్నిహితమైనది. చెడితినే! అక్కటా! నేనొక్కరుఁడనా? మావారందఱును జెడిరి. నేటితో మాకు భాగానగరపు ఋణము చెల్లెను గాఁబోలు! హా! భాగానగరమొక్కటియా? ఈ యపఖ్యాతి వ్యాపించి యెచ్చటను గాలూనుటకుఁ గాకపోవునే! "అని తన మంచముమీఁదఁ జదికిలఁ బడిరి మూసాబూసీ దౌలత్-ఉల్-ముల్క్ గారు.

"ఇదేమి యీశూరుని చర్య వింతగా నున్నది!" అని హైదరుజంగు తొట్రుపడుచు బుస్సిచేతనున్న ఫరమానా నందుకొని చదివెను. దానివలన మొదట నతనికిఁ గూడ దిగులు దోఁచెను గాని, తుదకొక సద్యస్స్ఫురణ గలుగఁగా దిటవు దెచ్చుకొని బుస్సీగారిని జూచి, తెచ్చుకోలు బీరముతో, "అయ్యా, ఈ ఫకీరును నమ్మరాదు; వీఁడు శత్రువుల పక్షమువాఁడు; ఈ ఫరమానా పూర్తిగాఁ గల్పితము; నవాబువారిది గాదు" అనుచునే డేరా ద్వారమునకుఁ బోయి చేయిచాచి హర్కారాలను బిలువఁ దొడఁగెను.

మొదట ఫరమానా కల్పితమని బ్రహ్మముగారిని జంపివేసినచోఁ బిదప, నవాబు వారియొద్ద ఫరమానా ప్రస్తావము వచ్చెనేని దమకందలేదని యెగురఁగొట్ట వచ్చునని యట్టి యుక్తి పన్నెను. "తా నొకటి దలఁచిన దైవ మొకటి దలఁచునే కదా!"

ఇంతకుమున్ను తాండ్రపాపరాజుతో వచ్చి దవ్వుల నిలుచుండిన ధర్మరావు, దాఁపుననే యున్న బుస్సీగుడారములో సన్న్యాసి ప్రవేశించుటఁ జూచి యతఁడెవఁడో తెలియఁగోరి, యాడేరా ద్వారము నొద్దకు వచ్చిచేరెను. అల్లేగుదెంచిన ఖడ్గపాణియగు ధర్మరాయఁడు, విజయ రామరాజుగారి భటులలోని వాఁడుగాఁ దలఁచి, అందు గాఁపున్న హర్కారాలతని నచ్చట గాఁపుంచి కొంత దవ్వుల విహరింపఁ బోయిరి.

దివ్వె వెలుఁగునందా సన్న్యాసి, తొల్లి తమ సంస్థానమునకు వచ్చియుండిన బ్రహ్మముగాఁ గానరాఁగా నతనివృత్త మరయఁగోరెను. వారి సంభాషణ సైత మితనికి శ్రమనొందకయే చక్కఁగా వినుటకు వీలు గలిగి యుండెను. తుదకు, ధర్మరాయఁడు, తమకొఱకు రామబ్రహ్మ మెంతో శ్రమపడినట్లును బడుచున్న యట్లును వారి మాటల వలన స్పష్టముగాఁ గనుఁగొనఁ గలిగెను. ఇంతలో నతని ఫరమానానే కల్పితమని నిరూపించి, అతని దండింప హర్కారాలను బిలుచునట్టి హైదరు జంగును నూరక వదలరాదని దలఁచి యొఱనుండి కత్తినిదూసి కొని "ఓరి, నీకిట్టి నీతికిఁ దప్పిన నడవడిక యలవడుట యంతయును నీవు గ్రహించిన లంచము యొక్క మహిమగదా! ఈ చేయియే లంచమును దీసికొన్నది గాఁబోలు" అనుచునే యతని బాహుదండము నఱికివైచెను. అతఁడు 'అల్లా రే' యని యార్త నాదము సేయుచు లోనికిఁ బోయెను. ఇంతలో రౌద్రాకృతిని వహించి బ్రహ్మముగారు వెలికి నిర్గమించిరి. వారిని ధర్మరాయఁడు గలిసికొనెను.

ఇంక విజయ రామరాజుగారి గుడారమునందేమి జరిగెనో యించుక విచారింతము. తాండ్రపాపరాజుగారు, పటకుటీరమును జించుకొని లోనికిఁ బ్రవేశించు నప్పుడు, శ్రీవిజయ రామరాజుగారు నిద్రాపరవశులయి యుండిరి. వారి శరీరచ్ఛాయయు నాభరణముల కాంతులును వారిని దివ్య తేజోనిధిగా వెలయించుచుండెను. రావు వంశజులకుఁ దక్కఁదక్కినవారికి వారు, మందార మహీరుహము వంటి యాశ్రయదాతలు. ఉదారతయందు వారిని బేర్కొనియే కర్ణదధీచ్యాదుల చెప్పవలయును. వైభవమున వారికిఁ దుల్యులవనిలో లేమిని దేవవిభునే పోల్పవలసి యుండును. సౌందర్య సచ్ఛీలములు సైతము వారి నాశ్రయించియే ప్రఖ్యాతి వహించుచుండును. ఇట్టి ప్రభువును పాపరాజు హతము సేయుట కెట్లు సాహసించును?

"అక్కటా, మహాప్రభు! నేటికి మీవినాశమునకుఁ గారణభూతునిగా నన్నీశ్వరుఁడు విధించెను. సకల భాగ్యములకు వెలిచేసి, యాశ్రితు లెందఱో వాపోయునట్లు, మిమ్ము హతము సేయవలసి వచ్చెనే యని చింతిల్లెదను. ఏమి సేయుదును? ఇదియే నేను బూనిన వ్రతము! ఇదియే నాజన్మోద్దేశము. అయ్యో, ఆకర్తృత్వము నేనేల వహింప వలయును? మీ చర్యయే నారూపముగాఁ బ్రతిఫలించి మిమ్ము బాధించెడిని" అని, తనలోఁ బాపరా జనుకొనెను. తన ప్రతిన ప్రకారము నెఱవేర్పవలసియున్నది; జాగుచేయుటకుఁ గాదు. కావున నెట్టకేలకు ఘోరకృత్యమునకు సాహసించి, నిద్రాపరవశులను జంపనొల్లక, "హా, మహారాజ! లెండు, లెండు; మేల్కనుఁడు; త్వరలోనే యెన్నటికిని మేల్కనని సుఖనిద్రను,

పాప భూయిష్ఠమగు ప్రపంచజ్ఞాన మలవడని దీర్ఘనిద్రను బొంద వచ్చును; లెండు” అని లేపెను; వారు లేవరైరి.

“హా, మహారాజ! బొబ్బిలి బెబ్బులి! బొబ్బిలి బెబ్బులి! అయ్యో, ప్రభువ! పులివాతి కండమైతిరిగదా !” అని భీషణముగా నఱచె నాయేకాంగ వీరుఁడు. అట్లతఁడు బెట్టిదుఁడై యఱచుచు నిలుచుండు నప్పుడే, మహారాజుగారు కడపటికలను గాంచి భీతిల్లి లేచి కూర్చుండిరి. ఈశబ్దమునకుఁ గన్నులు దెఱచిరి. పాపరాజు భయంకరాకారము గానవచ్చెను. కర్తవ్యాంశము దోఁచక దాము సైతము దిగ్భ్రమతో, బొబ్బిలి బెబ్బులి! బొబ్బిలి బెబ్బులి, యని కూయిడిరి. ఇంతలోఁ బాపరాజు, వారి మీఁదికిఁ బ్రాఁకి, వక్షస్థ్సలమునఁ జేతి బాకుతోఁ బెక్కుపోట్లు పొడిచి [illegible] వెలికిఁ జెంగలించెను. బుస్సీయొక్కయు రామరాజుగారియొక్క డేరాలోఁ గలిగిన కలవరములకు స్కంధావారమంతయు మేల్కని కృత్యము దెలియక తొట్రువడెను. ఒక్కొక్కభటుని నోటినుండియును ‘బొబ్బిలిబెబ్బులి, బొబ్బిలిబెబ్బులి’ అను మాటలు నిర్గమించుచుండినవి. రామబ్రహ్మము, పాపరాజు, ధర్మరాయఁడు, అను మువ్వురొకటి చేరిరి. బొబ్బిలి భటులు గూడ నాసందడి కచ్చటికి వచ్చిచేరిరి. రావువారిని జంపి వారి రాజ్యము పరిపాలింపఁ దలఁచిన మహారాజుగారు దమ విరోధిచావునకు మున్నే తమ ప్రాణముల వదలవలసిన వారైరి. ఆహా! దైవమునకును బౌరుషమునకును గలిగిన బలాబలము లిట్టివే!

34-వ ప్రకరణము.

“కలవరమునకుఁ గండ్లున్నవా?”

విద్వత్కవులు, పాపమంధకారముతోఁ బోల్చుటకుఁ గారణములు గలవు. దుష్కృత్యములు నిరాఘాటముగఁ గొనసాగుటకు గాఢాంధకార బంధురమగు నిశీథియే యుక్తసమయము. ఆరాత్రి, గర్భీకృత మహాఘోరకృత్యయయ్యు బొబ్బిలి రాజ్య చరిత్రమునకు విజయ పతాకవలె నెన్నఁటికిని బ్రఖ్యాతి వహించు మహిమఁ గలది. ఆచిమ్మచీకటిని మహాయోధులగు వీరపురుషులు మువ్వురును అమానుష సాహసకృత్యములను జేసి గుడారముల వెలుపలికి వచ్చిచేరిరని చెప్పియున్నాము గదా! వాండ్రలోఁ దాండ్ర - పాపరాజు, తన ప్రభువు ఋణమును దీర్చికొనిన వానివలె మిగులఁ దృప్తివహించెను. అతని యుద్దేశము నిరభ్యంతరముగఁ గొనసాగినందులకు హృదయమునఁ బొంగి పొరలుచుండిన సంతోషపూరమునకు మితిలేకుండెను. “ఆహా! నేను గదా ధన్యుఁడను! ప్రభుఋణమును సంపూర్ణముగఁ దీర్చికొంటిని. ఇదియే నా జన్మోద్దేశము! ఇంక నాకీప్రపంచముతోడి తగులాటము లేదు” అని యనుకొనుచుఁ దన్ను మూగియున్న స్వపక్షపరపక్ష భటులలోఁ దూఱి యొక్కగంతునఁ దనప్రభువు వీరశయన మలంకరించిన చోటును జేరెను.

ఆ ఘోరదర్శనమునకుఁ బాపరాజు హృదయాటవిలోఁ గ్రోధాగ్ని యొక్కుమ్మడిని జొచ్చి యొక్కపెట్టున దరికొల్ప సమకట్టెనో యన బగ్గనమండెను. హా, హతవిధీ! నీ వెప్పుడు నిర్దగ్ధమగుదువో కద! అంతఃపుర హర్మ్యంబుల, మృదుల తల్పంబుల మల్లమదేవీ ముఖచంద్ర చంద్రికాపాన మత్త దృక్చకోరకులయి సుఖనిద్ర నవధరించునట్టి మహాప్రభువు, దయానిధి, ఈ శర్కరిల ప్రదేశమున, రక్తభూయిష్ఠ ప్రదేశమున వాయితోడు సైతములేక యొంటరిపాటునం బడియుండువారే! వీరికా యిట్టిదురవస్థ యొనగూడవలయును? హా, నేనుండియు లేనివాఁడనైతినే!——మహారాజ!——

ఈ తరుణమున రంగారావుగారి నావరించియున్న మూర్ఛదొలఁగుటచే నించుక హీనస్వనముతో మూల్గిరి. ప్రాపంచిక పరిజ్ఞానము సైత మలవడెను. దీనినే మనవారు 'మరణకాలపు తెలివి' యందురు.

చచ్చెను విరోధి; వరించితిరి విజయమును; గోపన్న బొబ్బిలి ప్రభువు. మహాప్రభు! నేను పాపరాజను, విజయరామ రాజుగారిని వధియించి విజయలక్ష్మిని మీకు సమర్పింప వచ్చితిని.

ఆమాటలు మహారాజుగారి యెదకెంతో తృప్తిగలిగించెను. ప్రస్ఫుటముగా నానందాతిశయ ముగ్గడించునట్లు కండ్లు తేజరిల్లెను. "సం-తో-ష-ము! స-తో--ష-" (మనుచునే ప్రపంచము వదలిరి.)

మహాప్రభు! మీకొంటిపాటు దగునో? నేను రావలదా? పరమునందుఁగూడ మీసేవయే కదా నా కలవడవలయును? నాకీలోకమున మీకు భిన్నులయిన సేవ్యులు లేరే!" అని, గోవింద, గోవింద యనుచు, నా శూరలోక ప్రశంస నీయుఁడు, బాకుతో నొమ్ముఁబొడిచికొని, తన ప్రభువు పాదములకడ మేను వ్రాల్చెను. ఆహా, ఇదియేకదా యుత్తమసేవకుని ధర్మము!

ఇంక స్కంధావారమునకు మరలి యందలి విశేషములను బరిశీలింతము. రామబ్రహ్మము గారును ధర్మరావుగారును బుస్సిదొర శిబిరమునం దుండిరనికదా చెప్పియుంటిమి. బొబ్బిలి సైన్యము రమారమి పదునైదువందలకు వీరితోఁ జేరికొనెను. వీరి ననుసరించినవారు, విజయనగరము వారి సైన్యములు దప్పి వెలుపలికిఁ బాఱివచ్చినచోఁ బొడుచుటకు సిద్ధముగా నుండిరి. వీరు జాఫరల్లీ సైన్యమువారనియు, ఉంరాగారి సైన్యమువారనియు నిచ్చటఁ జెప్పవలసిన యవసరము లేదు. ఇట్టు లైదాఱు వేల విజయనగర సైన్యమును బొడిపుచ్చుట కీమూఁడు వేల దళములే చాలియుండెను.

ఆతరుణమునం దాశిబిరములోఁ గలిగిన కలవరమును వర్ణింప నెవ్వనికిఁ దరము? బెబ్బులి, బెబ్బులి యని కొందఱును. బొబ్బిలి, బొబ్బిలి యని భ్రామికముతోఁ గొందఱును, 'బొబ్బిలి బెబ్బులి' యని కొందఱును గూయిడఁ దొడఁగిరి. యదార్థముగా బొబ్బిలి బెబ్బులి పొడిచికొని కూలినప్పటికిని, అతని నామస్మరణ మాదండులోఁ బెక్కువిధములఁ బెల్లెసఁగియే యుండెను. తొట్రుపాటును, గలఁతయును సంపూర్ణ స్వైరతను వహించి యాస్కంధావారములో మెలఁగుచుండెను. నిజముగా భ్రామికము విజృంభించినందున వారికట్టెదుట

బెబ్బులియే తిరుగులాడునట్లు గానరాఁగా ఖడ్గప్రహారముల బెబ్బులిని జంపఁబోయి యావీరు లొకరినొకరు పొడుచుకొనఁ దొడఁగిరి. ఈ ఘోరసంకుల యుద్ధమున బుస్సీదొరగారు దమ సైనికులను గాంచి యాగ్నేయాస్త్రములను బ్రేల్ప నాన తిచ్చిరి. వారు గాల్చునట్టి తుపాకులకు స్వపక్ష విపక్షబలములు రెండును నేలకొరఁగఁ దొడఁగెను.

బుస్సీదొర, మహాశూరుఁడని యిదివఱకే తెలిసికొని యున్నాము. అతఁడు నిపుణత మెఱయ మెలఁగి, పెక్కు యుద్ధములయందు, విజయమే పొందుచుండెను. అట్టి శౌర్యనిధికి, ఉపాయచతురునికి నారేయి మిగుల భారమయినదిగ నుండెను. ఆయదనునఁ దన పౌరుషముగాని, తంత్రములుగాని ఫలింపదని గ్రహించెను. వీఁడు స్వపక్షభటుఁడు; వీఁడు పరపక్షభటుఁడు; అని నిర్ణయింపఁజాలక, విశ్వాసము నించుటకుఁగాక యతఁడు తొట్రిల్లెను. హృదయాంతరాళమున సంపూర్ణముగా భ్రామికము నిండిన యిట్టి యిక్కట్టున నాతఁడు పౌరుషమును నమ్మి యేమి సేయఁగలఁడు. విధిలేక దైవమును నమ్మవలసినవాఁ డయ్యెను. తుదకుఁ దనజీవితమును దైవాధీనముచేసి, 'చేత ఖడ్గముధరించి వెలుతురుగల తన డేరాచెంత నిలుచుండి, తన్ను మార్కొన వచ్చువారినిఁ జంపుట లేక వారిచేఁ జంపఁ బడుట యనుటనే నిశ్చయించుకొనెను. పాపము! ఆ ఫరాసు వీరుఁ డాతరుణమునం దింతకంటె నేమిసేయఁగలఁడు?

పాపము! ఆగుడారములోఁ బొరలుచున్న హైదరు జంగుగారి దుస్థితి నెట్లు వర్ణించుట? అతని దుశ్చర్యకుఁ దగిన ప్రతిఫలము లభించెననుటకంటె నన్యమేమి చెప్పుట? భుజము

దెగి నేలఁ బొర్లాడుచుండెను. ఆ మహాసంకుల యుద్ధమునందు, గొప్పకలవరము దలచూపి ప్రఖ్యాతస్థితిని విఱ్ఱవీఁగుచుండు తరుణమునందు నతనికి గాయముకట్టి బాధ తెలియరామికిఁ బానకాదు లొసఁగి చికిత్సచేయువాఁ డెవఁడున్నాఁడు? అయ్యో, హైదరుజంగు పాపభీతునివలె, అల్లా - అల్లా, అని భగవన్నామమును నెలుఁగెత్తి చెప్పుచుఁ బొరలుచుండెను. అక్కటా! ఒక్కపెట్టునకే ప్రాణములు నిర్గమించుట యెంతో సుఖప్రదము! ప్రాణములుండి యిట్టి వ్యథ ననుభవించుట యెంత ఘోరతమ మయినది! దుర్ధర్ష ప్రతాపనిధియగు నింతటి యుత్తమ సేనాధిపతి కతని దుశ్చర్యయే యిట్టి దుర్దశను గలిగించెననుటను దప్ప మనము విశదీకరింపఁ దగిన వింత విషయమేమున్నది?

ఇరువంకల మండుచున్న కొఱవి బొఱియలోని చీమవలె, విజయ నగరము భటులును బుస్సీగారి 'భటులును, హైదరు జంగుగారి భటులును నేకముగా హింసకులోనయిరి. వారిలోనే భ్రామికమువలని సమ్మోహన మంకురించి యొకరి నొకరు పొడుచుకొనుచుండిరి.

సేనలోఁ జొరఁబాఱి, ధర్మరాయఁడుగారు సలిపిన రణ విహారము ప్రశంసార్హమైనది. సైన్యాటవిలోఁ బెల్లురేఁగిన కొఱవిదయ్యములోయన వీరభటుల ఖడ్గఘర్షణముల వలనఁ గలిగిన నిప్పుకలు నలువలంకులను బిక్కటిల్లినవి. సముద్ర మధ్యమునఁ బొడకట్టు బడబానలమువలె ధర్మరాయఁడు, విపక్షసైన్యగర్భమునఁ జొచ్చి, ఆత్మీయ ప్రతాపానలముచే నభియాతి భటుల జీవరసముల శోషిల్లఁ జేయుచుండెను.

ఆహా! క్షాత్ర తేజోఽభ్యధికము బ్రహ్మ తేజమన్న మాట యిదివఱకుఁ బురాణాంతర్గతముగా నుండెడిది. దానివి దృష్టాంత పూర్వక మొనరించెను రామబ్రహ్మము. ఆమిషమును హరింపఁ జుట్టిచుట్టి వచ్చునట్టి యాఁకొన్న డేగవలె, రామబ్రహ్మము, ప్రళయకాల వీరభద్రుఁడో యన, ఖడ్గపాణియై యభియాతి బలములను జుట్టిచుట్టి భండనము సేయఁదొడఁగెను. ఆహా! తొల్లి, కంకుభట్టు, విరటుని పక్షమూని త్రిగర్తసైన్యముల నెట్లు చెల్లాచెదరుఁ గావించి యుద్దండ రణవిహారము సలిపెనో యందులకుఁ దీటుగా మన బ్రహ్మముగారి రణవిహారమును బోల్పవచ్చును. పాండవ బలములమీఁద విజృంభించి తన ప్రభువు హితము పొంటెఁ దన యనుపమాన యుద్ధకళాకోవిదతను వెలయఁజేసిన శూర లోక శ్లాఘా పాత్రుని ధనురాచార్యుని ద్రోణుని నితనితోఁ బోల్పవచ్చును. ఏమి శస్త్రలాఘవము! శరీర లాఘవము! పోటునకు నలువు రేవురుగాఁ జమఘటయును, బొడువచ్చువారికి దుర్లక్ష్యుఁడై వారికిఁ జిక్కక యే వారిని గూల్చి విజృంభించుటయు నెవని కలవడును? ఈ సంగతిని దెలిసిన ముసల్మాను జోదు "లితఁడు మాయలఫకీరో? లేక యతని యపరావతారుఁడో?" అని దలపోయఁ దొడఁగిరి.

హా! బ్రహ్మము, రక్తము గ్రక్కుచున్న ఖడ్గమును, రక్తవర్ణ వసనమును ధరించి విజయనగర సైన్యనిర్మూలమునకునై భూమి కవతరించిన ధూమకేతువో యన పరులను భీతిగొలుపుచుండెను. కవిగానుండినవాఁడు గావున నెంతకెంత బీభత్స భయానక రసముల నుదారముగా వర్ణింపఁగలఁడో యంతకంత చైదములఁ గనఁబఱచెను.

ఇట్లా బ్రాహ్మణ-క్షత్రియుఁడు, రక్తతృష్ణ పెల్లు మీఱఁగా, పరశురాముఁడు పూర్వకాలమున రాణ్మండలమున విహరించిన యనువు వెల్లడి పఱచుచు, రణవిహారము సలుపుచుండునప్పుడే విజయ రామరాజుగారి మరణవార్త జ్ఞప్తి వచ్చెను. అప్పుడతని హృత్తాపమించుక యుపశమిల్లెను. మఱియును, బొబ్బిలి సంస్థానము చెడుటయును, దాని నుద్ధరింప శ్రీ వేంకట గోపాల రంగారావు గారొకరు గలరనుటయును స్మరణకు వచ్చెను. వారు, బాల్యము దీఱి యుక్తవయస్కులయి సింహాసన మధిష్ఠించు నంతకుఁ దన సాహాయ్యముండిన మేలుగ నుండునే యను నూహయొకటి స్ఫురించెను. అంత నాతనికి రణవిహారమునందిచ్చ బొత్తిగాఁ దొలఁగెను. వెంటనే, బ్రహ్మము ఉంరావారున్న స్థలమునకుఁ బోయి, అతనియొద్ద సెలవొంది, భాగా నగరముఁగూర్చి పశ్చిమాభి ముఖుఁడుగా నానిశీథినే పయన మయ్యెను.

బొబ్బిలి యెల్లనుదాఁటఁగానే, రామబ్రహ్మము తాను రామకవి యైనట్లు భావించుకొనెను.

ఇంక ధర్మరాయాది బొబ్బిలివీరులు, వీరావేశముతోఁ బ్రాణము లున్నంతకుఁ బోరి, పగవారి దళముల నఱికి వీరవిహారము సలిపి తుదకు వీరశయనము లలంకరించిరి. "బొబ్బిలి వా రభిమానఘనులు; అద్వితీయపరాక్రమ నిధులు" అను ప్రఖ్యాతి నాచంద్రార్కము ప్రపంచమున నిలిపి దివమున కేఁగిరి. శాత్రవుల వ్రేటులకుఁ దప్పి బ్రదికిన వీరభటు లొకరిద్దఱుండిరి గాని, వారు సైతము దమ శస్త్రములకే తమ ప్రాణానిలము లర్పించుకొనిరి.

యుద్ధరంగమునం దెదిరి పోరు వీరుఁడొక్కఁరుడు గాని యిప్పుడు లేఁడు. బుస్సీదళమునులోనివారు హతశేషులు గొందఱే యుండిరి. ఉంరాగారి దండునందుఁ బెక్కుఱుండిరి. ఇంక గోలుకొండ దళమువారును విజయనగరపు వీరవారమును నిశ్శేషముగాఁ గూలెను.

తామెట్లు వచ్చిరో యట్లే, తమరాక యొరులకుఁ దెలియరానట్లు, తమతోడ వచ్చిన భటులతో బాలాజీసింగు శంకరసింగు లప్పుడే చిక్కాకోలమునకుఁ బయనమైరి.

ఆరేయి యెంతో వ్రేఁగున వేఁగెను; వేఁగుచుక్క దూర్పునఁ దోఁతెంచుచుండెను. హా, యేమి భయంకర ఘోర దర్శనము! భయానకరసమున కాచోటు పుట్టినిల్లుగాఁ బొడకట్టుచుండెను. ఏమి విక్షోభము! ఏమివికృత దర్శనము! రణమునఁ దెగిన భటుల మొండెములు చెప్పనలవిగాని విధముల త్రుళ్లిపడుచుండినవి. వినువారి గుండియ లవియునట్లు, ప్రాణాంతకము లయిన గాయముల బాధ కోర్వఁజాలక రణనిహతులు మూల్గుచు విడఁజాలక ప్రాణవాయువుల వదలుచుండిరి. గాయముల బాధకును, మరణమువలని భీతికిని జిక్కి భగ్న కంఠస్వనములతో నచ్చటచ్చటఁ గొందఱు దమ దారాసుతులను బేర్కొని యంతములేని దుఃఖముతోఁ బలవించు చుండిరి. అక్కటా వారివ్యథల కుపశాంతి గలదో? ఎక్కడఁ గాంచినను రక్తప్రవాహములు; ఏదెసఁ జూచినను ద్రుళ్లిపడుచున్న మానవావయవములు; ఇట్టి పోలికలనిని జూచునెట్టి కఠినహృదయునకును జిత్తము నీరుగాఁ గరుఁగక పోవదు.

అట్టిరణమున శస్త్రవైద్యులను వెంటఁ బెట్టుకొని రణనిహతులను బరీక్షించుచు బుస్సీదొర రణరంగమున దిరుగఁ జొచ్చెను. అతఁడు చికిత్సలకు బ్రదుకఁ గలుగువారల నందఱను వేఱుపఱుపఁ దన భటుల కానతి యొసఁగెను.

ఇవ్విధముగా నతఁడు, పరిశీలించుచు వచ్చుచో, శ్రీవేంగళరాయఁడు గుట్టుసురుతో నుండునట్లు దెలియవచ్చెను. తత్క్షణమే యతని నొక ప్రదేశమును జేర్చి ప్రఖ్యాతులగు వైద్యుల నియమించి యతనికిఁ జికిత్సలు సేయింప నాతఁడాయువు బలము గలిగి, దినక్రమమునఁ దెప్పిరిలెను. అతనికి సంపూర్ణ స్వస్థము గలుగఁగానే యతని రణము గనులారఁ జూచి మెచ్చినవాఁడు గావున నాతనికిఁ గ్రొత్తపల్లి మొదలగు జమీనులొసఁగి బుస్సీదొర గారవించెను.

ప్రకృతము బొబ్బిలి రాజాముల పరిపాలన భారము వహింపవలసినవారు, విజయనగరమున నున్న ఆనంద గజపతి మహారాజుగారుగా నేర్పడిరి.

35-వ ప్రకరణము.

“ఉపసంహారము.”

మన కథానైపథ్యమున నింతటితోఁ దెరవాల్చుట యుక్తముగాదు. చదువరుల డెందములలో శోకరసము పూరించి యందులకుఁ బర్యాయము వెదుకని దోషమటుండఁగా మల్లమదేవిగారి వాఙ్మహిమంబును గప్పిపుచ్చిన దుష్కృతము గలుగును.

దేవిగారు వీరపుత్రిక; వీర సోదరి; మహావీరపత్ని; వీరునకే జనయిత్రి; ప్రఖ్యాత పతివ్రతా కులతిలకము. ఇట్టి మహనీయకు వాగ్భంగమెట్లు గలుగును? వారు మరణ కాలమునఁ జెప్పినవన్నియును గొనసాగినవి.

వారుద్దేశించినట్లే విజయరామరాజుగారు, ఎంతో ప్రయత్నముచేసి బొబ్బిలికోట మీఁది కెత్తివచ్చియు, బొబ్బిలి వీరభటుల నత్యుగ్రముగా మార్కొని హతముసేసియు, ఉపాయములు వన్నియుఁ దుదకుఁ దమ యొడలిని గూడ నచ్చటనే వదల వలసినవారైరి.

దేవివారు, వాక్రుచ్చిన రీతిగానే బుస్సీచర్యలు నైజాముగారికి రుచింపని వయ్యెను. అతని యెడల నసూయగలిగి, అది కాలక్రమమున నభివృద్ధినొందఁ దొడఁగెను. ఇతఁడొక నైజామువారికే కాక, సర్కారులయందలి ప్రభువుల కందఱికును విరోధిగా నుండెను. ఆనందగజపతిగారి యెడల నితని కేర్పడిన మనస్పర్ధకు మితిలేకుండెను. అతనికి నైజామువారి ఋణము దీఱను గాఁబోలును. పెక్కుకారణము లొకటి చేరినందున నతఁడు, అధికారులచేఁ గర్నాటక రాజ్యమునకు రావించుకొనఁబడెను.

సర్కారుల పరిపాలనార్థము బుస్సీస్థానమున, కాన్. ఫ్లారెన్సు అను ఫరాసు సైన్యాధిపతి నియమితుఁడాయెను. అతనికిఁ గూడ, ఆనంద గజపతిమహారాజుగారి యెడలఁ జూపోపమిగలిగి యతనిని నాశమొనరించు తలంపొనఁగూడి యుండెను.

ఆనందగజపతిగారు, మిగుల సమర్థులు; వారియందు విజయరామరాజు గారి యుత్తమ గుణములన్నియుఁ జక్కఁగా నలవడి యుండినవి. ఫ్లారెన్సుగారి దురభిప్రాయమెఱిఁగి వారు దమ సైన్యములను మంచి వ్యవస్థకుఁ దెప్పించుకొనుటయే కాక యాంగ్లేయ వీరుల నాశ్రయింపఁ దొడఁగిరి. కొంత సైన్యముతో ఫ్లారెన్సు ఆనందగజపతిగారి నెదురింప వచ్చుచుండెను. ఆసన్న మెఱిఁగిన విజయ నగరాధిపతి యాంగ్లేయ దళపతియగు కర్నల్ ఫోర్డు దొరగారి తోడ్పాటును వహించి, తామే యాఫరాసు దండనాథుని మార్కొనవెడలిరి. ఆంగ్లేయుల సహాయ మానంద గజపతిగారికిఁ గలదను సంగతి దెలియఁగానే ఫ్లారెన్సు భయపడి పైకొక యడుగైనను బెట్టలేక రాజమహేంద్రమునందే నిలుచువాఁడయ్యెను.

ఆంగ్లేయుల సహాయముతోఁ దమ్మెదిరింప నానందగజపతి రాజుగారు వచ్చుచున్నారను సంగతి దెలిసి వారిని శిక్షించు నుద్యమముతో నవాబుసలాబతు జంగుగారు స్వసైన్యములతో మచిలీబందరు దనుక విచ్చేసిరిగాని, కర్నల్ ఫోర్డుగారి ప్రతాపాతిశయము దెలిసి, వారి నెదిరించుట యాపత్కరమని దలఁచి యాంగ్లేయులతో మైత్రిపాటించుటకు సంకల్పించుకొనిరి. సలాబతు జంగుగారి యీసదుద్దేశమున కిదియొకటియే కారణము గాదు. ఫరాసువారి యెడల నతని కదివఱకేర్పడి యుండిన మనస్స్పర్ధయును దీనికిఁ దోడుపడుచున్నదని మనము చెప్పవలసిన పనిలేదు. కాఁబట్టి నైజామువారు, ఆంగ్లేయ సౌహార్ద సంపాదనమునకై కర్నల్ ఫోర్డు దొరవారి మూలముగాఁ గొన్నియొడంబడికలను గావించుకొనిరి. ఆ సంధికి సాక్ష్యములోయన

నాంగ్లేయ ప్రభువులకుఁ గొండవీడు, నైజాముపట్టణము, మచిలీబందరు అనెడి సర్కారుల నొసఁగిరి. నైజామువారి కాంగ్లేయులు హితులగుటయే ఫరాసులు దొలఁగుటకు హేతువు గాదా! అయినను, సర్కారులలోఁ బూర్వము ఫరాసువారు మెలఁగిన మెలఁకువలకు సాక్ష్యమొసఁగుదానివలె, పూర్వమొకప్పుడెంతో వ్యాపకము నందున్న ఫరాసు వైభవము నావలెనే శుష్కీభూతమయి సన్నగిలి పోయినదని దెలుపుచున్నదోయన నిప్పటికిని 'యానాము' అనెడి యొక చిన్ననగరము ఫ్రెంచివారి యధీనమున నున్నది. బొబ్బిలి యుద్ధము జరిగిన రెండు సంవత్సరములకే సర్కారులయందలి వ్యవస్థలన్నియు నిట్లు మాఱెను.

దండయాత్ర వెలువడిన శ్రీ ఆనందగజపతి మహారాజుగారు దమ రాజధానికి మరలుచో రాజమహేంద్రవరమున మృత్యుదేవత స్ఫోటకరూపమున వారినిడాసి కాలగతి నొందించెను. అక్కటా, తిన్నఁగా వారు విజయరామరాజుగారి యనంతరము మూఁడుసంవత్సరముల కాలమైనను వసుంధరా పరిపాలనమునకు నోచుకోరైరి. వారిట్లు బందరుమీఁది కేఁగియుండినప్పుడు, దమ కుటుంబము వారియెడలఁ బ్రీతిగలిగిన బొబ్బిలి భటులను గొందఱను జేర్చుకొని రాజాముకోటను జేరి యందలి యానందరాయల సైన్యములఁ బాఱఁదఱిమి, వేంగళరాయఁడు గారు, కోటను దమ స్వాధీనమునకుఁ దెచ్చుకొని పరిపాలనము సేయుటకు మొదలుపెట్టిరి.

పూర్వకాలపు టుత్తమ క్షత్రియుల యాచారమున నానందగజపతి మహీపతిగారికి శరీరసంస్కారములు జరిగెను.

వారి దేవేరు లిరువురును దమ పెనిమిటితోడ సహగమనము చేసి శాశ్వతకీర్తులఁ బడసిరి.

అంతట, విజయనగర సామ్రాజ్య సింహాసనమునకు సన్నిహిత జ్ఞాతివర్గమునఁ జేరినవారగు శ్రీవేంకటపతిరాజుగారు, అధిష్ఠాతలయిరి. వారు బాల్యదశయందుండఁబట్టి మంత్రిత్వము వహించి శ్రీసీతారామ రాజుగారు పరిపాలనా భారము వహించిరి. సింహాసన మధిష్ఠింపఁగానే శ్రీవేంకటపతి మహారాజుగారు విజయరామరాజు గారను పేరిని వహించిరి. వారు మహారాజమాత్రులుగా నుండిరిగాని యధికార సూత్రములన్నియు సీతారామరాజుగారి యధీనముననే యుండినవి. వీరియొక్క రక్తపాతమునం దిచ్ఛకును రాజ్యతృష్ణకును మేరయుండ లేదు. వీరు, దమకణఁగని మన్నెదొరలను, ముహమ్మదీయ నాయకులను దండించియుఁ జెఱపెట్టియు విజయనగర సామ్రాజ్యము విరివికిఁ దెచ్చిరి. వీరు బలసమగ్రులగుటం బట్టి హైదరాబాదునకు సామంతులుగా నుండుట వదలి స్వతంత్రులు గానే యిక్కాలమున వెలయుచుండిరి.

శ్రీవేంగళరావు గారు రాజామును దమ స్వాధీనమునకుఁ దెచ్చుకొనిన పిదపఁ దిన్నఁగా నాలుగు సంవత్సరములయినను బరిపాలించినవారు గారు. వారు కాలగతి నొందఁగానే రాజాము నగరమునకు శ్రీరంగారావు గారి పుత్రులు, శ్రీగోపాల వేంకటరంగారావుగారు పరిపాలకు లయిరి. వారు సైతము సీతారామరాజు గారి మాయా వాగురకుఁ జిక్కి కొంతకాలము విజయనగరము నందడఁపుఁబడి, ఘటదీపాకృతిగ నుండవలసినవారైరి.

ఈకాలమున నుత్తర సర్కారులయందు-ఏల-హిందూస్థానమునం దంతటనునే యాంగ్లేయులు మహాప్రఖ్యాతిని వహించి యుండిరి. వీరి రాజనీతియును, నిష్పాక్షిక బుద్ధియును, పరిపాలనా పటుత్వమును నితర సామ్రాజ్యముల వారి కనుకరణీయ పాత్రములయి వెలయుచుండినవి.

ఇప్పుడు, సీతారామ రాజుగారు నిరంకుశులయి మెలఁగఁ జొచ్చిరి. వారి యెడతెగని పోరులవలన సామ్రాజ్యము విస్తార మొంది నప్పటికిని, సంస్థానము ఋణముల పాలయి చెన్నఱి వలసి వచ్చెను. ధనమెక్కువ కావలసియుండెను. ధనతృష్ణ సహేతుకముగానే యతని కెక్కువయగు కొలఁదిని, అతఁడు మసీదులకును, పండితులకును నొసఁగిన మడులను మాన్యములను జప్తులు సేయఁదొడఁగెను. ఈకారణమునుబట్టి, జనులలోఁ బొడకట్టిన క్షోభను వర్ణింపనెవనికి శక్యము? ఇదివఱకే సంస్థానమున్న నెంతో చనవు గలిగియుండిన 'అడిదము-సూరకవి' సైతమిప్పటి పరిపాలనమును దూషించి పద్యముఖముగాఁ దనయిష్ట దైవతమగు రామలింగేశునకు మొఱవెట్టుకొని యున్నాఁడు. పలుమాటలేల? విజయనగర సామ్రాజ్యము నందిప్పటి పరిపాలనము, ఎంతో యపయశమును సంపాదించినట్లు సూచితమగుట ప్రసిద్ధాంశమే!

తుదకుఁ బెక్కుకారణములను బట్టి ఆంగ్లేయాధిపతులతోడనే విగ్రహము గలిగెను. మొదటి విజయరామరాజుగారి సైన్యముల మార్కొన్న శ్రీరంగారాయ రాణ్మౌళివలెనే యాంగ్లేయ వాహినులఁ దాఁకిన రెండవ శ్రీవిజయరామ గజ

పతిగారును కాలగతి నొందవలసివచ్చెను. ఈ మహారాజుగారి పుత్రులు శ్రీనారాయణ బాబుగారు.

ఈకుమార మహారాజుగా రప్పటి కనిమిదియేండ్ల ప్రాయమువారు. వీరు శాత్రవోద్ధతికి భీతిలి దల్లిగారితోఁ బాఱిపోవఁగా నది తెలిసి, కరుణానిధులగు నాంగ్లేయు లతని కభయ మొసఁగి, అతని పైతృకమగు రాజ్య మొసఁగిరి.

ఈ తరుణమునందు విజయనగరము కారాగృహము నందుండిన శ్రీగోపాలవేంకట రంగారావుగారు, చెఱనుండి తప్పించుకొని భాగా నగరముఁ జేరిరి. ఈ సంగతిని దెలిసి యాంగ్లేయాధికారులు వారియెడల జాలినించి, వారి పెద్దల రాజ్యములకు వారిని ప్రభువులనుగాఁ జేసి "శ్రీబొబ్బిలి రాజ్య సంస్థాపనాచార్యుల"ను ప్రసిద్ధింగాంచిరి.

బుచ్చన్నయు బ్రహ్మము గారును నీ చరిత్రమునకు సంబంధించినవారు గాన, వారిని మనమీతరుణమున విస్మరించుట నీతిగాదు. బుచ్చన్నగారు బొబ్బిలి యుద్ధానంతరము, గొన్ని నెలలు జీవించి, శ్రీగోపాల వేంకటరంగారావు గారికిఁ బోషకులుగా నుండి, భాగా నగరమునందే శరీరము వదలిరి. రామబ్రహ్మము రామకవియయ్యెనని యిదివఱకే చెప్పియున్నాము గదా! వారు, ఉంరాగారి యాశ్రయము వలన నైజాముగారి కృపకుఁ బాత్రులయి మన చిన్నరంగారావుగారి యున్నతికై యెంతో పాటుపడిరి. వారి యమానుష పౌరుషము బొబ్బిలి విషయమునఁ బ్రయోజకత వహింపక పోయినను, పరోపకార పారీణుల ప్రశంసకుఁ బాత్రమయినదని యెవరొప్పుకొనక మానుదురు? ఆహా, ఆ పౌరుషమే, యతని యుచ్ఛ్వాస

పారము దైవోపహతము గాక కొనసాగియుండెనేని చరిత్రకారుల కలము మఱియొక రీతిని దిరిగి యుండునేకదా! అక్కటా! రామబ్రహ్మము దైవోపహతుఁడు; అతని కార్యమునకు హానిగలుగుట సహజమేయనినను, అతఁడితరుల కొఱకుఁ బడినపాటులకు సైతము దైవము భంగకారి కావలయునా?

అయినను, కలిమి లేములును సుఖదుఃఖములును వెన్నెలచీఁకటుల వలెనే మాఱి మాఱి జీవకోటుల నాశ్రయించుట స్వాభావికము. అట్లే ప్రథమమున విజయనగర సంస్థానమునందు మిగులఁ జనవు గలిగి విజయ రామరాజ భూషణ ఖ్యాతిచే సుప్రసిద్ధుఁడుగా నుండిన యడిదము సూరకవి యిప్పుడు దుర్దశాహతుఁడయి దురపిల్లుకాలము తటస్థించెను. మొట్టమొదట నెన్నోకష్టము లనుభవించి, అవమాన ఖేదమున నెదకాలి, 'కవిబిరుదమును బ్రహ్మముగా మార్చుకొన వలసి వచ్చిన తురగరామ కవికిఁ దుది దినములు సుఖపరిణామకము లయ్యెను. అతఁడు పరోపకారమునకుఁ బడినపాటులే, ఆద్మీయనిష్కృతికి నికారములయి డెందమునకానందమొనగూర్చెను. చిన్నరంగారావుగారి వ్యాజమున నితనికి నిజామువారి దివాణమునఁ గలిగిన మన్ననకు మితిగలదో?

శ్రీమల్లమ దేవిగారు, ప్రఖ్యాత పతివ్రతాభరణము. వారు, మరణవేళ పలికిన పలుకులయం దొక్కటియైనను బొల్లుగాదయ్యెను. బొబ్బిలిని శ్రీరాజాజ్ఞి వంశజులే పరిపాలింపువారైరి. వారి కాశ్రయదాత లాంగ్లేయ రాజ్ఞులేయైరి.

శ్రీమల్లమ దేవిగారి యభిమతాను సారమే యీపుణ్యభూమియగు భరత ఖండము, ఆంగ్లేయసార్వభౌముల యేకచ్ఛ

త్రాధిపత్యము క్రింద నెన్నుదిగనుచున్నది. సామంతరాజనికరమునందు, సౌహార్ద మెంతయో వ్యాపించి, యింతకుమున్నున్న శాత్రవమంతయు నెచటికో ప్రవాసమేఁగెను. నిష్కారణ విరోధములును, నిర్నిమిత్తకలహములును ధ్వంసములయి, సదాచారములును విద్యావ్యాసంగములును నిండి మెండుకొనినవి. ఈభరతఖండము, భూతదయవలని ప్రయోజనములను బొందుటకును, దారతమ్య రహితపాలనము వహించుటకును నిదియే ప్రథమకాలము. దేశమునం దేవంకగాంచినను సుఖసంతోషముల సంపూర్ణస్వైరత! ఏప్రక్కఁ జూచినను నిశ్చిత జీవితానుకూలములు! ఏదెసయందును పక్షపాతరహిత న్యాయ సమృద్ధి! కలాభివృద్ధి! ఆచంద్రార్క మీ భరతఖండ మాంగ్లేయ రాజ్ఞులవలనఁ బరిరక్షితమగును గాక!

"శ్రీ శ్రీనివాసార్పణమస్తు"

END OF
TITLE